శ్రీవిక్టోరియా-డయిమండుజూబిలీ పద్యములు.

విబుధకోటినిఁ బ్రోచు విశ్రుతకృపయను నమృతంబు పుట్టినిల్లయ్యె నెద్ది
విమతక్షమాపాల వితతిఁ గాల్చెడు కోప బడబాగ్నిశిఖల కావాసమెద్ది
ధవళ శారీర రుచులతోఁ దనరు నెద్ది । యమ్మహాలక్ష్మి విడిదియిల్లయ్యె నెద్ది
యట్టి విక్టోరియా రాజ్ఞియనెడు సింధు । పాలకడలి మమ్మోలార్చి యేలుఁగాత. ౨.

సీ. పూవునొవ్వకయుండఁ బువుదేనియలు గ్రోలి ముదమొందు నాడుతుమ్మెదయనంగఁ
బవలు రేల్వికసించి చవులూరు విరిదేనె వెదఁజల్లు ధవళారవిందమనఁగ
నాశ్రితావళి హాయి నొసఁగ జల్లఁదనమిచ్చి యమరు నేడాకుల యనఁటియనఁగఁ
జిరకాలమున నుండి చివుకు లేశము లేక మహినిల్చు పెనుచేవమ్రానునంగఁ
బ్రజలమనసు నొవ్వకయుండఁ బన్నుగొనుచు । జాలఁగృపఁజిమ్మి సంతాన సప్తకంబు
గలిగి షష్టిహాయనప్రాప్తి గలిగి మించు । శ్రీమహిత నిత్యకళ్యాణి సీమరాణి. ౩.

సీ. ఉరుసత్యకీర్తి! నీ వుదయమొందినతోనె యార్యుల శ్రమలన్ని యస్తమించె
నఖిలైకజనని! నీ వడుగు పెట్టఁగ దుష్ట కువలయాధిపకోటి గూలఁబడియె
నమలచారిత్ర! నీ వభివృద్ధినొంద మా జాతివైషమ్యముల్ క్షయమునొందె
గుణరత్ననిధి! నీవు కువలయం బలరింప మనుజుల సుముఖపద్మములు విచ్చె
దేవి! నీకు సంతతిగల్గ దేశమెల్లఁ । గొల్లద్రోపుడులందున గొడ్డుపోయె
నీదు చిత్రచారిత్ర వర్ణింపఁదరమె । గుణమణికదంబ ధన్య విక్టోరియాంబ. ౪.

సీ. నరులు ద్రవ్వకయుండ నాల్గుదిక్కుల నఖాతమగు సాగరమె కందకముగాఁగ
గడలిలేచిన కొండగమివోలు నోడలగుంపు పెట్టని చుట్టుకోటగాఁగ
బాలింపఁబడునట్టి ప్రజలెల్ల నుచితయోచనఁ జెప్పఁగల మంత్రిజనముగాఁగ
బుడమి యూనిన పోల్కిఁ బొలను లందందఁగన్పట్టు రక్కసిబొగ్గు పంటగాఁగ
జిత్రసాధనంబులతోడ ధాత్రిలోనఁ । గ్రాలునేసీమ యట్టి యింగ్లాండుసీమ
నిప్పుడేలుచున్న వరాలకుప్పవీవు । గుణమణికదంబ ధన్య విక్టోరియాంబ. ౫.

సీ. సూర్యతాపము లేనిచోటులున్నవి కాని నీప్రతాపము లేని నెలవు లేదు
శశిమూర్తి చొరనట్టి స్థలములున్నవి కాని నీకీర్తి యరుగని నెలవు లేదు
వర్షధారలు లేని వసుధలున్నవి కాని నీ దయారసమేదు నెలవు లేదు
ఈశ్వరాఖ్యవినని యిమ్ములున్నవి కాని నీపేరు వినరాని నెలవు లేదు
అపర యలదక్షిణోత్తర ధ్రువములందు । దీవులందునుఁ గడు మూలరేవులందుఁ
గడలి మధ్యమం దాఫ్రికాఖండమందుఁ । జెల్లుఁగద నీదు నేల్బడి సీమరాణి. ౬.

సీ. రామచంద్రుఁడు మహారాజయ్యెనే కాని చక్రవర్తిసమాఖ్య జరుగదయ్యె
నలయుధిష్ఠిరుఁడు రాజాధిరాజగుఁగాని సార్వభౌమత నొందఁజాలఁడయ్యెఁ

జక్రవర్తిగ హరిశ్చంద్రుఁడుండె నెవ్వాని యతనికి నీభోగ మబ్బదయ్యె
నలుఁడు భూవలయంబు గెలిచి యేలెనుగాని యొక్క సామంతున కొరిగియుండె
మహితగుణజాల యిఁక వేయుమాటలేల । భరతఖండంబు నేలిన ప్రభువులందు
నీకు నుపమింపఁదగినట్టి నృపుఁడు లేఁడు। గుణమణికదంబ ధన్య విక్టోరియాంబ. ౭.
సీ. మూఁడుపూఁటల డిల్లిపురికైనఁ జనవచ్చు గంగ దాఁటఁగవచ్చుఁ గాలినడక
వానగురియకున్నఁ బైరుసేయఁగవచ్చుఁ గలవు లక్ష్యము లేక గడపవచ్చుఁ
గాశికాపురవార్త గడియలో వినవచ్చు రయితు రాజునెదిర్చి బ్రతుకవచ్చుఁ
గడమాల పండితాగ్రణియైనఁ గావచ్చు నడవి నొంటరిగ స్త్రీయరుగవచ్చు
దేవి! పొగబండ్లవల్ల, వంతెనలవల్లఁ । గాలువలవల్ల, నీ మహాకరుణవల్ల
తంతివార్తవల్లను, సమత్వంబువల్లఁ । బాఠశాలలవల్ల నీ పనుపువల్ల. ౮
సీ. కత్తి చేఁగొనివచ్చు కఠినాత్మునకు జంకి వంగి దండముఁ బెట్టు వ్రాతదప్పె
ధనకాంత గొంతుపీకను గోయు ఖలుచేత నడవిఁ బాంధులు చచ్చు నార్తిదప్పెఁ
బ్రతినిమేషము మాలు రాచపీనుఁగులకుఁ బన్నులీవలెనన్న భయముదప్పె
నడరి ద్రోహము సేయు నధమాధమునియింట బానిసతనమును బొట్లుదప్పె
పాడు పిండారిదండులు మాడుకతన । మాయదారి పాశకరులు మ్రగ్గుకతన
దుష్టనృపులు మన్నెపుదొరల్ త్రుంగుకతనఁ। గడుపుచల్లగ మము నీవు గాచుకతన.
సీ. నిలువెల్లఁ బ్రవహించు నీ దయారసమట్లె పంటకాల్వలు పాఱుఁ బల్లెలందు
నరుల వాహినుల నీయానకట్టినయట్టు లానకట్టలు ప్రవాహములఁ గట్టు
నెడలేక యెపుడు నీ కడుపుపండెడునట్లె పుష్కలంబుగఁ బండుభూములెల్ల
నీకీర్తికన్యక నిలుచు గేహములట్లె పాఠశాలలుమించుఁ బట్టణములఁ
జల్లదనమెంత చదువెంత సౌఖ్యమెంత । పాడియెంత వైభవమెంత పంటయెంత
సేమమెంత నీయేల్బడిచేతఁ గాంత । శ్రీమహిత నిత్యకళ్యాణి సీమరాణి. ౧౦.
సీ. నీ మహాపతిభక్తి నీ దేశపాలనా ప్రబల శక్తికి వింత వన్నెవెట్టు
నీ మహాభూతికి నీ గర్వరాహిత్యమును బాళివా మేలిప్రాఁతఁబూయు
నీ మణిశ్రేణికి నీ గుణశ్రేణులు మిసమిసల్ దళుకొత్తు మెఱుఁగుఁదెచ్చు
నీ ప్రతాపముతోడ నీ ఘనశాస్త్రాది విద్యాప్రదీపంబు వియ్యమొందుఁ
గీర్తికినిమూర్తి, దానలక్ష్మి కభిమాన । లక్ష్మి యొండొంటికిచ్చు నలంక్రియలను
దరమె కొనియాడ నిన్ను నెవ్వారికైన । గుణమణికదంబ ధన్య విక్టోరియాంబ.
సీ. కృపఁజూపి నిరుపేద కుపకారమొనరించు చుట్టమేదన నిన్నె చూపవలయుఁ
బసచెడ్డ పగతుఁ జేపట్టి కాచెడి దయాసింధువేదన నిన్నె చెప్పవలయుఁ

పక్షపాతము లేక ప్రజల నేలు సతీమతల్లి యేదన నిన్నె దలఁపవలయు
నిఖిలవిద్యలయందు నెఱజాణయగు కల్కి మిన్నయేదన నిన్నె యెన్నవలయు
వర పతివ్రతాతిలక మే గరితమిన్న । యనిన వెంటనె నిన్నె పేర్కొనఁగవలయు
రాణివనసీవె జన బహిఃప్రాణమీవె । శ్రీమహిత నిత్యకల్యాణి సీమరాణి ౧౨.

సీ. ఆంగ్లేయ హిందూమహాసేన నడపించు సేనాధిపతి నీదు చిన్నకొడుకు
జర్మానియాదేశ చక్రవర్తియగుచు ఖ్యాతుఁడైనాఁడు నీ కూఁతుబిడ్డ
జనలోక వినుత రష్యాదేశ చక్రవర్తిని యయ్యె నొక చిన్నమనుమరాలు
సార్వభౌములు మహా చక్రవర్తులు కిరీటాధిపుల్ నీదు నియ్యకొను లెల్లఁ
జుట్టములు స్నేహితులు మహాక్షోణివిభులు । దేవి! నీదు వైభవమే మదృష్టమేమి
జన్మమహిమయేమి, కడుపుచలువయేమి । గుణమణికదంబ ధన్య విక్టోరియాంబ.

సీ. కలియుగంబున నిట్టి ఘనతతో నెనుబదివత్సరంబుల దాఁక బ్రతుకుటరిది
బ్రతుకఁబోలును గాని రాజ్యభారమునందె షష్టిహాయన పూర్తి జరుపుటరిది
జరుపనొప్పును గాని జనసమ్మతంబైన యుత్తమపాలన ముండుటరిది
యుండవచ్చును గాని నిండు వేడుకతోడ సిరియు సంతతి యిట్లు చేరుటరిది
యరుదులన్నియు నీయందె యడఁగియుండు । బ్రతుకు వేయేండ్లు శాశ్వతైశ్వర్యవృష్టి
నేలు వేయేండ్లు మాదేశమిట్లె నీవు । గుణమణికదంబ ధన్య విక్టోరియాంబ. ౧౪.

గీ. ప్రేమ "జ్యూబిలీ రీడింగురూమ" పక్ష । మున రచించి యర్పించె నీపుష్పమాలఁ
బ్రబల విక్టోరియా చక్రవర్తినికిని । జిలకమర్తి లక్ష్మీనరసింహమూర్తి. ౧౫.

ఉ. శ్రీసచరాచరాత్ముఁడయి జీవులనెల్లను బ్రోచుచున్ మరిన్
భాసిలు సర్వరక్షకుఁడు భారకుఁడై మనచక్రవర్తినిన్
వాసియువన్నెయున్ శుభమువర్ధిలరాజ్యము నాయువున్ సుఖా
వాససమృద్ధియున్ గలుగవారక క్షేమమొసంగి గావుతన్.

క. శ్రీహర్ మేజస్టీక్వీన్ । మాహాత్మ్యముఁ బాగడవశమె మనవులకిలన్
సాహసిరిముఖుఁడుఁ గావలె । నాహా యమసమానమార్గ మామె కెచెల్లున్.

సీ. ఘనవంశమున బుట్టి జనములబాలించుచును జెనురాణియై తనరునెవరు
లండను నందయై యిండియా నేలుచు దండిప్రాదండయై యుండునెవరు
రాజపూజితమహా రాజసేవితరాజ జీవితంబగుచు రాజిల్లునెవరు
యెల్లరయుల్లముల్ చల్లనజెల్లించు నల్లాను చే నుల్లసిల్లునెవరు

అట్టి శ్రీ క్వీనువిక్టోరియాకు నాఱు పదులు వత్సరములు రాజ్యభారవహియు
గనుటగల్గెను మనలకు ఘనతమీర । సర్వజయ దిగ్విజయయంచు సన్నుతింప.

గీ. సార్వభౌమాధిపత్యంబు షష్టిహాయ । యనములుఁ జెల్లెనుగాన మానవేశి ధాన
మనుట కనుమానమేలనో మనుజులార । సార్వభౌమిని యుంజెల్లు సర్వమానను.

క. మును చక్రవర్తులనియును । ఘనులు మహారాజులనియు కథలుఁ గలవిఁక
గన నెట్టివారలిప్పుడు । గనవిన మన రాణిగారు కాదె తలంపన్.

గీ. ఇట్టి ఘనపుణ్యురాలిఁ గట్టెనుటఁ గన్నఁ। జరితములువిన్న నుతిఁగొన్న జనులకిలను
సకల దారిద్ర్యదుఃఖముల్ సమసిపోవె । యిట్టి భాగ్యశాలింక నెందేఁగలదె.

క. ఎక్కడి లండన్ పట్టణ । మెక్కడి మన యిండియా మహిమ నేమందున్
జక్కగ నక్కడనుండియు । నిక్కడ నిక్కనెడునట్లు నేలుచునుండెన్.

క. ఎంచగను నలువదేడులు । నంచితముగ రాజ్యభార మారవహించెన్
మించెన్ యశమెల్లెడలన్ । బెంచెన్ దన ప్రజలఁబోలఁ బేర్మిని మనలన్.

క. ఈయమకున్ దెలియని య । న్యాయములున్ గొన్ని కలవటంచును దోఁచున్
వేయేలఁ గ్రిందివారలుఁ । జేయుదు రన్యాయములని చెప్పగవలయున్.

క. ఇంకను బహుకాల మిలన్ । బొంకములేక నెల్లపుడమిఁ బూర్తిగ నేలున్
శంకలు తేవేవంకను । సంకటములుఁదీర దేశసౌఖ్యము మీరన్.

గీ. బహుకుటుంబిని ఘనమైన భాగ్యశాలి । మేటి యిల్లాలుఁ బిల్లలతోటితల్లి
కడుపు చల్లగఁబండిన గణ్యురాలు । నిల్లునిండిన సిరులచే నల్లసిల్లు.

గీ. పిల్లపిల్లతరము నెల్లకాలంబిట్లు । నిట్టి రాణివంశ మేప్రమీర
రాజ్యమేలవలయు రమణ నాచంద్రార్క । తారయుతమునగుచు ధరణియందు.

మ. అహహా చిత్రము జిత్రనూ సకల విద్యాప్రాప్తియున్ దృప్తియున్
బహుసౌఖ్యాప్తియు నాప్తసంపదయు సద్భావంబు సంసారమున్
విహితానేకశుభంబులున్ గలిగె క్వీన్ విక్టోరియాయేలికన్
నెహబాన్వీయు విధంబులున్ బాగడఁజేసెన్ లోకముల్ మెచ్చఁగన్.

గీ. ఇట్టి జయము దెల్ప నిండియాయంతట । జ్యూబిలీయనెడు మహోత్సవంబు
సలుపవలయునంచు సర్వాధికారులు । సకలదిక్కులకును జాటబనుప.

గీ. పట్టణశ్రేష్ఠమగుఁ జెన్నపట్టణంపు । రాజధానికి ముఖ్యమై రాజితమగు
నట్టి గోదావరీ మండలాఖ్యయందు । నెందుఁ జేరొందు రాజమహేంద్రపురము.

క. ఇందు మహాజనులందఱుఁ । బొంపుగ గుమిఁగూడి మిగులఁ బోడిమిగను నా
నందమగు నన్నివేడుక । లందము పెంపొంద శుభము లందగఁజేయన్.

రగడ. పురమెల్లను సంపూర్ణోత్సాహము । స్థిరమతి నైనేసిరి ఘన మోహము
సరిగఁ గట్టిరి పచ్చనితోరణములు । సరిపట్టుగఁ జేసిరి కారణములు
రంభాస్తంభా రంభాలంకృత । జృంభణజాజితచూత శ్రీకృత
నారికేళ పున్నాగపత్రములు । సార పుష్పసంస్కారచిత్రములు
నెచ్చటఁజూచిన నెచ్చగు మ్రుగ్గులు । నచ్చుగఁజూచిన నగుఁ దగుఁ గ్గులు
రతనాల్ రీతిని రాజిదీపములు । సీతిఁ జేసిన గానరుగ తాపములు
బహువిధంబులగు బాణసంచులును । మహిమఁ గాంచు నామబ్బుమించులను
సకలసంపదల సంగతిఁ గాంచెను । సుకుమారులుఁ గన సొబగువహించెను.

పూర్ణషడ్జమ రాగము — ఇంగ్లీషు స్టైల్.

ధరన్ జయము రాణికిన్ - మరిన్ శుభము బోణికిన్ ॥
పరమపురుషు కరుణఁ జేసి _ ధరన్ జయము ॥

పుత్రపౌత్రగోత్రజైత్ర యాత్రగాత్రసుఖములున్
మనములరగఁ గలుగుమిగుల జనము లిలను గొలువఁదనము ॥ ధరన్ ॥
జ్ఞానదానమానగాన సేనయాన శుభములున్
ఘనజనధన మనుపమగుచు ననయము దనకనువునొసర ॥ ధరన్ జయము ॥

గత్తు. శ్రీమించినదట	శీలముగలదట।
రాచకూతురట	రాణినామమట।
చక్రవర్తినట	జయమొందినదట।
దయఁగలిగినదట	దానముగలదట।
దీనపోషిణట	తేజముగలదట।
మాటఁదప్పదట	బోటులమేటట।
జగమునేలునట	జనులఁ బ్రోచునట।
చిరంజీవినియట	చిరకీర్తియట।
విక్టోర్యాయట	విజయముఁగనెదట।
జయాజయాజయ	జయజయజయజయ॥

గీ. నేల నాలుగుచెఱగులు నేలుగాత । జనులఁ బాలనసేయుచుమనుచుగాత
ఇండియాదేశమును దయనెంచుగాత । దైవమెప్పుడు రక్షించఁ దలచుగాత.
క. మును జక్రవర్తినీ బిరు । దను గొనుసమయమున ఘనతదొరకొని మరిఁ జె
ప్పిన యెంప్రెసఫ్ యిండ్యా । యను దానిన్ రాణిగురించి యధికము జెపితిన్.

వ. ఇట్లెబ్బదెనిమిదేడులీడుఁగలిగి యఱువదేడులేలఁబడిన్ మిగిలినట్టి యబ్బ్యులు దొర
సానియగు మహారాజ్ఞిగారి యబ్బురంపుఁ బాలనమునం బాలుపడిన లిబ్బులచెలికిక్క
యగు మిక్కిలిఁ జిక్కనగు మన హిందూదేశంబున కక్కజంబుగుఁ జక్రవర్తినీ
యను పేరును బెంపును బొందియుండు నేలికసానికా సర్వేశ్వరుండు భోగ
భాగ్యాయురారోగ్య వైరాగ్య పుత్రపౌత్రాభివృద్ధియు నిష్టసిద్ధియు నొసంగి
రక్షించుగాతా యని ప్రార్థించుచుండెద

సౌరాష్ట్ర రాగము.

శ్రీ క్వీన్ విక్టోరియాకు శుభమంగళం శ్రీ చక్రవర్తినికి జయమంగళం॥ శ్రీక్వీన్॥
సకలసుజనులెల్ల సన్నుతిసేయగ - రాజ్యమంతట తన పూజ్యతఁ జెల్లుచుండ॥ శ్రీక్వీన్॥
రాణీగుణమణి కళ్యాణి సత్పుత్రజనని - అధికమైన సింహాసనాధిపత్యముగల॥ శ్రీక్వీన్॥
బంధుజనసమూహ - బహుకుటుంబిని కారణకార్య సత్కరుణాతరంగిణికి॥ శ్రీక్వీన్॥

సీసమాలిక.

ప్రిన్సఫ్ వేల్సు సేఫిండియా గూడ్విజిట్టనెడు సద్గ్రంథము మునరచించి
నట్టిశుభంబున నధికమౌ యెంప్రెసఫ్ యిండియాయను బిరుదింపుమీర
మరువత్సరమున నిమ్మహీదిగ్విజయ మెన్నగలిగెను శ్రీ రాణిగారికపుడు
నతిచిత్రమగు నెంప్రెసఫ్ యిండియాయను గ్రంథమొనర్చితి గౌరవమున
మోస్టునోబిల్ డ్యూకు ముందటి గౌర్నరుగా రిచ్చటికివచ్చు కాలమునను
లెక్చెరుఁ దెలుగున లిఖియించితిని మేస్టరౌ కెలసాల్ దొర రసికుననుమ
తినిగొని మనమున ఘనమగు సంతోష ముప్పతిల్లగ నప్డు మెప్పువడసి
యున్నవాడను గాన నొనరించితిని దీని నాగ్రంథములఁ జెవులందమొంద
వినియుట్రూ ట్రాన్సులేషన్సు నొనరజేయఁ। దగినవారల కార్డరు మిగులనొసగి
పిదపఁజూచిన ఘనమైన ముదమునొదవు। నాంగిలేయుల కెల్లను నతిశయముగ
నాదిమ ధనుర్ధరుని భక్తి మోదశౌర్య। డాదినారాయణాభిధానాంచితుఁడను.

క. విమే బ్రాడీయన్సెర్వర్ । యూరోపెడ నగ్రాసనమున కియ్యకొనెనుగా
నాయనకు వందనంబులుఁ । వేయిగఁ జేసితిమి నిండువేడుకమీరన్.

శ్రీ క్వీన్ విక్టోరియా చక్రవర్తినీ గారి కనేకవందనాదులచే
వినయవిధేయుండనగు
చిలంబి - ఆదినారాయణప్ప.

సీ. నీవు భీష్మునకు శైనేయుఁ డశ్వత్థామకును వృకధ్వజుఁడు ద్రోణునకుఁ జేకి
తానుండు బాహ్లికతనుజాతునకు ననిరుద్ధుండు కృపునకు నుద్ధవుండు
మత్స్యేంద్రునకు దీప్తిమంతుండు రాజరాజునకు సాంబుఁడు సూర్యతనయునకు గ
దుండు మారుతికి వృకుండు కేకయులకుఁ జారుదేష్ణుండు దుశ్శాసనునకుఁ
బుష్కరుండు పాండ్యభూపాలునకు గాంది। నీసుతుండు ద్రుపదునికి సునంద
నుండు నా సుదక్షిణునకును గృతవర్మ। శల్యునకు శుకుండు సైంధవునకు. ౧౫.

వ. వెండియుఁ దక్కిన యోధులు వారల యోధులకుం జాలినిలుచువారు నేనర్జునునకుం బాలుపడిన జయింపవచ్చునని కొలువుసాలించి యంతఃపురంబున కరిగె నందఱుం దమతమ నివాసంబులకుఁ జనిరంత నయ్యదువల్లభుండగు శ్రీకృష్ణుని యనుమతంబునఁ జారుదేష్ణుండు ప్రయాణభేరి వేయించిన. ౧౬.

మ. శరధివ్రాతము పంకమై నిలిచె నక్రాళి డుల్లె న్దిశా
కరిసందోహము మ్రొగ్గె భూధరము లాకంపించె సూర్యాగ్ని చం
ద్రరుచుల్ మాసె నభంబు బిట్టడరెఁ బాతాళంబు భీతిల్లె శం
కర నీరేరుహసంభవుల్ బ్రమసి రుగ్రంబైన భేరీధ్వనిన్. ౧౫.

వ. అయ్యవసరంబున యదువృష్ణి భోజాంధకాదులు యుద్ధసన్నద్ధులైరి కృష్ణుండును సముచిత శృంగారం బంగీకరించి యంతఃపురంబు వెడలి. ౧౬.

గీ. సైన్య సుగ్రీవ మేఘపుష్ప బలాహ। కములతోడ నిశాతమార్గణగణాది
సకలసాధనములతోడఁ బ్రకట గరుడ। కేతనముతోడఁ దగు తేరు ప్రీతిఁ జూచి.

వ. ఆరథమునకుఁ బ్రదక్షిణము గావించి మహీదేవతల దీవనలుగొని విప్రాశీర్వాదంబులు చెలంగ రథారోహణంబుచేసిన బలభద్రసాత్యకి ప్రభృతి భ్రాతృవ్రాతంబును బ్రద్యుమ్న సాంబ సారణ చారుదేష్ణ దీప్తిమ ద్భాను భానువింద శుక వృక పుష్కర వేదవాహ శ్రుతదేవ సునంద చిత్రబర్హ కవిన్యగ్రోధారుణాది కుమారసంఘంబుఁ గూడి తమతమ బలంబులుగొలువ నిజకేతన చ్ఛత్రచామరశంఖ శిరస్త్రాణతనుత్రాణ ధనుర్బాణాది నానావిధచిహ్నచిహ్నితంబులగు రథంబులెక్కి రయ్యవసరంబున.

సీ. శుభమస్తు దేవతాచూడావతంసయంచు సరోజగర్భాది సురలువల్క
భద్రమస్తు సుపర్వపరిపంథిహరయని సిద్ధమునీంద్రు లాశీర్వదింప
మంగళమస్తు రమానాథయని యక్షవనితలు గర్ణపర్వముగఁ బాడ
విజయోస్తు తే జగద్వినుత విక్రమయని వందిమాగధులు సైవారమొసఁగ
నాగ ఘీంకార ఘంటానినాదములును। ఘోరగంధర్వ విపులహేషారవంబు
నిష్ఠురస్యందనోదగ్ర నేమిరావ। మును దిశల్ నిండఁ గదలె నా మురహరుండు.

వ. ఇవ్విధంబున నశేషబలసమేతుండై కదలి రాజమార్గంబున నల్లనల్లన చనుదెంచు నప్పుడు. ౨౨.

గీ. పౌరపుణ్యపురంధ్రు లభ్రంకష కన। కమయ సౌధాగ్రములనుండి కంసవైరి
మీఁదఁ జల్లిరి లాజ సమ్మిళితపుష్ప। ములు జయధ్వను లాకాశమునఁ జెలంగ. ౨౩

వ. అందు. ౨౪.

ఉ. అక్కట యింతమాత్రమునకై భువనంబులయందు నెల్లఁ జే
రెక్కిన యాదవోత్తము లనేకులు గొల్వఁగ మేటికయ్యముల్
పెక్కులు గెల్చినట్టిహరి పెంపునఁ దాఁ జననేల యిందులో
నొక్కఁడ చాలు నోర్వఁగ రణోర్విని గౌరవపాండవేయులన్. ౨౫.

క. అని పలుకువారు కొందఱు। ఘను లర్జునుమూఁకలోనఁ గలరు నదీనం
దన గురు కర్ణాశ్వత్థా। మ నకుల కృప వాయుతనయ మద్రేశాదుల్. ౨౬.

క. వారలయం దొక్కొక్కఁడ। యీరేడుజగంబులందు నెక్కటిఁ గడిమిం
దేరినవారలు వీరలు। నారూఢబలాధికులు జయము విధియొసఁగున్. ౨౭.

క. అనువారలునై చూడఁగ। ననుజులుఁ దనుజులును గొల్వ నతిసంతోషం
బున నేనలు మున్నుగ న। వ్వనజాక్షుఁడు వెడలె ద్వారవతిపురమనఘా. ౨౮.

వ. అప్పుడు. ౨౯.

సీ. పరశు తోమర గదా ప్రాస కృపాణ చాపశరాఢ్యులై వీరభటులు చనఁగ
సమరసన్నాహ భీషణ యోధజన మనోరథ సమానంబులై రథములరుగ
నిజవేగజిత మనోనిలజవవాజి సంహతి ధరాతలము గ్రక్కదలఁబర్వఁ
బృథులఘంటాజాత భీషణారావంబు సురల బెగ్గిలఁజేయఁ గరులునడవ
నా మహాభారమోర్వక యవని క్రుంగ। దిక్కరులు క్రుంగ శేషుండు దిరిగి ముడుక
కచ్ఛపంబును దలయెత్తఁగానదయ్యెఁ। గ్రోడమును నిల్వనోపక కొమ్ము వంచె. ౩౦.

వ. ఇవ్విధంబున బంధు భ్రాతృ పుత్రమిత్రాదిజనంబులు పరివేష్టించికొలువ శమంతక పంచకంబునకుం జనుదెంచి యంతకమున్న పన్నినం గనుపట్టు పట్టాంశుక విరచితాభ్యంతర నివాసంబులును నీలపటకల్పితానల్ప కుంజరశాలలును ధవళాంబర కృత దుగ్ధ జలజంత్రచేల నిర్మితంబులగు గుడారంబులును విలసిల్లు నిజశిబిరంబు గోధూళికా లగ్నంబునం బ్రవేశించి బలభద్రాదుల నుచితస్థానంబులం గనిపి రథంబు డిగ్గి యభ్యంతరంబున కరిగి. ౩౧.

గీ. నలిననేత్రుండు పన్నీరుజలకమాడి। వస్త్రభూషణమాల్యముల్ వరుసఁదాల్చి
సలతోఁగూడి సంధ్యాది విధులుదీర్చి। యన్నపానాదికృత్యంబు లాచరించి. ౩౨.

క. అరవిరి పూఁబానుపుపై । మురాంతకుఁడు పవ్వళించె మద్దియ లడుగుల్
పరిపరిలాగుల నొత్తఁగ । మరువపు సురటీలు వీవ మది మోద మొదవన్. ౩౩.

వ. అనవుడు నుదారస్వాంతుండగు నిలావంతుండు హరిగుణానురాగియగు శుకయోగి కిట్లనియె. ౩౪.

క. హరి యివ్విధమున సేనా । పరికరములతో శమంతపంచకమునకుం
ద్వరితముగ వచ్చినంతట । హరిసూనుం డేమిచేసె నానతియీవే. ౩౫.

వ. అనుడు శుకయోగీంద్రుం డిట్లను నా తెఱంగున హరి సుఖనిద్రం జెందిన తత్సైన్యంబుల వారలును మజ్జనభోజనాది కృత్యంబులుదీర్చి విశ్రమించిరంత నిక్కడఁ బాండవ స్కంధావారంబున నొక్క రమ్యప్రదేశంబునఁ గరదీపికా సహస్రంబులు వెలుంగ బాహ్లికాది కురువృద్ధులును ద్రుపదాది బంధులును ద్రోణాది మాన్యులును గర్ణాది ప్రభులును ధర్మజ సుయోధనాది పౌత్రులును బరివేష్టింపఁ గాంచనపీఠికాసీనుండై యున్న గాంగేయునకు నర్జునుం డిట్లనియె. ౩౬.

మ. హరి యేతెంచె సమస్తబంధువులు సైన్యాధీశులున్ నందనుల్
కరి గంధర్వరథాశ్వసేనలు సమగ్రప్రీతిఁ గొల్వంగ సం
గరకేళీపరులై మదీయ రథులం గాల్ద్రివ్వుచున్నారు ని
ర్భర దర్పంబున రేపకడ సంగ్రామంబు సేయందగున్. ౩౭.

క. అనుడుఁ గిరీటికి గంగా । తనయుం డిట్లనియె నతని తలఁపెఱిఁగి ప్రియం
బున నట్లే చేయుద మీ । జననాథుల ననుపు యుద్ధసన్నద్ధులుగాన్. ౩౮

వ. అన నప్పార్థుండు పార్థివోత్తముం గనుంగొని యిట్లనియె. ౩౯

మ. హరితో నీధరణీవరాగ్రణికినై యాయోధనక్రీడకున్
బురికొంటన్ వడి నేఁడు మేనులు తృణంబుల్ గా విచారించి వీ
రరసోద్రిక్తమనస్కులై మెఱయువారల్ నిల్వుఁడాత్మన్ శరీ
రరతిం జెందిన భూవరుల్ చనుఁడు పుత్రభ్రాతృసంయుక్తులై. ౪౦.

వ. అనిన వారెల్లను నైకమత్యంబున నర్జునున కిట్లనిరి. ౪౧.

క. సురనాథతనయ సంగర । ధరణిని బ్రాణంబులాసఁ గెదము కాచింతా
మరణేరణేయనెదు వలు । కెఱుఁగమె నీకేల మమ్ము నిట్లాడంగన్. ౪౨.

వ. అనిన నట్లేని కయ్యంబునకుఁ జయ్యన సన్నద్ధులై రండని యనిపిన నెల్లవారలుం దమతమ విడుదులకరిగిన యనంతరంబ భీష్ముండును బాహ్లిక ద్రుపదాదులును నిజ నివాసంబుల కరిగి యుచితప్రకారంబున నుండిరంత. ౪౩

క. తెలతెలవేగినఁ బటహ । కులచే నన్నరుఁడు భూవరులకు బోరలకుఁగా
బలములతో నాయిత్తమై । నిలుఁడని చెప్పించె నంత నిజశిబిరములన్. ౪౪.

సీ. పక్కెరల్ వేయుచో భద్రదంతావళఘటలు గావించు ఘీంకారరవముఁ
బల్లముల్ గట్టుచో నుల్లాసముగఁ జేయు సైంధవశ్రేణి హేషారవంబు
నాయిత్తమొనరింప నందంద తిరుగంగఁ దేరులఁ బరఁగు చక్రారవంబు
సన్నద్ధులగుచు నుత్సాహంబుతో వీరవరులొనరించు నాహ్వానరవము
విజయభేరీమృదంగాది వివిధతూర్య । రవములొక్కట దివి భువి నవియఁ జేయఁ
బూర్ణచంద్రోదయాత్యంత ఘూర్ణమాన । సాగరంబును బోలి తత్సైన్యమడరె. ౪౫

వ. అయ్యవసరంబున సూర్యోదయంబైనఁ జతురంగబలంబులు సవరణలఁ గనుపట్టె. నేల యీనినచందంబున సంగరంబునకు నరుగం దొడంగెనంత. ౪౬.

సీ. కాంచన పద్మరాగశ్రేణిచే నొనర్చినయట్టి దివ్యకిరీటమమర
నతులిత వజ్రమయంబై యభేద్యమై తనరు వర్మము మేన ఘనతనూన
మరకతమాణిక్యమయదండయుక్త ప్రతాపాంక వానరధ్వజము మీఱ
నంభోజసంభవస్యందనరథ్యవిభ్రాజితగంధర్వరాజి మెఱయ
మద్రనాథుండు మొగలపై మహిమఁ జెలఁగ, గాండివంబును గవ దొనల్ కాంక్షఁ బూని
దేవదత్తనినాదంబు దిశలునిండ । విజయుఁ డత్యుగ్రమూర్తియై వెడలెననికి. ౪౭.

వ. వెండియు భీష్మ ద్రోణ కృపాశ్వత్థామ కర్ణ బాహ్లిక సోమదత్త భూరిశ్రవులును ధర్మజ భీమ నకుల సహదేవులును దుర్యోధన దుశ్శాసన దుర్ధర్షణ దుష్ప్రహాది ధార్తరాష్ట్రశతంబును ద్రుపద శిఖండి ధృష్టద్యుమ్నాది పాంచాలవర్గంబును విరాట ధృష్టకేతు సుదక్షిణ యవన నీల విందానువిందులును కేకయమహీపాలు రేవురును భగదత్తాలంబస హలాయుధ ఘటోత్కచాదులు రుక్మి సైంధవ శకున్యాది నానాదేశాధీశ్వరులును దమతమ చతురంగబలంబులు గొలువ రథారూఢులై నిజకేతన ఛత్రచామరాదిలాంఛనంబులు మెఱయింపుచు నొండొరుల సంగరోచితాలాపంబులాడుచు నద్దేవేంద్రనందనుఁ గూడ నడచిరంత నందఱం గలయం జూచి.

సీ. వివిధశస్త్రాస్త్రప్రవీణులై తగు వీరబలము నొక్కమ్మడిఁ బాదుకొలిపి
వారికిఁ బ్రాపుగా వాయువేగములైన గుఱ్ఱంపు దళములఁ గుదురుపఱచి
వానికిఁ గాపుగా నానారణక్రియాశూరులచే మీఱు తేరులునిచి
వానికి బాసటగా నున్నతద్విపప్రచయంబు చాలుపఱఁజేసి
నడుమ నొక్కొక్క నేర్పరిఁ దగనమర్చి । యనిమిషాధీశ నందనుండనువెలింగి
మానుషవ్యూహమొనరించె భూసుతముగ । సకలయోధులుఁ జూచి యాశ్చర్యమొంద.

వ. ఇవ్విధంబున మానుషవ్యూహంబుఁ బన్ని యందు నమ్ముందట గాంగేయ రాధేయు
లును దానును వామభాగంబున గురుకృపాశ్వత్థామలును దక్షిణపార్శ్వంబున భీమ
ధృష్టద్యుమ్న ఘటోత్కచులును, నడుమ యుధిష్ఠిర నకుల సహదేవ దుర్యోధన
దుశ్శాసనాదులును జతుర్థునందును వెనుక బాహ్లిక సోమదత్త భూరిశ్రవులును
నెడనెడ ద్రుపద శిఖండి విరాట దృష్టకేతు కేకయ నీల సుదక్షిణ విందాను
విందులును భగదత్తాలంబుస హలాయుధ రుక్మి సైంధవాదులు తమతమ తనుత్రాణ
శిరస్త్రాణ చాపబాణతూణంబులు ధరియించి హస్త్యశ్వరథారూఢులై వీరాలాపం
బులు నిగుడం బడమరమొగంబైయుండ నంతకమున్న యక్కడ. ౫౧

మ. వనజాక్షుండును వైదికోత్తములు భవ్యప్రక్రియం బాడ పే
ల్మని కాలోచితకృత్యముల్ నడపి యక్కౌంతేయు లారాధనం
బున కేతెంచువిధంబెఱింగి బలరాముండు న్మదింబొంగి గొ
బ్బున సేనల్ వెడలింప వేత్రసమితిం బంపెన్ రణక్షోణికిన్. ౫౨

వ. తదనంతరంబ. ౫౩

సీ. గరుడకేతనంబు గగనంబు నొరయంగ। ఖడ్గబాణచాప గదలమెఱుఁగు
లెల్లదిశలునిండ నెలమి దారకుఁ డర। దమ్ముఁదేరఁ గడుముదమున నెక్క. ౫౪

మ. రమణీయంబగు పాంచజన్య జనితారావంబు గర్జావిశే
షముగా ఖడ్గమరీచిజాలము తటిత్సంఘంబుగా నుగ్రచా
పము దేవేంద్ర శరాసనంబుగను శుంభత్కృష్ణమేఘుంబు పా
ర్థ మహాగ్నిచ్ఛటమీఁది కేగె శరధారాలాల నొల్లాసియై. ౫౫

వ. మఱియు. ౫౬

ఉ. విధ్వమలాంశురేఖయన వెల్లనిగాత్రము చెంగలింపఁ దా
లధ్వజరాజ సీర ముసలంబులు భీమణవృత్తిఁజూప శం
ఖధ్వని లోకజాలములు గంపమునొందఁగఁ జేయవచ్చె న
య్యధ్వమునన్ మురారి గొనియాడఁ బ్రలంబవిరోధి యాజికిన్. ౫౭

ఉ. అత్యధికప్రతాపము జనావళి సన్నుతిఁజేయ సంగరా
చిత్యము మీఱ వర్మము విచిత్రకిరీటముఁ దాల్చి శస్త్రసం
గత్యమున న్విరోధులకుఁ గాలుఁడనం గడు భీకరాకృతిన్
సాత్యకివచ్చె ధర్మరథజాలము ప్రోయఁగ యుద్ధభూమికిన్. ౫౮

శా. విద్యుల్లీలఁ జెలంగు ఖడ్గరుచిరావిర్భూత రుగ్జాలముల్
ఖద్యోతప్రభ నించఁ జక్రరవ మాకాశంబునం బర్వ యు

ర్థోద్యోగంబున మత్స్యకేతనముతో రౌహాధావళుల్వెంటరాఁ
బ్రద్యుమ్నుం డరుదెంచె వైరికులగోత్రచ్ఛేద దంభోళియై. ౫౮.

మ. ఘనబాణాసన బాణమండలిగదా ఖడ్గంబులన్మించు మిం
చినతేరున్నతలీలనెక్కి సిడముల్ జిత్రాతపత్రంబు మీ
అ నవీనోజ్జ్వల దివ్యవర్మము శిరస్త్రాణంబుఁ జూపట్టఁగా
ననిరుద్ధుం డనిరుద్ధవృత్తినడచెన్ హర్షంబు సంధిల్లఁగన్. ౫౯.

శా. చండప్రక్రియ మేఘడంబరము లాశాచక్ర మొక్కుమ్మడిన్
నిండన్నవ్యరథంబుపైనిలిచి తూణీరంబులున్ సజ్య కో
దండంబున్ ధరియించి కంకట శిరస్త్రచ్ఛన్నుఁడై చారుదే
ష్ణుం డేతెంచె మహోజ్జ్వలాకృతి రణక్షోణీ జయోత్సాహియై. ౬౦.

ఉ. అంబుజలోచన ప్రతిముఁ డాహవకేళి ధురంధరుండు బీ
రంబున విల్లు నమ్ములుఁ గరంబులఁబూని విపక్ష భీకరా
డంబరవృత్తి దిక్కులువడంక మహారథమెక్కి వేడ్కపై
సాంబుఁడువచ్చె వాహినులసంఖ్యలు గొల్వఁగ యుద్ధభూమికిన్. ౬౧.

సీ. ఉద్ధసంగ్రామసల్లోద్ధవుం డుద్ధవుం డుగ్రోగ్రసేనుఁ డయ్యుగ్రసేనుఁ
డభియాతిరాజమహాక్రూరుఁ డక్రూరుఁ డరితమోనిచయాదిత్య డారుణుఁడరుణుఁ
డతులిత ధీరతా కృతవర్మ కృతవర్మ కాంచన మణిమయాంగదుఁడు గదుఁడు
దారుణ సమరైకతానుండు చేకితానుం డాస్యజితపుష్కరుండు పుష్క
రుండును శంకుండు దీప్తిమంతుండు భానువిందుఁడు సునందనుండును వేదవాహుఁ
డును బృహద్భానుఁడును వృకుండును రథంబులెక్కి చనిరనికి ధరణిగ్రక్కతిలఁగ.

వ. మఱియు భానుదేవుండును సారణుండును శతదేవుండును వరూధియుఁ జిత్రబర్హియు
నాదిగాఁగల యోధులు దమతమ సేనాసమేతులై యొండొరులఁ గడవఁ బంతం
బులు వలుకుచు సింహనాదంబులు సేయుచు శంఖంబులు పూరించుచుఁ గృష్ణునిం
గూడి చనిరంత గజదానధారా గంధలుబ్ధ పుష్పంధయ ఝుంకారబధిరిత దిక్తటం
బులై చలితఘంటాఘణంఘణారావ నిజఘీంకార ప్రతిధ్వనిత చక్రవాళాచల
గహ్వరంబులైన మత్తదంతావళంబులును మత్తదంతావళ మదజలకలితమార్గ
దుర్గమకర్దమంబు డెక్కలత్రొక్కుడుంచే నింకిపగిలి బీటలై రజోవికారంబుఁజెంది
మొగసిమొగసిచూచు గంధర్వ గరుడసీమంతినుల సీమంతసీమల సిందూరరేఖలై
తత్కబరీభర విలసిత మందారతరుప్రసూన నిష్యందమానమరందానంద ఇందిందిరం
బులపైఁ బుప్పొడి మొప్పనంగప్పి మెఱయ నడతెంచు భీషణహేషాఘోషంబుల

జయసూచనంబుచేయ వాయువేగ తురంగంబులును వాయువేగ తురంగంబుల గట్టిపఱచి సారథులు వలసినయెడలకు నడిపింప యుద్ధసన్నద్ధులగు రథికులకు నెలకలై యురుగడవచ్చిన భుజంగమంబుల తెఱంగునం దనరు విచిత్రకేతనంబులును గేతనంబులఁ బొలుపొంది యాత్మచక్రనేమిధ్వానంబులచేత శైలగహ్వరంబుల నిండించు సింగంబుల మేలుకొల్పు రథంబులును రథంబులకంటె వడిగలిగి ధనుర్బాణపట్టిసప్రాసపరశ్వధశూలభిండివాల తోమరక్షురికాగదాది నానావిధాయుధ సన్నద్ధులై యుబ్బున నిబ్బరంబైన బెబ్బులుల చందంబునఁ గొదమసింగంబుల తెఱంగునం బొంగి బ్రహ్మాండంబు పగుల నార్చుచు నొండొరులఁ గడవఁ బఱతెంచు వీరభటులుం గలిగి యెడలేక ఘోషించు విజయభేరీమృదంగ కాహళాదుల యారావంబుల నమరి యురువది యక్షౌహిణులుం గనుపట్టె యత్మ సేనాసముద్రం బర్జునద్వీపంబు ముంపుటకునై యెదురునడచి నిల్చిన. ౬౩.

ఉ. ఆహరి పాండవేయులు నయంబున పన్నినయట్టి మానుష
వ్యూహముఁ జూచి యందునకు నోర్చి జయించుటకై మహాచల
వ్యూహము నర్చెనంత సరియోధులు విస్మయమొంది సంగరో
త్సాహముఁ దక్కి రాత్మల భుజంగమరాజనుతాతనూభవా. ౬౪.

వ. అని మఱియు నిట్లనియె నట్లు పన్నిన మొగ్గరంబు ముందఱఁ దానును బలభద్రుండును సాత్యకియును వామభాగంబునఁ గృతవర్మ ప్రద్యుమ్నానిరుద్ధులును దక్షిణ పార్శ్వంబున గద సాంబ చారుదేష్ణులును మధ్యప్రదేశంబున బంధుమిత్రామాత్య సహితుండై నెలయేరులతోడి నడగొండలంబోల్పు గంధసింధురంబులు పరివేష్టింప రథారూఢుండై యుగ్రసేనుండును బశ్చాద్భాగంబున నుద్ధవాక్రూరచేకితాన సారణాదులును నెడనెడ బృహద్భాను భానుదేవ శ్రుతదేవ వృక శుక సారణాది కుమారులునుం దమతమ యుడియాలంబులు మెఱయనుండిరి వారల యుద్ధంబుఁ జూడ నంతకమున్న పురందరాది బృందారకులు విమానారూఢులై యంతరిక్షంబున నిల్చిరంత. ౬౫.

క. మోహరములు రెండును స। న్నాహంబునఁ దారసించినన్ ఫల్గున సే
నాహంకృతి యుడివోను। త్సాహంబున శౌరి పాంచజన్యంబొత్తెన్. ౬౬.

క. వెండియు రాముఁడుఁ బ్రద్యు। మ్నుండును సాత్యకియు సారణుండును ననిరు
ద్ధుండును గృతవర్మయు సాం। బుండును శంఖంబులపుడు మొరయించిరొగిన్.

గీ. సకలయాదవసేన యుత్సవముతోడ। సింహనాదంబు లొనరింప సింహనాద
ములయటంచును భీతి వెంపునఁ గిరీటి। బలములోఁగల కుంజరంబులు వడంకె.

వ. మఱియుఁ గృష్ణుని సైన్యంబునందు విజయభేరీశంఖ కాహళాదులు మొరయించిన
నారావంబు ప్రళయకాల ఘూర్ణమానార్ణవధ్వానంబు ననుకరించె సకల యోధ
వీరులును గయ్యంబునకుఁ గాలుద్రవ్వుచు ధనుర్గుణటంకారంబులు నిగిడింపుచుఁ
జతురంగబలంబులు మున్నునడపించిరంత. ౭౦.
క. ఈకైవడి హరిసేనా । నీకము నడతేరఁజూచి నిష్ఠుర కోపా
ద్యాభీలకౌటిల్యమున సుభ । ద్రాకాంతుం డపుడు దేవదత్తంబొత్తెన్. ౭౧.
సీ. తదనంతరంబున ధర్మపుత్రుం డనంతవిజయంబును వృకోదరుఁడు పౌండ్ర
మును మాద్రిపెద్దనందనుఁడు సుఘోషంబుఁ దెలివిమీఱంగ సహదేవుఁడు మణి
పుష్పకంబును నదీపుత్రుండు గురుఁడును గృపుఁడు ద్రౌణియుఁ గురుక్షితివిభుండు
హైడింబుఁడును ద్రుపదాధీశుఁడును మత్స్యపతి వికర్ణుఁడు నలంబసుఁడు నర్క
పుత్రుఁడు మొదలుయోధులన్భృతముగాఁగ । శంఖములను ద్రోయింపఁదధ్వానములను
విజయ దుందుభి తమ్మట ప్రజరవంబుఁ । గూడి యొక్కట సర్వదిక్కులుఁబగిల్చె.
ఉ. వాసవిఁజేరవచ్చి మనవారలకున్ సెలవిమ్మటంచు దు
శ్శాసనుఁడాడి యవ్విభుని సమ్మతినొంది చెలంగి యాత్మ సే
నాసమితిన్ రయంబున రణంబునకుం బురికొల్పునంత ను
ల్లాసముతోడ నమ్మెన చలంబున యాదవసేనఁ దాఁకినన్. ౭౩.
చ. హరులు హరుల్ రథావళి రథావళి యోధులు యోధు లుగ్రకుం
జరములు కుంజరంబులును సందడిగాఁ దలపడ్డ నప్పు డ
బ్బురపడ మిట్టిదట్టిదనిపల్క నశక్య మహేంద్రునకైన నా
సరసిజసూతికైనను భుజంగమహారునకైనఁ జూడఁగాన్. ౭౪.
వ. మఱియు నుభయసైన్యంబులం గనుపట్టు వీరభటులు చటులచక్ర చంక్రమణవిలాస
నిరుపమోద్యములై యీసునరేసి పోతరించి యాఁబోతులరీతి గంధసింధురంబుల
చందంబునఁ గొదమసింగంబులతెఱంగునం గలంపడి పోరుచోఁ గఠారంబుల
వారలు మీఱినపంతంబులం బలుకు నుడుగులు లెక్కగొనక యొండొరుల
నేరుపునం బొడువఁ గడువడిన్ సందడింపుచు నిప్పులొలుక సరిదాటులుగవిశంగిల
వయిచుచు బిరుదునం దిపురుకొను నెడ వెఱపులుగని కమ్మి నెమ్మి సంతసిల్లి ఱంకెలు
వైవ సంగరంబులకు సూటిపట్టి నెట్టనఁ జంపి చచ్చువారలు నద్దాయుధంబులఁ
బ్రవీణులై సంచలింపక యొకండొకండు వదుగు రేగురతోడ భ్రమరి విశేషంబులం
జరియింపుచు డాయుచు వ్రేయుచు నొండొరుల వ్రేట్లుదప్పించి దాఁటుచు నీటున
నరి కెదిరించి యఱుకుచుఁ బరస్పరహేతిగతుల సంగంబులు ద్రీలినఁ బిఱికివాఱక

సాహసంబున మించి నేలకొఱగువారును నానావిధాయుధానీకంబులు ధరియించి బంటుతనంబున శూరులతోడం దలపడి సంగరప్రకారంబునం బెఱవార్లు చూచు చుండఁ బోరాటం బొనరింపుచు హుంకారంబు నిగిడించుచు నొక్కసాధనంబు దమచే నొప్ప నది నెత్తురుకాఁక వీఁకఁ దిగువరాకున్న నొండొక యాయుధంబుఁ గొని నఱక నదియుఁ దుత్తుమురైన వేఱొక శస్త్రంబునఁ బొడిచి విడిచి పుడమి యందువఁ గలియంబడి బాహాబాహిం బెనంగి త్రెళ్లువారును నైదుపులంకించి అంకెలు నైచుచుఁ బదువురు నేవురు మూఁకలై యురువడించి మేనులు సింపుచుఁ బొంచి పొంచి లాఘవంబుల నెదిరి యితరేతరముష్టాముష్టి మోములుపగులఁ బోరిపడు వారలును మఱియు నూఱు నిన్నూఱుఁ దుటుముతుటుములై చటులగతిం గయ్యం బులు సేయఁజొచ్చి హెచ్చినగర్వంబున నన్యోన్యప్రాసంబులఁ గర్ణాద్యవయవంబులు తెగిన నిబ్బితి నిబ్బరంబై మగుడఁజాలక విడనిమత్సరంబునఁ గచాకచిం బెనంగి మడియువారును సహస్రసంఖ్యలగు శూరులు గుంపులై గర్వంబు పెంపున మూఁకల కుఱికి గదలఁ గదలనీక పోరి యొండొరులయేట్ల వికలులై కూలువారలును దమతమ దొరలరుగఁ దెలిసి పిఱుందన యరిగియరిగి తిరిగివచ్చి పతులకడఁ జతురతఁ బో ప్రాణంబులు విడుచువారలును మున్నొకని గుఱిచేసి కూడం జనునెడ నడుమ నొకండు దలద్రెంచినం బడక వాని నఱికి పడు వీరుల మొండెంబులును ననుజులుం దనుజులుం జుట్టంబులు మొదలగువారలకు నెడనడుము సొచ్చి తెంపుచేసి మృతిఁ బొందువారలును భయంకరంబైన పొలికలనం దొరఁగు రక్తమాంసపుఁ దిట్టలుసూచి వెఱచి తలకోక లెఱుంగలేక వెఱ్ఱియాటలాడుచు నుభయసైన్యంబులవారలుచూచి నవ్వఁ బరువులువెట్టువారును గశాతాడనంబునం జేసి తురంగమంబులం గదలించి డాసి యితరేతర ప్రహరణంబుల నశ్వపల్యాణసహితంబుగా రెండు తునియలై కీలుదప్పిన బొమ్మలచందంబునం గూలు రాహుత్తులును నంకుశాఘాత కుపితంబులై యొండొంటి మర్మంబులు గాఢ దంతాదంతిం బోరి మావంతులతోడఁ బీనుంగులైన యేనుంగులును సారథులురవడించి యశ్వంబుల పగ్గంబులు వదలి కదియఁద్రోలినఁ బరస్పరబాణఘట్టనల రథంబులు తిలప్రమాణఖండంబులై వ్రాలఁగిన విరథులై కరవాలంబులుం బలుకలుంగొని యీలమూసగొనక యొండొరుం డాసియు వ్రేసియుఁ దప్పించియుం గుప్పించియుఁ బోరిపోరి పొలిసిన రథికులుం గలిగి యాసందడి కయ్యంబు భయంకరంబై యుండెనంత. ౭౫.

ఉ. వాసవనందనుం గడచివచ్చి వికర్ణుఁడు దోడుగాఁగ దు
శ్శాసనుఁడేచి సాంబుని నిశాతశరంబులనేయ నవ్విభుం

దీనును మత్సరంబు మదిఁ బెచ్చఁగఁ గృష్ణుఁడు మెచ్చ నార్చి యు
ల్లాసముతోడ వాఁడు దెరలన్ విశిఖంబుల నొంచి వెండియున్. ౪౬.

క. శరముల రెంట వికర్ణుని । తురగంబుల నొంచి ఫడఁగఁ దొమ్మిది తూపు
ల్వాఱిపి పొడిఁజేసి సారథి । నురువడి నొకకోలచేత నుక్కడఁగించెన్. ౪౭.

ఉ. అత్తఱి దుస్ససేనుఁడు రయంబునఁ దీవ్రశరంబుచేత వీ
రోత్తము సాంబు నొంచి మఱియుం బదునేను మెఱుంగుటమ్ము లు
వ్వెత్తున సారథిం దగులనేసి తెరల్చినఁ గృష్ణనందనుం
డొత్తి నిశాతబాణమున నుక్కుటనేసె నతండు మూర్ఛిలన్. ౪౮.

చ. కడువడి సారణుండు తెలిగన్నులఁ గెంపుదలిర్ప నగ్రజుం
గడచి శరద్వయంబున వికర్ణుని సారథిఁ జంపి పుచ్చియున్
నెడ మిడు మూడు బాణములఁ జెక్కులు వాపుచు వాని బాహులం
బెడిదపుటమ్ము లాఱువఱపెన్ గగనంబు గలంగ నార్చుచున్. ౪౯.

ఉ. వాఁడును రోషమెత్తి హరివాహిని బగ్గిల సాంబుతమ్ముని
న్వ్యాఁడు నిశాతబాణముల నొంచి హయంబులఁ గేతనంబుఁ గ్రొ
వ్వాఁడి శరంబులేసి నెఱవాదితనంబునఁ ద్రుంప నాతనిన్
బోఁడిమిమాన్చి యార్చెఁ గురుపుంగవసైన్యము దైన్యమొందఁగన్. ౫౦.

గీ. అది గమంగొని కృష్ణుసైన్యంబులెల్ల । నార్చి భేరులు మొరయింప నర్జునుండు
తనబలంబులఁ బురికొల్పి తానుఁ గడఁగి । తోరమగు కినుకతోడఁ బ్రద్యుమ్నుఁ దాఁకి.

గీ. అతనిపై జాలుకొన ముంచె నంపవెల్లి । మీనకేతుండు నతనిపై మించి ఘోర
సాయకంబులు వఱపె మాద్రేయులలిగి । చారుదేష్ణునిఁ దాఁకి రుత్సాహ మొదవ.

క. ఆ రుక్మిణికొమరుండును । వారల రథ్యములమీఁద వడి నూఱమ్ముల్
తోరముగ నేయ వారును । ఘోరాస్త్రములేసి హరులఁ గూల్చిరి నేలన్. ౫౩.

వ. అంత. ౫౪.

సీ. సురనదీసూనుండు హరిపూర్వజన్ముపై నాలుగుబాణముల్ నాటె నతఁడు
కోపించి హలముచేఁ గూల్చె రథ్యంబుల భీముండు సాత్యకిఁ బేర్చి నూఱు
శరములనేసిన బరవసంబున వాఁడితూపుల నేడింటఁ దునిమెఁ బడగ
ద్రోణుండు కృతవర్మఁ దొడరి తొమ్మిది నారసంబులు పఱఁగింపఁ జండసాయ
కముల నేనింట నతఁడు దత్కంకటంబు । చూర్ణముగఁ జేసె నల్కపైఁ గర్ణుఁ డమ్ము
లేడుపదుల ననిరుద్ధుఁ గాడనేయ । నతఁడు నన్నింట నొప్పించె నతని మేను. ౫౫.

గీ. ద్రౌణివడిఁ జేకితానుని తనువు మూఁడు। బాణములనొంప నతఁడు నక్షీణశక్తి
నాలుగమ్ముల నతని గంధర్వములను। దనువులెడఁబాపి యొకటఁ గేతనము ద్రుంచె.
గీ. బాహ్లికుం డుగ్రసేనునిఁ బదిశరముల। నొంచె నాతండుఁ దూపులేను నిగిడించె
నతని దేహంబు దల్లడమంద సోమ। దత్తుఁ డొకయమ్ము చేత నుద్ధవునిఁ గ్రుచ్చె. ౮౭.
క. భూరిశ్రవుఁ డరుణునిపై। ఘోరాస్త్రమ్ము లిరువది నిగుడ్పఁగ నాతం
డీరేడు పెద్దతూపుల। సారథి రథచాప కేతుజాలముఁ ద్రుంచెన్. ౮౮.
వ. వెండియు ధర్మనందనుండును సుయోధనుండును ఘటోత్కచుండును నీలుండును గేకయులును ద్రుపదుండును విరటుండును సుదక్షిణుండును విందానువిందులును గురుకరూశాది దేశాధీశులును నొక్కుమ్మడి శరపరిఘ చక్ర తోమర శూలాది బహువిధాయుధంబుల నరిబలంబులు బడలువడ నుద్దండవృత్తి మోహరించి రందు ఘటోత్కచుండు. ౮౯.
శా. పూర్వారావము దిక్కులందు వెడల న్మాయాబలస్తోముఁడై
వార్వాహంబున మింటికిం జని శిలల్వర్షించు నొక్కొక్కచో
గర్వోద్రిక్తమనస్కుఁడై రథికులన్ ఖండించు నొక్కొక్కచో
దుర్వారాశుగకోటిఁ గాలుబలముం దూలించు నొక్కొక్కచోన్. ౯౦.
వ. మఱియును. ౯౧.
మ. ఒకచో నార్చు నొక్కచోఁ జటుల బాహుల్లాసము ల్సేనహా
రికిఁ గానంబడఁజేయు వేఱొకచోఁ గ్రీడాగతిం గుంజర
ప్రకరంబు న్వడిఁజెండివైచు నొకచో రథ్యంబులన్ గూల్చు నొం
డొకచోఁ జీఁకటి గొల్పునంతగమిచే నుద్దామ తేజంబునన్. ౯౨.
క. ఈరీతి నింద్రనందను। వారలు వెఱఁగందఁ గృష్ణవాహిని గలఁగన్
ఘోరాస్త్ర పరంపరచే। వారక పదివేలరథుల వడివధియించెన్. ౯౩.
ఉ. వెండియుఁ గృష్ణసైన్యములు వీఁగినఁ గన్పడి ద్రోలఁజూచి సాం
బుండును సాత్యకిం గలసి పూనికతోడ ఘటోత్కచున్ మహా
కాండములేసి నొంచి తురగంబుల పీఁచమడంచి సారథిన్
గుండెలు వ్రీలఁజేయుటయు ఘోరపరాక్రమవృత్తి నాతఁడున్. ౯౪.
ఉ. ఒండురథంబుపైకుఱికి యుగ్రత సాత్యకిఁ గృష్ణనందనుం
బెండుపడ న్నిశాత శరబృందము లేసిన వారలిద్దఱున్
వెండియు భీమనందనుని విల్లుసిడంబునుఁ దేరు సారథిం
జండతరాశుగప్రతతిఁ జక్కుగఁజేసి చెలంగి యార్చినన్. ౯౫.

క. విరథుండై యవ్వీరుఁడు । కరమున గదఁ బూని విలయకాలుండనఁగా
బఱతేరఁ జూచి సాత్యకి । శరముల నేనింట దానిఁ జక్కుగ నేసెన్. ౯౬
క. అనిరుద్ధుండును ఝషకే । తనుఁడు బలుఁడు సారణుఁడు నుదగ్రస్ఫూర్తిన్
ఘనజాలబాణముల నొం । చిన నాతఁడు ఱిచ్చపడి విచేష్టితుఁడయ్యెన్. ౯౭
వ. అప్పుడు. ౯౮
క. తనకొడుకుఁ బెక్కురథికులు । గనుకని నొప్పింప నదరి కడువడిని మరు
త్తనయుఁడు ప్రళయాంబుద ని । స్వనమో యన నార్చి బాహుసారము మీఱన్. ౯౯
ఉ. సారణు నైదుదూపులను సాంబుని నొమ్మిదిసాయకంబులన్
న్మీఱి పదేడుబాణముల నిష్ఠురువజ్రుని రెంట సాత్యకిన్
క్రూరశరంబుచేత ననిరుద్ధకుమారుని మూడుకోలలం
దూఱఁగ నేయ వారలును దోడనె కప్పిరి భీముననమ్ములన్. ౧౦౦
వ. వెండియు. ౧౦౧
మ. అనిరుద్ధుం డొకతూపుచేత బకదైత్యధ్వంసి చాపంబు చ
క్కన ఖండించె బలుండు నాగట రథాంగంబు ల్వడంగొట్టెఁ గే
తన మా సాత్యకి ద్రుంచివైచె విలసత్కాండద్వయి న్మీనకే
తనుఁడున్ సాంబుఁడు నేసి రాశుగతతిం దత్కాయమత్యుద్ధతిన్. ౧౦౨
వ. అంత. ౧౦౩
మ. గదచేఁ ద్రిప్పుచు రౌద్రవైఖరి మహాకల్పాంతక ప్రౌఢి బె
ట్టిదుఁడై భీముఁడు చండభాస్కరునికంటెన్ దీవ్రమై నెమ్మొగం
బు దలిర్పం గనుదోయి నిప్పులురులన్ భూమండలంబెల్ల గ్ర
క్కదలన్ రాముని తేరు దక్షిణము నుగ్గై రాలఁగొట్టె న్వడిన్. ౧౦౪
శా. ఆ వీరుండును బాదచారియయి బ్రహ్మాండంబు గంపింపఁ గ్రో
ధావష్టంభమునన్ మరుత్తనయు సంహారంబు గావింపఁగా
వేవేగం బఱతేరఁ గన్గొని మహావీరుండు పార్థుండు రో
షావేశంబున నేగుదెంచెఁ బరయోధానీకము ల్బెగ్గిలన్. ౧౦౫
వ. అతనితోడన తోడన యుత్తమోజుండును యుధామన్యుండును ధృష్టద్యుమ్నుండును విరాటుండును రుక్మియు భగదత్తుండును గేకయులును నేతెంచి రంతకమున్న.
శా. అశ్వత్థామయు భీష్ముఁడుం గృపుఁడు ద్రోణాచార్యుఁడుం గర్ణుఁడున్
విశ్వంబెల్ల వడంక నార్చి సమరోర్వీరేణుసంఘంబు స

హ్రాస్వం గ్రమ్మ శతాంగముల్వ్రాఁపి తాలాంకున్మదంబేది నీ
లశ్వేతోరుగరుద్ధ్వజాన శరజాలంబేయఁగా నత్తఱిన్. ౧౦౬

శా. అభ్రధ్వానసమానశార్ఙ్గనినదం బాకాశసంచారులన్
విభ్రాంతిం బొరలింపఁ గేతనరుచుల్విస్పందనత్యంత కో
పభ్రూమండలి భుగ్నమై మెఱయ శుంభత్పాంచజన్యారవా
దభ్రవ్యాప్తి మహీధ్రముల్వడఁక దైత్యధ్వంసి యేతెంచుచున్. ౧౦౭

సీ. భీష్ము నిన్నూట నొప్పించి యశ్వత్థామఁ బదియేనుతూపులఁ బాఱఁగొట్టి
ద్రోణుని నిరువదిబాణంబులఁ దెమల్చి భీముని మున్నూట బెండుపఱచి
కర్ణుఁ బంద్రెండుమార్గణముల నోనేసి ద్రుపదనందను మేనఁ దూపునాల్పి
మత్స్యనాయకుని మైమఱుపు వాఁడిశరములఁ జించి యొక్కొట రుక్మినొంచి నరక
తనయ కృపులను నిష్ఠురాస్త్రములఁ గ్రుచ్చి। కాండపంచకమునను గేకయులనొంచి
నిమిషమున నొక్క యక్షౌహిణీబలంబుఁ। బిలుకుమారిచె నానాస్త్రములనరేంద్ర.

వ. అయ్యవసరంబున నర్జునుండు గర్జారవ కాలమేఘంబు చందంబున సింహనాదంబుఁ జేసి దేవదత్తంబు పూరించి కర్ణ గాంధారేయాదులఁ గయ్యంబునకుఁ బురికొల్పిన.

ఉ. వారలు తూర్యబంధురరవంబు లెసంగఁగ సింహనాదముల్
బోరనఁ జేసి యద్భుతముఁ బొంది సురల్గన శౌరి సైన్యమున్
దారుణలీలఁ దాఁకినఁ బదంపడి యయ్యదుయోధవర్యులుం
ఘోరపరాక్రమస్ఫురణఁ గోల్తలఁ జేసిరి పార్థనందనా. ౧౧౦

వ. అందు బలభద్రుండును భీష్ముండును సాత్యకియు నశ్వత్థామయు ద్రోణుండును బ్రద్యుమ్నుండును గృతవర్మయు ధృష్టద్యుమ్నుండును నుగ్రసేనుండును బాహ్లికుండును సాంబుండును గర్ణుండును నక్రూరుండును నజాతశత్రుండును నుద్ధవుండును ద్రుపదుండును విరాటుండును గదుండును భీముండును సారణుండును ఘటోత్కచుండును జారుదేష్ణుండును దుశ్శాసనుండును దీప్తిమంతుండును దుర్యోధనుండును భానుదేవుండును భూరిశ్రవుండును బృహద్భానుండును ధృష్టకేతుండును భానువిందుండును రుక్మియు వృకుండును గేకయులును నరుణుండును భగదత్తుండును బుష్కరుండును జాంద్రాధీశ్వరుండును సైంధవుండును వేదవాహుండును సుదక్షిణుండును శ్రుతదేవుండును యవనాధిపుండును సునందనుండును నీలుండును జిత్రబర్హియు విందానువిందులును వరూధియు నకుల సహదేవులును న్యగ్రోధుండును సైంధవుండును దక్కిన యోధులును దుర్మర్షణాదులును హేతిప్రాస పరశ్వధ పట్టిస భిండివాల ధనుర్బాణ నానాయుధ సన్నద్ధులై యొండొరుల

వ్రేసియుఁ ద్రోసియుఁ ద్రుంచియుఁ జెంచియుఁ బొడిచియు నడిచియుఁ జిమ్మియుఁ గ్రుమ్మియు మొత్తియు మత్తియు ననేకప్రకారంబులఁ గయ్యంబు సేయు నెడఁ గుంజరంబులఁ గుంజరంబులును ఘోటకంబుల ఘోటకంబులును నరదంబుల నరదంబులును బదాతులఁ బదాతులుం దలపడి చెయితివియని బీరంబునఁ బరస్పర శస్త్రంబులఁ బొడిచియు నొడిచియు వ్రచ్చియు గ్రుచ్చియుఁ గుదిపియుఁ జదిపియుఁ గొట్టియు మట్టియు ననేకోపాయంబులఁ బోరుసమయంబున. ౧౧౨.

క. రారాజు తమ్ములెల్లన్ । ఘోరమదేభముల నెక్కుకొని యఱువదివే ।
ళేరుపు లేనుంగులతో । నారాముని మీఁది కేఁగ నతఁ డుద్వృత్తిన్. ౧౧౩.

క. ఏనిక మొత్తము లెదిరెను । నేనిఁక మొత్తకయుడంగ నెగ్గగునని మ ।
త్తానేకపముల నన్నిటిఁ । బీనుంగులఁ జేయఁదొడఁగెఁ బేర్చినకినుకన్. ౧౧౪.

వ. అట్టియెడ నా సుయోధనతమ్ములు దుష్ప్రహ దుర్మర్షణ దుర్ముఖ దీర్ఘబాహు భీమబాహు భీమ సుషేణ సులోచన సేనాపతి జలసంధ విచిత్ర తర్షణోగ్రాలోలుపులు పదుమువ్వురును మత్తకుంజరంబుల నెక్కి పెట్టునం డీకొల్పి చుట్టుముట్టిన నతం డందఱికి నన్నరూపులై హలంబునన్ దగిలిచి తిగిచి ముసలంబునఁ దత్కుంభమధ్యంబులం దివిచి జంభారాతి కుంభినీధరంబుల దంభోళిచేఁ గూల్చు చందంబున నన్నిటిం గూల్చి దుష్ప్రహుసామజంబుతోడన చదిపి తత్సోదరుఁ డగు భీముని శిరంబు డొక్కసొర నడఁచి తత్కుంభికుంభములు వగులందన్ని యనంతరంబ భీమబాహుం డగుదెంచి తన దంతావళంబుచే నవ్వీరునిం బొడిపించిన నతం డచలాకారుండై తద్దంతిదంతంబులు పెఱికి వానిని వాని యేనుంగుతోడఁ బీనుంగుఁ గావించినఁ దక్కిన పదుగురును దలపడి సింహనాదంబులు చేసి యెదిరిన నా హలాయుధుండు వారలతోడన యవార్యరణంబుల మారిమసంగి పొంగి నింగి పగులనార్చిన.

ఉ. తమ్ములు సచ్చిరంచును ముదంబఱి యర్జునుఁ జేరవచ్చి శో
కమ్మున రాజరాజు పలుకన్ సురరాజతనూభవుండు వే
గమ్మున రాజులన్ గజనికాయములుం దనతోడ రాఁగ నొ
క్కుమ్మడిఁ దన్నుఁ దాఁకి బలుఁ డుద్ధతితోడ హలంబు ద్రిప్పుచున్. ౧౧౬.

చ. నిలిచిన సర్వసైన్యధరణీవరముఖ్యులు నేగి సాయకం
బులు నిగిడించి తాకఁపము పోఁడిమి గానఁగ తాకయుండ న
బ్బలుఁడును వానిఁ గైకొనక బంధురహస్తహలంబుచేత రా
జులఁ బొలియించి వాజుల వసుంధరఁ గూల్చె రథాళి నూచఁగాన్. ౧౧౭.

ఉ. అర్జునుఁ డగ్నికల్ప నిబిడాశుగముల్ పరఁగించి వానిపై
నూర్జితశక్తిఁ జూప నతఁ డుగ్రత నాగలిఁ గేలఁ ద్రిప్పుచున్
నిర్జరనాథనందనుని నేలకుఁ దే నడతేర సీరి ధీ
స్ఫూర్జితమూర్తిఁ జూచి దివిజుల్ భయమంది చలించి రందఱున్. ౧౧౮.

వ. అయ్యవసరంబున భీమసేనుండు దలకడచి యమ్మహావీరు నెదురునెడఁ బ్రద్యుమ్నా నిరుద్ధ సాత్యకి కృతవర్మ చేకితానులు రథారూఢులై కదలి సేనామధ్యంబున నొక్కండును బాదచారియై భీమార్జునుల మీఁద నురువడించు బలభద్రుం గనుంగొని వాయువేగంబున వచ్చి విప్వచ్చుండాఁకి. ౧౧౯.

సీ. సాత్యకి యిరువదిసాయకంబుల శల్యు నేసెఁ బ్రద్యుమ్నుండు నేడు వెడద
తూపుల వర్మంబు దూఱనిగిడ్చె గదుండు తొంబదియాఱు కాండములను
గపికేతను నించె విపులాస్త్రములు నాల్గు కృతవర్మ హయములఁ గీలుకొల్పెఁ
జేకితానుండు నిశితభల్లముల రెంటఁ దఱిమి గాండీవంబు దాఁకనేసె
మీనకేతనసూనుండు మెఱుఁగులొలుక । రత్నపుంఖశరంబు లుగ్రంబుగాఁగ
భూనభోంతర మదరంగ నానిలింప । సార్వభౌమాత్మజుని నేసె గర్వమడర. ౧౨౦.

ఉ. ఆ జగదేకవీరుఁ డగు నర్జునుఁ డందఱికన్నిరూపులై
రాజితపుంఖసాయకపరంపర లభ్రము నిండ నాత్మసే
నాజనులెల్ల నుబ్బ నదనం బదునార్వుర నొక్కపెట్టునం
గాజుపడంగఁ గూల్చెఁ దెలిగన్నులఁ గెంపుదొలంక వెండియున్. ౧౨౧.

సీ. కృతవర్మ సారథిఁ గెడపె మూఁడమ్ముల గదునిపై నాల్గు మార్గణములేసె
నంబకయుగళి సాత్యకిమేన నాటించెఁ గ్రూరాస్త్రమున ననిరుద్ధు నిడఱు
పడవైచెఁ బుడమిని బ్రద్యుమ్ను నక్షుద్రభల్లసంహతి మూర్ఛపాలు చేసె
నతని సారథి నేరుపడర నవ్వీరునిఁ గొనియేగెఁ దమసైన్యమునకు వేగ
చేకితానుని యురము నిశితమహాస్త్ర । పంచకమ్మునఁ గ్రుచ్చె నప్పార్థుఁ డంతఁ
గర్ణ గాంగేయ గురు కృపు లడిమి మెఱసి । హరికిఁ గేడించి తత్సేన కరిగి రపుడు.

శా. ధృష్టద్యుమ్నుఁడు నాసుయోధనుఁడు మాద్రీసూనులున్ సంగరా
వష్టంభోజ్జ్వలమూర్తులై హరిని దివ్యస్ఫూర్తిబాణంబులన్
దృష్టప్రక్రియ నేసి యార్వ నతఁడున్ ధీరాత్ముఁడై యందఱిం
జేష్టల్ దక్కఁగ శార్ఙ్గముక్తవిశిఖశ్రేణి న్వ్యసం జేసినన్. ౧౨౩.

మ. భగదత్తుండు నలంబసుండును విదర్భస్వామియున్ సైంధవుం
డు గురుప్రోద్భవుఁడున్ హలాయుధ విరాటుల్ నీలుఁడుం గేకయుల్

దగ భూపాలుఁడుఁగూడి యవ్విభునిమీఁదన్ మార్గణవ్రాతముల్
నిగుడంజేసి ధరాతలంబువడఁకన్ విక్రాంతులై యార్చినన్. ౧౨౪.

గీ. అవ్వడయ్యంపవెల్లికి నరుడు గాఁగ । సంచలింపకయుండె నాసారసాంద్రుఁ
డంబుదంబులు జలధార లగ్గలముగఁ । గురియఁ గనుపట్టు నీలాద్రి తెఱఁగుమీఱి.

వ. తదనంతరంబ యతండు. ౧౨౫.

సీ. భగదత్తు మేన డెబ్బదితూపులడరించి ద్రౌణిబాహుల శరద్వయము నాఁటి
నారాచయుగళి సైంధవు విల్లుఖండించి బాణముల్మూడలంబసునిమేనఁ
గీలించి యొకవాఁడికోల రుక్మిఁ దెమల్చి ద్రుపదనందను మేను దూసిపాఱ
భల్లపంచకమేసి బాణషట్కమున సుయోధను మూర్ఛపాలొనరిచి విశి
ఖములరెంట విరాటువక్షంబుఁ వ్రచ్చి । కవల నెనిమిదియమ్ములఁ గాడనేసి
కాండవింశతిలీలఁ గేకయులఁ గ్రుచ్చి । యుగ్రమార్గణమున హాలాయుధునివైచె.

వ. అయ్యవసరంబున. ౧౨౮.

ఉ. వీరరసంబు వెల్వడిన వీఁకను మేనులఁ గ్రమ్మనెత్తురుల్
కోరకితోరుకింశుకములోయనఁ బొల్చియు ధీరచిత్తులై
తోరముగాఁగనార్చి జయదుందుభు లొక్కట మ్రోయఁ బేర్చియ
వ్వీరశిఖామణిం దఱిమి వేయిశరంబులనేసి రుద్ధతిన్. ౧౨౯.

ఉ. అత్తఱిఁ గృష్ణుఁ డార్చుచు మహాశుగసంహతి వానినన్నిటిన్
దుత్తుములై పడంగ వడితో నొనరింపుచు వారికెల్ల వి
ల్లెత్త శరంబులెత్తఁ దలయెత్త నశక్యముగాఁగనేసె ను
వ్వెత్తున యాదవోత్తములు హెచ్చఁగఁ బాండవసేన భీతిలన్. ౧౩౦.

చ. మఱియు నతండు వారలఁ దెమల్పఁగఁ బూని తదీయవాజులన్
నెఱి చెడఁగొట్టి సారథుల నేలపయిం బడఁద్రోచి తేరుల
న్విఱుగఁగమోఁది కేతువులు విండ్లును నొక్కటఁ ద్రుంచి వర్మము
ల్పఱియలుచేసి తత్తనువులన్ నిగిడించె ననేకబాణముల్. ౧౩౧.

గీ. వారలెల్లను విరథులై పోరికెడగఁ । దలఁగిపోయినఁ గృష్ణుఁ డుద్దండవృత్తి
నరిబలంబులు దల్లడమందఁజొచ్చి । యశనికల్పాశుగంబు లేయంగనంత. ౧౩౨.

క. మరలెడు మత్తేభంబులుఁ । దెరలెడు తురగములు నేలఁ ద్రెళ్లెడు రథముల్
పొరలెడు యోధులు నల్గడ । వఱచెడు రక్తంబులయ్యె వాసవిసేనన్. ౧౩౩.

వ. అది గనుంగొని యర్జునుండు. ౧౩౪.

మన్యవ్యాఘ్రము

ప్రథమాంకము.

[వర్తకశ్రేష్ఠుఁడైన విజయసేనుఁడును, ఆయన చెల్లెలు విమలయుఁ బ్రవేశించుచున్నారు.]

విమల — (కుడివైపుననున్న తలుపుదగ్గఱ చెవియొగ్గి వినుచున్నది.) చిననాయన యింకా మేలుకొనలేదనియే తోఁచుచున్నది.

విజయసేనుఁడు — (ముందుకు, వెనుకకు నడచుచు) విమలా! అక్కడ నిలుచుండుట నిష్ప్రయోజనము. చిననాయన నిద్రనుండి లేచెడిమార్గము లేదు.

విమల — (అతనికేసివచ్చి) ఆయన కదలుచుండుటను, ఇంతకుముందే వింటిని.

విజయ — ప్రక్కమీఁద నిటునటు గదలుట నీవు వినియుందువు. ఈ పల్లెయందున కలవాటుపడ్డవారు మనలను రాత్రి ఆలస్యముగాఁగాని పడకకు వెళ్లనందుకు ఆక్షేపించి రాత్రినిఁ బగలుచేయుచున్నారందురుగాని మధ్యాహ్నముదాఁక నిద్రించుచు పగటినే వారు రాత్రిగాఁ జేయుదురు.

విమల — ఇపుడెనిమిదిగంటలయియుండును.

విజయ — తొమ్మిది గావచ్చినది. చిననాయనగారి ముఖదర్శనము మనకు లభించు సరికి వాడుకచొప్పున, పదియుఁగూడ నగునని తోఁచుచున్నది.

విమల — సరే! అన్నయ్యా! ఇందుకొఱకిఁక విచారింపకు. నీ మనస్సంక్షోభమునకు నీ వ్యాపారనష్టమే చాలును.

విజయ — నిజము. సరుకులు దగ్గఱలేనప్పటికిని, సాహసించి క్రయవిక్రయములు చేసిన యాదుర్వ్యాపారమువలని దురంతనష్టముచేత సొమ్మంతయుఁ బోవుటయు, ఇఁక మునిఁగి కొట్టుకొనిపోవుట తరువాయిగా, ఇపుడు నేను దారిద్ర్య ప్రవాహము ఒడ్డునఁ గొట్టుకొనుచుండుటయు, నా సావుకారులను-జూచుటకు మొగము చెల్లకుండుటచేత బస్తీలోకి వెళ్లుటకయినను సిగ్గగుచుండుటయు, ఇవియే చాలును. నేనింటియొద్దనున్న సమయమున నయినను విశ్రాంతిలేక, విషాదమును, ఈ మన్నెపు ముసలి బెబ్బులి యీయింటనుండుట పదిరెట్లు హెచ్చుగా—

విమల — (అడ్డగించి) ఊరుకో! అన్నయ్యా! ఇట్లనకు. నీకు కలిగిన నష్టములచేత నీస్థితి చెడినదాఁక, మున్నెప్పుడు నిట్లన్నవాఁడవుగావు.

విజయ— సరే! సరే! ఇంక అనను. ఇపుడు నాకొక్కరూపాయి కావలసినను దొరకని యీ యవస్థలో బంధువులుగూడ, ఇంటఁజేరి సత్కార మపేక్షించుట ఆగ్రహహేతువుగదా! ఆ బంధువుఁడయినను, భాగ్యముతోఁ దులతూఁగుచు మన్నెమునుండి వచ్చినవాఁడై, చిల్లిగవ్వయైన వ్యయపెట్టకుండ, తానును తన పరివారమును, ఇంట దాఁపరించుట, అంతకంటెను కోపహేతువుగదా!

విమల— నీస్థితి అనుకూలముగానే యున్నట్లు ఎల్లప్పుడును అతఁడు తలఁచుటకు హేతువులుండెను. ఇపుడారీతిని లేదనియాతనికిఁ దెలియఁజేయుటకు నీవంగీకరించని యెడల—

విజయ— (మాటకడ్డమువచ్చి) విమలా! మన యిరువురకును బ్రాయశః భేదము గలిగింపఁజాలిన విషయ మిదియొక్కటే! ఈసంగతి యెత్తుకొనుచున్నావు!

విమల— నేనిఁక నొక్కమాటయిన నాడను. నీతో భేదముగలిగించు సామ్రాజ్యమయిన నాకక్కఱలేదు.

విజయ— నీవు మంచిపిల్లదానవు. నేను భాగ్యస్థితిలో నున్నప్పుడు నాకభిమాన మెంతయుండెనో నీవెఱుఁగుదువు. దారిద్ర్యము వచ్చిన యిప్పుడా యభిమానము పదిరెట్లు హెచ్చయ్యెనన్నమాట యెన్నటికిని మఱువకు.

తెరవెనుక— (తలుపుచప్పుడువలె వినఁబడుచున్నది.)

విమల—అది సుమంత్రుని పిలుపు. బస్తీనుండి యాతఁడు నీకు శుభవార్తలు తెచ్చినాఁడేమో! ఎవ్వరెఱుఁగుదురు!

విజయ— నాకట్టిసంభావన లేదు. సుమంత్రుఁడు చాలసరసుఁడు, అయినను నామాట విందువా అతనిని పెండ్లాడు నుద్దేశము పూర్తిగా విడిచిపెట్టు.

సుమం— (ప్రవేశించుచున్నాఁడు.) ఎంత దొడ్డవాఁడవోయి! విజయసేనా! నీకు చాలకృతజ్ఞుఁడనయియున్నాను. తెల్లవాఱినదిమొదలు నీమేలుకొఱకే యత్నించుచు బస్తీయెల్లఁ దిరుగుచుంటిని. అందుకుఁ బ్రతిఫలమేమనఁగా, నన్ను విడనాడుమని నీచెల్లెలి కుపదేశించుచున్నావు.

విజయ— నా యుపదేశమునకుఁ గారణము నీకుఁ దెలిసియుండవలసినదే! నేను పూర్వము తలఁచుకొన్న హరణమును మాచెల్లెలికిచ్చుట కిపుడు నాకు శక్తి లేదు. కాఁబట్టి—

సుమం— (మాట కడ్డమువచ్చి) కాఁబట్టి పరాపేక్షవిషయమయి తటస్థించిన యీ ప్రథమావసరమునందు, ఆమెకు విధి విహితముగా దొరకఁదగిన నాసంరక్షణ మామెకు లేకుండఁజేయుట యుచితమని తలఁచుచున్నావు.

విమల— (సుమంత్రునితో) నావిషయమయిన విచార మిప్పుడు కట్టిపెట్టి, అంతకంటెను అత్యావశ్యకమయిన సంగతినే మా యన్నయ్యతో మాటాడుటకు నిన్నుఁ గోరుచున్నాను. అనఁగా, అతని స్థితిగతులనుగుఱించి ప్రశంసింపుము.

విజయ— ఆహా! అది యెంత వినోదకరమయిన విషయము!

సుమం— నిశ్చయముగా! నీవు తలఁచుదానికంటెను వినోదకరమే! ఒక్కఁడయినఁ దక్కువకాకుండ నీ సావుకారులందఱును, నీ ఋజుప్రవర్తనము విషయమయి తమకు సంపూర్ణవిశ్వాసము గలదనియు, విశేషోల్లాసముతో, ఇఁక మూఁడు సంవత్సరములవఱకును గడువిత్తుమనియు, నాచేత నీకిపుడు వర్తమాన మంపుచున్నారు.

విజయ— వారికిని, నీకునుగూడ నావందనములు. కాని, నేను నష్టపడ్డ ద్రవ్యము నీ గడువులోపల మరల నార్జింపఁగలనను నమ్మకముమాత్రము నాకు లేదు.

విమల— అన్నయ్యా! నిశ్చయముగా నీవు సంపాదింపఁగలవు.

సుమం— ఇంతేకాక, నీ పినతండ్రి కుబేరసేనుఁడు నీవు కడగండ్లఁ బడుట కెన్నటికిని సహింప—

విజయ— (మాటకడ్డమువచ్చి) నాకుఁ బిచ్చయెత్తించుటకు నీయుద్దేశము గానియెడలఁ ఆతనిసంగతి నింక నెన్నఁడును బ్రస్తావింపకు. ఆతని నొక్కదమ్మిడియయిన నడుగుటకంటె నేను బంటాపనిలోకి వెళ్లి పొట్టపోసికొందును.

సుమం— ఇది యేల? అతనియొద్ద పదిలక్షలకు పయిగా ధనమున్నదని విన్నానే!

విజ— ఆసొమ్మాతఁడు నానిమిత్తమయి దాఁచవచ్చును.

సుమం— సరే! ఆతఁడు దాఁచుఁగాక యని నేనును గోరుచున్నాను.

తెరవెనుక— (తలుపుచప్పుడువలె వినఁబడుచున్నది)

విమల— ఈసంగతి నింక నెక్కువగా వాదించుటచేత ప్రయోజనము లేదు. మా యన్నయ్య యభిమానమును నీ వెఱుఁగుదువు. మా చిననాయన కన్నులువిచ్చుటకును హృదయము చల్లఁబడుటకును దైవసహాయమే తప్ప సాధనము లేదు.

విజయ— (తెరనుండి చూచుచు) ఎంత దౌర్భాగ్యము!

విమల— ఇపుడేమివచ్చినది!

విజయ— ఇదిగో! అసహ్యము పుట్టించు నా ముసలివిధవ చండసేన మరల వచ్చుచున్నది. ఆమెను, ఈయింటికి రాకుండ నాపు మార్గము లేదా!

విమల— సరే! రానీ! ఆమె యిచ్చట చాలసేపుండదు.

విజయ— ఉండదందువా? మన భాగ్యవంతుఁడయిన బంధువుఁడు వచ్చినప్పటినుండి

గూడ నీమె యెప్పటివలె ఇక్కడనే నివసించుచున్నది.

సుమం— కూఁతును పెండ్లిచేసెదనని చెప్పి కుబేరసేనున కీమె టోపివెయ్య నుద్దేశించిన దని నాకు తోఁచుచున్నది.

విజ— పోనీ! మన కేమి? టోపివేసిననుసరే! గొంతుపిసికిననుసరే!

చండసేన— (తెరలోపల) ఇదిగోనోయి! నేను వచ్చినానని మీ యజమానునకుఁ జెప్పనక్కఱలేదు. లోపలకు వెళ్లుటకు ముందు వర్తమానమంపుట యంటే నా కసహ్యము. (తెరఁజిమ్మకొని ప్రవేశించి) ఎవ్వరికిఁ దెలియకుండ హఠాత్తుగా నాస్నేహితుల యెదుటికివెళ్లి వారికి సంతోషము గలిగించుట నాస్వభావము. సంతృప్తికి సాధనమును ఇదియే!

విజయ— (ప్రక్కకు మొగముత్రిప్పి) నీ కౌతుక సంతృప్తికి సాధనమిదే!

చండ— నాయనా, విజయసేనా! క్షేమమా? విమలా! బాగున్నావా! సుమంత్రా! సుఖముగా నున్నావుగదా! కుబేరసేనుఁడుగా రెట్లున్నారు!

విమల— అవ్వా! సుఖముగా నున్నారు.

చండ— ఆమాటవిని చాల సంతోషించుచున్నాను. ఆయనయేఁడీ?

విమల— అదిగో! గదిలో.

చండ— నిజముగా? అతఁడు స్నేహపాత్రుఁడు! (లేచి ముందుకు నడచుచు) అతనినిఁ జూచినదాఁక నాకు తోఁచకున్నది. ఇపుడే అతనిదగ్గఱకు వెళ్లవలెను. (కుడివయిపు గుమ్మములోపలకు వెళ్లుచున్నది.)

విజయ— ముఖ్యముగా! అయితే, ఆయన యింకను లేవలేదు.

చండ— (తొందరతోఁజూచి మరల వచ్చి) అయ్యో! విజయసేనా! ఈమాట ముందరనే చెప్పినావుకావేమి? లోకాతీతురాలనయిన యాఁడుదాననని నన్ను నీవెంచినావు గాఁబోలు!

విజయ— తొందరపడకు. నిన్ను సామాన్యునిగానే తలఁచినానుగాని యంతకంటె కించిత్తయిన నెక్కువదాననని తలఁపలేదు.

చండ— నామీఁద నీకు చాలదయ! (విమలతో) కుబేరసేనుఁడు వాడుకకంటె నీదినమం దాలస్యముగా నిద్రించుచున్నాఁడు. కాదా?

విమల— కాదు. పదిగంటలకు లోపుగా నెన్నడును ఆయన యీవలికి రాఁడు.

సుమం— చండసేనగారితోడి సల్లాపసౌఖ్యము దొరకునని ఆయనకుఁ దెలిసియుండెనా, యీసరికే యిక్కడికి వచ్చియుండును.

చండ— ముఖస్తుతిచేయకు నాయనా! స్తుతిలేకుండనే మా ఆడువాండ్రము సహజ

సౌందర్యముచేతనే గర్విష్ఠులము.

విజయ— (రవికకుట్టుచున్న చెల్లెలితో) అవ్వ జాముప్రొద్దువేళవచ్చెనా, చిననాయన అప్పుడు మేల్కొని యుండఁగలఁడు.

విమల— అవునవ్వా!

చండ—అమ్మాయీ! నేనిప్పుడు వెళ్లను. ఈదిన మిక్కడనే యుండఁదలఁచినాను. మీకు అనుకూలమయినయెడల—

విజయ— (ప్రక్కకు మోముత్రిప్పి) ఏమి యాానుకూల్యము!

చండ— విజయసేనా! ఏమనుచున్నావు?

విజయ — మిక్కిలి అనుకూలమని.

చండ— ఎంతదయయోయి! సోతువేమంటావా? నీ వ్యాపారవిషయము కొంతకొంత నాకుఁ దెలియుటచేత—

విజయ— (ప్రక్కకు మోముత్రిప్పి) నీకుఁ దెలియవలెనని యెవ్వరును గోరలేదు.

చండ— ఇక్కడ నీ పినతండ్రిగారి సార్వకాలిక నివాసము నభినందించుచున్నా—

విజయ— (ప్రక్కకు మొగముత్రిప్పి) అభినందనమున కెంత చక్కనివిషయము!

చండ— ఆపినతండ్రి భాగ్యవంతుఁడని విన్నాను. అతఁడు ధనవంతుఁడే. కాఁడా?

విజయ— అవును. అవునని నమ్ముచున్నాను.

చండ— చాల- కాదా?

విజ— ఆలాగే తెలిసినది.

చండ— తెలిసినదా? ఏమిది? ఈవిషయమును నిష్కృష్టముగా విమర్శించుట నీవు ముఖ్యకృత్యముగాఁ జేసికొనలేదా?

విజ—ఇతరుల స్థితిగతులను విమర్శించుట నే నెన్నటికిని ముఖ్యకృత్యముగాఁ జేసికోను.

చండ— ఎంత యసంగతము! ఇట్లు ఇంత సాక్షాత్తుగా నీకు సంబంధించెడి యీ విషయములోఁ జెప్పుచున్నాను.

విజ— ప్రస్తుత వ్యవహారమునందు నీ కేవిధమయిన సంబంధము లేకున్నను విమర్శన బుభుక్షమాత్రము నీకు సంపూర్ణముగానే యున్నది.

చండ— (ప్రక్కకు మొగముత్రిప్పి) నా కేవిధమయిన సంబంధమును లేదని నిశ్చయించుకోకు. (పయికి) విమర్శన బుభుక్ష యని నీవిప్పుడంత సరసముగాఁ బలికిన వృత్తి నాకు ఏమియు ఫలాపేక్ష లేకుండ కేవలము నీక్షేమముకొఱకే నాకుదయించి నట్లు నీకుఁ దోఁచలేదటోయి!

విజ— (ప్రక్కకు మొగముత్రిప్పి) ఆలాగు తోఁచుటకు వీలులేదు.

చండ — ఒక బంధువుఁడు మన్యములో మిక్కిలి భాగ్యము సంపాదించివచ్చుట యెవరికి సంతోషము పుట్టింపకుండును.

విజయ — అవును. మానాభిమానములు పరిత్యజించి మరణశాసన భాగధేయము కొఱకు దురాశ పెట్టుకొను ప్రతివానికిని సంతోషము పుట్టింపవలసినదే!

చండ — అయ్యయ్యో! ఇక్కడ మరణశాసన ప్రసక్తి లేదోయి! అతఁడు మీకు మిక్కిలి ప్రయాసము గలిగించుచున్నాఁడు.

విజయ — అది సత్యమే!

చండ — అతనివల్ల మీకు విస్తారము ధనవ్యయమగుచున్నది.

విజ — ఆమాటయు నీవనవచ్చును.

చండ — అందుకుఁ బ్రతిఫలముగా మీకేమైన నిచ్చుట న్యాయము.

విజ — ఆమాటమాత్రము నీవనరాదు. అతని కిల్లిచ్చినందుకును, అన్నపానము లిచ్చినందుకును, వంటపూటివానివలె లెక్కకట్టి పుచ్చుకొమ్మన్నావా యేమి?

చండ — కాదు! కాదు! ఇట్టి సంగతులన్నియు ప్రజలు తమకుతామే గ్రహింపవలెను. అతనిని మీరు సంరక్షించుచున్నారు. ఇదిగాక అతని చలచిత్తమునకు లొంగి నడచుకొనుచున్నారు. సరే! మీరేమియు ఇందుకు ప్రతిఫల మపేక్షింపకున్నను తనంతటది రాఁగలదు. ఏలాగందువా? నాబిడ్డ విమలకు వివాహము తలపెట్టినారుగదా! దానికేమి కోరికలేకున్నను పెండ్లివేళకు తన పినతండ్రి చక్కని వస్త్రవాహనములను గొనియిచ్చినయెడల నాపిల్లది సంతోషించునని అతనికేమాత్రము సూచించినను తత్క్షణమే వేయిరూపాయిలసంచిని ఇయ్యక మానునా?

విమల — (ముందుకువచ్చి) అవ్వా! నేనట్టిదానను గాను. ఇది గుర్తెఱుఁగుము. నేను సూచనలు చెయ్యను. నాకు సొగసులక్కఱలేదు.

చండ — అన్నకూఁతురా! ఇకఁ దెలిసినది. నీవును సుమంత్రుఁడును ఇట్టి స్వల్ప విషయములను గణింపరు. పెద్ద అరణ మొక్కదానికే కాఁబోలు మీయపేక్ష!

సుమం — (ముందుకువచ్చి) ఓ ముసలమ్మా! ఇట్టి దురపేక్షలు నాకు లేవు. నేను విమలను వివాహమాడుట సొమ్ముకోసము గాదు. ఆమెకొక దమ్మిడియయినను ఉన్నదో లేదో నేఁ దెలిసికోను. అందుకు లక్ష్యమును జేయను.

చండ — చేయవేమి? ఆలాగయితే నీవు అసాధారణుఁడవయిన పడుచువాఁడవు. అన్నా! నేనెంత తెలివితక్కువదాననయితిని. సరే! ఇప్పుడు తెలిసినది. మీరిద్దరు గూడ మన విజయసేనుని లాభముకొఱకు మీకోర్కెలను మానుకొన్నారా?

అతనియొక్క యిప్పటి చిక్కులు తీరునిమిత్తమయి మీరందఱు గలిసి ముసలాతని నొప్పించు ప్రయత్నము చేయుచున్నారేమి?

విజ— (ముందుకువచ్చి) ఓ వృద్ధురాల! ఒకమాట! నాకు చిక్కులువచ్చెనా వానిని నేనే తీర్చుకొందును. సహజముగాఁ గనఁబఱుపవలసినదయినను వెనుకకుఁ బెట్టఁబడ్డ సహాయమునిమిత్తము బంధువునికిఁగాని వంగి వంగి నమస్కారములు నక్కనైచ్యములు చేయువానిని జూచితినా నాకసహ్యము.

చండ— (ప్రక్కకు మొగముత్రిప్పి) ఇందుల రహస్యము నాకుఁ దెలిసినది. (పయికి) విజయసేనా! నావలన నాయాస మక్కఱలేదు. నేను మొదటినుండి మీకు హితురాలను గనుక, ఆచనువుచేత నీ చిక్కులసంగతి తలపెట్టినాను. ఆచనువు చేతనే, నీ స్థితిగతులను నీ పినతండ్రితో సూచించువిషయమయి యత్నించుటకు.

విజ.— నీవు మిక్కిలి మంచిదానవు. ఈ సూచనలపద్ధతికంటె నాకసహ్యకరము లేదు.

చండ— సూచనయనఁగా సంగతులన్నియు తెలియునంత స్పష్టముగా ప్రశంస చేయుట యనియే నా తాత్పర్యము.

విజ— ఎప్పటికిని జ్ఞాపకముంచుకో! నీవు తలఁచునట్లు నాకుపకారముకొఱకు నా పిన తండ్రిగారితో ప్రశంసించుట మానుకొంటివా, అదియే నాకు మహోపకారము.

చండ— (ప్రక్కకు మొగముత్రిప్పి) నీకోర్కెయే జరుగఁగలదు.

విజ— అతని యొద్దినుండి నాకపేక్షలులేవు. నేనుగాని మాచెల్లెలుగాని అతని ధనము నాశింపము.

చండ— (ప్రక్కకు మొగముత్రిప్పి) నే నాశించుచున్నాను గనుక నా ప్రయత్నమును వీరు విఘటింపఁజాలరు. అతఁడు నిద్రనుండి లేచువఱకును ఈచోటు విడిచిపెట్టుటయే మంచిది. (పయికి) సుమంత్రా! కొంచెము నాతో రావోయి! పువ్వుల తోటలోకి వెళ్లుదము.

సుమం— (సంశయించుచున్నాఁడు.)

విమల— (చేయడ్డమిడి సుమంత్రునితో) రావనకు. ఆమెను అవమానము చేయకుండు టయే మంచిది. ఆమెచలపాది.

సుమం— (ప్రక్కకు మొగముత్రిప్పి) భయంకరమయిన ముసలికోఁతి.

చండ— ఏమోయి రావయితివి!

సుమం— ఇదిగో! వచ్చుచున్నాను.

చండ— } (వెళ్లుచున్నారు.)
సుమం— }

విమల — (తెరవైపు జూచి) ఇదిగో! మన కరణము కృష్ణశర్మతాతగారు వచ్చుచున్నారు.

కృష్ణశర్మ —(ప్రవేశించి ఒక కాగితముఁ జూచుచు) ఇది దురన్యాయము! నిశ్చయముగా నిది దురన్యాయము!

విమల— కృష్ణతాతా! ఏమది.

కృష్ణ— ఇది దురన్యాయము. నిశ్చయముగా.

విజయ— ఏమయ్యా! నిన్ను పిలిచినపుడు పలుకవేమి?

కృష్ణ— నాకు లక్ష్యము లేదు! అమ్మాయి! నాకు లక్ష్యము లేదబ్బాయి! నేను బ్రతికియున్నంతకాలము నిన్ను 'అబ్బాయి' యనియే పిలుతును. నేను మీతండ్రిగారితోఁ దిరిగినాను— మిమ్మల నిద్దఱను పుట్టుకమునుండి యెఱుఁగుదును— కనుక నిది దురన్యాయమని నిశ్చయముగాఁ జెప్పుచున్నాను.

విజ— దురన్యాయమేది?

కృష్ణ— మీ చిననాయన వర్తనము.

విజ— మా చిననాయనగారా! ఆయనవట్ల గౌరవముతో మాటాడుము—

కృష్ణ— (అడ్డుకొని) అతని పరివారము విషయమయి చాలగౌరవముతో మాటాడుచున్నాను. నీచిక్కులకుతోడు అతని పిండివంటలతో నీయిల్లు గుల్లగుచున్నది.

విమల— కృష్ణతాతా! ఊరుకో! నీయజమానుని నొప్పించుచున్నావు.

కృష్ణ— అమ్మాయీ! ఆమాట నిజమే! కాని విధిలేకున్నది.

విజ— ఏమిచేయుటకు నాస్థితి చాలునని నీయభిప్రాయమడుగుటకు నిన్నిక్కడికి రమ్మనలేదు.

కృష్ణ— లేదు. నిశ్చయముగా, ఏమిచేయుటకు నీస్థితి యిపుడు చాలదో ఆసంగతి చెప్పుటకే నేను వచ్చినాను. (వ్రేళ్లతో లెక్కించుచు) మీ చిననాయన యొకఁడు— ఆయన సేవకులిద్దఱు- ముగ్గురు- వాండ్రొక్కొక్కఁడు తట్టెడేసి మ్రింగుదురు. ఆతిండి నావంటివానికి వారమునకు సరిపడును. ఇఁక గుఱ్ఱపులాయములో నొక మహానుభావుఁడు బారల బొక్కువాఁడున్నాఁడు.

విజ— ఆ బారలబొక్కు మహానుభావుఁ డెవరు?

కృష్ణ— మీ పిననాయనగారి వ్యాఘ్రేశ్వరుఁడు!

విజ— ఏమీ? బ్రాహ్మణబాలుఁడా?

కృష్ణ— కాదు. క్రూరమృగబాలుఁడు. ఇంతటితో నలుగురైరి.

విజ— దానిమాట కేమిలే!

అహల్యాబాయి.

మొదటి ప్రకరణము.

మహారాష్ట్ర దేశమునకుఁ గస్తూరితిలకమువలె నలరు శ్రీ పునహానగరము భయంకర శాసనుండగు శ్రీ పేష్వా మాధవరాయని పాలనమునందుండుటచేఁ జోర కిరాతభీతిలేక తన్నగరవాసులందఱు హాయిగ గుండియలపైఁ జేతులునైచుకొని నిద్రించుచుండిరి.

ఆహాహా! రాత్రి సకలజంతుసంతతికిని నపారనిద్రాసుఖమొసంగు మహోపకారియయ్యు, మదనప్రేరితులకును, విచారవిభ్రములకును, పాపకర్ములకును గంటికిఁ గూర్కు రానీయక నాలుగుజాములకాలమును నపకారిణియై యుండునుగద! అయినను సర్వరహస్యములను దన కడుపున నిడుకొని కన్నతల్లివలెఁ గాపాడునట్టిది రాత్రియే గనుక దురాచారులకుగాక మానధనులకుఁ గూడనది యుపకారియగు. ఆనాటిరాత్రి నగరమంతయుఁ గాలపురుషుండు వేసిన సమ్మోహనాస్త్రముచేత బద్ధమై పరవశత్వంబునొందెనేమో యనునట్లు తమ ప్రాణంబులఁ బరమేశ్వరునకును, నర్థంబుల రాజసేవకులకును సంరక్షణార్థ మొప్పగించి నిద్రించుచుండిరి. వేయుగన్నులతో సర్వేశ్వరుండు రక్షింపఁ దమపని యేమున్నదనియో, నియమిత కార్యంబుల మఱచియో, యనిలంఘనీయమగు నిద్రాదేవి కెదురాడ నేరకయో రాజభటులుఁగూడ నెక్కడివారక్కడ నిద్రింపుచుండిరి. తమపనియం దత్యంత శ్రద్ధాళువులు కొందఱు వీథులు గస్తీ దిరుగుచు నడుమనడుమ నిద్రవచ్చినపుడు స్తంభమునకో గోడకో జేరఁబడి కునికిపాట్లుపడుచు నట్లిట్లు పనిఁజేయుచుండిరి. నగరమునందలి దీపములన్నియు నొకటితరువాత నొకటి క్రమముగ నారిపోయెను. ఆ రాత్రి యొకబాలిక దీపములు పెట్టినదిమొదలు పలుమాఱులు తన పెరటితలుపు తెరచుచు మూయుచు మాటిమాటికిఁ దన ముద్దుమొగమ్ము బాటసారుల కగపడునట్లు తొంగితొంగి చూచుచుండెను. జాము రాత్రియగుతరువాత నొకమారట్లు చూచి వీథిలోనికి రావలెనని గుమ్మములో నడుగిడ నిద్దఱు బాటసారు లాదారి నేగుచుండిరి. అందుచే నామె చంగున లోనికింజని దలుపుమూసెను. మఱి రెండుసారు లట్లు గృహము వెడలిపోవఁ బ్రయత్నించుచుండ నొకమాఱు తల్లి మేల్కని యామె స్థితినిగూర్చి పరికించి యామెను బండుకొనఁ జేసెను. రెండవమాఱు తన చిన్నతమ్ముఁడు నిద్రలో దుస్స్వ

ష్టముం గని యేడ్చుటచే నాతని నూరడింపవలసివచ్చెను. రెండుజాములరాత్రియైనవెనుక ద్వారము వెడలి యా సుందరి వచ్చునప్పటికిఁ దన కెదురుగ నరుగుపై నిద్రించు రాజభటుడు "పోకుపోకు జాగ్రత" యని పలువరించెను. రహస్యకృత్యములఁ జేయువారు ప్రపంచమునందలి యన్నియంశములుఁ దమవిషయమే యనుకొందురు గాన నామె యామాటలకు వెఱచి యిలువెడల సాహసింపదయ్యెను. తుదకు నాకన్య రేయియంతయు నిదుర లేకయే నిష్కారణముగ శ్రమపడి యింకఁ దనకుఁ దగు సమయము లభింపదనుకొనుచుండ జాముకోడి కుక్కురోయని కూసి యామెకు మఱింత విచారమును గలిగించెను. అయినను నామె తన ప్రయత్నమూనక కడపటిసారి తలుపుం దెఱచిచూడ వీధిలో నిర్మనుష్యమైయుండెను. ఇంట నందఱుఁ దెలవాఱుజామున వీచు మందమారుతములు తమ్ముఁ జోకబట్టి గాఢనిద్రం దేలుచుండిరి. అది తగినయదనని మదినెఱిగి యాసుందరి మార్గమెఱుఁగుటకుఁ దన రెండు కన్నులందక్క తక్కిన శరీరాంగకములనెల్ల గప్పు మేలిముసుంగు ధరించుకొని గృహావరణము దాటి యావలఁబడి తనకోరిక క్రేళ్లుదాటుచుండినట్లై తనగమనంబును నతివేగమై యుండునట్లు నడిచి తను నిర్ణయించుకొనిన స్థానమునకుం జనుచుండెను. అపుడు చీఁకటి పూర్ణముగనున్నను నాకాశమను పాలవెల్లిని విలాసార్థము గట్టిన పాదరసపు బుడ్డివలె దోఁచిన వేఁగుచుక్క మినుకుమినుకుమని వెలుతురు నిచ్చుటచేతను, ధవళధవళమగు మేలిముసుఁగు తనయొడలంటుటచేతను నామె కితరులు నితరుల కామెయు నగుపడుచుండిరి. ఇట్లు కొంతదూర మాయింతి నడచినడచి యెవ్వరో మనుష్యులు త్రోవను వచ్చుటచే గొంతతడ వొకయరుగుపై గూరుచుండి మఱలఁ దన ప్రయాణము సాగింపఁ గొంత నడచి నాలుగుసందుల మొగదగ్గఱఁ దన గమ్యస్థానమునకు దారియెఱుఁగక నిలుచుండెను. అప్పుడు తనముందు ఇరువదియైదు సంవత్సరముల యీడుగల మనుష్యుఁడు నడచిపోవుటఁ జూచి యొంటరిగ దీర్ఘాలోచన మొనర్చుచు శిరమున వెల్లపాగయు, వెల్లదేహమునఁ దెల్లయంగరకాయుధరించి మెల్లగాఁబోవు నొక క్షేత్రాయఁపువానిఁ గనుంగొని చకచక వానివైపునకు నడచి చల్లగ వానివీపున జేయివేసెను. అదివఱకు నిర్మనుష్యమగు వీధింబోవు నాపురుషుఁ డీ చల్లని హస్తస్పర్శముచే నులికిపడి తిరిగిచూచి యెదుట మబ్బుమఱుంగున మసలు మెఱుఁగుతెఱంగున ముసుంగుమఱుంగున నిలంగు నంగనం జూచి యాశ్చర్యపడి యామెతో మెల్లగ "నీవెవ్వరిదానవు, నాతో నేమిపనియున్నది" అని యడిగెను. ఆమెయు మృదూక్తులతో "నాపేరెందుకు? భవానీదేవి యాలయమునకు దారి నీవెఱిఁగినచో జెప్పుము, నేనటకుం బోవలయును" అని ప్రత్యుత్తరమొసంగ నాతఁడు

“నీయెదుట నాచెట్లచాటున నొకమేడయున్నది. ఆమేడ కావలిదే భవానీ దేవాలయము.” అనిచెప్పి యట్టిసమయంబునఁ జీఁకటియని శంకింపక, దురాచారులకు వెరువక, కావలివాండ్రకు జంకక నతిసాహసముతో నొంటరిగ బయనముచేయుచున్న యామె తెరువరు నాచ్చుకొనుచు నామెపైఁ గన్నులు నిగుడ్చి నిలువఁబడెను. ఆమాటలు వినఁబడినతోడనే యన్నెలఁత యాదేవళమువంక నరుగుచుండెను. ఈసుందరియాలయమువంక దెవ్వరినిమిత్తమేపనికై జనుచున్నదో తెలియఁగోరి మన తెరువరి యామె వెనువెంటఁదగిలి యామెచేఁ గనుఁగొనఁబడకుండ నడచుచుండెను. ఆమె యాలయమును జేరి మూసియున్న కవాటములు గఘాలున ద్రోసి లోనికిఁ జని దేవియున్న గుడితలుపులయొద్దకుం జని నిలిచెను. గర్భగుడితలుపులు మూయఁబడి నందున నామె ముహూర్తమాత్రము యోచించి గుడియెదుట నేల సాష్టాంగ నమస్కారమొనర్చి, తనమొగ మాగుడిగడపపైమోపి కొంచెమునేపు వెక్కివెక్కి యేడువసాగెను. ఈనడుమ వెంటవచ్చిన యబ్బాలుఁడు బాలికస్థితికిఁ దొంటికంటె నక్కజపడుచు ఱెప్పవాల్పక నామెను జూచుచు నాకమూల నామెచే లక్షితుండు గానట్లు గూరుచుండెను. ఊరడించువారు లేనందున దుఃఖము వెంటనే యుపశమిల్లెను. బాలిక లేలికయగు హృదయముతో నచ్చటనుండి యిట్లనెను. “అమ్మా భవానీ! జగన్మాతా!! తండ్రిలేనిబిడ్డను నన్నిట్టుజేయుట నీకు ధర్మమా! ఇపుడు నామనస్సున కిష్టములేని యీకార్యముఁజేయుటకంటె నన్ను జంపివేయరాదా! ఈకార్యమునుండి తొలంగుటకని మాయమ్మను నేల దోఁచునట్లు జేయవు? తల్లీ నామనోరథము నెరవేరదేని నాకు విషమేగతి; ఆమాట నీకే దక్కఁగలదు. నా సాహసము నీవెఱుఁగనిదికాదుగదా” యని పరిపరివిధముల నమ్మహాదేవినిఁ బ్రార్థించి తెల్లవాఱుచుండుటచేఁ దన్నెవ్వరైనఁ గన్గొందురేమో యని మఱల గృహమునకుఁ దనవారు మేల్కొనకమున్న నరుగదలఁచి లేచెను. లేచుచుండఁగా “నీ మనోరథము నెరవేఱును భయపడకుము” అని యొక యమానుషవచన మామెచెవులకు వినవచ్చినట్లయ్యెను. అందుచే సఫలీకృత మనోరథనయ్యెదనని యామె సంపూర్ణోత్సాహము గలిగి గుడివెడలి పదిబారలు వచ్చునప్పటికి నావఱ కాలయమున నక్కిన యక్కుమారుఁడు సుందరిం గలసికొనివచ్చుట కారంభించెను. తన రహస్యముల నాతఁ డాలకించెనేమొ యని యామె దిగులుగొని యాతని నసూయతోఁ జూచుచు నడువ నావయసుకాడు పరవశుఁడై యామె హస్తముం బట్టుకొని “సౌందర్యమంతయు సంపూర్ణముగ నీసొమ్మైనది. ఇంక నేమివరములకై దేవినిఁ బ్రార్థించుచున్నావు? నావంటివానిపై దయయుంచుము” అని యాచేయి ముద్దుఁబెట్టుకొన

యత్నించుచుండ నామె సహజముగ బలముఁగలదగుటచే సహజలక్షణమగు నధైర్యమును విడిచి చేయి విదలించుకొని కనులెఱ్ఱఁజేసి కోపముతో నాతనిఁ గసరఁ బోయెను. కాని యాతఁ డామెను మఱలఁబట్టుకొని "నాతో రా, నీ వెక్కడి కరుగఁగలవురా!" అని లాగఁదొడఁగెను. పడుచుకన్నియయగు తాను నిశాసమయమున నొంటరిగా వచ్చినందుకు విచారించి, విచారించినఁ గార్యము లేదని యరక్షితరక్షణియగు నాభవానీమాతం దలంచి హా! జగన్మాతా యని గద్గదస్వరముతో నఱచెను. ఆ యఱపు గుడి యరుగుపై నిద్రించుచు నప్పుడే మేలుకువగాంచిన యొక సన్యాసి విని "దురాత్మా యెవఁడవురా నీవు" అని దగ్గఱకువచ్చెను. వెంటనే యాదురాత్ముఁడు పిక్కబలముఁ జూపి యదృశ్యుఁడయ్యెను. సన్యాసి యామె నూరార్చి యిట్లొంటరిగా రాఁగూడదని చెప్పి యింటిదనుక సాయముఁజనియెను. ఆమె యిల్లుచేరి తనవారెఱుఁగకుండ మెల్లన మంచముపైఁ బవ్వళించెను.

రెండవ ప్రకరణము.

హోల్కారు రాజ్యమునకు రాజధానియగు నిందూరునగరమునకు నేడుక్రోసుల దూరమున, మహూయను పట్టణము కలదు. నిత్యకళ్యాణప్రదమగు పచ్చని యడవి నడుమ నా పురముండుటచే నుద్యానవనమందలి మేడలాగు ముద్దులు మూటగట్టుచు నుండుటయె గాక వ్యాధిగ్రస్తులకు నిరామయత నొసంగు నారోగ్యస్థానమై యలరుచుండును. దానికి మూఁడుక్రోసుల దూరమున వింధ్యపర్వత సంబంధములగు కొండలచే నావరింపఁబడి యొక గూడెము కోటనడుమనున్న పల్లెవలె సురక్షితమై యుండును. ఆపల్లె కులవృత్తివలన జీవించు గొల్లలకు నివాసస్థానమై వారికిఁ గామిత సౌఖ్యప్రదాయినియై యుండును. ఆగొల్లలచే భగవదవతారమని పూజింపఁబడుచు మహూనగరవాసులచే నాగతానాగతవేదియగు మహర్షియని యెన్నఁబడు నొక వృద్ధుఁడుండును. ముడతలుపడిన మొగమును యాకులన్నియుఁబండి రాలిన వెనుక మోడగు చెట్టువలె నున్నదై వెండ్రుకలులేకయున్న శిరస్సును, నాతఁడు కాలము దీరినవాఁడని వేనోళ్లఁ జాటుచున్నను నాతని యద్భుతదార్ఢ్యమును, దంతపటిమయుఁ జెవుడు రామియు, గమనవేగమును నతఁడంత యీడుగలవాఁడా యని సందియము గొలుపును. రాత్రులు కొంచెము రేచీఁకటితప్ప నేత్రరోగముగూడ పగటివేళల నెద్దియు లేదు. కనులయెదుట బంధుగణమెల్ల నశించుటయుఁ దనకుఁ జిరాయువు గలుగుటయుఁ జూచి యావృద్ధుఁడు తనను ప్పెట్లు గడచునని చింతించుటప్పుడప్పుడు కలదుగాని, మూఢభక్తిగల గొల్లలు మహానుభావుఁడని వాని కఖిలోపచారములు

చేయుచుందురు. దిక్కులేనివారికి దేవుఁడేదిక్కైనఁ జూపునుగదా! గొల్లలందఱు మహర్షులు వసియింపఁదగు పర్ణశాలవలె నొక కుటీరమును నిర్మించి యందాతని నుంచిరి. శతవత్సరపూర్ణుఁడైనను మనోబలము చెడనివాఁడగుటచే రాజకార్యముల యందుఁగూడ నతని యాలోచన మమోఘము. పూర్వకాలపు సంగతుల నెఱుఁగఁ గోరినవారును, క్రొత్తపనులఁ దలపెట్టి యవి నెఱవేరునో లేదో యను సందేహము గలవారును నీవృద్ధునడిగి వాని యిచ్ఛాప్రకారము వర్తింతురు. ఒకనాఁడు సాయంకాలమున గడియరాత్రియైనతరువాత నొక పడుచువాఁడు సత్యఋషియని ప్రసిద్ధి కెక్కిన వృద్ధునియొద్దకుఁ బాదచారియై వచ్చుచుండెను. వంపులుతిరిగి తుమ్మెద రెక్కలతో నెక్కసక్కెముసేయు మీసముల సొరును, వెడఁదనుదురు సోయగమును, చెవుల స్పృశించు కొనలుగల కనులతీరును చక్కనివారిలోఁ జక్కనివాఁడని యతనికి బిరుదునామము గలుగుటకుఁ గారణములయ్యెను. యౌవనమంగసౌష్ఠవమును బరిపూర్ణముసేయ విద్య, గుణసౌష్ఠవమును పూర్ణముచేసెను. చిన్ననాటనుండియు సాముకసరతులు చేయుటచే దండలుతిరిగిన భుజములును, విశాలవక్షమును, మూర్తిని స్తోత్రపాత్రములుగఁ జేసినట్టులె విద్యవలనఁ గలిగిన శాంతమును, సువర్తనయుఁ గీర్తిని సుజనస్తోత్రపాత్రముగఁ జేసెను. బలమునకుఁ గార్యములయందలి చలము వానికివన్నె దెచ్చెను. చుట్టుజరీగల్ల యెఱ్ఱపట్టుతలపాగయు, పచ్చపట్టు అంగరకాయు, తెల్లని మడుపుదోవతియు, వలెవాటుగనిడ్డ యుత్తరీయమును వాని యలంకారమును సమాప్తముచేసెను. ఆవన్నెకాఁడు సత్యఋషి కుటీరమును బ్రాపించి తలుపుఁద్రోసి ప్రత్యుత్తరము రానందున నచట నిలువంబడియుండెను. వృద్ధుఁడు లోన నెవరి తోడనో గుసగుసలాడుచున్నట్లు శబ్దము వినవచ్చెను. ఆమాటలు వినఁబడకమున్నె శ్యామసుందరదత్తు మరల తలుపుఁద్రోయుటచే ఋషి తననిమిత్త మెవరో వచ్చినారని లోపలనున్న మనుష్యుని వెడలిపొమ్మని యానతిచ్చి తలుపుఁదీసెను. అంతట వృద్ధుఁడు శ్యామసుందరుని రమ్మని పిలువ నాతఁడు కుటీరము వెడలి ముసుఁగువేసికొని జనుచున్న యతిదీర్ఘకాయుని, మహాసత్వునిఁ దేరిపారిచూచుచు వెంటనే లోనికిం జనఁడయ్యెను. ఆ పురుషుఁ డెవఁడై యుండునని యోచించుచు శ్యామసుందరుఁడు లోనికింజని లెక్కకుమించిన చిరుగులతో నేలవేయఁబడియున్న ప్రాతకంబళముపై వృద్ధుఁడొసంగిన యాతిథ్యమునకు సంతసించి కూర్చుండెను. కూర్చుండినతరువాత వారొకరితో నొకరిట్లు మాట్లాడిరి.

ఋషి— నాయనా నీవెవ్వరిచే నంపఁబడి నానిమిత్తము వచ్చినావు! నీపేరు శ్యామసుందరదత్తు కాదా?

శ్యామ— ఔను. రాధాకాంతరావుగారు తమదర్శనముచేసి యాయన తమతో మొన్న మనవిచేసిన యంశమునుగూర్చి తమ రాలోచించిరేమో యని తెలిసికొని రమ్మనిరి.

ఋషి— (తలయూచి) ఆఁ, నేనావిషయమై యోచించినాను. తుదనెగ్గుట కష్టసాధ్యము.

శ్యామ— కష్టమునకు నేమి? వారిధనముఁదినుచు మేము వారిపక్షమునఁ గష్టపడుదుము. శ్రమకేమియు సంశయింపము.

ఋషి— మీరెంత కృతజ్ఞతతోఁ బనిచేసినను నామె స్త్రీకదా, పురుషులమై కక్షవహించి తుదనెగ్గుట యసాధ్యము. నేనిట్టి వెన్నిచూచినాను? ఆమె జస్వంతరావు చెప్పినట్లు వినుటమంచిది.

అని, యాతఁడు తన యభిప్రాయమెఱిఁగింప దత్తునకు ముఖవికాసము తప్పాంత మందమగుటఁ గనిపెట్టి ఋషి యాతనికి ధైర్యముగలుగునట్లు మరల "ఆయినను దైవము మనపక్షమున నున్నాఁడు. హోల్కారువంశమును మొదటి నుండియు నెఱిఁగిన నేను, మనరాణి గెలుచునట్లు నా యాశీర్వచన మొసంగెద"నని హెచ్చరించెను.

శ్యామ— అయ్యా! మీరు రాణిగారి పూర్వుల నెఱుఁగుదురా? మీవయసెంత?

ఋషి— నావయసెంతయున్నదో నేనెఱుఁగను. సంగతులనుబట్టి తెలిసికొనుము.

శ్యామ— మీరు శివాజీ మహారాజు నెఱుఁగుదురా?

ఋషి— సరిసరి. నాకర్మముకాల నేను శివాజీ నెఱుఁగకపోవలెనా? అతఁడు మృతినొందునప్పటికి నేను పండ్రెండేండ్లవాఁడను.

శ్యామ— శంభాజీ, సాహుమహారాజులను జక్కఁగా నెఱుఁగుదురని నే దలంచుచున్నాను.

ఋషి— బాగున్నది. సాహు మొన్నటివాఁడు కాదఁటయ్యా? నాకనుల ముందటఁబుట్టి, నాకనులముందట మృతినొందినవాఁడు.

శ్యామ— ఔరంగజేబును మీరు స్వయముగా నెన్నఁడైనఁ జూచినారా?

ఋషి— అలంఘురును జూచినారా యని యడుగుచున్నావా? అలంఘురు సేనలతో యుద్ధము చేసినవారెవరు నేను కానా?

శ్యామ— పీష్వాబాలాజీ విశ్వనాథులఁగూర్చి మిమ్ము నడుగ నక్కఱయే లేదు. వారందఱు మీకు లెక్కలేదు.

ఋషి— నిన్నటివాండ్రసంగతి నన్నడిగెదవేమి? పూర్వాంశముల నేమైన

రెండవ ప్రకరణము.

నడుగవలసిన యెడల నడుగుము.

శ్యామ — మలహారురావు హోల్కారుగారి బాల్యము మీరు చక్కఁగ నెఱుఁగుదురు కాఁబోలు.

ఋషి— మలహారురావు గారిని. ఆయనతండ్రియు నేనును మిగుల స్నేహితులము.

శ్యామ — అట్లయిన నూఱుసంవత్సరముల యీమధ్య మీరెఱుఁగని యంశములు లేవు. మీరు జాంబవంతునికన్న నేమాత్రమో కొంచెము పెద్దగా గనుపించుచున్నారు.

ఋషి —ఎన్నియెఱిగిన నేమి? ఎంతవయస్సున్న నేమి? ఈపాకు సహాయమొనర్ప గలిగితినేని నాజన్మము ధన్యతఁ గాంచును. కృతజ్ఞులామెచుట్టును లేరుగనుక యామె నిరపాయమైన స్థితిలో లేదు.

శ్యామ— (తొందరతో) ఎవరు కృతజ్ఞులుగారు?

ఋషి —ఎవరునుగారు. రానోజీ, దౌలతురావు, గోమోజీ దక్కఁ దక్కినవా రెవ్వరును గృతజ్ఞులుగారు. రాధాకాంతరావుగూడ మంచివాఁడని చెప్పవచ్చును.

రాధాకాంతరావు విషయములో ఋషి పలికిన సందిగ్ధవచనములు శ్యామసుందరుని మనసునకుఁ గొంత వ్యాకులపాటుఁ గలిగింప నదివఱకు తాను కన్నులారఁ జూచుచుండినదానికి, నేడు చెవులార విన్నదానికిఁ గల వ్యత్యాసమునకుఁ గారణమూహించుచుండెను. మార్పునొందినవాని ముఖవైఖరి నవలోకించి, ఋషి యేమో మరలఁ బలుకఁ బ్రయత్నించుచుఁ దన పెదవులఁ గదుపుచుండ నంతలో కుటీరపు వాకిట. "అయ్యో! అయ్యో! నిష్కారణ మిద్దఱును జచ్చిపోవుచున్నారు. రక్షింపుఁడు రక్షింపుఁడు. కటకటా! ఆడుదిగూడ దారుణముగ వధపాలగుచున్నది. రండిరండి." అని యెవ్వఁడో యంగలార్చుచుఁ బరువెత్తసాగెను. కరుణార్ద్రహృదయుఁడగు శ్యామసుందరుఁడు యోగితో సంభాషణముమాని యోగియింటి గోడపైనున్న ఒలుకకొయ్యకుఁ దగల్పఁబడిన విల్లును నమ్ములం గొని మొలలోనున్న చిన్నకైజారు నూడఁబెఱికి యాస్థలమువంకఁ జనెను. ఋషి యార్తనాదముఁజేయు నాపురుషునిఁ బిలిచి యాపదనొందినవా రెవ్వరని యడిగెనుగాని వాఁడు పేరుఁజెప్పకయే దత్తును వెంబడించిపోయెను. అపుడు ఋషి తనలో "ఈదినముననో రేపో యాతఁడు వచ్చునని తెలిసినది. ఈ యదృష్టహీనుఁడు వాఁడై యుండఁడుగద" యని వితర్కించుకొని యెద్దియుం దోఁచక యిటునటుఁ దిరుగులాడుచు నెందుచేతను యాస్థానమునకుమాత్ర మరుగక తామరాకులోని నీరుతీరున తటతట పరితపించుచుండెను.

మూడవ ప్రకరణము.

రానోజీ పల్కారున కప్పటికి నేబదిసంవత్సరములకంటె నొకటిరెండెక్కువ యుండునే కాని తక్కువ లేవు. చిన్నతనమందు మలహారురావు హోల్కారునకుం దమలపాకుల చుట్టలను, వస్త్రములను నందించు నీచసేవకకోటిలో నివాఁడై యాప్రభువు ననుగ్రహమునకుం బాత్రుఁడై సైన్యమున నొక సరదారయ్యెను. తెలివితేటలుగల మహారాష్ట్రుఁ డగుటచే నతిత్వరితముగ రాజ్యముననున్న ముఖ్యోద్యోగస్థులలో నొకఁడై మలహారురావు చనిపోవునప్పటికి ప్రధానవర్గములో నొకఁడయ్యెను. ఈతఁడు సత్కులీనుఁడును, సదాచారుఁడును గాకుండినను మిగుల ప్రజ్ఞఁగలవాఁడు. అందె యుక్తులకుఁ బెట్టినది పేరు. మోసమున నితని జెప్పి మఱియొకరినిఁ జెప్పవలయును. అతఁడు సౌందర్యము లేని నల్లని మోటమనుష్యుఁడని చెప్పుటకంటె వాని యాకారము వర్ణింపనక్కఱలేదు. ప్రథమకళత్రము వియోగమొందుటచే మఱల వివాహమాడఁ బ్రయత్నించి తన ప్రియమిత్రుఁడగు హరిహరపాండ్యాజీ సహాయమున సౌందర్యశాలి యగు నొక కన్యం జేకొని మఱికొన్ని రాజకార్యవిషయములగు నుత్తరములు సంగ్రహించుకొని యిందూరునగరమునకు వచ్చుచుండె. ఆరాత్రి యెట్లయిన మహేశ్వరపురముఁ జేరవలయునని నిశ్చయించి ప్రొద్దుపోయిన వెనుకఁగూడఁ బయనమొనర్చుచుఁ దాము వచ్చునప్పటికి వంటకములఁ జేయించి సిద్ధముగనుండుమని దుండిరావునంపెను. పల్లకియందుఁ బదునెనిమిది వత్సరముల వయసుగల సుందరియొర్తు గూర్చుండి తలుపు లించుక తెఱచి చుట్టునున్న కొండలను, మహావృక్షములను, నిష్కళంకమైన యాకాశమునుఁ జూచుచుండెను. ఓంకారనాదములతో బోయలు పల్లకి మోయుచుఁ దనవెంట రాగ రానోజీ పల్కారు గడియగడియకు పకిలించుచు నలసి మోయలేక దన్ను మోయుచున్న గుఱ్ఱము నెక్కి యిరుప్రక్కల నిరువు రాయుధపాణులగు భటులు గొల్వఁ బజలికతోఁ బయనమొనర్చుచుండెను. మార్గశ్రమచేఁ జెన్నుచెదరి విసికియున్న యా సుందరి పల్లకిసరిగా మధ్యమధ్య నొకమాఱు తన గుఱ్ఱమును నడిపించుచు “కమలా నీవు మిగుల శ్రమపడినట్లున్నావు. వచ్చినంతదూరము రానక్కఱలేదు. కావలసినయెడల నాదగ్గఱనున్న రొట్టెలు నాల్గు తినుము” అని యూరార్పుమాటలు పలుకుచు వడిగ నడుగులు వేయుమని బోయలను హెచ్చరించుచు రానోజీ రెండుగడియల రాత్రికి ఋషి వసియించు ప్రదేశమునకు సమీపముగ వచ్చెను. అది కృష్ణపక్షమున కారంభమగుటచే నా పాడ్యమినాడు చంద్రోదయము రెండుగడియల కగుచుండెను. తూర్పునఁ దెల్లదువ్వలువఁబఱచినట్లు రేఖలు గానఁబడెను.

అట్లు పయనము చేయు నామనుష్యులయొకట చెవులు బ్రద్దలగునట్లు మోరయెత్తి ఘణిల్లు ఘణిల్లుమని అంకెవేయుచు నొక వృషభము కాలిడెక్కలతో నేలదువ్వి దుమ్ము వ్యాపింపఁజేయుచు భయంకరాకారముతో దారికడ్డముగ నిలిచియుండెను. మార్గము నుండి యాయెద్దు ముద్దువలెఁ దొలఁగనందునఁ దాము పోవుటకు నెద్దును బెదరింపుమని రాణోజీ తన సేవకులలో నొకని నాజ్ఞాపించెను. మందబుద్ధియు మోటచౌరవయుఁగల నాసేవకుఁడు ద్విపాదపశువుగనుక నావశువును బెదరఁగొట్టుటకుపాయమేదియులేక దనపైనున్న యెఱ్ఱగుడ్డవిప్పి హూత్తుహూత్తని యాగుడ్డ దానిపై వేయఁ బోయెను. ఆ పశు వటివఱకొక కారుచున్నపోతుతోఁ బోరాడి దానిచే గాయములు తగుల నొచ్చి కడుఁగోపముతో నుండెను. అంతలో గుఱ్ఱ మొకసారి సకిలించెను. బోయ లోంకార మెక్కువచేసిరి. ఎఱ్ఱగుడ్డఁ జూచుటచే బెదరి, బోయల యోంకారము చేఁగలవలపడి, గుఱ్ఱపు సకిలింపుల సహింపనోపక నాలపోతు మూర్ఖస్థుల గుండెలు వ్రక్కలగునట్లు అంకెవేసి గుబాలున వారిపైఁబడెను. దీనికంతకుఁ గారణుఁడైన మూర్ఖ సేవకుఁడు దాని బారినుండి తప్పించుకొని యావలఁబడెను. ఆమనుష్యునివెనుక నే వచ్చుచున్న రాణోజీపై నాజంతువు పడి మునుముందు నడువలేక సగము చచ్చిన యశ్వముపైఁబడి దానిని నేలఁగూలఁద్రోయ వాహనముతోఁగూడ నాతఁడును నేలఁ గూలెను. కూలినతోడనె నాతఁడు లేవఁ బ్రయత్నించుచుండునంతలో గుఱ్ఱముమీఁద నుండి యాతనిమీఁదికి దుమికి యప్పపుఁ బశువు దేహమెఱుఁగక సూదిమొనలవలె వాడిగనున్న కొమ్ములతో నాతని గుండెలమీఁదను, డొక్కలోను, నెమరకణతమీఁదను దన యుచ్చవచ్చునట్లు గాయములుచేసి వెడలు క్రొన్నెత్తురుతోఁ దనకొమ్ముల నలంకరించెను. సేవకు లిరువురును భయకంపితులై నాయుధములు తమంతటఁ దామె వారిచేతులనుండి నేలజార వెనుక దిరిగిచూడక పరువెత్తిరి. బోయలు మోయుపల్లకి నచ్చటవిడిచి చెల్లాచెదరై నలుదెసలకుఁ బరుగెత్తిరి. ఒకనిముషమున నచ్చట క్రింద పడిన నాయకుఁడును, పల్లకిలోనున్న సుందరియుందక్క నెవ్వరులేరైరి. పారిపోయిన సేవకులలో నొకఁడు తన స్వామిపై జాలిగల్గి ఋషికుటీరము దగ్గఱకువచ్చి యా ఘోరవార్త నచటివారికిఁ దెలుపుటయు శ్యామసుందరదత్తు సహాయార్థము బయలుదేఱుటయు మీరందఱు నెఱుగుదురుగదా. శ్యామసుందరుఁడు కడువేగమున నడచి వచ్చెను. ఈలోన నాస్త్రీ, పడియున్న రాణోజీని, దన యసహాయస్థితినిఁజూచి కదలి మెదలిపోవుటకు నంగములాడక కొయ్యయయ్యెను. బోయలు పల్లకి దింపుటయు, రాణోజీపై నెద్దుపడుటయు నామె యెఱుఁగునుకాని తరువాత నేమిజరిగెనో యెఱుఁగదు. పండుకొన్న దేహము పండుకొన్నట్లె యుండెను. చూచెడు కనులు చూచినట్లుండెను. ఇట్లామె మహాభీతితోనుండ వాయెద్దు కోపాగ్ని చల్లారకపోవుటచేఁ

గాఁబోలు చంగున నాపల్లకిమీఁదఁబడి కొమ్ములతో గుభిల్లు గుభిల్లుమని యాపల్లకిం బొడుచుచు తన మహాబలముచే దాని నడ్డముగాఁ బడఁద్రోసి దానిపై నెక్కి తన్ని పగులఁగొట్టుచుండెను. ఆ నారీమణి స్మారకమెఱుఁగక మొదటమాత్ర మొక కేక వేసి మూర్ఛిల్లి యందు బడియుండెను. అంతలో దత్తు తత్తరపాటునవచ్చి. యనతిదూరమున నామె కేకవిని యతిత్వరితమునవచ్చి మన స్థిమితమునుఁ జిక్కఁబట్టి విల్లుపయోగింప నెంచి యందసమానప్రజ్ఞగల మహారాష్ట్రుఁ డగుటచే వరుసగా రెండుబాణముల దాని మొగమున నాటనేసెను. వెంటనే యది రోసముచే పైఁబడ నుంకింప నతఁడు మఱి రెండుబాణములను రెండుకన్నులమీఁదఁ గీలింప నది యంబాయని నేలఁబడెను. వెంటనే యా సేవకుఁడువచ్చి తన కత్తితో దానిని నఱికి తన యసహాయశూరతఁ జూపెను. అపుడు దత్తు పల్లకి యథాప్రకారముగఁ బట్టించి తలుపులఁ దెఱచి యందు మాటలాడనేరని పోతపసిండిబొమ్మయై, నిలుకడఁగన్న మెఱుపుఁ దీగయై, మన్మథ రాజ్యలక్ష్మియై, పడుచువాండ్ర బాధించు హృదయశల్యమై నిశ్చేష్టురాలగు [illegible]య్యతివం జూచి యామెను లెమ్మని పిలువ నామె పలుకదయ్యె. ఆమెను లేవఁదీయుటకుఁ దనకు సహాయముచేయుమని సేవకు నడుగ వాఁడు "నిద్రపోయెడుదానిని లేపెదరేమి? ఆమెనుఁ బండుకొననిమ్ము. నీవిటురా" అని మందలించెను. కొంచెము చల్లనినీళ్ళు తెమ్మని సేవకునంపి తానే యమ్మగువను సందిటఁబట్టి పల్లకినుండి తీవఁదీసి యొక చెట్టుమొదట పైబట్టపఱచి దానున కామె మేనుజేఱినట్లు కూరుచుండఁబెట్టి పడకుండ నామెనుఁ దానుగూడఁబట్టుకొనియుండెను. ఆమె జీవచ్ఛవమై మాటయు, కదలికయు లేక యెటులుంచిన నటులుండెను. మేనెల్లఁ జిఱుచెమ్మటలు గ్రమ్మి కణములుగా బరిణమించి మొగమున ముత్యాలువెట్టినట్లు వింతవిన్నాణము నొసంగెను. విలాసార్థ మామెకొప్పున గ్రుచ్చిన మల్లెపుష్పములు నలుదెసల జాఱి యామెవలె పసివాడి యుండెను. వట్రువులై పెద్దవగు పిఱుందుల స్పృశియించు నిడుదవెండ్రుకలు మొగమ్ము నంతయు గ్రమ్మునట్లు చీకాకుపడుటచే నామె వదనము భూచ్ఛాయతోఁగూడు గ్రహణకాలచంద్రునివలె నుండెను. చెమ్మటలచేఁ గరఁగి మొగమంతయు వ్యాపించిన కుంకుమబొట్టు ముఖారవిందమున కొక్క యారుణ్యమును దెచ్చి సంధ్యారాగములో నున్న చంద్రమండలములాగు మొగమునకు వన్నెవెట్టెను. బెదరిన లేడికన్నులవలె చలించు నేత్రములును, భయమున వడఁకు గాత్రమును, నందకత్తియల గరువమడంచు లీవియు, దొండపండునకు బంధువగు మోవియు నామె యందమునకు వింత యందము నీయ నెడలెరుంగని స్థితియందుండియు నామె మోహినీదేవివలె నుండెను. సుంద రాంగు లెట్టి యవస్థలోనున్నను స్తోత్రపాత్రలె కద! శ్యామసుందరదత్తు కమలాభాయి మొగమువంక కోరికలూర కనుల కఱవుదీఱ నూహ లెంతదూరమోపార పలుమాఱు

తెప్పవాల్పకచూచి యామెకు సముచితోపచారములఁ జేసెను. ఇంతలో సేవకుఁడు నీరుదెచ్చుటయు, చల్లని యాజలమామె మొగమునఁగొట్టి నామె కొంత సేదదేఱి కొంచెము నీరుఁద్రావి మఱల సొమ్మసిల్లి తిరిగి కొంత యుదకముఁగ్రోలి కనువిచ్చెను. కనువిచ్చి యాసుందరి భువనసుందర విగ్రహుఁడగు శ్యామసుందరుఁ గనుంగొని సిగ్గునఁ దలవంచి పరపురుషునియెదుటఁ గూరుచుండుట కిష్టములేక మెల్లఁగాలేచి యావలకుఁ జరిగి క్రిందపడిచిన యుత్తరీయము మేలిముసుఁగుగా వేసికొని, యాతఁడెవఁడా యని యాలోచించుచుఁ బ్రభు వెట్లుండెనని సేవకునడిగెను. ఈనడుమ శ్యామసుందరుఁడు రాణోజీయొద్దకుఁ బోయి శరీరమునిండ గాయములఁ జూచి యాతఁడు జీవించుట యసాధ్యమని యెంచియుఁ దగుచికిత్స చేయఁదలఁచి మెల్లఁగ దానును సేవకుఁడును వానినెత్తి పల్లకిలో పరుండఁబెట్టిరి. అప్పుడు రాణోజీ “నాభార్య నాభార్య” యని మెల్లగానన “నీభార్య సురక్షితముగనున్నది. భయములేద”ని దత్తు ప్రత్యుత్తరమొసంగి రెండుగుడ్డలు మసిచేసి యాగాయములకుఁ గట్టుకట్టెను. ఆ రెండుమాటలుగాక నెన్నిసారులు పిలిచినను రాణోజీ పలుకక తనలో తాను పలుమాఱు పలువరింపఁదొడంగెను. సేవకునివలనఁ దనప్రభు వింకను సురక్షితుఁడని యెఱిఁగి కమలాభాయి “ఇంకను జీవించియున్నాఁడా, దైవమునకు నాపై నింత కోపముండ నాకు సుగతి యెట్లగును. ఎద్దు నాకు పూర్ణముగ నుపకారము చేయలేదు. నన్ను జంపినను మేలుగానుండును.” అని తనలో విచారించెను. ఇంతలో బోయలు తిరిగివచ్చుటచే రాణోజీని పల్లకిలో మోయించి గూడెమునుండి బండి తెప్పించి కమల నందుఁ గూర్చుండబెట్టి వారి నందఱిని మహూనగరమునకు శ్యామసుందరదత్తు తీసికొని పోయెను.

నాల్గవ ప్రకరణము.

మహూగ్రామమున మురళీధరదాసను నొక మనుష్యుఁడు సుందరియు గుణవతియునగు నానందభాయియను భార్యతోఁ గాపురముఁ జేయుచుండెను. అతఁడు పిల్లలుగలవాఁడును బీదవాఁడునైనను గొంచెము వ్రాఁతనేర్చినవాఁడగుటచే హజారుమల్లను మారువాడీ వర్తకునియొద్ద లెక్కలువ్రాయుచు స్వల్పజీతమును గ్రహించుచు మిగుల గౌరవముఁగలిగి కాలక్షేపము సేయును. ఆనందభాయి యిప్పటికి ముప్పదివత్సరములు వయస్సుగలదై మగనికంటె మూఁడుసంవత్సరములు చిన్నదైయుండెను. మురళీధరదాసు పొడుగుగ నుండునుగాని బక్కపలుచని పసిఁడివన్నెగల శరీరముతో నందగాడని పేరొందినవాఁడే. రమారమి జాము రాత్రి యగునప్పటికి శరీరమెఱుఁగక

పడియున్న రాణోజీని, దిక్కులేక భయవివశురాలైన కమలాభాయిని వెంటఁబెట్టికొని శ్యామసుందరదత్తు మహానగరముఁ బ్రవేశించి మురళీధరదాసు గృహమునకు రమ్మని బోయల కానతిచ్చి తాను ముందుగా నాగృహమువైపు జనెను. భోజనముచేసి భాగవతము చదువుకొనుచున్న మురళీధరునియెదుట శ్యామసుందరుఁడు నిలువ నతఁడమితానందమునొంది భార్యను బిలిచి. "మన దత్తువచ్చినాఁడు. మన దత్తు" అని యఱచెను. ఆనందభాయి చాలకాలముక్రిందటఁ జూచుటచే దత్తును జేరరమ్మని "ఏమి నాయనా యింతకాలము జాగుచేసినావు" అని తలపైఁ జేయివేసి నిమిరెను. "అక్కయ్యా! నారాకకేమిగాని శ్రీరాణీ యహల్యాభాయిగారి కొలువులో గొప్ప యుద్యోగియగు రాణోజీ, చచ్చుటకు సిద్ధముగనున్నాఁడు. అతనితో, భార్యకూడ వచ్చినది. వారివిషయమై మన మతిజాగ్రత పుచ్చుకొనవలెను." అని జరిగిన వృత్తాంతము నంతయుఁ దన బావకును సోదరికినిఁ దెలియపరచెను. అంతలో మన కమల యెక్కిన బండియుఁ బల్లకియు వచ్చినందున నిస్పృహుఁడగు రాణోజీని మెల్లమెల్లఁ జేతులమీఁద వేసికొని లోపలికిఁ దెచ్చి యొక గదిలో నొక పరుపుమీఁదఁ బండుకొనబెట్టిరి. పాపము రాణోజీ మూల్గుటయెగాని బాధ యిదియని చెప్ప నేరక పిలిచినఁ బలుకక ప్రక్కపైఁ గొట్టుకొనసాగెను. వారారాత్రి యొక్క ప్రణవైద్యుని రప్పించి యాతనిఁ జూపఁగా నతఁడు పెదవి విరచి "రోగి బ్రతుకుట దుర్లభ"మని చెప్పెను. ఆనందభాయి కమలాభాయిని మిగుల గౌరవముగ లోనికిందెచ్చి కొంచెము పొంగిలపరచి దుఃఖభారమున నాత్మహత్యఁ జేసికొనునేమోయని కడు మెలకువతోఁ గాపాడుచు నామె నొక నిముషమును వదలక నడుమనడుమ నామె యందమున కాశ్చర్యమునందుచు "కాకిముక్కునకు దొండపండుఁ గట్టినట్టు ముదివానికీ చిన్నదానిని తల్లిదండ్రు లెట్లిచ్చిరో కదా! ఆ ముసలివానితోనైన నింత పసుపు కుంకుమఁ బెట్టుకొని పదికాలములపాటు కాపురముఁ జేయనీయక దైవ మామెకు ఘోర వైపరీత్యముఁ దెచ్చిపెట్టుఁగాఁబోలును ఈరూప మడవిఁగాచిన వెన్నెలయగునా" యని విచారపడుచు నామెపైఁ జేయివైచి పండుకొనెను. రాణోజీస్థితిఁ జూచి మురళీధరదాసతని తమ్ముఁడగు దౌలతురావునకు నొక మనుష్యునిచే వర్తమానమంపెను. ముందు రాణోజీకి వంటచేయుటకుఁ బంపఁబడిన దుండిరావు గంజాయిదుకాణమున దిట్టముగ గంజాయిత్రాగి మెలకువలేక పండుకొనియుండ మార్గమున నెద్దును బెదరించిన లక్ష్మణుఁడు దుకాణమునకు గంజాయికిఁబోయి దుండిని లేపి జరిగిన వృత్తాంతమును జెప్పిపంపెను. దుండిరావచ్చటికి వచ్చి, తన యజమానునకు సహాయమెద్దియు నొనర్పఁజాలక యాతని నాధారముగఁ జేసికొని తాను పన్నిన పన్నుగడలన్నియు వ్యర్థములయ్యెనని చింతించుచు నిద్రనాపలేక రెండుకునుకులు కునికెను. ఈనడుమ నానందభాయి కొంచెము కన్నుమూసినందున

పలువిధములగు తలఁపులు మనస్సున మల్లడిగొనుటచే తెప్పపాటులేక నిట్టూర్పు విడుచుచు కమల లేచికూర్చుని కన్నులనిండ ముక్తాఫలములవలె గ్రందుకొనియున్న బాష్పములు మాటిమాటికిఁ దుడుచుకొనుచు మిగుల దుఃఖించుచు "అమ్మా! నీవెంత కఠినురాలవు. నీవు నాకుఁ జేసిన యీద్రోహమునకు నేనీజన్మమున మఱల మీదగ్గఱకు రాను. అంతే మీరుమిక్కిలివచ్చిన నిచ్చటనే శరీరసమాప్తము చేసెదను. దైవమా! నాకేల మరణముఁ గలుగఁజేయవు? ఆయెద్దు నన్నేల గ్రుమ్మకపోవలె? ఈయనపని యెట్లయినను నేను దురదృష్టవంతురాలనే" యని వగచుచుండెను. అంతలో నానందభాయి మేలుకొని ప్రక్కలో నామె లేకుండుటకుఁ గలవలపడి లేచి దూరమునఁ గూర్చుండిన యాకన్నియం జూచి తన యజాగ్రత్తవలన నపాయమప్పటికి రానందుకు సంతోషించెను. కాని యప్పుడప్పుడె తొందరతో తన కన్నీళ్లగుపడకుండఁ గమల తుడుచుకొనినను నామె దుఃఖించుచున్నట్లు లానంద తెలిసికొని మితిమీరిన జాలిచే నామె దగ్గఱగఁ జని స్త్రీ యగుటచే స్వాభావికలక్షణముపోకుండఁ దానుగూడఁ గంటఁ దడిఁబెట్టుకొని "అమ్మా! యేల వాపోయెదవు? నీముఖసౌందర్యమును, నీవిలాసమును జూడఁగా మఱియొక యుపద్రవము జరుగఁగూడదని నాకుఁ దోఁచుచున్నది. అయినను విలపించినఁ గార్యమేమి? నీభర్త ప్రాణములవిషయమై. గాక మఱి యేవిషయమైనను నాతమ్ముఁడు నీకు కావలసిన సాయముచేయును. అతఁడు మంచివాఁడు" అని యూరడించెను. కమల యప్పుడు తన వెనుకటియవస్థయెల్ల మనస్సునం దట్టుటచే నొకమా రామె యొడిలోఁ దలఁబెట్టుకొని గట్టిగ రోదనమొనర్చి "అమ్మా నీవు మా తల్లివంటిదానవు. నీతమ్ముఁడు మిగుల మంచివాఁడు. అన్నివిధముల నంతటివానిఁజూచి యెఱుఁగను. ప్రాణములు నిలిపిన మహాత్ముఁ డతఁడుకాఁడా? ఏన్నటికైన నా కతఁడే దిక్కని నేను నమ్మికొని యుంటిని." అని పలికెను. ఇంతలో శ్యామసుందరదత్తు తలుపుఁదెరచి గదిలోని కరుదెంచుటచే వారి సంభాషణము ముగిసెను. కమల యాతనిఁజూచి చటుక్కునలేచి గోడకుఁజేరి నిలిచి సిగ్గునఁ దలవంచి పదాంగుళముతో నేలవ్రాయుచుండెను. ఆమె వైపు చూడ్కి నిగుడించి దత్తు తన సోదరితో "అక్కయ్యా! రాణోజీగారికి రవ్వంత నిలకాటుచేసినదని తోఁచుచున్నది. కుదురవచ్చునని నా కాశకలదు." అని తనరాకచే వారి సంభాషణ యాగినదనియుఁ గమల సిగ్గున నిలువవలసివచ్చినదనియుఁ దానాగది విడిచి వీధిలోనికిం జని యేమియుందోఁచక నిటునటు పచారుసేయుచుండెను. అప్పుడు రెండుజాములరాత్రికంటె నధికముగఁ బ్రొద్దుపోవుటచే వీధులలో నెవరును లేరైరి. పిండి యారఁబోసినట్లు వెన్నెల ధవళధవళమై వ్యాపించియుండ. నున్నతసౌధముల యొక్కయుఁ దమయింటి కావలనున్న దేవాలయముయొక్కయు నీడలు వీధిలోనికి వ్యాపించి యసమానమైన సౌందర్యము నొలికించుచుండెను. ఆ వెన్నెలకెరటములలో

మునిఁగి యానందము నొందుచు శ్యామసుందరుఁడా సాయంకాలము తన హృదయము నపహరించిన దొంగను బలుమాఱు దలఁచుకొని మనస్తాపము నొందసాగెను. “ఆహాహా! ఏమి! ఆ కమలసోయగము! ఆమె సార్థకనామ. నిజముగ లక్ష్మియే. వేయిజన్మములకైన నేనీమెను మరువఁజాలను. ఈమె నాయది. ఎంత వెఱ్ఱివాఁడను. పరధనమైన యామె నాసొత్తనుటకంటె వెఱ్ఱియేమున్నది? ఈ రాణోజీ చావక బ్రతుకునా? ఛీఛీ మోహపాశమునఁ దగిలి పాపమనక పుట్టెడు దుఃఖములోనున్న యామె భర్త మరణమును గోరుచున్న నా హృదయము వజ్రమాయేమి! అతఁడు జీవింపకపోయినమాత్రమున నాకామె లభించుటయెట్లు? ఆమె పతివ్రతగదా, అయినను సర్వేశ్వరుఁడఘటనఘటనాసమర్థుఁడుగదా” అని మెల్లమెల్లన లోనికింజనెను. అక్కడికిఁ బదునాల్గుమైళ్లదూరముననున్న నిందూరునగరమునకు మనుష్యుఁడుపోయి దౌలతరావును వెంటఁబెట్టుకొని తెల్లవారునప్పటికి వచ్చెను. దౌలతరావు శవమువలె పడియున్న సోదరునిఁ జూచి విలపించి యాతనిఁ బోరుగూరనుండనీయఁ జనదని కమలను సహోదరునిఁ బ్రయాణముఁజేసి పల్లకిలో వానినుంచి, దుండిరావును సేవకులు వెంటరాఁబయలుదేరెను. కమల హృదయము ఆనందభాయియొద్దనుండి బయలుదేర నెప్పటియట్లు చింతిల్లుచుండెను. శ్యామసుందరుఁడామెను సాగనంపుటకుఁ గడుదూరమరిగి, కమలావియోగమున వివర్ణముఖుఁడై దౌలతరావును వీడ్కొని యింటికిఁజనెను. కొంతదూర మిట్లు పయనము సాగినతరువాత రాణోజీ మిగుల నాయాసమొందఁ బల్లకిఁ జెట్టుక్రిందఁ దింపిరి. దౌలతరావు గుండెలఁ బాదుకొని యేడ్వనారంభించెను. కమల నిశ్చేష్టితురాలయ్యెను. పల్లకిలోనున్న రాణోజీ పల్లకిలోనే మృతినొందెను.

అయిదవ ప్రకరణము.

రాణోజీ పల్కారునకు దౌలతురావు తమ్ముఁడు. వయసున నితఁడు రాణోజీకిఁ దమ్ముఁడైనను గుణములయం దతనికి దౌలతరా వన్నయనియు, రూపమున నచ్చముగ నన్నగారినోటనుండి యూడిపడినటులుండెననియుఁ జెప్పఁదగును. అభిమానముచేత నతనిభార్యయుఁ బక్షపాతముచేత నతని స్నేహితులును, నీలమేఘశ్యాముఁడని వర్ణింతురుగాని యతఁడు నిజముగ మాలకాకివలె కడునల్లనై యందమనుమాటయైన లేని వికారాకార్యుఁడు. దుబ్బులవలెఁ దెగపెరిగిన మీసముల నలుపునకును వానిమోముయొక్క నలుపునకును, రవంతయు భేదముండదు. ఆతని చక్కదన మంతటితో సమాప్తమునొందక యెత్తుగఁబెరిగిన బొజ్జకడుపుతోడను, శరీరముయొక్క విపరీతపు లావుతోడను, కొంచెము దీర్ఘమగు ముక్కుతోడను, జూచువారికి నవ్వుఁ బుట్టించు

చుండును. అన్నకు మయుక్తులలో సహాయమై యిరువురును గొప్పయుద్యోగములు సంపాదించి, హోల్కారు సంస్థానమున మంచివారని పేరుసంపాదింపకపోయినను, దేశమున దుర్మార్గులనకయినను పేరువహించిరి. అట్టుండియు నంతవఱకుఁ దమయేలిక విషయ మేద్రోహమును దలఁచినట్లులేదు.

ఇట్లు రాణోజీ తనపాలిటి మృత్యుదేవతయైవచ్చిన యెద్దుచే గాయములు దగిలి నందుఁ బల్లకియందు మృతినొంద దౌలతురావు శవము నందె యుంచి జాముప్రొద్దెక్కు వఱకు కమలాభాయితో నిందూరునగరముఁ బ్రవేశించెను శవమును దన గృహమునకుఁ గొనిపోక స్మశానమున కాదారినిఁ దీసికొనిపోయి కమల నింటికంపి తనభార్య కప్పగింపు మని దుండిరావునంపి బంధుజనులను రుద్రభూమికి రమ్మని వర్తమానమంపి వారు వచ్చినతరువాత తన సోదరునకు యథావిధిగ నగ్నిసంస్కారముచేసెను. అక్కడకు వచ్చిన కులస్థులందఱును, మనుష్యులు కాలముదప్పినతరువాత వివాహమాడఁగూడ దనియు దైవవశమునకు నెవ్వరేమిచేయఁగలరనియు నంత సుందరికి వివాహమైన నెలకే వైధవ్యమువచ్చుట యన్యాయమనియు నామెకు నీ దురవస్థకే యీశ్వరుఁ డీపెండ్లి సంకల్పించెననియు బహువిధముల జాలినొందిరి. దౌలతరావు భార్యయగు దుర్గభాయి పెద్దపెట్టున నేడ్చుచు వీధిగుమ్మముదగ్గఱ కెదురుగవచ్చి తోడికోడలిని, కౌఁగలించుకొని రోదనముచేసి "అమ్మా తోటికోడండ్రమని పట్టుమని మనమిద్దఱము నొకనెలయైనను గాపురముచేయమైతిమి. నీవెంత దురదృష్టవంతురాలవో యేభోగ మనుభవింపకముందె పసపు కుంకుమయైన మనసుదీరపెట్టుకొనకముందె, యొక ముచ్చటచ్చట దీరకముందె పెండ్లియైన నెలకె యీలాగైతివిగదా! అమ్మా! మొదటి పర్యాయమే నిన్నీ ప్రాంతలోఁ జూడవలసివచ్చెఁగదా. తల్లీ నీవింకా వచ్చినతరువాత నిద్దఱమును గాపురముఁ జేయవలె ననుకొన్నాను కాని యింతవఱకు వచ్చునని యెఱుఁగనుతల్లీ" అని పరిపరిభంగుల నంగలార్చి కమలయుఁ గొంచెము దుఃఖింప నామె నూరార్చి దానూరకుండెను. కమల యెందుచేతనో ధైర్యముఁ జిక్కఁబట్టి యంత విస్తారముగాఁ బొగలుట మాని గుండె రాయిఁజేసికొనెను. అగ్నిసంస్కారాదులఁ జేసి దౌలతరావు కర్మ నారంభించి రెండుదినములు గడచినవెనుక దుండిరావునుబిల్చి, కమలనుగూర్చి కొన్నిసంగతు లడుగఁదలఁచి యిట్లనియె.

దౌల— ఓరీ! దుండీ! మాయింటికి నెంత దుర్దశవచ్చినది. నాకు నా కుడి హస్తము వడిపోయినదిగదా, యింక నాబ్రతుకేల?

దుండి— అవును దైవవశమున కేమిచేయఁగలము? మీకేమి మూడేండ్లదామె మీ వదినగారిమాటఁ దలఁచిన నాగుండెలు తాళుటలేదు.

దౌల— ఆహాహా! ఏమి యీమెయందము! దైవము మిక్కిలి యయోగ్యపుఁ

బని చేసినాఁడు. ఇంతటి యందకత్తెను నేనెందును జూచి యెఱుఁగను. ఇటువంటి కన్య యెంత యదృష్టవంతునకు భార్యయగును.

దుండి—(కొంచెమాలోచించి సందేహముతో) ఆమె యెక్కడి కరుగఁగలదు? పాపము, ఇఁక నీవెదక్కు నిన్నుగని పెట్టుకొనియుండును గనుక నీవామె సుఖముఁ జూడుము.

దౌల—మఱే. ఆమె నాదగ్గఱనుండునా? పుట్టినింటి కరుగునేమో. అయితే నీమెను మా యన్నగారు వివాహమాడినాఁడా?

దుండి—వివాహమైనపుడు నేనక్కడ లేనుగాని పెండ్లియైనదని మీయన్నగారు నాతోఁ జెప్పినారు. త్రోవలోఁ దన్నడిగినవారందఱితోడను ఈమె తనభార్యయనియె చెప్పెను. పెండ్లియగుట సందేహము లేదు.

దౌల—అయినదా? నేను కాలేదనుకొన్నాను. సరే. ఇఁక విచారము లేదు.

దుండి—విచారమెందుకు? నాదగ్గఱ దాఁచక నీమనసునకున్నది చెప్పు. నీకు నేమైన నాశకలదా? మనకు లాభించునెడలఁ బెండ్లి కాలేదని చెప్పుదము.

దౌల—మిత్రుఁడా! నీవు నాకేమయిన సహాయముఁ జేసెదేని యీలోకములకు మా యన్న పెండ్లియాడలేదని చెప్పి నేను వివాహమాడవలెననియున్నది. నీవు నన్ను మఱియొకలాగెంచవద్దు.

దుండి—నీకుఁ బ్రియముఁ జేయుటకంటె నాకుఁ గర్తవ్యమేమున్నది? ఆమెను నయమున భయమున లొంగఁదీసి నీకు వివాహముఁ జేయింతు. ఈ పదిదినముల కర్మ ముగిసినదాక నోరెత్తఁబోకు.

అని వారు మాటలాడుకొనుచుండ దుర్గభాయి లోపలినుండి వచ్చి కమలభాయి దురవస్థకుఁ గొంచెము విచారించి, యామెతల్లికిని దమ్మునకును వర్తమానము నంపుమని భర్తతోఁ జెప్పెను. సాధారణముగ నేమి కారణముచేతనోగాని దుండిరావునకు దుర్గయనినచో నొకవిధమైన భయము గలదు. అందుచే నామె వచ్చినతోడనే లేచి, యతఁడు మెల్లగా జాఱెను. తరువాత దౌలతురావు కమలపుట్టినింటికి వర్తమానము నంపుటకు సమ్మతించి తన మనోరథమును భార్యకు నెఱిఁగింపఁగోరి యామె యొద్ద భయము గలవాఁడగుటచే రవంత సంశయించి యూరకుండెను. దుర్గభాయి సద్వంశమునఁ బుట్టి, సద్గుణములు కల యొక సుందరి సదాచారుఁడు కాని యామె భర్త సద్గుణపుంజమగు భార్యకు జడియుట స్వభావమే యగుటచేత దౌలతరావున కామె పిఱికిమందైనను. నీమూర్ఖుఁడు చీవాట్లకు వెఱువక యప్పుడప్పుడు తన మనోరథముల నామెకుం దెలిపి యామెచే మందలింపఁబడు వాడుకగూడ గలదు. దౌలతరావు దుర్గనుజూచి సంశయమెల్ల విడిచి యిట్లనియెను.

SCIENCE PAPER SERIES No. 4.

HEAT. ఉష్ణము.

చాలకాలమువరకును ఉష్ణము పదార్థమని పూర్వికులలో జ్ఞానులు సయితము నమ్మియుండిరి. కాని ప్రకృతమందట్టి యభిప్రాయమును ప్రకృతిశాస్త్రజ్ఞు లెరుగాని యామోదించుట గానము. నిజముగా నుష్ణము పదార్థమైనచో వస్తువులన్నియు వేడిగా నున్నపు డెక్కువ తూఁగవలసినదే కదా. ఇట్లెప్పుడైనను జరుగునని చెప్పుట పిచ్చితనము కాక మరియొకటి కానేరదు. ఉష్ణము శక్తిస్వరూపముగాని, పదార్థము కాదు. ఈశక్తి రాపిడివలన గలుగుట మనకందరికి ననుభవనీయమే కదా. ఇప్పటికిని కూడ యజ్ఞాదిక్రతువులయం దెట్లు అగ్నిని గలుగఁజేసికొనెదరో మనమందర మెరుగుదుము. సాధారణముగ చిన్నచిన్న పల్లెలయందును గ్రామములయందును చుట్టలు త్రాగు జనులు రెండు ఉక్కుతునకలను కొద్దిగ దూదినిని ఒకసంచిలోవేసి కూడ ఎల్లప్పుడును దీసికొనిపోవుచుందురు. వలయునప్పుడెల్ల నా తునకల రాపిడిచే అగ్నికణములను దూదిలోఁ బ్రవేశింపచేసి యగ్నిని సంపాదించుకొందురు. ఇట్టిసమయమున నెట్టిపదార్థముగాని కలుగుటలేదు. రాపిడి గలుగచేయుటకు మనము వ్యయపరచిన బలము, ఉక్కుతునకలయందలి యణువులయందు చలనము పుట్టించుచు, నట్టిచలనశక్తి నిట్లు వెల్లడిపరచుచున్నది. ఇదియే ఉష్ణస్వభావమైయున్నది.

ఉష్ణమువలన పదార్థములు విరివియగుచున్నవి. ఏపదార్థముగాని ఉష్ణశక్తికి లోనైనప్పుడు కొంత మార్పును చెందుచున్నది. ఇందువలన స్వభావ మెన్నటికిని మారుటలేదు. కఠినమైన వెండికడ్డి నొకదానిని తగుకాలము మూసలోనుంచి కాచినయెడ నది నీరగుచున్నది. ఈనీరును తగినంత ఉష్ణసహాయముచే నావిరియగునట్లు చేయవచ్చును. పదార్థ మెట్టిస్థితిలో నున్నను కఠినమైయున్నను, ద్రవముగానుండినను, లేక వాయుస్వరూపము ధరించినను, బరు వెంతమాత్రము తగ్గనేరదు. స్వభావ మెన్నటికిని మారదు. సర్వసాధారణముగ కఠినపదార్థము ద్రవపదార్థముగ మారినప్పు డెక్కువస్థలము నాక్రమించుకొనును ద్రవముగా నున్నప్పటికన్న యావిరిగనుండునపు డింతకంటె నెక్కుడుస్థలము నాక్రమించుట నిశ్చయము. దీనికి కారణమేమయి యుండవచ్చును. స్వభావము మారదు. అణుపదార్థములవిభాగములు. ఉష్ణశక్తి యన చలనశక్తియే. ఈ చలనము పదార్థఅణుస్వరూపముల తరంగంబుల పొరలుచు వానిని దూరదూరముగ నుంచుచుండును. అందువలననే యుష్ణము హెచ్చినకొలది పదార్థములు ఎక్కుడు విరివిని చెందుచున్నవి.

కఠినపదార్థములలోకూడ నన్నియు నేకరీతిగ నుష్ణప్రసారమువలన విరివిని జెందుటలేదు. స్వభావమునుపట్టి మార్పులు గలుగుచున్నవి. ఇనుమును మంచుగడ్డయు కఠినపదార్థములే కాని అధిక ఉష్ణము చేర్చినంగాని ఇనుము కరగనేరదు. నిమిష మాత్రమున అతి స్వల్పమగు వేడిమిచే మంచుగడ్డ నీరగుచున్నది. నీరును పాదరసమును ద్రవపదార్థములే యయినను, సమానముగ గాచబడినప్పుడు నిర్ణయకాలములో నీటికంటె పాదరసము ముప్పదిరెట్లెక్కువగ కాగును. గనుకనే శాస్త్రజ్ఞులు ప్రతి పదార్థమునకు ఉష్ణశక్తి (అనగా ఉష్ణమును పొందగలశక్తి) స్వభావమునుపట్టి మారుచుండునని చెప్పుచున్నారు.

ఉష్ణమువలన పదార్థములందు గన్పట్టు మార్పులంబట్టి ఉష్ణశక్తినికూడ ధాన్యాదులవలె, కొలుచుటకు సాధనము లేర్పడియున్నవి. ఎట్టిపదార్థమయినను కొంత యుష్ణబలమునకు తగుపాటి మార్పును బొందకమానదు. ఉష్ణము హెచ్చినచో మార్పు హెచ్చుచున్నది. మొదటిది తగ్గినచో రెండవదిగూడ తగ్గుచుండును. కాని కఠిన పదార్థము బహుస్వల్పముగను ద్రవపదార్థములు సామాన్యముగను వాయుపదార్థము లత్యధికముగను ఉష్ణమువలని మార్పును జెందుచున్నవి. అందువలన నిట్టి కొలతకు తరుచు ద్రవపదార్థములనే యుపయోగించుచుందురు. ఇట్లు మన మేరుకొను ద్రవ పదార్థము రెండువిధముల మన కంగీకారముగ నుండవలసియుండును. ఉష్ణ మెంత స్వల్పమయిన నందుకు తగుపాటి మార్పును గనపరచవలెను. ఇదియునుంగాక సాధారణోష్ణోద్రేకమునకు వాయుస్వరూపమై యావిరిగ మారకుండవలెను. ఈ విషయములలోఁ దృప్తికరముగ ప్రవర్తించు ద్రవపదార్థము పాదరసముగనున్నది. కనుకనే శాస్త్రజ్ఞులు ఉష్ణపరిమితి నిర్ణయసాధనముల (Thermometers)లోఁ బాదరసమునే యుపయోగించుచున్నారు.

ఇట్టి సాధననిర్మాణమును గూర్చి కొంత ముచ్చటింతము. కుంకుడుగింజకన్న నెక్కువ పరిమాణము లేనట్టియు, లోపల గుల్లగా నుండునట్టియు, ఒక గుండ్రని గాజుకాయ ముఖమునకు మిక్కిలి సూక్ష్మమైన తూముగల సన్నని గాజుకాడ నొక టంటియుండిన నొక విచిత్రమైన గాజుసాధన మేర్పడుచున్నది. గాజుకాయ కడు చిన్నదిగను, కాడ కడు సన్నముగను ఉండును. ఈ కాడ ముఖము దెరచియుండును. ఈ సాధనమునకు గంతపూర్తిగ ప్రథమమున బాదరసము నెక్కించి యటువెనుక లోపలనుండు పాదరసము యావిరియై పైకి నెగయునంతవరకు యా గాజుసాధనమును కాచవలయును. అపుడు దానిముఖము మూసివేసి కళపెళ ఉడుకుచున్న నీటియావిరిపైనుంచిన లోపలనున్న పాదరసము గాజుకాడకు కొంతయెత్తున నిలిచి యుండును. ఆస్థలము గుర్తించి గీటుపెట్టవలయును. తరువాత ఈ సాధనమును

నీరగుచున్న మంచుగడ్డలలో ముంచిన పాదరసపంక్తి క్రిందికి దిగి గాజు కాయకు సమీపమున నిలిచియుండును. ఇక్కడను వెనుకటివలెనే గీటుపెట్టి గుర్తించవలయును. ఈ గుర్తులమధ్యనున్న స్థలమును సాధారణముగ నూరు అంచెలుగ భాగించియున్నారు. వీనినే డిగ్రీలని (Degrees)) పిలుచుచున్నారు. ఏతత్భాగములనుగూడ నంతర్భాగములుగఁ జేసినచో ఉష్ణమువలనఁ గలుగు స్వల్పభేదములను సహితము గన్పెట్టవచ్చును. మనము చంకలోగాని, నాలుకక్రిందగాని, చేతితోకాని గాజుబుడ్డినిబట్టి యుంచినయెడల మన శరీరమందుండు అంతరాగ్నియొక్క స్థితిగతులు బయలుపడగలవు. సాధారణముగ మనకు వాడుకలో సంభవించు శీతలము మంచుగడ్డ శీతలముకన్నను, ఉష్ణము నీటిఆవిరివేడిమికన్నను, మించియుండవు గనుక ఆ సాధనమందిట్టి హద్దుల నేర్పరచికొనిరి. అతిశీతలమును, అత్యుష్ణమును గనిపెట్టుటకు వేరు నిర్మాణములుగల సాధనములను గల్పించికొనియున్నారు.

ఉష్ణమువలన కలుగు మార్పుల కొండు గొన్ని యుదాహరణముల బొందుపరచుచున్నాము. మనలో ననేకులు ఇనుపదారి నెన్నడైన చూచియుండవచ్చును. ఆమార్గమున నుంచిన యినుపకమ్ములు ఒకదానికొకటి యంటియుండక కొంచెము ఎడముగ నుండును. అట్లుండనియెడల రాపిడిచేతను గ్రీష్మకాలమందలి వేడిమిచేతను కమ్మి పొడవై రెండవకమ్మితో కలిసి ఒకదానినొకటి త్రోసికొనలేక పైకి పొడుచుకొనియుండును. అందువలన ధూమశకటము దారితప్పి క్రిందపడవచ్చును.

బండిచక్రమునకు ఇనుపపట్టాను తగిలించుకొరకు ముందు దానిని గాల్చి తరువాత ఆ పట్టాను చక్రముదగ్గరబెట్టి చల్లార్చుదురు. కాల్చబడినపుడు వృద్ధిచెందిన ఇనుపపట్టా నీళ్లుపోయుటవలన జల్లపడి హ్రస్వముచెంది చక్రమునకు దిట్టముగ తగులుకొనును.

ద్రవపదార్థములును కఠినపదార్థములవలెనే యుష్ణమువలన వృద్ధిచెందునుగాని నీరు కొన్నిసమయములయందీ నిబంధనకు లోబడియుండదు. నాలుగు డిగ్రీలకుపైన ఉదకమన్ని ద్రవపదార్థములవలెనే ఉష్ణముచే వృద్ధియు, శీతలంబున సూక్ష్మమును చెందుచుండును. కాని నాలుగు డిగ్రీలకుముందు అనగా ౦, ౧, ౨, ౩ డిగ్రీలు సమీపించునపుడు నీరు శీతలముచే వృద్ధిచెందును. ఇందున కుదాహరణంబుగ నీటితో నిండినట్టియు, మూతి బిగియబడినట్టియు నొకగాజుబుడ్డిని దీసికొందము. దీనిని తగినంత శీతలమునకు లోబరచినచో లోపలినీరు ఘనీభవించును. నిజముగా ద్రవముగానున్నప్పటికన్న ఘనీభవించిన సమయమున నీరు సూక్ష్మదేహము బొందుచో ఘనీభవించిన నీటిగడ్డ బుడ్డిలోన ఇమిడి ఉండును. కాని యట్లుండక మూతిని భేదించి ఒకప్పుడు బుడ్డిని పగులగొట్టి బయలువెడలును. ఇట్టి కారణముననే చలికాలమున ఉత్తర దక్షిణ

ధ్రువసమీపమున నుండు దేశములలో పర్వతములవగిలి రాళ్లతివేగమున పైన విడిపోవుచున్నవి. రాతిలోనున్న నీరు ఘనీభవించుటచే యిట్లు సంభవించును.

ఇంతియగాక నీరిట్లు నిబంధన నుల్లంఘింపకయుండినయెడల ప్రపంచములోఁ జాలభాగము వాసయోగ్యముగ నుండనేరదు. ఒక చిన్నచెరువులోని నీరు ఘనీభవించుటకు సిద్ధముగ నున్నపుడు, పైనున్న నీటితెరముందు ఘనీభవించును. ఈ ఘనీభవించిన నీరు నీటికన్న బరువైనచో గ్రిందికిపోవును. ఇట్లే క్రమక్రమముగ చెరువులోని నీరంతయు, ఉపరిభాగమునుండి నీటి క్రిందిభాగమువరకు పర్వతమువలె ఘనీభవించి యుండును. ఈలాగున, సముద్రములు, చెరువులు, నదులు వేయేల శీతలదేశమందలి నీటియాధారములన్నియు పర్వతములవలె కఠినముగ నుండును. అట్టి సమయంబున నలుగు రైదుగురు సూర్యు లుదయించినను ఘనీభవించిన నీరు, ద్రవపదార్థము కానేరదు. ఓడలు నడువఁజాలవు. నీటిలోని జంతుజాలము చచ్చిపోవును. ఇట్టి మహోపద్రవము మాన్పుటకే కాఁబోలు సర్వేశ్వరుఁడు నీరిట్లువ్యవహరించునట్లేర్పరచి యున్నాడు. ఆహా- ఏమి ఈచిత్రము- ప్రకృతిశాస్త్రము చదివినకొలఁది దేవునిమహిమ యందలి నమ్మకము దినదినప్రవర్థమానమగుచున్నది.

ప్రపంచము గుండ్రముగను అందు రెండువంతులు జలమయముగను ఉండి ఉన్నది. ఇందు నిరక్షరేఖకు సమీపముననుండు దేశములు ఉష్ణముగను, ధ్రువసమీపముననుండు దేశములు శీతలముగను ధ్రువములకును నిరక్షరేఖకును మధ్యగానుండు దేశములు సమశీతోష్ణములుగను ఉండును. ఉష్ణకాలమునందు ఉష్ణమండలములందలి సముద్రపునీరు (అనగా ఉపరిభాగపునీరు) కాగి తేలిక అయి ఉపరిభాగమార్గమున శీతలమండలము చేరుచుండును. శీతలమండలపునీరు బరువుగ నుండుటచే నీటి క్రింది భాగముగుండ ఉష్ణదేశప్రాంతములకు పోవుచున్నది. ఇట్టి ఏర్పాటుచే ఉష్ణదేశమున నున్నవారికి శీతలమును, శీతలమండలమున నుండువారికి ఉష్ణమును కలుగుచున్నది. ఉత్తర అమెరికాదేశసమీపమున సముద్రమధ్యమున పారుచుండు వేడినీటికాలువ ఇట్టి నిబంధనల ననుసరించియే కలుగుచున్నది. ఉష్ణప్రాంతములనుండి శీతమండలములకుఁబోవుచున్నది. వేడినీటిప్రవాహము గాని మరియొకటి కానేరదు. (The Gulf stream). మనలను చుట్టియుండుననిలముగూడ మన కిట్టిలాభములను గలుగజేయుచున్నది. ఉష్ణమండలముపై వీచుగాలి వేడిమిచే చులకనయై మింటికెగసి యాకాశపథమున ధ్రువమండలప్రాంతదేశములకు పోవును. అట్లే శీతల మండలమందలి గాలి చల్లదనముచే బరువెక్కిన భూభాగమున కంటియుండి క్రమక్రమమున ఉష్ణదేశములకు జారివచ్చుచున్నది. ఇవియే మనకున్న ముఖ్య వాయుప్రవాహములు. కాని దేశకాల స్థితులనుపట్టి ఇవి మారి యనేకవిధములుగ పారుచున్నవి.

కఠినపదార్థము లెన్నడుగాని ఉష్ణములేక ద్రవపదార్థములు కానేరవు. మరియు ద్రవపదార్థమున కుష్ణసహాయముండినంగాని వాయుస్వరూపము ధరింపజాలదు. కాని మన కొకవిశేషముకద్దు. పెద్దమంచుగడ్డను తీసికొని పరిశీలించినయెడల, అది నీరు గుట మొదలుకొని పూర్ణముగ అగువరకు, థర్మామీటరువల్ల మనకెట్టిభేదమును కనుపడదు.

ఇట్లే ద్రవపదార్థములు వాయుస్వరూపములగునపుడుకూడ కనిపెట్టవచ్చును. ఇట్టిసమయములందు ఉష్ణము గ్రహింపబడకపోలేదు. కాని యది గుప్తముగ నణగియున్నది. దీనినె లేటెంటు ఉష్ణము (Latent heat) అని వక్కాణించుచున్నారు. తదనుకూలముగ ఆవిరి ద్రవపదార్థముగ మారినప్పు డీగుప్తమైన యుష్ణము బయలుపడుచున్నది. ద్రవపదార్థములు కఠినపదార్థములు అగునపుడుకూడ నిట్లే గుప్తమయిన యుష్ణము కన్పెట్టఁబడుచున్నది. ఇందునకు కొన్ని నిదర్శనంబుల నిచ్చుచున్నారము. చెమటపట్టినప్పుడు వీవనలతో విసరికొంటిమా ఒడలు చల్లగనుండును. మన యొంటినున్న నీరు మన శరీరమందలి యుష్ణసహాయమువలననే యావిరియగుచున్నది. అందువలన చల్లగనుండున ట్లనుభవించుచున్నాము. మార్గములపై నీళ్లు చల్లబడినపుడు చుట్టునుఉండు గాలి చల్లపడుచున్నది. నీరు ఆవిరియగుటకు వలసిన యుష్ణము ఆవరించియుండిన గాలివలన గలుగుచున్నదిగనుక ఇట్లు సంభవించును. ఒక మట్టికూజాలో నీరుపోసి పాత్రపై తడిగుడ్డ కప్పినచో తడిగుడ్డ యారిపోవుటచే నీరు చల్లబడుచున్నది. నీరు ఇంకునట్టిపాత్రలలోనుండు నీరు ఒకప్పుడు చిన్నచిన్న మంచు కణములుగ మారిపోవునంత శీతలమగుటకూడ కద్దు. గాలిని తీసివేయఁగలిగిన (air pump) యంత్ర ఆవరణములో నొక పింగానిపాత్రనుంచి అందులో నీరుపోసి యంత్రబలముచే గాలిని తీసివేసినచో ఆనీటిలో చాలభాగ మావిరియగును. ఇందుకు కావలసిన వేడిమినీటినుండియే తీసుకొనిపోబడుటచే మిగిలిననీరు మంచుగడ్డయగును.

ద్రవపదార్థములనుండి వెలువడు యావిరి బలముగలదై యుండి తన బలమును చుట్టుప్రక్కలనున్న వస్తువులందు గనుపరచుచుండును. బరువునను, ఆకృతియందును, విరివియందునను సమముగనుండి ఒకమూతి తెరచికొని రెండవమూతి మూసియున్న గాజుగొట్టముల రెంటిని తీసికొని వానినిండ పాదరసము నెక్కించవలయును. అటుపిమ్మట రెండుమూడుబిందువుల నీటి నొకగొట్టమునను అంతియే పరిమాణముగల ఈథర్ బిందువు లింకొకదానిలోనున్న పాదరసముపైనుంచి ఈగొట్టముల ముఖములను బొటనవ్రేళ్లతో నణచిపెట్టియుండి పాదరసమున్న యొక పెద్దగిన్నెలో వీనిని తలక్రిందుగ నుండునట్లుంచవలయును. తలక్రిందులు చేసినప్పుడా ద్రవబిందువులు పాదరసముకన్న తేలిక యగుటంజేసి గొట్టముల చివరకుపోయి నిలుచును. ఇట్లు కొంతకాల

ఱుంచినచో ప్రథమమందిగొట్టమందున్న పాదరసపంక్తి సమానమైయున్నను క్రమక్రమముగ ఈదరున్న గొట్టమందలి పాదరసము క్రిందికి త్వరలో దిగిపోవును. రెండవానియందిట్లు బహుస్వల్పముగ జరుగును. దీనికి కారణమేమైయుండవచ్చు? గొట్టముల రెంటిలోనున్న ద్రవబిందువులు యావిరియగుచున్నది. కాని ఈదరతిత్వరిత ఉష్ణప్రసారమంతలేకయే యావిరియగును. నీరును ఆవిరియగుచుండినను అంతత్వరలో కానేరదు. అందువలన ఈదరు ఆవిరి వృద్ధియై తనబలముచే పాదరసమును ద్రోసివేసి తానాగొట్టము నాక్రమించియుండును. రెండవగొట్టములోని నీటియావిరి స్వల్పముగ నుండినను తన బలముచే పాదరసమును గొంతవరకు త్రోసివేయుచున్నది. ఆవిరిబలము ఆయా యావిరులందలి శీతోష్ణస్థితినిబట్టియు, పదార్థస్వభావమునుబట్టియునుకూడ నుండును.

ఎట్టిపదార్థముగాని ఆవిరియగునపు డట్టి ద్రవపదార్థము నణచుచుండు వాయుబలమును జయించినంగాని ఆవిరి బయటరానేరదు. గనుకనే నీరావిరి కానైయున్నపుడు పైన వ్యాపించియున్న వాయువును త్రోలివేయవలసియుండును. ఇట్లే వాయుపదార్థముగాని లేకుండిన స్థలమున ఆవిరియగునపు డతిసులభముగ నట్టి యావిరి బయలువెడలును. కాని ఇట్టి గాలిలేని స్థలము మూయబడిన పాత్రయయినచో ముందు బయలువెడలిన యావిరి తరువాత బయలుదేరెడి యావిరి కడ్డుపడును. అట్టిసమయమున యతి కఠినమునను, అత్యుష్ణప్రసారముచేతను గాని ఎట్టి ద్రవపదార్థమును వాయుస్వరూపము పొందచాలదు. కాబట్టి దిట్టముగ మూయబడిన పాత్రలో నీరు ఆవిరియగుచున్నపుడు కొంతవర కతిసులభముగ ఆవిరియయినను క్రమక్రమమున నూటపాతిక నూటయేబది డిగ్రీల యుష్ణము ప్రసరింపచేసినను నీరావిరి కాకయుండును.

ప్రకృతిశాస్త్రజ్ఞులు మనచుట్టును ఆవరించియుండు వాయువు ఏబదిమైళ్లకన్న నెక్కుడు దూరముగ నుండదని చెప్పుచున్నారు. అట్లుండిన సముద్రముపై ప్రసరించు గాలియింత ఎత్తుగనుండును. గనుక అక్కడనున్న పదార్థములపై గనుపరుపబడు వాయుబలమెక్కువగనుండును. మిక్కిలి ఎత్తయిన పర్వతప్రాంతములయందంత బలముండజాలదు. ఏబదిమైళ్లలోను కొంతతగ్గును గనుక వాయుబలము (అనగా అణచుశక్తి) కొంచెముగ తగ్గును. అట్టి ప్రదేశములందు నీరు మొదలైనవి అతిత్వరగానే యావిరియగును. అందుకు నిదర్శనంబుగ, సాధారణముగ నూరుడిగ్రీల యుష్ణమున కావిరియగు నీరక్కడ తొంబదియారు డిగ్రీలకే యావిరియగుట కలదు. గనుక పర్వతశిఖరవాసులు ఎక్కువ వేడిచేగాని నీటిలో ఉడకని వంటపదార్థములను బిగియపడిన దృఢమైన పాత్రములలో నుడికించుకొనుచుందురు. ఉష్ణము త్రిమార్గగామియై యొకచోటనుండి మరియొకచోటికి పోవుచుండును. ఈమార్గములు పదార్థస్వభావముల ననుసరించియుండును. ప్రథమ

మార్గము ఏకపంక్తిని వ్రేలాడగట్టిన గోళీకాయల చలనగమనమును పోలియుండును. ఒక కఠినపదార్థమునుండి మరియొక్క కఠినపదార్థమున బ్రవేశించునపు డుష్ణము పైని చెప్పినయట్లు గమనించుచుండును. ఒక చివర నిప్పులలోనున్న ఇత్తడికాడను చేత బట్టినచో వేడిగనుండును. ఉష్ణము ఒకస్థలమునుండి మరియొకస్థలమునకు కఠినపదార్థగామియై పోవురీతిని కండక్షన్ అని పిలుచుచున్నారు (Conduction). పదార్థములన్నిటియందును ఉష్ణము గమనింపచాలదు. కొన్నిపదార్థములు కండక్టర్సు (Conductors) అనగా కండక్షనుకు తగినవియు మరికొన్ని తగనివియు నున్నవి. ద్వితీయ మార్గమెట్టిదో చూడవలెనన్న కాగుచున్న నీటిలో రంపపుపొడుముంచినచో తేటపడుచున్నది. క్రిందనున్న నీరు కాగి తేలికయై పైకిపోవును. పైనున్ననీరు చల్లదనముచే బరువుగ నుండుటచే క్రిందికిదిగును. ఈ గమనిక పొట్టుమూలమున మనకంటబడుచున్నది. దీనినే కన్వెక్షన్ (Convection) అని పిలుచుచున్నారు. ఉష్ణము వాయుపథమున నొకచోటనుండి మరియొకస్థలమునకు బోవునపుడు రేడియేషన్ అని పిలుచుచున్నారు (Radiation). ఇదియే మూడవమార్గము. సూర్యునివద్దనుండి మనకు నుష్ణ మిట్లు ప్రసరించుచున్నది.

కండక్షనను ఉష్ణగమనికవలని లాభము లనేకములు గలవు. క్రొవ్వొత్తిదీపమున కెదురుగ దోమతెరవంటి సన్నని ఇనుపతీగెలతో నల్లిన తెర నొకదానినుంచినచో దీపపుకాంతి ఈతెరకు దిగువున చాలవరకు తగ్గును. ఒకప్పుడు దీప మారిపోవుటయు కూడకలదు. అపుడు అగ్నిప్రసారము తెరకావల గలిగించినచో దీపము తెరకూర్ధ్వముగ వెలుగును. ఇనుము మంచి కండక్టరుగనుక ఉష్ణమంతయు నిమిషములో నన్నివైపుల వ్యాపింపచేయబడును. గనుక దీపమునకు దగినయుష్ణములేక కాంతిగలిగి దీపము వెలుగనేరదు. సర్ హంఫ్రీడేవీ యను శాస్త్రజ్ఞుం డిట్టిజ్ఞానముచే బొగ్గుగనులలో పని చేయువారికి గొప్ప మహోపకారము చేసియున్నాడు. ఇదివరలో గనులలోనుండు అపాయవాయువులు దీపపు ఉష్ణముచే మండి పనివాండ్రనందరిని చంపుటయేకాక గని నంతను మాపుచేయుచువచ్చినవి. ఇపుడు గనులలో ఉపయోగింపబడులాంతరుకు చుట్టును ఇనుపతెరలు కట్టియుండును. అందువలన తగినంత ఉష్ణము దొరకక అపాయమైన గాలులు విర[illegible] నూరకుండి పనివాండ్రను బాధపెట్టకయుండి యున్నది.

బొచ్చుతోచేసిన వస్త్రములు మనము సాధారణముగ ధరించుదుము. బొచ్చు కండక్టరు గాకపోవుటచే శరీరమందలి యుష్ణమును పైకిం బోనీక లోపల నణచిపెట్టియుండును. అందువలన మనకు వెచ్చగనుండును.

మంచుగడ్డలను మనదేశములలో ఒకచోటినుండి మరియొకచోటికి తీసికొనిపోవునపుడు, పొట్టులోను ఊకలోను కట్టి తీసికొనిపోవుచుందురు. ఊకయు పొట్టును

కండక్టర్సుకాని కారణముచే గడ్డ నీరుకానేరదు

బొగ్గుగుండ ఎంతమాత్రమును ఉష్ణము పోచాలదు. ఒకవైపున కాలుచున్న బొగ్గున మన మెంతమాత్రము అపాయములేకయే సులభముగ చేత పట్టవచ్చును. వజ్రములు గోమేధకములు మొదలగు విలువగలిగిన రాళ్లు కండక్టర్సు గాజట్టివి కావు. గనుక వివాదాంశమును గాజురాయిని యీరాళ్లను పెదవివద్దపెట్టిచూచినచో విలువగల రాళ్లు పెట్టినపుడు చల్లగనుండును. దీనివలన కొంత విమర్శజ్ఞానము కలుగుచున్నది.

సర్వేశ్వరుఁడు శీతలమండలములో నివసించు కుక్క, ఎలుగు మొదలగుజంతువులకు దళమైన బొచ్చును, ఉష్ణదేశమందలి ఒంటె కోతి మొదలగువానికి పలచని చర్మమును అమర్చియున్నవాఁడు. ఆహా ఏమి ఈ సర్వేశ్వరుని కృప. తదనుగుణ్యమైన సౌఖ్యమును గలుగజేసి జంతుజాల మంతటిని సంతోషపెట్టుచున్నాడు.

ఆవిరికి బలముగలదని వేరుగ నొక్కి వక్కాణింపనేల. నీరుకాచునపుడు పాత్ర దిట్టమైనదిగనుండి మూత పలచనదిగను తగుపాటిదిగను ఉండినయెడ నీటియావిరిచే నట్టిమూత పైకి క్రిందికి నెగసిపడుచుండును. ధూమయంత్రమును కనిపెట్టిన వాట్సు దొరగారిట్టి పరిశీలనచేతనే ప్రపంచమందందఱిని తమకు కృతజ్ఞులుగ జేసికొన్నవారు. ఇక్కాలంబున నెక్కడచూచినను, ఏపనికైనను, ఆవిరియంత్రముల నుపయోగించుచున్నారు. ఇనుపసామానులుచేయుట, యంత్రములుచేయుట, కాకితములుచేయుట. ఇంకను ఎన్నోపనులు నెరవేర్చుట, యావిరిబలముననే జరుగుచున్నది. ఎవరయినను బుద్ధిమంతులు ఆవిరిబలమువలన పని జరగునపుడు, నీటియావిరినే యుపయోగించిన కాని పని జరగనేరదా యని యడిగిన నడుగవచ్చును. అవును వేరు ఆవిరికూడ నట్టిపనులకు నుపయోగింపవచ్చునుకాని వర్తకవ్యాపారము చేయునప్పుడు మిక్కిలి సమృద్ధిగను వ్యయమంతలేకుండగను జరుగుపనులనే ఏర్పరచుకొనవలయును. నీటికన్న సమృద్ధిగను చవుకగను దొరకు ద్రవపదార్థ మెన్నటికిని మనము కనుగొనజాలము గాన దీని నుపయోగించుచున్నారు. నీటిని నొక ఇనుపభాండమున కాచినపుడు వెడలెడి యావిరిగొట్టములమూలముగ ఇంకొకపాత్రలో చేరును. ఈ పాత్ర కావలివైపున ముందుకును వెనుకకును ఆడగలిగిన మూత యొకటిగలదు. ఆవిరి ప్రవేశించినపుడు ఆమూత కదలి వెనుకకును ముందుకును ఆడుచుండును. ఈ చలన మిచ్చవచ్చిన ట్లుపయోగింపవచ్చును. ఈ చలనమునే తగిన యేర్పాటులచే త్రిప్పుడుయంత్రములకును, బరువునెత్తు యంత్రములకును, దంపునట్టి యంత్రములకును, బండ్లను నడుపుటకును ఉపయోగించవచ్చును. ఇదియే ధూమయంత్రమర్మము.

శుక్రనీతిసారము.

క. శ్రీవిఘ్నేశ్వరుఁ బ్రణతుం । గావించి తెనుంగొనర్తుఁ గావ్యని కావ్యం
బోవాసవేయదేవ స । దావాస నిరంతరార్చి తార్చాభావా.

క. శ్రీరాజిత శౌర్యాధిక । భూరమణావశ్యవేద్య భూతిప్రదదే
వారిగుఁ శుక్రనయ వి । స్తారము సకలార్థశాస్త్రసారము వినుమా.

జగజ్జన్మస్థితిలయకర్తృం బరమాత్ముని మ్రొక్కి శుక్రుఁడు దన్నుఁబూజించి స్తుతి నమస్కారములొనర్చి యడిగిన తొలువేలుపులకు సప్రమాణముగ నీతిశాస్త్ర ముపదేశించెను. ఈ శాస్త్రము మున్ను లోకోపకారమునకు సర్వవేది విధాత శతలక్షశ్లోకపరిమిత మొనర్చెను. వసిష్ఠాదులము మేము దత్సారము నల్పాయుష్కులగు రాజాదుల మేలుకొఱకు యుక్తిబహుళముగ సంక్షేపించితిమి. ఒక్కొక యంశమును దెలుపు నితరశాస్త్రములమాట యేటికి? అందఱకు సుఖజీవనసాధనమును లోకము నిలుపునదియు నీతిశాస్త్రమె. సర్వపురుషార్థ సాధనము గావున రాజాదులు దీనిం జదువునది. ఇది యెఱుంగువారు చతురుగ దిరివగఱార్జించి యెల్ల ప్రజలనెల్ల నిల్లంజేయుదురు. వ్యాకరణము చదువమిఁ బదములు, తర్కము పఠింపమిఁ బదార్థములు, పూర్వమీమాంసం దెలియమి యజ్ఞాదికర్మనిర్ణయములు, వేదాంతశ్రవణము చేయమి శరీరాదుల భంగురత్వాదులను దెలియవా? ఇవి యాయాశాస్త్రములు చేసినవారి యభిమతమును బుద్ధిప్రావీణ్యమును దెలుపుచు నామతములందు రుచిగల జనులచే నవలంబింపఁబడినవి. లోకవ్యవహారమునకవి యేల? భోజనము లేమిని దేహము నిలువనియట్లు నీతి లేమిని సమస్తలోకవ్యాపారము సాగదు. సర్వసమ్మతము సకలాభీష్టప్రదమునగు నీతిశాస్త్ర మఖిలరక్షకుఁడగుట రాజునకు నత్యావశ్యకము. అపథ్యము భుజించువారికి రోగములవలె నీతిలేనివారికి నపుడు గొందఱుఁ గొంతకాలమునకుఁ గొందఱు విరోధులగుదురు. పథ్యభోజులకు రోగములవలె నీతిమంతులకు విరోధులు తత్కాలమునఁ గొందఱుఁ గొంతకాలమునకుఁ గొందఱు లేకపోదురు. రాజునకు దుష్టనిగ్రహ శిష్టానుగ్రహములు పరమధర్మములు. అవి రెండును నీతిలేనివారలకు దొరకవు. అనీతియె భూపతికెల్లపుడు భయమును వైరివృద్ధిని నత్యంతబలక్షయమును గలిగించు గొప్పలోపము. నీతిదూరుఁడై విచ్చలవిడి సంచరించు భూపాలుఁ డాపదలపాలగును. అట్టివానిఁగొలుచుట కత్తివాతిని నాల్కతో నడఁచుట. నీతిమంతుఁడగు భూకాంతుని సేవించుట సుకరము. నీతిబలములు రెండునుగలవార సిరి విరివియగును. ఎట్లు గోరకుండ దేశమంతయుఁ దనకు మేలుచేయ సమకట్టునో, అట్టు చక్కఁగ హితముగోరు భూదారుఁడు ప్రవర్తింప

వలయును. మండలము దండ్రు మంత్రులు మొదలగువారును వేరగుట భూరమణుని నీతి నైపుణములలేమియే. సుజనరంజనుండు దుర్జనతర్జనుండు సకలానందనుండునగు రాజనందనుండు తన యాలోచనచే భూజనుల తేజముగైకొనుచుఁ బ్రాచీనజనపుణ్యమ్మున నీ నేలయేలఁజాలును. చలివాన యెండలచేతను జ్యోతులగతి ప్రకృతిరూపములచేతను బ్రియము నప్రియము హెచ్చుతగ్గునగు నాచారముచేతను గాలము మాఱుచుండును. ఆచారము నడుపును గాన రాజు కాలమ్మునుంచి చెడ్డలుగలిగించువాఁడు. కాలముతనంతనె మంచిది చెడ్డదియునగునేని కొందఱు ధార్మికులేర్యేలకావలెను? జనులు రాజుదండించునని వెఱచితము తమ సత్కర్మములు విడువకుందురు. ఈలోకమున స్వధర్మము ననుసరించినవాఁడె కడుఁ దేజరిల్లును. అది విడిచిన సుఖముకలుగదు. అదియె గొప్పతపము. సర్వదా దీనిఁ జేసినవానికి సురలును గింకరులగుదురు. ఇఁక నరులఁ జెప్పవలెనే? బలువెఱపు గలిగించు మంచిదండనములచే నరుల నిజధర్మపరుల నొనరించి భూవరుఁడు దాను నట్టివాఁడగావలయును. ఒండువిధమైనఁ దేజతఱుఁగును. పట్టాభిషేకముననో ప్రకారాంతరముననో దొరతనమందిన యతఁడు తనయందేలోపములేకబుద్ధినీతి బలశౌర్యములతో నెల్లజనుల ననుదినముఁ బ్రోచుచు నపరాధుల సదా దండించునది. ఎప్పుడు మేలుఁకువగలవానికిఁ గొలఁది ధనమును జెనుపొందును. నీతిధనాదులుగల వానికిఁ బహుప్రాయులును వశులగుదురు. సాత్వికము రాజసము తామసమునని తపము త్రివిధము. తేఁజెట్టితప మత్యంత మరయునో యట్టివాఁడగును. నిజధర్మము వీడక ప్రజలఁ గాచుచు నగ్నియజ్ఞములాచరించి పగతురఁ బరిమార్చుచుఁ జాగమున విన్నాణియై శూరుఁడు నోర్పుగలవాఁడు భోగములరాగరహితుఁడునగు సాత్వికుఁడు తుద నిత్యానందమందును. కనికరములేక కండకావరముగలిగి కల్లలాడుచు బాధలుపెట్టువాఁడు తామసుఁడు నరకవాసియగును. మోసగాఁడు, అపకారి, భోగలంపటుఁడునై, పిసినితనము, కపటము, కలహప్రీతి, నీతిలేమి, నీచులచెలిమిగలిగి, యొకటితలంచి యొండొకటి వాక్రుచ్చి వేఱొకటిచేయు రాజాధముఁడు పశుపక్షి పాదపాదిజన్మమేదియే నొందును. సాత్వికతామస రాజసులు దేవాసుర మానవాంశ సంభూతులు. సత్వతమస్సులు సమమైన మనుష్యులగుదురు. మనుజుఁడు సత్వాదులలో దేనినాశ్రయించిన నట్టివాఁడె యదృష్టమననగును. కావున సత్వమున మనమునిలుపునది. ఇందుఁ గలిమిలేములకుఁ గారణమీ పుట్టువుననో తొలుబామునో చేసిన పుణ్యపాపములె. క్షణమైనఁ గ్రియారహితుఁ డెవఁడేని కలఁడా? పుట్టుచేతనె బ్రాహ్మణుఁడు క్షత్రియుఁడు వైశ్యుఁడు శూద్రుఁడు మ్లేచ్ఛుఁడుకాఁడు. వీరు గుణక్రియలచేతనె భేదముగలవారైరి. ఒక బ్రహ్మవలననే పుట్టినవారందఱు బ్రాహ్మణులు

కారా? వర్ణమువలనఁగాని కన్నవానివలనఁగాని బ్రహ్మవర్చసము బొందఁడు. శమదమదయాగుణములు జ్ఞానయజ్ఞోపాసన దేవతారాధన క్రియలు గలవాఁడు బ్రాహ్మణుఁడు. సుజనావనకుజనదండనాది క్రియాదక్షుఁడు దప పరాక్రమాదిగుణ ధనుఁడు క్షత్రియుఁడు. కర్షణగోరక్షణములు చేయుచు నిత్యము సరకు లమ్మకొనను నేర్పున జీవించువారు వైశ్యులు. ద్విజులపూజయందాసక్తిగలిగి కొలుచుచు జితేంద్రియులు శమోత్సాహవంతులునై నాగళ్ళు కట్టుట గడ్డిమోచు నలఁతివారు శూద్రులు. ఆత్మధర్మాచరణముమాని కనికరముమాలి పరులనొంచుచు నవివేకమున సర్వదాచంపు చండాలురు మ్లేచ్ఛులు. నరులకుఁ బూర్వకర్మఫలభోగమునకుఁ దగునట్టు పుణ్యముననో పాపముననో తలంపు పుట్టును. అది తొలఁగి, యెవఁడు నేదియుఁ జేయఁ జాలఁడు, కాఁగలదానికిఁ దగునట్టు తలంచును, అట్టివారె సహాయులను దొరకుదురు. పూర్వకర్మాధీనముగా సర్వము జరుగునని నిశ్చయించిన నిదికార్య మిది యకార్యమను నుపదేశములు నిష్ఫలములగును. హెచ్చుతెలివి మెచ్చునడవడియుఁ గలవారు పౌరుషము మెత్తురు. మగఁటిమిలేమిని జతనము చేయలేనివారు దైవము మన్నింతురు. గతజన్మకృతములు సుకృతదురితములు దైవము, వర్తమానజననకృతములు పౌరుషము నందురు. ఈరెండె సర్వమున కాధారము, ఎపుడును ప్రబలమె దుర్బలము నడంచునుగా. ఫలములగు సుఖదుఃఖములచేతనె, వాని బలాబలములు దెలియునుగాని లాతిచొప్పునఁగాదు. మనకుఁ గనఁబడు కారణము చేతనె ఫలమందుట గానరాదు. అదిపూర్వజన్మ కర్మనిమిత్తముగాని పెఱతెఱఁగునఁ గాదని నిర్ణయము. అల్పవ్యాపారముచేత సైతము మానవులకు మహాఫలము గలుగుటయు పూర్వకర్మముచేతనె యగును. మనుజులకీ జన్మపుఁ గ్రియచేతనె గలుగు ఫలమునకుఁ బూర్వకర్మమువలనఁ జనురువర్తియుఁగల దీవియకు గాలివలనవలె రక్షణ మావశ్యకముగావునఁ గొందఱు భూతవర్తమాన కర్మజమునందురు. ఆవశ్యముగాఁగల కార్యములకుఁ బరిహారముండినఁ దెలివి బలుములకొలఁది ఖలుల బ్రుందించుట గడు మంచిది. మందమధ్యాధికములుగ సుఖదుఃఖములిచ్చు పూర్వకర్మము త్రివిధముగ నారయునది. రావణునకు వనభంగమున నొక్క వానరునివలనను, భీష్మాదులకు గోగ్రహణమున నొక్క నరునివలనను దైవప్రాతికూల్యమును, రామార్జునులకుఁ దదానుకూల్యమును, స్పష్టమయ్యె. దైవముసుముఖమైనయల్పక్రియయు ననల్పఫలయగును. విముఖమైన గొప్పక్రియయు ననిష్టఫలదాయినియగు. బలిచక్రవర్తి దానముచేతను హరిశ్చంద్ర మహారాజు సత్యముచేతను బద్ధులైరి. శాస్త్రముచే సదసత్క్రియ లిష్టానిష్టఫలదములని యెఱింగి యసత్కర్మముమాని సత్కర్మమునాచరింపవలెను. కాలము

నకుఁ గారణముగావున సుకృతదురితములకును గారణమగు రాజు తన క్రౌర్యము చేతను దీక్ష్ణదండము చేతను బ్రజలను స్వధర్మమున నిలుపవలయును. స్వామి, అమాత్యుఁడు, మిత్రము, ధనము, రాష్ట్రము, దుర్గము, బలమునని రాజ్యమునకు నేడంగములు. అందు రాజు మూర్ధము, అమాత్యుఁడు నేత్రము, మిత్రము శ్రోత్రము, ధనము వదనము, రాష్ట్రము పాదములు, దుర్గము హస్తములు, బలము మనము. రాజాదులు వృద్ధిమంతులు కాఁదగు మేలిగుణములు దెలిపెద. సంద్రమును జందురుఁడుబలె నీజగమును వృద్ధి నొందించువాఁడు నేత్రానందకరుండునై చక్కఁగ నడుపురాజు లేకుండినఁ బ్రజ కడలిం జుక్కానికాఁడులేని యోడవలె నశించును. పాలకుఁడు లేకున్నఁ దమతమ ధర్మమున జనులు నిలువరు. ప్రజలేకున్న నీనేల నేలికయు శోభనొందమి సందియంబె? న్యాయమున నడిచిన జనపతి తన్ను జనులను, ధర్మార్థకామసంపన్నులఁ జేయుటయు లాతివిధమయిన విపన్నులఁ గావించుటయుఁ దప్పదు. పృథుయుధిష్ఠిరులు ధర్మమున వశపఱిచికొని వసుధననుభవించిరి. అధర్మమున వేననహుషులు నశించిరి. కావున ధర్మము పురస్కరించుకొని పార్థివుండర్థమునకు యత్నింపవలయును. ధర్మపరుఁడగు నరవరుఁడు దేవాంశజుఁడు; ఇతరుఁ డసురాంశజుఁడు ధర్మమడంచి ప్రజల బాధించును. ఇంద్రానిలయమవరుణానిలకుబేరసూర్యచంద్రాంశములఁ దాల్చి తనయాలోచనమున భూమిపతి చరాచరనియామకుఁడగును. రక్షణదక్షుఁడగు మహాక్షితిపుండింద్రునివలె భాగహారి, వాయువు గంధమునకువలె శుభాశుభకర్మములకుఁ బ్రేరకుఁడు రవివలెఁ దమోనుదుఁడు ధర్మప్రవర్తకుఁడు నధర్మనాశకుఁడు, దండధరునివలె దుష్కర్మదండకుఁడు, రక్తుఁడై సర్వభాగముల ననుభవించుచు నగ్నివలెశుచి, వరుణుఁడు రసములచే బలె తనధనములచే సర్వపోషకుఁడు, ధనాధిపతి నిధులరక్షించు విధమున ధనరక్షణదక్షుఁడు, చంద్రుఁడు వెలుఁగులచేఁ బలె తన గుణకర్మములచే నాహ్లాదకరుఁడు కావలెను. చంద్రాంశము లేక యితరాంశములన్నిటిచేత రాజు రాజిల్లఁడు. పితృ మాతృ గురు భ్రాతృబంధుయమకుబేరులను నీ యేడ్వుర గుణములు గలవాఁడె రాజు. తండ్రివలెఁ దనప్రజకు గుణములవఱుపఁజాలుట, తల్లివలె నపరాధములు క్షమించుట పోషించుట, శిష్యునకు గురువువలె సువిద్యఁ జదివించుట హితముపదేశించుట, తండ్రిధనమునుండి సోదరునివలె యథాశాస్త్రము తన భాగము పంచికొనుట, చుట్టమువలెఁ దన్ను స్త్రీలను ధనమును రహస్యమును రక్షించుట, కుబేరునివలె ధనమిచ్చుట, యమునివలె దండించుట, మిక్కిలి వృద్ధిపొందఁగల చక్రవర్తియందీ యేడుగుణములుండును. వీనిని రాజెన్నఁడును విడువఁజనదు.

మొసళ్ళు.

మొసలి బల్లిజాతిలోనిది. దాని వీపుపైని బల్లికివలె మెత్తని చర్మముండక బుడుపులవరుసలుగల కొమ్మువంటి పదార్థముతో చేయఁబడిన చర్మముండి మొసలికి రక్షణముగానుండును; ప్రక్కలను చర్మముపైని గుండ్రని చిన్న పొలుసులు నిండి యుండును; కడుపుమాత్రము మృదువయి నలుచదరములైన పొలుసులను గలిగి యుండును. ఇది చూపులకు పెద్దబల్లివలె కనఁబడినను, మిక్కిలి భయంకరమయిన క్రూరజంతువు. మొసలియొక్క రూప మీ క్రిందిపటమునఁ జూపఁబడియున్నది—



దీనితోఁక శరీరమునకంటెను పొడుగుగానుండును. దీనివీపు పొడుగునను బుడుపులు నాలుగు వరుసలుగానుండి కడపట నొక్కటిగా చేరును. తెడ్డువలె నుపయోగపడుటకయి తోఁకయొక్క ప్రక్కలు గుండ్రముగానుండక చదరముగానుండును. మొసలియొక్క వీపు నల్లరేఖలందందుఁగలిగి గోధుమవర్ణముకలదిగానుండును; కాళ్ళయొక్కయు కడుపుయొక్కయు అడుగుభాగము తెలుపుతోఁ గూడిన పసిమివర్ణము కలదిగానుండును. కాళ్ళు పొట్టివిగా నుండును; ముందటికాళ్ల కయిదేసి వేళ్లుండి కడపటి రెంటికినిదక్క మిగిలినవానికి గోళ్లుండును; వెనుకకాళ్లకు నాలుగేసి వేళ్లుండి కడపటి దానికిఁదక్క మిగిలివానికి గోళ్లుండును. కప్పకాళ్ళకువలె వానివేళ్ల మధ్యను చర్మముండును. తల మిక్కిలి దీర్ఘమయి ముందుభాగమునందు ముక్కు రంధ్రములను గలదిగానుండును; ఆముక్కురంధ్రములకు కనుఱెప్పలవంటి మూతలుండివలసినప్పుడు మూయుటకును తెఱచుటకును అనుకూలముగానుండును. దౌడలు చెవులవఱకును తెఱచుట కనుకూలముగా నున్నందున, ఎంత పెద్ద జంతువునైనను మొసలి నోటితో ననాయాసముగా పట్టఁగలుగును. దౌడలలో వెనుకవైపునకువంగి యొక్కొక్క వరుసనే పళ్లుండి యవి దౌడలుదగ్గఱగాఁ జేర్చినప్పు డొండొంటిలో వమరి సందులేక యుండును. పళ్లువెనుకవైపునకు వంగియుండుటచేత మొసలినోటిలోపడినజంతువు విడిపించుకొని యీవలఁబడుట దుర్ఘటము. మొసలికి దౌడల్లవంటి పెదవులు లేనందున దానిపళ్లు అంపపుపండ్లవలె సదా వెలికిఁ గనఁబడుచుండును. దీనికి నాలికలేదని

భ్రమింతురుగాని దీనినాలుక చలనములేక క్రిందిదౌడనంటుకొని యుండును. కన్నులు చిన్నవయి ప్రకాశించుచుండును. ఇతరజంతువులకువలె రెండు కనురెప్పలుండుటయే కాక నీటియడుగున నున్నప్పుడు రక్షణముగానుండుటకొఱకు అద్దమువంటి ప్రకాశమానమయిన చర్మముకూడ పయినిపొరగా నుండును. ముక్కురంధ్రములకువలెనే చెవిరంధ్రములకును వలసినప్పుడు తీయుటకును మూయుటకును దగిన చర్మపు మూతలుండును. ఈ ప్రకారముగానే గొంతుకలోపలఁగూడ నాకతో లుమూఁతయుండి మొసలి నీటిలో మునిగినప్పుడు నీరు లోపలికిపోకుండ వారించును. ఇట్టిమూఁత యుండుటచేత మొసలి జంతువును నోటఁగఱచికొని నీటిలోనికి లోఁతునకుఁ బోయినప్పుడు నీరెంతమాత్రమును లోపలికిపోదు. ఒక జాతి మొసళ్ళు దేశమునందలి గంగాది నదులలోను మడుగులలోను విస్తారముగానున్నవి. వీనిలో పెద్దవి యిరువదియడుగుల పొడుగుండును; వీనికిపళ్లు నూఱువఱకునుండును. ఇవి సాధారణముగా చేపలను తినియే జీవనముచేయుచున్నను, నీటిలో పడవైచిన శవములను గొన్నిసమయములయందు బ్రతికియున్న మనుష్యులను నీటిలోదిగిన యితరజంతువులనుపట్టి భక్షించును.


మొసళ్ల నెత్తురు మనుష్యరక్తమువలె వెచ్చగానుండక చల్లగా నుండును. మొసళ్లు నదీతీరములయందలి యిసుకతిన్నెలలో పల్లముత్రవ్వి వానిలో నెండాకుల్లు వేసి గ్రుడ్లుపెట్టును. ఒక్క యాఁడుమొసలి యొక్కొక్కసారి యిరువదిమొదలుకొని యఱువదివఱకును గుడ్లనుపెట్టి పిల్లలను జేయును. గుడ్లనుపెట్టిన నలువదిదినములలో నెండవేఁడిమిచేత నాటేసి యంగుళములపొడవుగల పిల్లలు కలుగును. అప్పుడు తల్లి పిల్లలను నీటిలోనికిఁ దీసికొనిపోయి యవి స్వయముగా నాహారమును సంపాదింపకోఁగలుగునంతవఱకును సగము జీర్ణమయిన యాహారమును బెట్టుచుండును.

మొసలి వ్యాఘ్రమువలె క్రూరమయినజంతువు. అది నీటిపయి నీఁదెడు బాతులు మొదలగువానిని, నీరువట్టుతీర్చుకొనుటకై జలములోదిగిన పందులు మొదలగువానిని, నీటిలోనుండెడు చేఁపలనుగూడపట్టి చంపితినును. చేఁపలను పట్టుకొనుటకై నీటిలో నెంతదూరమయినను తఱుముకొనిపోవును. పంది, కుక్క, మొదలయిన వానిని పట్టుకొన్నప్పుడవి చచ్చుటకయి లోతునీటిలోనికీడ్చుకొనిపోవును. ముక్కురంధ్రములుమాత్రము నీటిపైకిఁబెట్టి, మనుష్యులను జంతువులను బట్టుకొనుటకయి యది దినములకొలఁదిని నీటిరేవుల సమీపమున వేచియుండును. ఈ క్రూరజంతువును సంహరించుటకయి మనుష్యులు వివిధోపాయములను పన్నియున్నారు. కొందఱు పెద్ద గాలములకు పందిమాంసమును గ్రుచ్చి నీటిలోవేసి మొసలి దానిని మ్రింగినప్పుడు దానిని పయికీడ్చి, ఒడ్డుచేరినతరువాత దానికన్నులలో దుమ్ముకొట్టి గుడ్డి దానిని జేసి

తరువాత సులభముగాఁ జంపుదురు. మఱికొందఱు పడవలలోఁ బోయి సన్నని దారముల కొనకు గాలముకట్టి వాఁడిగల యాగాలమును దానియొక్క చర్మములో మెత్తని భాగమునందు గ్రుచ్చుదురు. అది త్రాడును కొఱికి ముక్కలు చేయుటకయి ప్రయత్నించునుగాని యాత్రాడొక్కపగ్గముగాక యక్కడక్కడ ముడిపెట్టబడి విడిగానున్న యిరువదిముప్పది సన్నదారములకూడిక యగుటచేత కొఱుకఁబడక దారములు పండ్లసందునఁ జిక్కుకొని దానిప్రయత్నము నిష్ఫలమగును. ఆదారములతో దానిని నీటియుపరిభాగమునకులాగి మనుష్యులు మరలమఱియొక వాఁడిగాలముతో పొడిచి చంపుదురు. ఆఫ్రికాఖండమునందలి నీగ్రోజాతివారు చేతవాఁడికత్తి నిధరించి మహాసాహసముతో నీటిలోమునిఁగి మొసలి యడుగునకుఁబోయి దానిని కడుపులోఁ బొడిచి చంపుదురు. మొసలి నీటిలో తిన్నగా మహావేగముతో పరుగెత్తఁగలుగును గాని ప్రక్కలకంత శీఘ్రముగా తిరుగఁజాలదు. కాఁబట్టి మనుష్యులు దాని యుపద్రవమును తప్పించుకొనుటకయి వంపులుతిరిగి యడ్డదిడ్డములుగా నీఁదుదురు.

పూర్వకాలమునం దీజిప్టుదేశస్థులు మొసళ్లను పూజించెడివారు. ప్రతికుటుంబమువారును దామొక్కొక్క మొసలిని పెంచి దానికాభరణములును పవిత్రాహారమ్మును బెట్టి పూజించి చచ్చినప్పుడు దానినూరేగించి యుత్సవముచేసి పాతిపెట్టెడిహారు. ఆదేశములోనే యింకొకజాతివారు మొసళ్లనుజంపి భక్షించెడువారు. అందుచే నారెంటుతెగలవారికిని తఱుచుగా కలహములు జరగుచుండెను. గ్రద్దలు మొదలయిన పక్షులును ముంగిసలు మొదలైన చతుష్పాదజంతువులును మొసలిగుడ్లను తిని వాని సంఖ్య తగ్గునట్లు చేయుచుండును. మొసలిగుడ్లు బాతుగుడ్లంత లేసియుండి కొంచెము కోలగానుండును. అనావృష్టిచేత చెఱువులు మొదలయిన వింకఁబాఱినప్పుడు కొన్ని సమయములయందు మొసళ్లు గ్రామములమీఁదఁబడి పశువులను జంపుటయుఁ గలదు. ౧౮౮౯వ సంవత్సరమున గొప్పయనావృష్టి సంభవించినప్పుడు సింహళద్వీపములోని కోర్నెగల్లిగ్రామసమీపముననున్న చెఱువునుండి రాత్రివేళ మొసళ్లు బైలుదేఱి పట్టణముమీఁదుగా చేరువనున్న వేఱొకచెఱువునకుఁ బోయెనఁట. అప్పుడు కొన్ని మొసళ్లు బావులలోఁ బడెనఁట; కొన్ని తోఁటలలోని కంచెలలో చిక్కుకొని మనుష్యులచేతఁ జంపఁబడెనఁట. వరపుచేత జలాశయములింకఁబాఱుటవలన సామాన్యముగా దొరకెడి యాహారము దొరకనప్పుడు మొసళ్లు బురదలోఁజొచ్చి పూడి యోగనిద్రనొందియుండి వర్షములు కురిసినతరువాత లేచి బైలువెడలును. ఒకయుద్యోగస్థుఁ డెండిన చెఱువులో తన గుడారమును వేయించెననియు, ఒకనాఁటి రాత్రి యతఁడు పరున్న మంచముక్రింద నేలకదలి యందుండి మొసలియొకటి బయలువెడలెననియు,

జంతుచరిత్రకారులొక కథను వ్రాసియున్నారు.



అమెరికా ఖండమునం దింకొకజాతి మొసళ్లు గలవు. అవి సాధారణముగా మత్స్యములను తినియే బ్రదికినను కొన్ని సమయములయందు మనుష్యులను కొన్ని యితరములైన పెద్దజంతువులను బట్టుకొని యీడ్చుకొనిపోవును. అక్కడి యీ మొసళ్లు శీతకాలములో యోగనిద్రపూని చచ్చినట్టు పడియుండి యెండకాలము రాఁగానే లేచి మరలతిరుగసాగును. ఈ జంతువులక్కడ నదులలోను సరస్సులలోను మందలుగానుండును. ఇవి తాము మ్రింగలేనంత పెద్దజంతువును పట్టుకొన్నప్పుడు ఆ జంతువును నదియొక్కగట్టున గోయిత్రవ్వి కుళ్ళనారంభించువఱకు నందుంచి, తరువాత వెల్లగించుకొనివచ్చి నదీకూలమునందలి దుబ్బులలోఁ బెట్టుకొని తినును.

భీమలింగాష్టకము.

సంస్కృత భుజంగప్రయాతవృత్తములు

ఉమావామసంగం హిమానీసమాంగం । రమాసూనుభంగం సమానాంతరంగం ।
హిమాంశూత్తమాంగం క్షమాభృన్నిషంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభాంగం.
జటాజూటగంగం కృపానిధ్యపాంగం । శ్రితార్త్యోఘభంగం హతద్విడ్రణాంగం ।
నదన్నాట్యరంగం లసజ్జ్యాభుజంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభాంగం. ౨.
స్ఫురద్రౌప్యశృంగం సుహృత్పద్మభృంగం । మదేభప్రభంగం మృడానీభుజంగం
కనద్ఘోతురంగం దయార్ద్రాంతరంగం । నమామ్యంగుటూర్భీమలింగం శుభాంగం. ౩.

ఘటిత మనోజ్ఞహీరమణికాంతి వృషాబసకాంతలాలసా
చటులరయాన్వితాను గతసారనదీ ఘనరాజహంసము౯.— చ. ఆ.

లక్షణాపరిణయము.

శృంగారరసప్రధానంబగు నీకావ్యము వర్తమానమందు కాకినాడకాలేజిలో నాంధ్రపండితులును, గోదావరిమండలములోని వింజరము గ్రామవాస్తవ్యులును నగు మహారాజశ్రీ శృంగారకవి శర్వారాయకవీశ్వరునిచే రచింపఁబడినది. ఈ కృతికర్త తాతతండ్రులనాటనుండియు శృంగారకవిత్వమును చెప్ప వాఁడుకనుపట్టి వీరి కుటుంబమువారికి శృంగారకవివారను పౌరుష గృహనామము కలిగెను. ఈ గ్రంథము రచింపఁబడి పదిసంవత్సరములు కావచ్చినది. ప్రకృతమం దీయనవయస్సు ముప్పది సంవత్సరములు. శ్రీకృష్ణుని యష్టమభార్యయు మద్రదేశాధీశ్వరుని పుత్రియునగు లక్షణయొక్కయు శ్రీకృష్ణునియొక్కయు పరిణయమహోత్సవకథ నీగ్రంథమునందు కృతికర్తగారు చక్కగావర్ణించియున్నారు. ఇయ్యది మూఁడాశ్వాసముల గ్రంథము. ఈకవియొక్క మృదుమధురశైలియు, వర్ణనా సామర్థ్యంబును నీక్రిందిపద్యంబులవలన దేటపడగలవు.

ఉ. తాను మరుత్తనూఁబరగి తత్పురి నల్లనఁజేరియుం జగ
త్ప్రాణుఁడనం జరించి తనుదార పరీమళరాశి నాశలం
బూనుట గంధవాహుఁడయి పొల్చినవారలు రోసి త్రోయఁగా
లూనక భీతిఁబాటుటనె యా శుగనామము గాలిదాలిచె౯.— ప్ర. ఆ.

చ. అనుఁగు పొలంతి జంఘమకరాంక విలాసముఁజూప మీనకే
తనగతిఁ గన్నులొప్పినను దారనఖంబులు సూనకాండ భా
సనెసఁగఁగానసంగ ఘనసంపద మధ్యము జెందఁజూచి యీ
ర్ష్యనుబలెఁగావిమోవి యలరారెడు నిక్షుశరాసనస్థితి౯.— ద్వి. ఆ.

మ. వనితాక్రీడనితాసితారుణ సరోజాతోత్పలవ్రాత కృం
తన తాపంబు సరోవరంబు నలుసంతంజెంద దత్యాశఁ ద
త్తనుభర్త్రాధర పద్మరాగ, రదముక్తా, హాసహీరాప్తికై
ధనమూలంబు జగంబులన్న పలుకు ల్తథ్యంబు లూహింపగ౯.— ద్వి. ఆ.

చ. హరిహరిణాక్షియు న్సుమసమంచిత శయ్యవసించి యాశుఁ డీ
శ్వరి, శతపత్రశాలిశచి, స్రష్టసరస్వతి, హేళిఛాయ, భా
స్వరతరపుష్పధ న్వరతి, వానినెసంగి యొసంగిరంత బం
ధుర వసుధాసుధాశన వధూవరకోటికి గంధవీటికల్.— తృ. ఆ.

గీతగర్భితోత్సాహ. సరసనీరజాతనయన సద్వనీవసంతభూ
భరణ పత్త్రిరాజతురగభవ్యపావనాఖ్యభూ
నిరతహాటకాచ్ఛవసననీరదాభదేహ స
చ్చరిత వాసుదేవ విబుధజాలవంద్యబ్రోవుమీ.— తృ ఆ.

పైన చెప్పఁబడిన మూడు గ్రంథములు సుజనరంజనీ, కార్యస్థానమునందు కాకినాడలో దొరకును వలయువార లచ్చటికి వ్రాసి గ్రంథంబులఁ బడయవచ్చును.

వాసవదత్తాపరిణయము.

వాసవదత్తాపరిణయమను నీప్రబంధము వక్కలంక వీరభద్రకవీంద్రునిచేఁ బదునెనిమిదవ శతాబ్దమునందు రచింపఁబడినది. ఈ ప్రబంధమును నూతనముగా వక్కలంక భీమశంకరుడుగారు రచ్యోత్తించి ముద్రింపించిరి. ఈగ్రంథము పీఠికా పురాధీశ్వరులైన రావు మాధవరాయ నృపాలుని కంకితము చేయఁబడినది. ఇందలి కథ సుబంధకవికృతమగు సంస్కృతనాటకము ననుసరించి వ్రాయఁబడినది. ఈ కావ్యము శృంగార రసప్రధానము. శైలి మృదువై మనోహరముగానున్నది. పాటలీపుత్ర పురాధీశుండగు చింతామణి నృపవరుని కుమారుఁడగు కందర్పకేతుఁడు స్వప్నమందు లతాంగినిజూచి యదిమొదలు విరహవేదనకు లోనై రాజ్యమునువదలి ప్రియమిత్రుఁడగు మకరందునితో వనవిహారము సలుపుచు వింధ్యాటవీ పరిసరప్రాంత భూములందు సంచరింపుచు నొక కీరమువలన కుసుమపురాధీశుఁడైన శృంగారశేఖరుని యనుంగు పుత్రికయగు వాసవదత్తయొక్క వృత్తాంతము విని కీరముతోఁ గూడ నా రాజశేఖరుని యంతిపురంబు ప్రవేశించి వాసవదత్త నపహరించి తనతోఁ గూడ నశ్వముపై నునిచి వింధ్యాటవింజేరెను. ఆ యడవియందు నివసించియున్న మునీంద్రుని శాపవశంబున నా లతాంగి శైలత్వము నొందెను. కందర్పకేతుఁడు నిద్ర మేల్కాంచి వాసవదత్తను గానక దేశాటనంబుజేయుచు గొంతకాలంబునకు దిరిగి యావనంబుజేరి యొక పాదచాటుననున్న శిలావిగ్రహము నుజూచి దానిని స్పృశించగా దానికి చైతన్యముకలిగి శాపకారణంబంతయు దెలియబరచెను. తరువాత శీఘ్రకాలములోనే వారిద్దఱకుఁ బరిణయ మహోత్సవము జఱుపఁబడెను, గ్రంథకర్తగారి శైలి నుదాహరించుటకై కొన్నిపద్యంబుల నీక్రింద బొందుపఱచుచున్నాము.

ఉ. సారసగంధులందు మణిసౌధములం గయిసేయువేళఁ గ్రొ
క్కారు మెఱుంగుఁ గన్నులను గజ్జలరేఖలు దిద్దిదిద్ది బ
ల్సోరణగంటి దారిఁ జను సోమునిఁ గాటుక గోరమీటినన్
జేరురమందు నాతనికిఁ జేర్చెఁ గళంకమునాటనుండియున్.— ప్ర. ఆ.

శా. కాంతంబై సుమనోమనోజ్ఞ నవమాకందద్రు కాంతారసం
క్రాంతానంత మనోజసైనిక పటాగారావళీ భూతమున్
జాంతస్సంజత పల్లవోదయ దిదృక్షానందిత స్వైరిణీ
స్వాంతంబై తనరె న్వసంతము లతాంతాలంకృతానంతమై.— ద్వి. ఆ.

చ. విరహకృశానురూపకృతవృత్తము మన్మథబాణ ఘర్షణ
స్ఫురదురువజ్రశాణము విశుద్ధమనుష్య మనోమరాళ సం
చరణమనోజ్ఞసైకతము సాధునిరీక్షణ పుష్పలిట్సితాం
బురుహము చంద్రబింబము సముజ్జ్వలవైఖరి నొప్పె నయ్యెడన్.— తృ. ఆ.

స్రగ్ధర. నీరస్మేరాబ్జభృంగే నిరుపకరుణో న్నిద్రభద్రాంతరంగే
తీరప్రోద్యత్కురంగే దివిజమునికృతోదీర్ణవాక్యప్రసంగే
ధీరవ్రాతానుషంగే ధృతపవనముఖోద్దీర్ణ రంగత్తరంగే
పారావారాంగసంగే భవభయచకితం పాహిగంగే శుభాంగే.— చ. ఆ.

ఉ. అత్తకు నాఁడుబిడ్డ కెదురాడకుమమ్మ నిజేశుఁడల్గినం
దత్తఱమందకమ్మ పతిదైవము నిక్కువమమ్మ యెప్పుడుం
బత్తియొనర్పు నాథుఁడని పల్కుఱు నిక్కకుమమ్మ యమ్మ నీ
వత్తిలుచొచ్చి బాంధవులనందఱఁ బ్రోవఁగదమ్మ యిమ్ముగన్.— పం. ఆ.

శ్రీసేనాపతికుమారి.

ఈ వచనకావ్యము బళ్లారిమండలములోని రాయదుర్గవాస్తవ్యులును "విజ్ఞానవర్ధనీ" పత్రికాధిపతులు నగు మ-రా-శ్రీ వై- నారాయణమూర్తిగారిచే రచింపఁబడినది. ఇందలి కథ మనోహరముగానే యున్నది. ఈ గ్రంథ మాంగ్లేయకథల ననుసరించి వ్రాయఁబడినట్టు కానుపించుచున్నది. ఇందలి గుణాగుణములనుగూర్చి మేమంతగా వ్రాయనక్కరలేదు. చదువరులకే విశదము కాఁగలదు. వలయువారు గ్రంథకర్తగారికి వ్రాసి పుస్తకములఁ బడయవచ్చును. దీని వెలమాత్రము మిక్కిలి యధికమని మేమూహించుచున్నాము.

సత్యసాధిని.

చెన్నపురియందలి ఆర్యమతసమాజము వారి యాదరణక్రిందను శ్రీసుబ్రహ్మణ్యాభినవసచ్చిదానందభారతీస్వాములవారి యాజ్ఞానుసారముగ నీ పత్రిక టి- యే- సామినాథయ్యరువారిచే మాసమున కొకసారి ప్రకటింపఁబడుచున్నది. ఇందు భాషావిషయ, మత, వేదాంత శాస్త్రవిషయములు లోనగునవి ప్రచురింపఁబడుచుండును. ...యానమందు మిగుల బ్రసిద్ధిగాంచి, యపరశంకరులని వాడబడుచున్న శ్రీ వివేకానంద

సరస్వతీ స్వాములవారి యుపన్యాసములు మొదలగునవి పత్రికయందు భాషాంతరీకరింపబడుచున్నవి. పత్రిక సర్వజనసామాన్యగ్రాహ్యమైన సులభశైలిని వ్రాయఁబడుచున్నది. హిందూ మతోద్ధారణకై పాటుపడుచున్న శ్రీ అయ్యరువారి యుద్యమముల నిర్విఘ్నముగా గొనసాగించుటకు సర్వేశ్వరుని మే మెల్లప్పుడును ప్రార్థించుచున్నాము. ఆంగ్లేయభాషయందు ప్రచురింపబడుచున్న 'బ్రహ్మవాదిని', 'ప్రబుద్ధభారత' మొదలగు పత్రికలవలెనే నీ 'సత్యసాధని' యు దేశమందంతటను వ్యాపించి సార్థకనామమై జనులకు మోక్షమార్గోపదేశినియై చిరకాలము వర్ధిల్లుగాత! ఈపత్రికకు చందా సంవత్సరమునకు మూఁడురూపాయలుమాత్రమే కావున హిందూమతాభిమానులందఱును దీని నాదరింతురని దృఢముగా నమ్ముచున్నాము.

అంతఃపురోపన్యాసము.

ఆర్యపుత్రా? కరవుదినములుకూడ వచ్చినవి. ఏమిబుద్ధి! ఇంటనున్న గోడుగు నిచ్చివేసితిరి. ఏబదిరూపాయ లప్పిచ్చితిరి. బంతులాటలక్రింద ద్రవ్యమంతయు పాడు చేయుచుంటిరి. ఇవి మూఁడునుగాక పైపెచ్చు మరియొకవ్యవహారమున బ్రవేశించినారట నిజమేనా?

ఏమి వ్యవహారము?

ఏవ్యవహారమా? నేనంతవెఱ్ఱిదానను గాను. మీరుచేయు పనులన్నియు నాకు గోచరములే.

మొన్న ముక్కోటిఏకాదశినాఁడు మనమందరము స్నానమునకుఁ బోవుచున్నప్పుడు మీవైపుజూచి కనుసైగఁజేసినవారెవరు? నేను జూడలేదనుకున్నారా యేమి!

మీరెందు కట్లు బొంకజూచెదరు? మీమాటలయందు నాకు నమ్మకముపోయి చాలదినములయినది.

మీ రింతప్రొద్దుపోవువర కెక్కడనున్నారు!

పురమందిరసభలో నుపన్యాసములు వినుచున్నారా?

మీ స్నేహితులందరు తొమ్మిదిగంటలకు లోపుననే ఇండ్లకువచ్చినారే? మీరొక్కరు మాత్రమే యుపన్యాసములు వినుచున్నారు కాబోలు? ఆహా! ఏమివింత! మగవారిని నమ్మరాదన్న సామెత యబద్ధమా? అగ్నిహోత్రసాక్షిగా బెండ్లియాడిన భార్యల విడనాడి 'పొరుగింటి పుల్లకూర రుచి' యనునట్లు పరస్త్రీల పొత్తు నపేక్షించి రేయింబవళ్లు వీథులవెంబడిఁ దిరుగుచు మర్యాదహీనులై చెడిపోయినవారెందరినో మీ రెరిగియుండియు తుదకు మీకున్ను అట్టి యవస్థయే సంప్రాప్తమయ్యెనా! అయ్యో! నేనేమి చేయుదును నాకు పిచ్చిపట్టినదనుకున్నారా?

అవును. మీ పిచ్చిచేష్టలను జూచి నాకున్న పిచ్చియెత్తుచున్నటులే కనుపడుచున్నది.

మీరు చదివినచదువు తగలబెట్టనా! మీతండ్రిగారు సకలకష్టములను పడి వేలకొలంది వ్యయపరచి మీచదువుకొరకెన్నిపాట్లుపడినారు? అవియన్నియు వ్యర్థములే కదా! పరదారాగమనము పాపహేతువని మీరు బాల్యమునందే చదివియున్నారే! ఈచదువులన్నియు సన్నమైనవి కాబోలు? మీవంటి చదువుకున్న మూర్ఖులను జూచి కాబోలు పెద్దలు 'చదువుకున్నవానికంటె చాకివాడు మేల'ని చెప్పియున్నారు. ఇట్టి చదువులు కాల్పనే?

మీరెందుకా ప్రకారము నవ్వుచున్నారు? నవ్వుచుండుటలేదా? నాకు తెలియదనుకొనుచున్నారా? ఏమివెఱ్ఱి? మీపక్కదిండ్లాప్రకారమెందుకు కదలుచున్నవి. మీకు నవ్వటాలుగా నున్నదా? నవ్వు నాలుగువిధముల నష్టమని వినలేదా? మీరు నవ్వవచ్చును. నాకు నవ్వురాదు మిమ్మున చూచినప్పు డేడ్పువచ్చుచున్నది.

మీకు సిగ్గగుచున్నదా?

ఏమి! మీసిగ్గు చిమిడినట్లేయున్నది. దారాపుత్రాదులతో బహిరంగముగా స్నానమునకుం బోవునప్పుడా పరస్త్రీలతో సరసము? అహా! మంచిసరసమే! ఆ ఆడపశువుకు బుద్ధిలేకపోయినను మీకైనా బుద్ధిలేదా? "చెట్టుచెడుకాలమునకు కుక్కమూతిపిందె" యనినట్లు నలుగురుబిడ్డలతండ్రియై మనుమలనెత్తు నీడువచ్చి తలయొకవైపున నెరిసినప్పుడా ఈవేషములు? వినినవారైన నేమనుకొనెదరో? పదిమందిలో తలయెత్తి తిరుగుచు నిట్టిపనులకొడంబడినయెడల జనులేమనుకొనెదరో మీరెరుగుదురా? కళ్లుమూసుకొని పాలుద్రావు పిల్లివలె మీ రహస్యవర్తనము లెవరికిని గోచరములు కావనుకొనుచున్నారా?

ఆ సిగ్గుమాలిన దాని కాపురము చెడగొట్టినతరువాత దానిబ్రతుకు తెరవెట్లు? దాని నింటనుండి బయిటదీసినతరువాత మీబ్రతుకెట్లు? నాకూటిలో దుమ్ముపోయుట కదెక్కడ సంప్రాప్తమైనది? రేపు దానింటికిబోయి, దాని భవిష్యమంతయు దీసివేయుదును. చూడండి నాప్రతిజ్ఞ?

నావి తప్పుడుకూతలనుచున్నారా?

తప్పుడుకూత లెవరివో స్పష్టమే? నేను వేఱుగ చెప్పనక్కరలేదు.

ఈమధ్య సంపాదన రాగిదమ్మిడియైనను లేదుగదా! పిల్లదానికి శుభ్రమైన పరికిణియైనను లేదు. నామాట సరేసరి. ధరలు చూడబోతే రూపాయకు పదిసేర్ల బియ్యమైనా లేవు. అధికారి వ్యవహారము చూస్తే అధ్వాన్నముగా నున్నది. మీవ్యవహా

రము చూస్తే ముండిన ట్టేయున్నది నల్గురు 'ఛీఛీ' యనుచున్నారు. "ఇన్నాళ్లు బ్రతికి ఇంటివెనుక చచ్చినద' నినట్లు నా బ్రతుకే ప్రకారముగా నున్నది.

లేనిపోనిమాటలు చెప్పకూడదనుచున్నారా? దాని కుటుంబము మిక్కిలి మర్యాదగలదా?

దానిమర్యాదయు దాని యన్నగారి మర్యాదయు ముండిన ట్టేయున్నది 'లోయ మాయగలము కాని లోకము మాయగలమా! దానిని చిన్నతనములో నేబదియేండ్ల ముసలిముండాకొడుకునకు ధనాపేక్షచే గట్టిపెట్టినందుకు ప్రపంచమందరు దాని యన్నగారికి గడ్డిపెట్టుచున్నారే? ఈ ముండ కాపురానికి వచ్చేటప్పటికి వానికి నన్నాళ్లు వదలినవి. ఈముండ ఎన్నిసంసారములు కూల్ద్రోయునో? చావుకు సిద్ధమై తలనెరసి మనుమలనెత్తి కూర్చున్నచోటనుండి లేవలేనివాఁడైనను మగవాఁడు తిరిగి వివాహమాడవచ్చునట? నోరువాయిలేని చిన్నపిల్లకు వైధవ్యమిప్పించవచ్చునట! సంసారసౌఖ్యముల నెరుగక ప్రపంచజ్ఞానములేక సప్తపదములలో వైధవ్యమును పొందిన బాలవితంతువయినను పునర్వివాహమాడకూడదట! ఆహా! ఏమి యీశాస్త్రములు! ఈవెధవ తాటియాకువ్రాతలు తగలపెట్టినట్లే యున్నవి. ఈశాస్త్రము లాడవాండ్రే చేసినయెడల ఇంత పాడుగా నుండునా? "ధర్మపత్నీ సమేతస్య" అనవలెనట! ఆహా! ఏమి యీ కారికలు! ఆరవ్వంతప్రాణము చటుక్కుమనినతరువాత ప్రపంచమంతకును ధర్మపత్నియే? చనిపోయినవానికిమాత్రమే కాదు. బాలవితంతువుల నిట్టి దురవస్థనుండి తొలగించుటకు బ్రయత్నించు దేశాభిమానుల కెవరును ప్రోత్సాహము కలిగించి తోడుపడగూడదు కాబోలు? ఆహా యేమిచిత్రము. ఇట్టి యభిప్రాయములు మారువరకును దేశమెట్లు బాగుపడును!

పురాకృతకర్మ మనుభవింపక తీరదనుచున్నారా?

పురాకృతకర్మము స్త్రీలకుమాత్రమే కాని పురుషులకు లేదు కాబోలు! పురుషుల కున్నపక్షమున వారెందుకు పునర్వివాహము లాడవలె?

అయ్యో! కర్తవ్యాంశమును మరచితిని. ఈశాస్త్రచర్చ నాకెందుకు. మీరు ప్రతిదినము సాయంకాల మెచ్చటికి బోవుచున్నారు?

హా! దైవమా! ఇది నా పురాకృతకర్మఫలము కాబోలు!

మీ రిట్టి యకార్యకరణముల కొడిగట్టి—

ఈప్రకార ముపన్యసించుచుండగా భర్త నిద్రవోయినందున యుపన్యాసము మనకు పూర్తిగా దొరకలేదు.

శా. కృష్ణుం డాఁకి రణధ్వనుల్ నిగుడ నక్షీణాశుగశ్రేణి న
త్యుష్ణజ్వాలలు గ్రమ్మ నేయ నతఁడుం దోడ్తో నవారించి యా
జిష్ణుప్రోద్భవు మేన శాత శరరాజి న్నిండఁ గీలింప వ
ర్ధిష్ణుండై యతఁ డన్ మదింగనలి శౌరి న్ముంచె వాలమ్ములన్. ౧౩౫.

వ. మఱియును. ౧౩౬.

ఉ. మచ్చరమెచ్చఁ గృష్ణుఁడు సమగ్రభుజాబలలీలఁ బేర్చి వి
వ్వచ్చుని దేహమంతయును వాఁడిశిలీముఖకోటి నుద్ధతిన్
గ్రుచ్చ నతండు నా హరి నకుంఠితవైఖరి నట్లు చేయఁ గ
మ్మచ్చులరీతిఁ బొల్చిరపు డా దనుజారియు నా కిరీటియున్. ౧౩౭.

వ. ఇవ్విధంబున నా కృష్ణార్జునులు మనంబున ఘనంబగు మత్సరంబున రామరావణుల కైవడి నంధకాంతకాంతకులలాగున జలధరంబులచందంబున గర్జనంబులు నిగుడ హుంకారంబులు మెఱయఁ బోరుచుండిరంత ఘటోత్కచాలంబస హలాయుధులును బాహ్లిక సోమదత్త భూరిశ్రవులును ధృష్టకేతు నీల సుదక్షిణులును విందానువిందులును గేకయ మహీపాలురేవురును యవనపాండ్యాధిపతులును ద్రుపద విరాట రుక్మి సైంధవులును గూడి యాదవసైన్యంబు దైన్యంబునొంద శంఖంబులు పూరించి యా ధనుష్టంకారంబులు గావించియుఁ గ్రూర నారాచంబుల మేనుల గ్రుచ్చియు శరంబుల నురంబుల వ్రచ్చియు భిండివాలంబుల గుండెలు వ్రీలనొంచియు భల్లంబుల శిరంబులు డొల్లఁ ద్రుంచియుఁ బేర్చి యార్చి రయ్యవసరంబున. ౧౩౮

సీ. బాహ్లికుఁ డుఱక యంబకములు మూఁ డుగ్రసేనుపైఁ బఱపినఁ జిమ్మరేఁగి
యతఁ డొక్కతూపున నతనివిల్లు ఖండించి యాఱుబాణముల రథ్యములఁ జంపి
విరథుఁడై తను నేయ కురువృద్ధుపై శక్తి యడరింప నది ఘోరమగుచు వచ్చి
యతని వక్షస్స్థలం బవలీలనాఁటిన నెత్తురు గ్రక్కుచు నేలఁ గూలె
నది గనుంగొని తత్పుత్రుఁడైన సోమ। దత్తుఁ డా భోజపతిమీఁద దారుణాస్త్ర
కోటు లడరించి యొకవాలు గొని రథమున। కుఱికి యాతని తల తెగనఱకెఁ గడిమి.

వ. మఱియు. ౧౪౦.

క. ఆయుగ్రసేను రథికుల। వేయివిధంబులఁ గలంచి విగతాసులఁ గాఁ
జేయుచు బాహ్లికనందనుఁ। డాయోధన భీష్మమూర్తియై తన్నొంపన్. ౧౪౧.

గీ. నూఱుతూపులఁ జేకితానుండు సోమ। దత్తుపై నేసె నతఁడు చేయెత్తకుండ
మఱియుఁ బిడుగున కెనయైన మార్గణమున। నలిగి యేసిన నవ్వీరుఁ డవనిఁ గూలె.

గీ. పార్థసేనలు దుఃఖవిభ్రాంతిఁబొంద । హరివరూధిని సంతోష మడరియార్చె
నది గనుంగొని మత్స్యేంద్రుఁ డలుకతోడ । సుధ్ధపునిఁదాఁకి యేసె శరోత్కరమున.

క. ఆతఁ డవి నడుమ జడియుచు । భూతలమగలంగ నుక్కు భూరితరాస్త్రం
బాతతగతినేసి మహా । భూతము లడరంగఁ దనువు బోరననడిచెన్. ౧౪౪.

వ. ఇవ్విధంబున మత్స్యమహీనాయకుండగు విరాటుండు డెగినఁ దద్బలంబు లాహవ నినాదంబుగావించె నయ్యాదవనాయకు బలంబులు సింహనాదంబొనరించె నంతఁ బాంచాలపతి క్రుద్ధుండై యుద్ధపునిపై శస్త్రపరంపరలు వరఁగించిన నతండును దోర్దర్పోన వారించె నయ్యవసరంబున ద్రుపదుండు. ౧౪౫.

గీ. ఆఱుదూపుల నతని రథ్యములఁ దునిమి । నాలుగమ్ముల సారథి నఱికి యొక్క
కోల విలుద్రుంచి వర్మంబుద్రీల రెండు । శరములేసి యతఁడుమీఁద శక్తిఁబఱపె.

క. అది భూతలమదరంగా । నదరులు గ్రక్కుచువచ్చి యాయుద్ధపు బె
ట్టిదముగఁ దాఁకుడు ధరణిం । జదికిలఁబడిమూర్ఛె పార్థసైన్యములార్వన్. ౧౪౬.

వ. ఇవ్విధంబున సుద్ధపుండు సమిద్ధరణింబడిన నడలుచు నక్రూరుండు క్రూరనారాచంబుల ద్రుపదు గ్రుచ్చి నాలుగుబాణంబుల ఘోటకంబులఁగూల్చి సారథి నుక్కు శాతశరంబున శిరంబుద్రుంచి కేతుచ్ఛత్రచామరంబులు భూతలంబునం దొరలించిన నతండు విరథుండై వాలునుం బలకయుం బూని సింహచంక్రమణ విలాసంబున నతని తేరిపయింగవియుడు నతం డనేక నిశితశరంబులం బరగింపం దనవాలున జడియుచుఁ జేర నేతెంచిన నయ్యక్రూరుం డర్ధచంద్రబాణంబున నప్పాంచాలపతి మూర్ధంబుద్రుంచి సింహనాదంబుగావించిన. ౧౪౭.

క. ఆరవము విని శిఖండి మ । హారోషంబెత్తి చూడ్కి యక్రూరునిపై
ఘోరముగ నిడి రయంబునఁ । జేరఁగ నేతెంచి పటువిశిఖములఁ గప్పెన్. ౧౪౮.

గీ. అతఁడు నేర్పునఁద్రుంచె నాయంబకముల
మఱియు ద్రుపదాత్మజుఁడు వాఁడిమార్గణముల
నతని రథ్యధనుర్ధ్వజయంతులను హ
రించి యొకకోల నతని ఖండించియార్చె. ౧౫౦.

వ. ఇవ్విధంబున నక్రూరుండు డెగిన నయ్యాదవబలంబుఁ జలంబునఁ బోరి కడికండలు సేయ శిఖండిం గనుంగొని హైడింబ హలాయుధాలంబసులును దృష్టకేతు సైంధవ యవన రుక్మి పాండ్య భూరిశ్రవులును గేకయ పంచకంబును విందానువిందులును దమతమ శంఖంబులు పూరించి యాదవబలంబు దఱియంజొచ్చి యొక్కపెట్టున. ౧౫౧.

సీ. కర్ణము ల్గుంభము ల్గరములుఁ బాదము ల్దంతముల్ దనుపులుఁ దఱిగి తఱిగి
ముఖములుఁ గేసరంబులు చెవుల్ వీఁపులు తోఁకలు నుగ్గుగాఁ ద్రుంచి త్రుంచి
నొగలు కూబరములు దిగుమెట్లు చక్రముల్ శీర్షంబులును బోడిచేసిచేసి
శిరములు నురములుఁ జెక్కులు ముక్కులుఁ దొడలుఁ గరంబులుఁ దునిమి తునిమి
యేనుఁగులనొంచి హయముల యేపడంచి। యరదములఁ ద్రుంచి కాలురయదటుడించి
సంగరంబున నిశ్శంకశౌర్యమెసఁగ। నేర్పుమైఁ గూల్చి రక్షౌహిణీబలంబు. ౧౫౨.

వ. అంతమధ్యాహ్నంబయ్యె నప్పుడు శిఖండిఘటోత్కచాదుల విక్రమంబునకు దేవత
లద్భుతంబునొంది యిట్లనిరి. ౧౫౩.

ఉ. రావణ కుంభకర్ణుల పరాక్రమముల్ మధుసుగ్రవిక్రమ
శ్రీవిభవంబుఁ గైటభుని చేఁతయు నందకు దోర్బలంబు నా
భూవనితాకుమారకుని పోఁడిమిఁ గంటిమి గాని యిట్టి శౌ
ర్యావహకేళి సల్పెడు మహాత్ములఁ జూచియెఱుంగ మెన్నఁడున్. ౧౫౪.

వ. అని యగ్గడించిరయ్యెడ నయ్యోధవరులు సింహనాదంబులు చేసినఁ దద్రవంబు విని సాత్యకి ప్రద్యుమ్నానిరుద్ధాదులు రయంబునఁ బఱతెంచి వారలపై శరవర్షంబులు గురియించి నిలువరించి రయ్యవసరంబున నవ్వలిచక్కి భీష్మ ద్రోణ కృప కర్ణు లొక్కుమ్మడిఁ బ్రళయకాలరుద్ర చతుష్టయంబు తెఱంగున మెఱపుమెఱసినభంగి యంత్రకారుల బాగున మెఱసి యొక్కచో ధనుర్గుణ ఝంకారంబులు నిగిడింపుచు నొక్కచో నిజహేతిప్రభావిలసితంబులు గావింపుచు నొక్కచోఁ గేతనంబులు మెఱయ రథవేగంబులు గనుపట్టంజేయుచు నొక్కచో సింహనాదంబులు సేయుచు నొక్కచో శంఖంబులుపూరించి విజృంభించుచుఁ గీలూడ్చినఁ గెడయు బొమ్మలయోజం గూలి కుప్పలుగొన నేకాక్షౌహిణీబలంబుఁ దునుమాడి యంత రక్తప్రవాహంబులు వఱపిరి హతశేషులు గాందిశీకులై యుండ నొరులు విఱిగిపడిన రథంబులసందున వీఁగియు గజకళేబరంబుల నొదిగియు సమానీనంబులైన సైంధవంబుల పక్కెరలఁ జొచ్చియు శవంబులనడుమం బడి కాలుచేయాడించకయుం గొందఱు నిలువం దక్కినవారు కృష్ణకృష్ణ గావుమని నెలుంగుసూపఁ దన్నాదంబు విని యామురాంతకుండును దారకునిచే రథంబు వేగంబునం బఱపించి తన సేనకుం జెయివీచి యోడకుండని నిలువరించు నవసరంబునఁ బ్రొద్దుగ్రుంకె నంతకమున్న యర్జునుండు తమసైన్యంబులం దివియించి భీష్మ ద్రోణ కృపాశ్వత్థామ ధర్మజ సుయోధన కర్ణాదులుం దానును గరదీపికా సహస్రంబులు వెలుంగ నిజస్కంధా

వారంబునకుం జని సముచితప్రకారంబున నందఱ ననిపి మజ్జనభోజనాదులుసల్పి సుఖంబుననుండె నంత నిక్కడ. ౧౫౫.

ఉ. సీరియు మాధవుండు హతశేషవరూధినితోడఁగూడి య
క్రూరుని యుద్ధపుం దలఁచి కుందుచుఁ బాండుతనూజసేనపై
వైరము మిక్కుటంబుగ నివాసముచేరఁగఁబోయి మందిర
ద్వారమునందు నిల్పి పరివారమునంపి యథోచితంబుగన్. ౧౫౬.

వ. అన్నపానాదికృత్యంబుల నిర్వర్తించి యెప్పుడెప్పుడు సూర్యోదయంబయ్యెడునని రణకుతూహలాయత్తచిత్తులై యుండిరయ్యుభయబలంబులు తమతమ శిబిరంబుల కరుగంజూచి దేవతలు దివంబునకుం జనిరని శుకయోగీంద్రుం డిలావంతునకుం జెప్పెనన్న జెప్పిన నటమీఁదివృత్తాంతంబేమని యడుగుటయు. ౧౫౭.

మ. శతపత్రోద్భవ వంశపావన దయా సత్యాన్వితస్వాంత సం
తతగోకాంచన ఘోటకాంచితధరా ధాన్యాది దానాఢ్య యా
శ్రిత నానావన దేవతాగృహ ధరిత్రీదేవ కళ్యాణ కా
వ్యతటాకాంధు నిధానసంతతి సమగ్రైశ్వర్యభాగోన్నతా. ౧౫౮.

క. దుర్మంత్రి గర్వభంజన। కర్మఠ దుగ్ధాబ్ధి కన్యకాధవపూజా
నిర్మలమానస నృపనయ। మర్మజ్ఞ దయాసముద్ర మానగుణాఢ్యా. ౧౫౯.

మణిగణనికరము. శరశరవర భవజనకగిరిసుధా। కరకరహరిహయ కరిహరిహరి భూ
ధరధర సితజలధరసురతరు సుం।దరదరవృషవిబుధముని సమయశా.

గద్య. ఇది శ్రీమత్కౌండిన్యగోత్ర పవిత్ర చరికొండ తిమ్మయామాత్యపుత్ర సకల విద్యాపారీణ శతఘంటసురత్రాణ సుకవిజనవిధేయ ధర్మననామధేయ ప్రణీతంబైన చిత్రభారతంబను పురాణకథయందు సప్తమాశ్వాసము.

అష్టమాశ్వాసము.

క. శ్రీరంగరాజసేవా। పారంగత హృదయ కమలభవవంశపయః
పారావార సుధాకర। మారసమానావతార మాదయపెద్దా. ౧.

వ. అవధరింపుము మృదుమధుర వచనరచనాపరితోషిత మునిజాతుండగు సూతుండు హరికథాశ్రవణాహ్లాదులగు శౌనకాదులకు నిట్లనియె నట్లు రామకృష్ణులుఁ దక్కిన యోధవరులును సూర్యోదయంబుఁ గోరుచు నాహవ కుతూహలాయత్తచిత్తులై యుండి రనవుడు శుకయోగీంద్రునకు నిలావంతుం డిట్లనియె. ౨.

క. ఈరీతి నుభయసేనలుఁ । బోరాడఁగ దినములెన్నిపోయెఁ గలనన్
భూరిబలు లెవ్వరెవ్వరు । వీరత్వముమీఱఁ దెగిరి వివరింపఁగదే. ౩.

వ. అనవుడు నయ్యిలావంతునకు నయ్యోగికేసరి యిట్లను నిట్లెఱుంగుము మఱియును బదియాఱుదినంబులు సమరంబు భీమంబై చెల్లె నందుఁ బాండవసైన్యంబున భీష్మ ద్రోణ కృపాశ్వత్థామ కర్ణ భూరిశ్రవులును యుధిష్ఠిర భీమార్జున నకుల సహదేవ దుర్యోధన దుశ్శాసనులును శిఖండి ధృష్టద్యుమ్నులును శల్యుండును నుత్తమౌజుండును యుధామన్యుండును ఘటోత్కచాలంబస హలాయుధులును సైంధవ విందానువిందులును నీల సుదక్షిణ పాండ్య యవన కేకయులును జతుర్ధనుండును జతురక్షౌహిణీబలంబులుం దక్కుఁ దక్కినబలంబులతోడ బాహ్లికాదులు గడసిరి యాదవబలంబున రామకృష్ణసాత్యకి గదులును బ్రద్యుమ్న సాంబసారణ చారుదేష్ణ బృహద్భాను భానుదేవ దీప్తిమదరుణాది కృష్ణకుమారవర్గంబును ననిరుద్ధ చేకితాన కృతవర్మలును నక్షౌహిణీ ద్వయంబునుం దక్కుఁ దక్కినసైన్యంబులతోడంగూడ నుద్ధవాదులు మడిసిరి పదునెనిమిదవనాఁడు ప్రభాతసమయంబునఁ బార్థుండు మేల్కాంచి సంధ్యాదికృత్యంబులు నిర్వర్తించి గురు కృపాశ్వత్థామ యుధిష్ఠిర దుర్యోధన కర్ణాది యోధవీరసమేతుండై యున్న గంగానందనుం గాంచి యతని యనుమతి నొక్క యుచితాసనంబునం గూర్చుండి వినయపూర్వకంబుగా నతని కిట్లనియె. ౪.

క. అనఘా నేఁ డెవ్విధమున । మొనదీర్పఁగవలయు నందు మురవైరికిఁ గుం
డినపతి దగులుపడకయుం । డనుపాయము దలఁచి చెప్పఁ గదా వెరవడరన్. ౫.

క. అనవుడు గంగాసుతుఁడ । య్యనిమిషరాజాత్మజునకు ననియెం గడునే
ర్పున శకటాకృతిగా మన । మొననిల్పుదమందు దాతము చతుర్థనునిన్. ౬.

వ. అని సంగరంబునకుఁ జయ్యన వెడలుండని యనిపిన సకలసైన్యంబులు గొలువ నతండు గట్టాయితంబైన రథంబు శల్యుండు దేర రథారోహణంబు గావించి కపికేతనంబు మెఱయఁ జక్రరక్షకులగు నుత్తమౌజుండును యుధామన్యుండును దోడరాఁ జనియె ననంతరంబ భీష్మ ద్రోణ కృపాశ్వత్థామ కర్ణ యుధిష్ఠిర వృకోదర నకుల సహదేవ సుయోధనాది యోధవీరులు సంగరోచిత శృంగారంబు లంగీకరించి నిజకేతన చ్ఛత్రచామర శరశరాసనాది నానావిధచిహ్నచిహ్నితంబులగు రథంబు లెక్కి విజయభేరీమృదంగ శంఖకాహళాది వాద్యంబులు మెఱయ యుద్ధభూమికిం బోయిరంత. ౭.

క. స్వారాజనందనుఁడు దన । తేరొయ్యనఁ బోవనిచ్చి దృఢతరశకటా
కారంబుగా నమర్చెన్ । వారణ రథతురగ సుభటవర్గము వరుసన్. ౮

వ. ఇవ్విధంబున శకటాకారంబుగా మోహరంబుమీఱంబన్ని యందు నంతర వ్యూహంబుగాఁ బద్మవ్యూహంబు సమకట్టి దాని మధ్యప్రదేశంబున సూచీవ్యూహం బేర్పఱచి తన్ముఖంబునఁ గేకయ పంచకంబును నట పిఱుంద సుదక్షిణుండును దత్పశ్చాద్భాగంబున నక్షౌహిణీబలంబు మున్నిడుకొని నకుల సహదేవ సహితుండై యుధిష్ఠిరుండును దత్సూచీ మూలస్థానంబునఁ జతుర్థనుండును నతనిచుట్టును గురుకృపాశ్వత్థామ కర్ణ దుర్యోధన దుశ్శాసన హాలాయుధాలంబస విందానువింద రుక్మి సైంధవ భగదత్త యవన పాండ్యాధీశులు నుండునట్లుగా నియమించి యర్జునుండును గాంగేయుండును వృకోదరుండును భూరిశ్రవుండును శిఖండియు ధృష్టద్యుమ్నుండును ఘటోత్కచుండును దమతమ యడియాలంబులు మెఱయ శంఖంబులు పూరింపుచు ధనుష్టంకారంబులు నిగిడింపుచు సింహనాదంబులు గావింపుచు నప్పెను మొగ్గరంబు ముందట నిల్చియుండ నది గనుంగొని పురందరాది బృందారకు లద్భుతంబొందిరక్కడ. ౯

మ. బలభద్రుండును కృష్ణుఁడున్ భుజబల ప్రస్ఫీతులై నందను
ల్బలియం బౌత్రులుఁ దమ్ములున్ సమర ఖేలాలోలతం గొల్వ నా
ర్పులెసంగం జనుదెంచి రాకలనికిన్ భూషా కిరీటధ్వజం
బుల కాంతు ల్నభమెల్లనిండ రభసంబు న్వేడ్కయు న్మీఱఁగాన్. ౧౦

వ. ఇవ్విధంబున యాదవవీరులు చిదిమిపెట్టిన బంటుతనంబునఁ జతురంగబలసమేతులై పాండవబలంబునకు ననతిదూరంబున మున్నుగా నుండిరందు. ౧౧

ఉ. ఆహరి వెన్నుదన్ని కుసుమాయుధ సాత్యకి సాంబ సారణుల్
బాహుబలంబుమీఱఁగఁ గృపాణ. శరాసన సాయకాది స
న్నాహముతోడ నిల్చి రరుణప్రముఖాత్మజులు న్విరోధి సే
నాహరణ ప్రవీణులయి నవ్వుచుఁ బొల్చిరి వారిచక్కటిన్. ౧౨

వ. అంతకమున్న రామకృష్ణులం గడచి కృతవర్మయుఁ జేకితానుండును సవరణలతోడి యరదంబులెక్కి తమతమ బలంబులను దాకును నిజశంఖంబులు మొరయించి సింహనాదంబు లొనరించి యతిరయంబునం జని యర్జునసైన్యంబుఁ దాఁకిన నిరువాఁగునుం గలసి పదాతులుఁ బదాతులును రథంబులు రథంబులునుఁ దురంగంబులుఁ దురంగంబులును గుంజరంబులుఁ గుంజరంబులును ఘోరంబుగాఁ బోరు నయ్యవసరంబున. ౧౩

శా. ధృష్టద్యుమ్నుఁడుఁ జేకితానుఁడును సందీప్తప్రతాపాఢ్యులై
ద్రష్టల్ మెచ్చఁగఁ బోరిపోరి తమ రథ్యంబుల్ ధరం గూలినన్
మాఃష్టామష్టిఁ బెనంగిరంతట బలంబున్ గర్వమున్ మీఱ ను
త్కృష్టుండై ద్రుపదాత్మజుం డతని మర్దించెన్ రిపుల్ బెగ్గిలన్. ౧౪.
గీ. అది గనుంగొని కృతవర్మయదరులుమియు । బాణములఁగప్పె ద్రుపదభూపాలసుతుని
నతఁ డది నడుమ వారించి యతనిమేనఁ । దొమ్మిదమ్ములుగ్రుచ్చి సూతునిహరించె.
సీ. సారథ్యమునుదానసల్పుచు నుభయసైన్యంబు లిచ్చెరువంద నా యదుప్ర
వీరుఁడు పాంచాలవిభు కుమారునిఫాలమున నొక్కబాణంబుఁ జొనుప నతఁడు
మూర్ఛిల్లె నప్పుడు ముమ్మరంబైన శోకమున శిఖండి యాగ్రహమునిగుడఁ
గృతవర్మఁదాఁకి తత్క్రతన చ్ఛత్రచామరకిరీటంబులు ధరణిఁగూల్చె
నతఁడు నట్లన గాలించె నలుకపొడమి । యమ్మహావీరుఁ డతని రథ్యములఁజంపె
విరథుఁడై యాదవుఁడు గదవేసెనతఁడు । నడుమనేద్రుంచి నొప్పించెనా'రసమున.
క. కరవాలము గైకొని జను । లరుదందఁగ నాశిఖండి హయముల నతఁడున్
ధరణింగూలిచె నాతఁడు, శరమునఁ గృతవర్మ శిరము చయ్యనఁ దునిమెన్. ౧౭.
ఉ. అప్పుడు రుక్మిణీరమణుఁ డాగ్రహ మూర్తిఁదలిర్ప దేవతల్
డెప్పరమంది కన్గొనఁ గడిందిమగంటిమి మీఱఁ బార్థుపై
నిప్పులు చిందుబాణములు నించి నభంబడరంగ నార్చినన్
గప్పె నతండు నంపగమిఁ గాలునుఁ జేయియు నాడకుండఁగన్. ౧౮.
క. బలభద్రుండును భీముం । దలపడి వక్షము ముసలమున నడువ నాతం
డలుకఁ బదమ్ముల నతని హ । రులఁగూలిచి స్యందనము విఱుగనేసె వడిన్. ౧౯.
మ. విరథుండై యమునావిదారకుఁడు పృథ్వీభూత సందోహసం
హరణోద్యుక్త కృతాంతుఁడో యనఁగ రోషావేశచేతస్కుఁడై
కరధారాగ్రమునన్ మరుత్సుతు శతాంగం బుద్ధతిన్ జుట్టినన్
హరిసైన్యంబులు నవ్వ నాతఁ డుఱికెన్ హర్యక్షలీలన్వెసన్. ౨౦.
వ. ఇట్లు భూమికి లంఘించిన. ౨౧.
క. అటమటిసారథితోడన్ । ముఱియుపడగతోడ హయసమూహముతోడన్
బిఱబిఱను ద్రిప్పి యరదము । పటపటగాఁ గొట్టి భీముఁ బైకొనెఁ గినుకన్. ౨౨.
క. ముసలమునద్రేయ నాతం । డప్పమున ఖండించి తాఁకి హలధరువక్షం
బసరొత్త● గదచేఁ గొ । ట్టె సురలు గనుఁగొని తన మగఁటిమి నుతియింపన్

శా. ఆలోకించి మునిపైఁ బురత్రితయ సంహారంబు గావించు న
ప్ఫాలాక్షుం డన నేగి మాధవుఁడు శుంభల్లీలతో బాహులన్
గీలించెన్ బదునాల్గుతూపు లది వీక్షించి చర్జునుం డాహరిం
దూలించెన్ విశిఖంబులన్ సురలు సంతోషించి భూషింపఁగన్. ౨౪

క. హరి యంతట రోషంబున । నరుని యురంబాడ నేసె నారాచములన్
శర మొకటిగ్రుచ్చ నొసలను । గరవాలున బలుఁడు గొట్టి కడువడి నార్చెన్. ౨౫

మ. అవనీమండలమెల్ల గ్రక్కదల బ్రహ్మాండం బెల్ల భేదిల్ల వా
సవి రోషంబున రామకృష్ణులపయిన్ సమ్మోహనాస్త్రంబు మం
త్రవిధిన్ మార్కొనమర్చి యేయుటయు మూర్ఛం జెంది రద్దారకుం
డువడిన్ వారలఁ గొంచు సత్యసుతుఁడుం దోడ్తోడ నేతేరఁగన్. ౨౬

క. చనియె నిట వాయుతనయా । ర్జునులార్చి కడంగి హరివరూధినిపైఁ బే
ర్చి నిశితశరములఁ గురియం । గని వారలఁ గప్పె మరుఁడు కాండంబులచేన్ ౨౭

వ. వెండియు. ౨౮

మ. అనిరుద్ధుండు ధనుర్గుణధ్వనులు మిన్నందంగ నేతెంచి లో
చనయుగ్మంబున వహ్నికీల లురులన్ సవ్యాపసవ్యంబులన్
ఘనబాణంబులు పింజపింజ గదియంగా వారిపై నేసి యా
ర్చిన భూరిశ్రవుఁ డుగ్రమూర్తియయి వచ్చెన్ సేన లగ్గింపఁగన్. ౨౯

సీ. వచ్చి యా యనిరుద్ధు వక్షస్స్థలంబు మూఁడంబకములనేసి హయములకును
బదితూపుల డరించి గుదియించి సారథి గుండె[illegible]లఁగ నొక్కకోలఁ జొనిపి
కత్తివాతమ్మున ఘనకార్ముకంబును నడిమికి వ్రయ్యలు పడఁగ నేసి
చిందంబు నాల్గువిశిఖముల భేదించి భల్లత్రయంబున నెల్లిగ్రుంచి
యార్చిన నతఁడు వేరొక్క యరద మెక్కి । యొండువిల్గొని యవ్వీరు బెండుపఱచి
గొడుగుఁ బడగయు విల్లును గుఱ్ఱములును । సూతు నిగ్రుంచె నమ్ముల సోనగురిసి.

క. వాలున భూరిశ్రవుఁడుం । గేలిగతి వైవ బుశ్యకేతుఁడు దానిన్
వాలమ్మునఁ జూర్ణంబై । నేలంబడ నేసి యాతనిం దూలించెన్. ౩౧

వ. వెండియు. ౩౨

శా. ఖద్యోతోజ్జ్వలమూర్తియై రిపులకుం గాన్పించు కౌరవ్య నీ
రోద్యోగంబు నిరర్థకంబై చనఁగ నాయోధావళిన్ ముంచు ధృ
ష్టద్యుమ్నాది రణప్రవీరుల యవష్టంభంబు వారించు నా
ప్రద్యుమ్నాత్మజుఁ డొంటిమైఁ గురుచమూపాథోధి మంథాద్రియై. ౩౩

వ. అయ్యవసరంబున భూరిశ్రవుండు దెలివొంది యొక్కెడఁజూచినఁ దానయై విహరించు హరిపౌత్రుని పయికినడరునెడ వృకోదరుండు రోషరక్తాక్షుండై యట్టహాసంబుఁజేసి నిలునిలుమని యదల్చి గదాదండంబున నవ్వీరుని వక్షస్స్థలంబు వగుల నేసిన నతండు వాతాహతిం జలించు మహీరుహంబు చందంబున నీషత్కంపితతనుండై కోపంబున నతనిం గరవాలంబున నేసిన యది ఖండంబులుగావించి యంతకాకారుండై. ౩౪.

క. మరుదుద్భవుండు గదచే । హరిపౌత్రుని శిరము వ్రేయ నది దునిసి సమి
ద్ధరణీస్థలమునఁ బడియెన్ । హరియనుచుం బార్థుసేన నార్పులు నిగుడన్. ౩౫.

వ. ఇవ్విధంబున ననిరుద్ధుంజంపి సింహనాదంబుఁజేసి సరోవరంబుఁ గలంచు గంధసింధురంబు చందంబున యాదవసైన్యంబుఁజొచ్చి హెచ్చిన గర్వంబున గద ద్రిప్పుచు రథులఁ గెడపియు సారథుల మడిపియు సిడంబులు పొడిఁజేసియు గొడుగులు పడఁగొట్టియుఁ దురంగంబుల నిరంగంబులఁగావించియు భటులఁ జటులగతి సంహరించియుఁ దనివిచనక మఱియును.

సీ. కుంభరత్నతతి గ్రక్కున జాతి మొగముపైఁ జిందంగ గదచేతఁ జిదిమిచిదిమి
నుకటిఁ జేపట్టి యొండొక్కటిపై ద్రొబ్బి చరణాగ్రమున నేలఁ జమరిచమరి
తుండముల్ చుట్టి చేతుల తీఁటవోవంగ ఘోరవిక్రమకేళిఁ గొట్టికొట్టి
కడకాళ్లఁబట్టి ఘీంకారంబునేయంగ వీచి నల్గడఁ బాఱవైచివైచి
కింకిణీఘంటకపతాక కేతనప్ర । కరవరాస్త్ర శస్త్రాళి చామరనియుక్త
భీషణోదగ్ర మత్తకుంభివ్రజంబు । భీముఁ డవలీల నాభీల లీలఁగూల్చె. ౩౬.

వ. అయ్యవసరంబున.

చ. కొడుకువిధంబెఱింగి కనుగోనల నీరున విస్ఫులింగముల్
వడిఁగురియంగఁ బాండవబలంబు భయంపడిచూడ మారుఁడ
వ్వడముడిఁదాఁకి యార్చి యదువర్గము మెచ్చ గుణంబుమ్రోయఁగాఁ
బిడుగులవంటిబాణములఁ జెల్లుగనేయ నతండు నుగ్రుఁడై. ౩౭.

వ. ఆ శంబరాంతకుపైఁ గవిసి యంతకదండంబునుంబోలిన తన గదాదండంబున నతని వక్షస్స్థలం బుపలక్షించి వేసిన నవ్వీరుండు సోలి యాలోన మేలుకని విలయకాలుండునుంబోలె విజృంభించి విశిఖంబుల వెల్లి ముంచి మఱియు నొక్క ఘోరనారాచంబున నమ్మారుతకుమారు జత్రుదేశంబు గాడనేసిన నతండు మూర్ఛిల్లె నది గనుంగొని యాదవబలంబున సింహనాదంబులు చెలంగె నా భీముండు దెలి

వారించునంతకు ధృష్టద్యుమ్నుండు ప్రద్యుమ్ను నిందాఁకి పుంఖానుపుంఖంబులుగా నిశితశర పరంపరలు పరఁగించి యొక్క భల్లంబున నో నాటునేసిన నతండు పెడఁద మోపున నతని విల్లువిఱుగనేసిన నవ్వీరుండును వేరొక్క కోదండంబుఁగొని యమ్ముల దొరఁగించిన నవితోడనె తునియలై దొఱఁగునట్లుగా నేసి మఱియును.,

క. ప్రద్యుమ్నుఁడు దరిగా ధృ। ష్టద్యుమ్నుని నేసె నశనిసమసాయకముల్
ప్రద్యోతములై నిగిడి జ। యోద్యోగము హెచ్చఁ బార్థుయోధులు బెదరన్. ౪౧.

క. అవియెల్ల ప్రద్యుమ్ననందనుఁ। డవలీలం దూలనేసి యవ్వీరుని మూ
డు విషమశాతశరములే। సి వెగడుపఱచెను విరోధి సేనలు చెదరన్. ౪౨.

వ. పెండియు నా దండివగలు దమలో నొండొరులపై నిగిడించు నిష్ఠురకాండంబులచే సూతాశ్వచ్ఛత్రచామర ధ్వజసహితంబులుగా రథంబులుగూలిన విరథులై కృపాణంబులును ఖేటకంబులుం బూని మిక్కుటంబైన యుక్కున నొక్కరొక్కరుల లెక్కగొనక డాసియు వ్రేసియు వ్రేట్లకుం దప్పించి తప్పించియు బహువిధగతులం గొంతప్రొద్దు పోరునెడ దెఱపిగని యా ధృష్టద్యుమ్నుండును బ్రద్యుమ్ని శిరంబు హరించి సింహనాదంబుఁజేసిన యాదవసైన్యంబు దైన్యంబునొంది సల్లడలం బఱచినం జూచి శోకరోషంబులు మనంబునం బెనంగొన సాంబసారణాదు లెలుంగుఁజూపి తమ సేనకుం బెయిమీచి మరల్చితిరంబుచేసి ధృష్టద్యుమ్నాదులపై నురువడించిన నుభయసైనికులకుఁ బోరు ఘోరంబయ్యె నందు. ౪౩.

గీ. మేఘసంఘముల్ గూడి భూమీధరంబు। నంబుధారలచేఁ గప్పు ననువుదోఁప
నమ్మహావీరు లర్జును నాక్రమించి। శరపరంపరఁ గప్పిరి సాహసమున. ౪౪.

వ. పెండ్డియు. ౪౫.

సీ. చారుదేష్ణుఁడు శతసాయకంబుల నారిఁ ద్రెంచె సాంబుండు పదింట నిడము
జవ్వాడనేసెను సారణుం డేనుమార్గణముల శల్యనురంబుఁ గ్రుచ్చె
భానువిందుఁడు బృహద్భానువిందుఁడు భానుదేవుఁడు వృకుఁడుఁ జంద్రుఁడెండుదూపు
లఁ దురంగమములఁ గూలనాసర్వ నరుణ పుష్కరులు తచ్చక్రరక్షకుల నొంచి
రొక మొగిఁగలిసి వేదవాహుఁడు సునంద
నుండు శుకుఁడును దీప్తిమంతుండు నాది
యైన కృష్ణతనూభవు లతని మెదలఁ
గదలరాకుండ నేసి రాగ్రహమునిగుడ.

గీ. అప్పుడా సవ్యసాచియు హరకరాగ్ర। దీప్తశూలంబు గతిమించు దివ్యశరము
నారిసంధించివేసి నానావిధముల। నతివిచిత్రంబుగాఁ ద్రుంచె నారథికుల. ౪౬.

వ. ఇవ్విధంబున నర్జునుండు హరికుమారుల నిశ్శేషంబుగా వధియించిన దుర్యోధన
ప్రముఖయోధులు హతశేషబలంబును జలంబునఁ జంపిరంత నిట రామకృష్ణులు
సాత్యకి దారకులు సేయు శిశిరోపచారంబులవలన మూర్ఛందేఱి ఖండంబులైన
శుండాలంబులును నొరఁగిన తురంగంబులును బఱియలైన యరదంబులుం గూలిన
కాలుబలంబును గ్రుంగిన కుమారవర్గంబునుం గలిగి నిర్మనుష్యంబైన యాత్మ
సైన్యంబుఁ జూచి శోకవ్యాకులితమనస్కులై రయ్యవసరంబున. ౪౮.

సీ. సంవర్తకాండజ భాస్కరమండలంబునా నాస్యంబు భీకరంబై వెలుఁగఁ
గల్పాంత విస్ఫులింగంబు లొక్కుమ్మడినిగిడె నాఁ గన్నులనిప్పులురులఁ
బ్రళయకాలోగ్ర నిర్భర సింహనాదంబు నాఁ బాంచజన్యస్వనంబునిగుడఁ
గల్పాంతసమయ మేఘవ్రాత నిర్ఘోషమున శార్ఙ్గగుణరావమగ్గలింపఁ
బక్షిరిచ్ఛాయదిక్కులఁ బర్వుపన్న । గాశపతికేతు వభ్రంబునందుఁ గ్రాల
దానవధ్వంసి శత్రులు దల్లడిల్ల । రామసాత్యకు లిరువంక రాఁగనడచె. ౪౯.

వ. ఇవ్విధంబున రామసాత్యకి సమేతుండై కృష్ణుండు రాఁ జూచి భీష్మార్జునులు తమ
తమ బలంబులం బురికొల్పిన దూర్యస్వనంబులు చెలంగఁ జండభానుమండలంబునుం
బొదువు నీహారంబు విహారంబున దావపావక జ్వాలాజాలంబుపయిం జను శలభం
బుల విధంబున నొక్కుమ్మొగి నురువడించి యమ్మువ్వురపయి లెక్కకు నెక్కువయగు
నమ్ములం గప్పిన ముప్పిరిగొను రోషంబున. ౫౦.

పర్జన్యుఁ డమ్ములఁ బడఁగొట్టు వైఖరిఁ గుంజరంబుల నేలఁగూలఁదన్ని
గ్గూల ముద్ధతి సారంగములభంగి సైంధవంబుల బారిసమరిపై చి
పద్మములఁ ద్రుంచు కైవడి రథికుల గళముల్ లొక్కుమ్మడి నులిమివైచి
బలుగాడ్పుతరువుల ఫలములఁ సుల్చు బలువునఁ బదాతుల డొల్లఁగొట్టి
భీష్మునొప్పించి భీముని బెండుపఱచి । యర్జునుని మోఁది హైడింబు నదటడంచి
ద్రుపదనందను సారథిఁ ద్రుంచి రథము । చక్కుగావించి యార్చె ముసలధరుండు.

క. గొడుగులు గడువడిఁ ద్రుంప్రుచు । సిడములు గెడపుచును జోళ్లు చింపుచురథముల్
పొడిపొడి సేయుచు నమ్ముల । మడియించెన్ యోధుల మురమర్దనుఁ డువడిన్.

గీ. కరుల హరుల రథంబులఁ గాల్బలముల । రూపుమాపి చెలంగి మెఱుంగు మెఱసి
నట్లు డాయుచుఁ బాయుచు నాశినిప్రవరుఁడుఁ జెక్కుండ్రు రథికులవసుధఁ గూల్చె.

సీ. భూరిమదోత్కట పున్నాగ జాలనిదానంబు బహుల గంధర్వరవము
నిష్ఠురస్యందన నికరాలయము శతకుంత సహస్రవిశ్రాంతభూమి

యర్జున నకుల శల్య ద్రోణ నిలయంబు గాంగేయ భూదార ఖడ్గసీమ
శకుని పలాశ సంచయ నిత్యవాసంబు కమనీయ పుండరీకస్థలంబు
నగుచుఁ గనుపట్టు పార్థుసైన్యాటవులను । రామ కృష్ణ శినిప్రవర ప్రచండ
వీతిహోత్రత్రయం బుగ్రహేతులడరఁ। గాల్చె లోకంబులెల్ల నాకంపమొంద ౫౩.

వ. అయ్యవసరంబున నర్జునుండు కోపోద్దీపితమానసుండై రామసాత్యకులతోఁ దలపడి పోరుచుండం జూచి కృష్ణుం డమ్మొగ్గరంబుఁ గదియనేడ భీష్మ భీమనందన భూరిశ్రవ శ్శిఖండి ధృష్టద్యుమ్ను లడ్డంబు సొచ్చి సాయకాసారంబుల ముంచిన నతండును నవ్వీరవరుల నంపగమిం గప్పి నిశ్శేషితులఁగావించి మించి సూచీవ్యూహంబు ప్రవేశించి యచ్చట నెదురుపడు కేకయులపై నిశితశరానీకంబులు నిగిడించి వారలం గడచి చనునెడ సుదక్షిణుం డడ్డంబువచ్చిన నతని నొక్క నారాచంబునఁ జచ్చినట్లు యుండునట్లుగాఁ జేసి పోవునప్పుడు ధర్మనందనుండు గవలునుం దానునుఁ దాఁకిన నతని నాశుగసముదాయంబుల నొప్పినొందించి తద్బలంబు బడలుపడనడచి పద్మవ్యూహంబు డగ్గఱి పాంచజన్యం బొత్తిన. ౫౪.

సీ. ఆకృష్ణుఁ జూచి సైన్యంబు భీతిల్లి బెబ్బులిఁగన్న మృగములపోల్కిఁ బఱవ
నది చూచి యర్జునుఁ డాకుండి నీశ్వరుఁడటఁ జచ్చియుండునోయని తలంచి
తనతోడఁ బోరు సాత్యకి సీరపాణుల డించి తీవ్రమున నేతెంచి సేన
మగుడంగఁ బురికొల్పి బెగడు చతుర్థన జననాథుఁదేర్చి యా చక్రపాణిఁ
దాఁకి నిబిడాశుగంబుల తళ్లగురియ । నతఁడు నాతనిఁగప్పెఁ బేరంపసమితి
నంతనారామ శైనేయు లరుగుదెంచి । యా మురాంతకుఁగూడి రుద్ధాముకోం.

వ. ఇవ్విధంబున నాయిద్దఱు కృష్ణునిగూడి రంతకమున్న భీష్మాది యోధవీరుల దెంచి గాండీవిం గలసి యందఱు నొక్క పెట్టున నమ్మొగ్గరిపైఁ గవిసిన దారుణంబైన రణంబయ్యె నందు సాత్యకిం దలపడి ధృష్టద్యుమ్నుండు మగఁటిమిమీఱిన నయ్యిద్దఱు నన్యోన్యబాణఘట్టనల శతాంగ తురంగ సూత కేతు బాణాసన తనుత్రాణ శిరస్త్రంబులు ధరణిపయిం దొరఁగిన విరథులై నేలకు లంఘించి కుంతంబులు గాని పంతంబులు పలుకుచు బెబ్బులులనయంబున గంధసింధురంబుల చందంబున సింగంబులభంగిఁ బొంగి నింగివగుల నార్చుచుఁ బదాభిఘాతంబుల భూతలంబు చలింపఁ జిమ్మియుఁ గ్రుమ్మియు బహువిధగతులఁ బోరుచుండి రయ్యవసరంబున.

చ. కడువడిఁ బాఱుతేరు పదఘట్టన భూమివడంక మోమునం
బడిన గజంబులం జిదిమి పాముచు యోధుల నుగ్గుసేయుచున్

గడఁగిన రాముఁడాంచె బలగర్వమునన్ శరజాలమేసి యా
వ్యూహము డిప్పట్టి యక్షుఁడు వాని తురంగములన్ వధించినన్. ౫౯.

క. వెండియు ఘటోత్కచుం డు। ద్దండత బాణంబులేయఁ దలఁకక బలభ
ద్రుండు హలంబునఁ దత్కో। దండము రాఁదిగిచి విఱిచి తనువ్రేయుటయున్.

మ. కచభాగంబు రియాడి వెన్నెఱయ రక్తస్స్రావములొప్ప నే
ల చలింప న్మణిహార జాలములు రాల న్వ్యోమయానస్థులై
ఖచరుల్ గన్గొని నవ్వఁ జేలము విడంగా భీతుఁడై నా ఘటో
త్కచుఁ డేగెం దనతండ్రి చేరునకుఁ జిత్తంబు త్రలం బడఁగన్. ౬౦

వ. అప్పుడు కృష్ణుండు కుండిననాథుండగు చతుర్థునం జేగవచ్చిన ధనంజయుండు దేవదత్తంబు పూరించి నారిసవరించి యొక్క సారవంతంబగు సాయకంబున దారకు పేరురంబు దూఱనేసి హయమ్ముల రయమ్మున నొక్కొక్క యమ్మున నెమ్ములు ప్రీలునట్లుగాఁ జేసి సింహనాదంబు చేసినం గించి దరుణితలోచనుండై.

ఉ. పుష్కరలోచనుండు వసుపుంఖశరంబుల నాలిగింట ధా
నుష్కకులాగ్రగణ్యు నరు నొవ్వఁగ నేసి కడంగి దగ్గఱం
బుష్కరసంచరుల్ భయముఁ బొంది రతండును గోపగించి య
ప్పుష్కర రాజకేతనుని వేయిశరంబుల నేసె నత్తఱిన్. ౬౧.

సీ. భుగ్నభ్రూకుటి ఫాలభాగుఁడయి యంభోజాక్షుఁ డప్పార్థుపై
నాగ్నేయాశుగమేయ నాశరము బ్రహ్మాండంబు భేదిల్లఁగా
జ్వాల కరాళమై యరిగినం బ్రాణేశ్వరుఁ దత్సైన్యముల్
కర్షింపై నలువంకల న్వెతిగి వేవేగంబునన్ బాఱినన్. ౬౩.

వ. అప్పుడు. ౬౪.

శా. జంభారాతి తనూభవుండలిగి తచ్ఛస్త్రంబుపై నేసె సం
రంభం బొప్పఁగ వారుణాస్త్ర మది ఘోరంబై నభోవీథి నీ
లాంభోదంబులు నిండఁగప్పెఁ దిమిరం బంతంతకున్ బర్వి ని
కుంభుల్ మ్రొగ్గఁగ మ్రోయుచున్ భువన సంక్షోభంబు గావించుచున్. ౬౫.

మ. వనజాక్షుండును మంత్రపూర్వకముగా వాయవ్యబాణంబు నే
సినఁ జిత్రమ్ముగ దానిఁ ద్రుంచి కుధరశ్రేష్ఠంబులు ఱ్ఱాఁతగాఁ
గ నిలింపుల్ భయమొంద నల్వలు గలంగన్ భూమి గంపింప న
ర్జునుపై నత్యురుశీలవచ్చుటయు ధీరుండై యతం డుగ్రతన్. ౬౬.

క. నాగాస్త్రమేయ నదియుఁ। భోగి సహస్రములచేతఁ బొడవడఁచి మరు
ద్వేగం బంతటఁబోవక। యాగోవిందుం డెమల్ప నడరిన నతఁడున్. ౬౭.

సీ. కటుభయంకరలీల గరుడాస్త్రమేసిన నర్జునుండును దాని నైంద్రబాణ
మునఁ దుత్తుమురుఁజేసె వనజాక్షుఁ డలిగి రౌద్రాశుగంబు నిగిడ్చె ననిమిషేంద్ర
తనయుండు దానన దానివారించె యాదవనాయకుండు చిత్తమున నల్గి
బ్రహ్మాస్త్ర మురువడిఁబఱపిన ఫల్గుణుండును బ్రతిశరము లేకునికి వేగ
మడర బ్రహ్మాస్త్రమేయ నయ్యాశుగములు
నిగిడి యొండొంటిఁ దాఁకి వహ్నిచ్ఛటలముగఁ
జదలఁ బోరాడి తామ తాశాంతమయ్యె
నఖిలదేవత లాశ్చర్యమందిచూడ. ౬౮.

వ. అంత. ౬౯.

చ. ఒకగుఱిఁ జెక్కుచాపధరు లొక్కమొగిం దగులంగనేసిన
ట్లు కమలనేత్రుఁజుట్టికొని డాసి కురుప్రభువుండు భీష్ముఁడున్
నకులుఁడు కర్ణుఁడుం గృపుఁడు నాగపతాకుఁడు దుస్ససేనుఁడున్
శకునియు ధర్మజుండును నిశాతశరంబులనేసి రుగ్రతన్. ౭౦.

వ. మఱియు నశ్వత్థామయు సహదేవుండును ఘటోత్కచుండును శిఖండియు ధృష్ట
ద్యుమ్నుండును భగదత్తుండును నీలుండును సుదక్షిణుండును గేకయులును
విందానువిందులు నాదిగాఁగల సకలయోధులు చండకోదండంబుల బెండ్లుపడ నేసిన.

ఉ. అప్పుడు కృష్ణుఁడున్ మనమునం దుఁ జలింపక కుంభజాతునిన్
నిప్పులవంటిబాణముల నివ్వెఱఁగందఁగనేసె వారలు
న్నప్పురిగొన్నయట్టి చలమున్ బలమున్ గరువంబుమీఱఁగాఁ
గప్పిరి కేతనంబుఁ దురగంబుల సారథిమేన నమ్ములన్. ౭౧.

చ. అలుఁగులు దాఁకి కౌస్తుభమునందనలాగ్నికణంబులొలిమై
జలజలరాల నాభరణజాలము నుగ్గుగ దళ్లి జొళ్లలో
పలన తగంగ మేన్దరలఁ బాఱఁగ రక్తము గ్రమ్మి జాఱఁ దూ
పులు నిగిడించి చేదివిభు భూమిపయిం బడనేసి యార్చినన్. ౭౨

సీ. పరిపూర్ణ చంద్రబింబ సముజ్జ్వలాస్యంబు ప్రళయకాలానల ప్రభలనీన
శారదచంద్రికా సమకటాక్షంబులు గల్పాంత సమయాగ్నికణములుమియఁ
బుష్పచాపోల్లసద్భ్రూమండలము భూపజాత నాశక ధూమకేతువుగను
దందశూకాధీశతుందిల దోర్దండమండలి దండప్రచండముగను

గుంభినీధ్రంబులూఁగ దిక్కుంభివరులు । మఱుఁగ నబ్బుగఁ గలఁగ నంభోజహితుఁడు
ద్రోవదప్పంగ దేవతల్ దాఁటుపడఁగ । రాక్షసారాతి ఘోరచక్రంబుఁ దాల్చె.

వ. అప్పుడు. ౭౫.

శా. రక్షోనాయక కంఠరక్తయుత ధారాశోణితాభీల్ దినా
ధ్యక్షాంశుప్రకరంబు నుద్ధతిఁ దిరోధానంబు సేయంగ భూమిక్షి భృ
త్పక్షచ్ఛేదన దక్షఘోరసుర రాడ్దంభోళి కోటిప్రభా
వాక్షీణంబగు చక్ర మాక్షణము దైత్యారాతిచే నిల్చినన్. ౭౬.

క. కరచక్రముఁ జూచి యుధి । ష్ఠిరు నెక్కుడుఁ గాచి నిఖిలసేనాధరణీ
వర నర చతుర్ధనులఁ జెం । ది రమ్మని హరిగనలివడిఁ బ్రయోగించెన్. ౭౭.

గీ. మన్నుమిన్నును నేకమై మంటలెగయఁ । జక్రమే తేరఁగాఁ జూచి సవ్యసాచి
యున్నయత్నంబులన్నియు నుడిగి యాచ । తుర్ధనునిఁ దన వెనుకకుఁ ద్రోచి నిలిచె.

మ. ఘననిర్ఘోషసమానరావ మడరంగాఁ జక్రమేతెంచి కుం
డిన భూనాథున కడ్డమై నిలుచు గాండీవిన్ హరించెన్ జతు
ర్థను కంఠంబును ద్రెక్కునన్ దునిమె దుర్గాధీశ నీరేజజా
త నిలింపాధిపు లాత్మభీతిలఁగ భూతవ్రాతము ల్బెగ్గిలన్. ౭౯.

చ. నరునిశిరంబు కేశవ వినాయకకేతన చక్రి దైత్యసం
హర పరమాత్మ మాధవ మురారి సరోరుహపత్రనేత్ర భూ
ధరధర యిందిరారమణ దానవవైరి యటంచుఁ బల్కుచున్
ధరపయిఁ వ్రాలె నంతట సుదర్శన ముగ్రతమీశు ద్రెళ్ళిడిన్. ౮౦.

సీ. గాంగేయ కుంభజ కర్ణ దుర్యోధనాశ్వత్థామ శల్యుల సంహరించి
మాద్రేయ కృప హిడింబతనూజవర జగత్ప్రాణసంజాతుల బారిసమితి
సింధుభూవరు దుస్ససేను ధృష్టద్యుమ్న రుక్మి శిఖండుల రూపుమాపి
కేకయాధిప సుదక్షిణ నీల భగదత్త విందానువిందుల వెల్లిఁబుచ్చి
పాండ్య సౌబల యవన భూపాల ధృష్ట । కేతు బాహ్లీకపౌత్రులఁ గీటడంచి
యుత్తమౌజు యుధామన్యు నుర్విఁగూల్చి । మఱియుఁ దక్కిన శూరులమారిమసఁగి.

వ. ఇవ్విధంబున సంవర్తసమయ సముజ్జృంభమాణ కుంభీనస రాజకటక చటులనిటల
తట శిఖిశిఖాసంకాశజ్వాలంబై ప్రళయకాల ప్రచండ మార్తాండమండల విడంబిత
విస్ఫులింగ భయంకరంబై కల్పాంత ప్రవర్ధమాన బృహద్భాను జిహ్వాసంహతి
దుర్నిరీక్షంబై పుష్కలావర్తకాది మహాంభోధర సంభూత నిర్ఘాత జాల బంధుర
ధ్వానానూనస్వానముఖరిత బ్రహ్మాండంబై కాలకూటంబు లీల సంస్పృష్ట రాజ

శేఖరగరకరంబై బడబానలంబు చందంబున నపహృతవాహినీనాథ జీవనంబై భగవదవతారంబు చెలువున సంస్థాపితధర్ముండై పాటితరక్షశ్చక్రంబగు చక్రం బాక్రమించినఁ దత్సైన్యంబునం గెడయు రథంబులును డొల్లు మాతంగంబులును ద్రెళ్లు తురంగంబులును నొరలు సవారులును రాలిన నరదంబులును జెదిసిన శిరంబులును దునిఁగిన మెడలును బెనఁగిన తొడలును బగిలిన ఱొమ్ములును నలిగిన కొమ్ములును దరలు ఖేడెలును నొరలు కండలును జూర్ణంబులైన గొడుగులును విశీర్ణంబులైన పడగలును నుగ్గైన నానావిధ శస్త్రంబులును దుత్తుమురైన తనుత్రాణ శిరస్త్రాణంబులును గూడి నెత్తురుటేరులం గలసి పఱచెనంబు. ౨౧

సీ. కీలాలవాహినీజాలంబు ప్రవహింప నందంద వడి నోలలాడుఁ గొన్ని
తెగగలమాంసంబు తెట్టెలు దిట్టలై వేడుకఁగని పాతులాడుఁ గొన్ని
గజమస్తకంబు లక్కజముగాఁ జేపట్టి యచ్చనగండ్లుగా నాడుఁ గొన్ని
సమరోర్విఁబడియున్న శస్త్రఖండంబుల ననువుమీఱఁగ వేటులాడుఁగొన్ని
భూమిపాలక భూషణంబులుధరించి । మెఱసి దమవారిముందట మఱియుఁగొన్ని
యివ్విధంబున భూతంబు లెసక మెసఁగఁ । గ్రీడసల్పుచుఁ జనియెఁ గిరీటితనయ.

వ. ఇవ్విధంబునఁ భూతంబులు దిరుగ నంతకమున్న తనబలంబు సుదర్శన నివృత్తం బగుట ధర్మనందనుం డెఱింగినవాఁడు గావునఁ గురు పితామహజ్ఞాతి బంధు మిత్రామాత్యుల నానాదేశాగత రాజన్యులం గనుంగొనియెడువాఁడై రథంబుడిగ్గి వచ్చి గాంగేయుం గనుంగొని మూర్ఛంజెంది కొంత తడవునకుం దెలిసి కన్నీరు దొరుఁగ నతని పాదంబులపై వ్రాలి యిట్లనియె. ౨౨

గీ. అనఘ స్వచ్ఛంద మరణుండ వవనిఁ గల్గు । మగలకెల్లను మగఁడనఁ బొగడనెగడు
పరశురాముని గెల్చిన బాహుబలుఁడ । వైన నీవును బొలిసితే మంచు విధిని. ౨౩

వ. అని శోకించి యచ్చటఁ బాసి గురుకృపాశ్వత్థామ కర్ణ దుర్యోధనాదులం జూచుచు నేగి యొక్కచో నిల్చి యందఱం దలంచి యిట్లనియె. ౨౪

సీ. సంగరోగ్రులు దివ్యశస్త్రాస్త్ర నిపుణులు గురుకృపాశ్వత్థామ లరిదిమగలు
ప్రకటదోర్బ్బలులు బాహ్లిక సోమదత్త భూరిశ్రవుల్ విపులకీర్తిప్రతాపు
లభియాతి శైలజంభారులు గర్ణ దుర్యోధన శకుని శల్యులు దలంప
మార్తాండతేజులు మత్స్యకేకయ పాండ్య పాంచాలదేశాధిపతులు మఱియు
నఖిల విశ్వంభరాధ్యుల కధికు లిట్టి । వారలునువచ్చి చచ్చిరి పోర నా ని
మిత్తమయి యీయఘంబు నేమిటనడంగు । దైవమా యని చింతించుఁ దల్లడించు.

వ. ఇవ్విధంబునఁగొంతప్రొద్దుదుఃఖించి యనంతరంబ యచ్చోటు వాసి ముందఱం బరశు పట్టిస ప్రాస ముద్గర తోమర గదా శూల భిండివాల కరవాలాది నానాయుధ శకలంబులపై నవయవభేదంబు తెలియంగరాక కూలిన కాల్బలంబులకు నెడగలిగి పోవుచుఁ గేతన చ్ఛత్రచామర ధనుర్బాణ రథ తురంగ సారథిసమేతంబుగా సమసిన రథికవరులకు నీసడింపుచు రాహుత్తసహితంబుగాఁ గుప్పలుగొనఁబడిన గుఱ్ఱపుఁదిట్టలకు నోసరిల్లుచు మావంతులతోడం బీనుంగులైన యేనుంగులకు నోహటింపుచుఁ జని యచ్చట భీమసేనునిఁ దద్వామ దక్షిణపార్శ్వంబులఁ ద్రెళ్లిన కవలనుం గని యొల్లంబోయిన యుల్లంబున మూర్ఛిల్లి యొట్టకేలకుం దెలిసి పేరుపేరున నట్లని విలపింపందొడంగె.

సీ. దుర్యోధనుండు బద్ధునిఁ జేసి ముంప నానదినుండి వచ్చిన నాఁటి శక్తి
మహ్మలాక్షా నివాసమ్మునఁ గీడు చెందకయుండఁ దెచ్చిన నాఁటిశక్తి
వనమధ్యమున హిడింబుని యుద్ధమునను బ్రాణములను గొన్నట్టి నాఁటి పెంపు
నంతిపురిజనులంత సంతోషింప బకునిఁ జంపినయట్టి బాహువీర్య
మెవ్విధంబున మడఁగె నేఁడెచటికేగె। నేతెఱంగున డాగె నేఁడెచటనడఁగె
హా మదేభాయుతప్రాణ హా గదాప్ర। వీణ హా వీర హా జగత్ప్రాణతనయ. ౯౧

గీ. నకుల సహదేవులార భండనపటిష్ఠు। లార సౌందర్యలక్ష్మీకుమారులార
పోయితిరె మీరు నేఁడు నాపొందువిడిచి। యంచు విలపించు నలుదిక్కులాలకించు.

గీ. మఱియు భీమాత్మసంభవు మానసమునఁ। దలఁచి యంతంత కార్తనాదంబు నిగుడ
నేడ్చె నదివిని భూతంబులెల్ల నడరె। మృగసమూహంబు పక్షులు మేఁతలుడిగె.

వ. ఇవ్విధంబున రోదనంబుచేయుచుఁ గొన్నియడుగులు నడచి చతుర్థునుం గనుంగొని పుడమికిం బడి యిట్లనియె. ౯౨

క. నినుఁ గావఁ బూని యర్జునుఁ। డనిఁ దన శౌర్యంబు వెలిపి హరిచేఁదగఁ గుం
డిననాథ యిట్టిభాగ్యము। గనఁజాలఁగనయ్యె నెంత కలుషాత్ముఁడనో. ౯౩

వ. అని నివ్వెఱపడి నిట్టూర్పునిగిడించి తత్పురోభాగంబున నర్జునుని నతనిముందఱనున్న శల్యుని నతని పార్శ్వంబులఁ గూలిన యుత్తమౌజ యుధామన్యులను దేఱిచూచి దుఃఖాక్రాంతస్వాంతుండై యాదండఁబడియున్న యన్నరుకళేబరంబుడగ్గఱంజని తచ్ఛరీరంబు తన యంకతలంబునఁ బెట్టుకొని నెమ్మనంబునం గ్రమ్మిన యుమ్మలికంబు వెంపున రిమ్మగొని సొమ్మసిలి యమ్మహీతలంబునంబడి పెద్దదడవునకుఁ గ్రమ్మఱఁ దెలివొంది కన్నీరుదొరుఁగ నిట్లనియె.

సీ. ద్రోణుశాసనమున ద్రుపదుఁ దెచ్చినయట్టి నీభుజావిభవంబు నేఁడడంగె
నంగారపర్ణుని భంగపెట్టినయట్టి నీదివ్యశక్తి దా నేఁడడంగె
దారుణమత్స్యయంత్రంబేసిమించిన నీ శరాసనదీప్తి నేఁడడంగెఁ
బాంచాలికై మహీపాలురఁ గెల్చిన నీవిక్రమస్ఫూర్తి నేఁడడంగె
హా సరోజాతవైరికులావతంస । హా జితోద్దండపరిపంథిరాజహంస
హా మహాశౌర్య హా సురాహార్యధైర్య । హా జయద్వీర హా హరిహయకుమార. ౯౫.

వ. అని తలఁచి రోదనంబుసేయుచున్న నమ్మేదినీనాథు దైన్యాలాపంబులు విని బలభద్ర
సాత్యకులు కృష్ణునిపాలికిం జని సాంత్వనవచనంబుల నిట్లనిరి. ౯౬.

చ. వనజదళాక్ష యింద్రసుతు వాహినిఁ గాల్చినపోటిలో మెఱుం
గొనరు తెఱంగునన్ నిలిచి కుంచుచు నొక్కఁడు విన్నవారికి
న్మనమెరియంగ బాంధవసమాజము మాటికిఁ బేరుగ్రుచ్చి యొ
క్కనిఁ దనమ్రోలఁ బెట్టుకొని గద్గదకంఠముమీఱ నేడ్చుచున్. ౯౭.

వ. నీచక్రంబునకుఁ దప్పియున్నవాఁ డెవ్వఁడో దెలియఁడు. ౯౮.

క. అని చూడుమనిన వారల । కనియెన్ దనుజారి యేడ్చునాతఁడు యమనం
దనుఁడు ధనంజయ శిరమది । మనమరుగుద మతని యడలు మాన్పఁగవలయున్.

వ. అని యా సంకర్షణ సాత్యకులుం దాను రథారూఢులై కదలి యాత్మసేనా
మధ్యంబున మాతంగ తురంగాది చతురంగబలసమేతులై భూతలంబునం బడిన
ప్రద్యుమ్న సాంబ సారణాదికుమారుల ననిరుద్ధ యుద్ధవాక్రూర చేకితాన కృతవర్మ
గదాది యాదవవీరులం గనుంగొనుచు శోకవ్యాకులితమనస్కులై చని పాండవ
బలంబు దఱియంబోవుచుఁ గృష్ణుండు వారల కిట్లనియె.

సీ. ఇతఁడు గంగాసూనుఁ డీతఁడు కుంభజుఁ డీతఁ డశ్వత్థామ యితఁడు కృపుఁడు
యీతఁడు రాధేయుఁ డీతఁడు సైంధవుఁ డితఁడు దుర్యోధనుఁ డితఁడు ద్రుపదుఁ
డితఁడు ధృష్టద్యుమ్నుఁ డితఁడు శిఖండి యితఁడు పాండ్యనాథుఁ డితఁడు విరాటుఁ
డీతఁడు హైడింబుఁ డీతఁడు భగదత్తుఁ డితఁడు సుదక్షిణుఁ డితఁడు నీలుఁ
డితఁడు కాంభోజనాయకుం డితఁడు యవనుఁ
డితఁడు శిశుపాలనందనుం డితఁడు రుక్మి
యితఁడు వడముడి యితఁడు బాహ్లికసుతుండు
ఈతఁడు తదాత్మసంభవుఁ డితఁడు శకుని. ౧౦౧.

వ. అని మఱియు నకుల సహదేవాదులఁ బేరు పేరం జెప్పుచుఁ బాడఱియున్న పార్థు
తేఱు చేరం జని రథంబు డగ్గఱ నిలిపిన. ౧౦౨.

చ. తనతొడమీఁదనున్న విబుధప్రవరాత్మజు నుత్తమాంగ మా
యన యురదంబుమీఁద నిడి యా హరిపాదములందు వ్రాలి లో
చనముల నశ్రుపూరము వెసన్ బ్రవహింపఁగ దీనభావ మా
ననమున నంకురింప యమనందనుఁ డాతనితోడ నిట్లనున్. ౧౦౩.

గీ. అఖిలభూతసముఁడవు నపవర్గదాయకుం । డంబుజాతనేత్రుఁడనుచుఁ బలుకు
మాటదప్పకుండ మాధవా ననుఁ జక్ర । కోటిఁద్రుంచి వీరిఁ గూడనంపు. ౧౦౪.

వ. అనిన బలభద్ర సాత్యకి సమేతుండై యప్పద్మలోచనుండు నట్లు పరిదేవనం
బొనర్చి తనకుఁ దానయియాఁడిల్లి యతని నూఱార్చుచుండ వెండియు నతండిట్లనియె.

ఉ. తమ్ముఁడు రాజులుం దెగినదానికి నీగతి నిల్వలేక శో
కమ్మున నుంటగాదు తనుఁగావుమటంచుఁ జతుర్థనుండు త్రా
సమ్మున నన్నుఁ జేరె మనుజప్రభుఁడంచును నిట్టివానిఁ జ
క్రమ్మున కప్పగించి తిఁకఁ బ్రాణము లేటికినాకు మాధవా. ౧౦౬.

క. అని కరుణపుట్టఁబల్కెడు । మనుజేంద్రునిమీఁదఁ గృపనమర్చినచూడ్కుల్
కొనసాగనిచి హస్తం । బున నిమిరి యతనికపుడు విభుం డిట్లనియెన్. ౧౦౭.

ఉ. ఇంత దలంకనేల ధరణీశ్వర యీ రణభూమిఁబడ్డ భూ
కాంతులలోన నొక్కరుని గ్రక్కున నిచ్చెద వేఁడుమన్న నా
యంతక నందనుండు వినయంబున హస్తయుగంబు మోడ్చి దై
త్యాంతక యీ చతుర్థ నృపాగ్రణి నిమ్మన నాతఁ డిట్లనున్. ౧౦౮.

క. గురుకృప భీష్మాశ్వత్థా । మ రాజరాడ్భానుపార్థ మాద్రేయ దివా
కరసుత ఘటోత్కచాదులు । హరివిక్రములుండ నితని నడుగఁగనేలా. ౧౦౯.

వ. అనవుడు ధర్మనందనుండు కృష్ణున కిట్లనియె. ౧౧౦.

సీ. సకలరాజన్య చారుకిరీట ఘృష్టపాదద్వంద్వుఁడగు సుయోధనునికంటె
మత్తారణసములు భీమప్రతాపులునైన మరుదుద్భవాది సోదరులకంటె
బలవంతులగు మత్స్య పాంచాల కేకయ పాండ్యాది విశ్వభూపతులకంటె
గిష్ఠుఁడగు మఱంది ధృష్టద్యుమ్నునికంటె ఘనబలుండగు ఘటోత్కచునికంటె
గిష్ఠుఁడైనట్టి కుండినాధీశునిమ్ము । చాలు నిదియె సమస్తవిశ్వంభరాధి
పత్యమిచ్చుట యేరికిఁ బడయరాని । బ్రహ్మపదము నొసంగుట పద్మనాభ. ౧౧౧.

వ. అనవుడు నప్పరమేశ్వరుం డిట్లని యానతిచ్చె. ౧౧౨.

గీ. సర్వభూతదయాపర సత్యసంధ । రాజపూజితపదపద్మ రాజతనయ
శోభనాకార నీచిత్తశుద్ధికాత్మఁ । జాలమెచ్చితిఁ గుండినేశ్వరునితోడ. ౧౧౩.

క. జీవించుఁగాత మత్కృప । జీవాతువుగాఁగ నుభయసేనలు నిపుడీ
దేవాధిప శంకర వా। ణీవల్లభు లాత్మలోన నివ్వెఱఁగందన్. ౧౧౪.

గీ. అని యతండుపల్క నఖిలజనంబును ౹ మిగుల నిదురఁబోయి మేలుకొన్న
చెలువ మాచరింపఁ జెక్కు చెమర్పక । లేచెనపుడు సవ్యసాచితనయ. ౧౧౫.

వ. అంత. ౧౧౬.

క. నరనాథాగ్రణి వినుమా । బరవసమునఁ జచ్చుటయును బ్రతుకుటయు మదిన్
బరికింపక రోషంబున । దురమునకును నుభయబలముఁ దొడరుటయు నంతన్.

క. హలధరుఁడు ధర్మజుండును । బలమున కడ్డంబువచ్చి బ్రతికిన చందం
బుల విప్పిచెప్పఁ దిరిగెన్ । నలినాక్షుని మహిమఁ దమ మనములఁ బొగడుచున్.

వ. ఇవ్విధంబున నజాతశత్రునకుఁ బ్రియంబుగా నుభయసైన్యంబులకుఁ బ్రాణంబు లొసంగిన సకలలోకాధ్యక్షుండగు పుండరీకాక్షుని యక్షీణప్రభావంబునకు నమందానంద కందళిత హృదయులై పురందరాది బృందారకులు మందారాభినవ ప్రసూనవర్షంబులు గురియించిరి సిద్ధవిద్యాధరులును గిన్నర కింపురుషాప్సరోజనంబులును గీత నృత్యవాద్యంబుల సంతసించి రట్టియెడ సుయోధనాది ధార్తరాష్ట్రులును యుధిష్ఠిరాది పాండవేయులును ద్రుపదవిరాటాది నానాధీశ్వరులును గాంగేయుండును మున్నుగాఁ దమతమ సైన్యంబులుగొలువ నరుగుదెంచి రథంబులు డిగ్గి యద్దేవునకుఁ గృతప్రణాములై నిలిచిరాయనంతరంబ విజ్ఞాననిధియగు నాదేవవ్రతుండు కృతాంజలియై యిట్లని స్తుతించె. ౧౧౭.

దండకము. శ్రీకామినీ మానసాంభోజమిత్రా దళత్పద్మనేత్రా రిపువ్రాతజైత్రా ముని స్తోత్రపాత్రా సదానందయోగీంద్ర సన్మానసారామచైత్రా మహాఘౌఘవల్లీలవిత్రా జగజ్జాలరక్షావిధాదక్షదక్షాత్మజానాథవంద్యా సముద్రంబులన్ బుద్బుదవ్రాతముద్భూతమైపొల్చి తన్నీరమధ్యంబునన్ లీనమైపోవురీతిన్ సరోజాతగర్భాండముల్ నీప్రభావంబుచే నుద్భవించున్ జెలంగున్ మడంగున్ ముకుందా భవద్రోమకూపంబులం దత్సయోజాతగర్భాండ సంఘంబు వాతాయనాయాత యాతాణుజాతంబునన్ బొల్చునందొక్క బ్రహ్మాండమధ్యంబునన్ రాజసుల్ తామసుల్ సోమరుద్రాజముఖ్యుల్ జగన్నాయకా తావకానంద కళ్యాణ లీలాగుణశ్రేణిలో నొక్కఁడైనన్ యథార్థంబుగా బుద్ధినీక్షించి వర్తింపఁగా శక్తుఁడే భక్తవశ్యా పయఃపూరసంపూరితానేక కుంభాంతరద్యోతమానేందు బింబాకృతిన్ బెక్కు దేహంబులందాల్చియున్ భిన్నమార్గంబులందోఁచినీవద్వితీయుండవైయుండు

దీశా భుజాచక్రధారావినిర్భిన్నరక్షఃకులాధ్యక్షకంఠా నృకంఠీరవా మేదినీ
నీరతేజోనభస్వద్వియత్స్వాంత చిద్బుద్ధ్యహంకార సంఘంబుచే నీప్రపం
చంబు గావించి తద్వ్యాధసూక్ష్మాకృతింబొల్చు దేహంబుల న్నిత్యపూర్ణుండవై
యుండియుం దచ్ఛరీరస్థజీవాకృతిన్ నీవిశేషంబు చింతింపఁ గామినీపుత్ర
హేమాది సంపద్విశేషంబులం బొక్కి నిక్కంబు గా నమ్మి నెమ్మిన్ భవత్పాద
పంకేరుహధ్యానముల్ మాని గర్వంబునం బర్వి మూఢాత్ములై చచ్చుచుం
బుట్టుచున్ సద్గతిం గాన రంభోజసద్మాధిపా యందులోఁ గొంద ఱత్యంత
యుక్తాత్ములై సుందరీనందనస్వర్ణసంఘంబులన్ రోసి కాంతారముం జేరి
యాధారలింగస్ఫురన్నాభి హృత్తాలు మూలాదికాధోముఖవ్యాప్తచక్రం
బులన్ సంతతాభ్యాసలీలాపటుత్వంబునన్ స్మీఁచుగాఁ ద్రిప్పి యాధారశక్తిం
బ్రకాశింపఁగాఁ జేసి బాహ్యేంద్రియద్వారముల్ మూసి వాతాగ్నులం
గూర్చియు న్మధ్యమార్గంబుచే నూర్ధ్వసంచారులై మీఱఁగాఁ జేయుచుం
జిత్సుధాపాన కేళీరతిం జెందుచున్ నిన్ను నానందరూపంబుగాఁ జూతు
రాజన్మశుద్ధాత్ములై కొంద ఱార్యుల్ మదింగామ్యకర్మంబులన్ మానియే దేవతా
భక్తియున్నించి యేమంత్రసంసక్తియున్ లేక దంభంబుఁ గామంబు లోభంబు
క్రోధంబు మోహంబు మాత్సర్యమున్ దవ్వుగాఁ ద్రోలి నీచిహ్నముల్ బాహు
యుగ్మంబులం బూని నీదాసభావంబు నిక్కంబుగా నాత్మలోఁ బుట్టి నీనామ
సంకీర్తనల్ జిహ్వఁ గీలించి నీపాదతీర్థంబు నిత్యంబు నుం గ్రోలి నీభుక్తశేషంబు
భక్షించి నీదాసవర్గంబుతోఁ గూడి క్రీడించి సత్కర్మముల్ నీకు సంప్రీతిగాఁ
జేయుచున్ ధన్యులై మించి నీసన్నిధానంబునం దెప్డు సౌఖ్యంబుతో నుందు
రంభోధిశాయీ సరోజాతగర్భ స్వచిత్రంబుగా మూర్ఛ నొందించి
తద్వక్త్రపద్మస్థవేదంబులం గొన్న విన్నాణి యున్నట్టి యంభోధిలోఁ జొచ్చి
దాఁగున్న యాసోమకుం బోర మీనాకృతిం బట్టి కట్టల్కతోఁ జంపి యా
వేదముల్ బ్రహ్మ మోదంబునం బొందఁగా నియ్యవే దుగ్ధవారాశి మధ్యంబునన్
మందరాగంబు మీఱంగఁ గవ్వంబుగాఁ జేసి భోగీశ్వరుం ద్రాడుగాఁ జుట్టి
దేవాసురుల్ మచ్చరం బెచ్చఁగాఁ ద్రచ్చుభో నగ్గిరీంద్రంబు పాథోధిలోఁ
గ్రుంగినం గచ్ఛపస్వచ్ఛరూపంబునం దద్ధరం బుద్ధరింపన్ ధరన్ మోసి
దేవారికిం బ్రాపుగావింపవే యూధరామండలం బెల్ల నుద్దండకేళిన్ హిర
ణ్యాక్షుఁ డక్షీణదోర్వక్రమారంభుఁడై చాపచందంబునం జుట్టి పాతాళలోకం
బున న్నిల్చినన్ ఘోరదంష్ట్రికరాళోగ్ర భూదార లీలావతారంబున న్వైరి

హైతేయునిం ద్రుంచి చెండాడి సర్వంసహాకామినిం గొమ్మన న్నిమ్మితో నెత్తవే
మత్తవేదండరీతిన్ మదోద్రిక్తుఁడై యుగ్రదైత్యుండు పుత్రుంబరీక్షించి
నీదేవునిన్ స్తంభమధ్యంబునం జూపుమాయంచుఁ దా నుక్కుకంబంబు
వ్రేయన్ మహాక్రోధరంహంబునన్ శ్రీనృసింహాకృతిం బొల్చి యద్దానవేంద్రున్
నఖాగ్రంబులన్ జీఱవే మీఱి లోకత్రయిం బాదపద్మంబుల న్మెట్టి యవ్వైరిని
న్నాగలోకంబులోఁ జేర్పవే సర్వరాజన్యకంఠావలిం జండబాహాకుఠారో
గ్రధారన్ వడిన్ జామదగ్న్యుండవై చంపవే పెంపుమీఱ న్నిలింపారియైనట్టి
యాలోకవిద్రావణు న్నిర్జితై రావణున్ రావణుం బుత్రమిత్రాదియుక్తం
బుగా భానువంశాబ్ధి రాకాసుధాంశుండవై ద్రుంచవే బాహుశక్తిన్ బ్రలం
బాది దుష్టాత్ములం గొట్టి కాళింది నుద్దండలీలన్ విభేదింపవే రౌహిణేయుండవై
దానవుల్ భీకరాకారులై లోకజాలంబులన్ బాధగావింపఁగా వారినిర్బం
ధులంగా మహాశైలకోదండుచే బిట్టుగెల్పింపవే మించవే కల్కిరూపంబునన్
దేవ నీమోము దిక్పాలురున్ వహ్నియున్ నేత్రముల్ చంద్రసూర్యుల్ శ్రుతుల్
దిక్కులున్ భూమి గర్భంబు స్వేదంబు పాథోధులుచ్ఛ్వాసనిశ్వాసముల్
వాయువుల్ శైలముల్ శల్యముల్ రోమముల్ వృక్షముల్ నాభి యభ్రంబు
శీర్షంబు స్వర్గంబు భార్యల్ ధరిత్రీరమాకామినుల్ పార్శ్వయుగ్మం
బహోరాత్రముల్ గాఁగ విశ్వాత్ముఁడై పొల్చు నీమోమునన్ బ్రాహ్మణుల్
బాహులన్ రాజు లూరుప్రదేశంబునన్ వైశ్యు లంఘ్రిద్వయిన్ శూద్రులుం
బుట్టిన న్వారికిన్ ధర్మమార్గప్రదేశంబుగా వేదశాస్త్రమ్ములం జేసితా
యీశ్వరా నిన్ను న్నుతింపంగ నేనెంతవాఁడన్ జడుండన్ మహాహీన
చిత్తుండ మత్తుండ నన్నుం గటాక్షింపుమీ భక్తమందార వేదాంతసంచార
భవ్యప్రకారా నమస్తే నమస్తే నమః.

వ. అని బహుప్రకారంబుల వినుతించు నప్పరమభాగవతోత్తము నయ్యాదవనాయ
కుండు మృదుమధురభాషణంబుల నాదరించి ధర్మజ భీమ దుర్యోధనాదులను
సకలరాజన్యులం దత్తదుచితప్రకారంబుల సంభావించి చిన్నవోయియున్న యర్జునుని
జేరందిగిచి యాలింగనంబుఁ జేసి హృదయానందంబు గావించి చరణంబుల కెరఁగిన
చతుర్థుని మన్నించి గాంగేయాదుల ద్వారకానగరంబునకు రానియమించి
తత్తన్నివాసంబుల కనిచి బలభద్రుండును దానును జతురంగబల పరివృతులై
నిజస్కంధావారంబునకుం జని యథోచితంబుగా నుండి యమ్మఱునాఁ డుభయ
సైన్యంబులుగొలువ ద్వారకానగరంబునకుం జను నవసరంబున. ౧౨౦.

మ. బలముల్మందరఁ గాంచెఁ గాంచనమయప్రాసాద హర్మ్యాగ్ర ని
ర్మల గంధోత్కటకుంభ ధిక్కృత నభోమధ్యజ్వలత్తారకల్
లలితారామ సదార్త్ర పల్లవలతాంత ప్రోల్లసత్కోరకల్
కలుషాంభోనిధి తారకల్ భటసమగ్రద్వారకల్ ద్వారకల్. ౧౨౧.

సీ. భవ్యప్రవాళసంబద్ధమందిరరోచు లుభయసంధ్యారక్తి నోటుపఱప
హరినీలమాణిక్య హర్మ్యాగ్రశోభలు శ్యామతఃపాతమ స్తతిజయింపఁ
జారువజ్రాంచితసౌధ శృంగద్యుతుల్. పండువెన్నెలతోడ మెండుకొనఁగఁ
బద్మాహితోపల ప్రాసాదకాంతులు చండభానుప్రభ జోకఁ జేయ
సంజకవలివి కృష్ణపక్షత్రియామ । లివ్వి శుక్లనిశీథినులివ్వి దినము
లివ్వియని బుద్ధిలోపల నేర్పరింపఁ । బద్మగర్భుండు నేరఁ డప్పట్టణమున. ౧౨౨.

సీ. అనవద్య వేదవేదాంగశాస్త్రాంభోజగర్భోరగేంద్రులై గణనకెక్కి
యధిక కోదండవిద్యాభీమ భార్గవరామ దాశరథులై రాశికెక్కి
(యమిత నవనిధానసముపార్జనాత్యంతపటిమ కుబేరులై వన్నెకెక్కి)
రణరంగ రిపు సంహరణక్రియా జంభారి బలభద్రులై చాలఁ బ్రణుతికెక్కి
యజ్ఞములొనర్చి శత్రుల నదటడంచి । పృథివి జీవనమునమించి విప్రసేవఁ
జేసి చెలఁగుదు రప్పురసీమ ధరణి । సురలు రాజులు వైశ్యులు శూద్రవర్యులు.

క. నిరుపమ సుధామయములై । పరమోన్నతిఁ జెంది మధ్యభాగవినీల
స్ఫురదురు చిహ్నంబులచే । సరసతహర్మ్యములు చంద్రసామ్యము దాల్చెన్. ౧౨౪.

సీ. కరికుంభములఁబోలి కందుకంబుల నేలు నున్ననివట్రువ చన్నులమరఁ
గలువ తేకులమీఱి జలచరంబులఁ గేరు తిన్నని నిడువాలుఁగన్నులమర
నళుల కైవడిఁ బొల్చి హరినీలముల గెల్చు కప్పన గిరికొను కొప్పులమరఁ
గుందనంబు హరించి క్రొమ్మెఱుంగులమించు మేలిమిఁ దగు నును మేనులమర
మెలఁగుదురు ముద్దుఁబలుకులు దొలఁకుకలికి
మొలక నగవుల వెన్నెల తళుకుచిలుక
నలరుదురు లీల రతిపతినైన మిగుల
వలవఁగాఁ జేయనేర్చిన వారసతులు. ౧౨౫.

చ. ప్రవిమలలీల దర్పక విరాజితకేళి మహీధరాగ్ర వ
జ్రవిపులపద్మరాగరుచిజాలము లెల్లపుడున్ జెలంగుచుం
గువలయ పద్మసంహతులకున్ మదిహెచ్చును గుందులేని యు
త్సవ మొనరింప డెందమున సంశయమంది కృశించె జక్కవల్. ౧౨౬.

చ. హరియును గుంభసంభవుఁడు సాగ్రహమెత్తి ధరాధరంబులన్
శరధుల నుద్ధతింగొన మనంబునఁజూచిన భీతినొంది ది
గ్ధరములు వార్ధులన్ హరిపదంబొగిఁజొచ్చి భయంబుదక్కెనని
ల్పురహిని సాలముల్పరిఖలున్ గనుపట్టె మహోజ్జ్వలాకృతిన్. ౧౨౯.

సీ. కకుబంతవిశ్రాంత గంధేభముల జోడుకోడెలోయన నొప్పు కుంజరములుఁ
గమలాప్త రథతురంగంబుల పిల్లలోయనఁ బొలుపొందు భవ్యాశ్వములును
సారమాహేంద్రకౌబేరరథంబుల యాకృతిఁ గనుపట్టు నరదములును
శౌర్యతిరస్కృత చండ కంఠీరవ ఘోరపరాక్రమ వీరభటులుఁ
గలిగి పరభీషణాకృతిఁ జెలఁగి నిత్య । కాహళీవేణుడమరు ఢక్కా మురజక
దుందుభి మృదంగ శంఖహుత్తుభకడిండి । మ ధ్వనిశ్రేణి దిశలు గ్రమ్మఁగఁదనర్చు.

గీ. అమిత తేజోమయంబైన యప్పురంబు । మెఱయుఁ గైవారమై యొప్పపరిఖతోడఁ
బరిధి సంయుక్తమైపొల్చు పద్మమిత్ర । మండలంబునుబోలి యఖండమహిమ.

సీ. పగడంపురత్నాలపైఁ గట్టినట్టి రత్నమణీనికర తోరణములచేతఁ
గర్పూరకస్తూరికా వజ్రరాసులుగనుపట్టు మేలియంగళ్లచేత
గందాననల్కినకడల ముక్తారంగవల్లికఁ దనరు ముంగిళ్లచేతఁ
గారిచనదండసంకలిత నానావస్త్రసమితిఁ జెన్నొందు సౌధములచేత
విమలమణిజాల నీరాజనములచేత । ననుపమదశాంగ ధూపవాసనలచేత
నమితమంగళ గీతవాద్యములచేతఁ । బుడమిలోఁ గడు నొప్పు నప్పురవరంబు.

వ. కాంచి యుబ్బలంబు చేరంజను నవసరంబున. ౧౩౧.

సీ. పరశుతోమరగదా పట్టిసశూలచాప శరాఢ్యమౌ కాలుబలము నడచె
రమణీయ వివిధచిత్రచ్ఛత్ర కేతనకాంతులఁ దగుశతాంగములు నడచె
నూపుర కింకిణీ నూతనక్వణనంబు గడు నొప్ప ఘనతురంగములు నడచె
దాన గంధాంధలుబ్ధ భ్రమద్భ్రమర ఝుంకారనాదము మీఱఁ గరులు నడచెఁ
దమ్ములును గర్ణుఁడును సోమదత్తుఁడును ద్రోణాత్మజుండును రుక్మియుం యవనపతియు
నాదిగా భూమిపతులెల్ల నలమికొలువ । రాజసము మీఱ నారాజరాజు నడచె.

వ. తదనంతరంబ యజాతశత్రుండు బాలశీతాంశురేఖయుంబోని యంకుశంబు కేలం గీలించి మాణిక్యశాతకుంభమయప్రకరచామర రమణీయ ఘంటానిగళభూషితైరావతకులసంభవ చతుర్దంత దంతావళారూఢుండై నకుల సహదేవు లుభయపార్శ్వంబుల నిలిచి వింజామరలు వీవఁ బరిపూర్ణ చంద్రమండలసమాన పుండరీకంబు భీమసేనుండు పూన నర్జునుండు తాంబూలకరండంబు ధరింపఁ జతుర్థనుండు మంద

మందానిలంబు నుడియనట్లుగా సురటిద్రిప్ప సాంబ సారణ చారుదేష్ణబృహద్భాను
భానుదేవ భానువింద సునందనాది హరికుమారవర్గంబు ముందట బలసికొలువఁ
బ్రద్యుమ్నానిరుద్ధు లుత్తమాశ్వంబుల నెక్కి పాయుతోలంగు లొనరింప నుగ్రసేనుం
డును సద్ధపుంటున నక్రూరుండును జేకితానుండును గృతవర్మయు నాదిగాఁగల
యాదవవీరులు భీష్మ ద్రోణ కృపాశ్వత్థామల మున్నిడుకొని పశ్చాద్భాగంబునం
గొలిచి యేతేర ఘటోత్కచాదిరాక్షసవీరులు తమతమ బలంబులతోడఁ బిఱుంద
రా దక్షిణవామభాగంబుల సామజంబులెక్కి వచ్చు రామకృష్ణులతోడ నుచితా
లాపంబులాడుచుఁ బౌరపుణ్యాంగనలు రమ్యహర్మ్యాగ్రములనుండి మంగళ పల్లవ
లాజపుష్పంబులుచల్లి దీవింప భూసురాశీర్వాదనాదంబును మంగళపాఠకగీత
రవంబును వందిమాగధ జయధ్వానంబునుం జెలంగఁ గుంజర ఘంటానినాదంబులు
రోదోంతరాళంబులునిండ విజయభేరీమృదంగ కాహళ వేణు శంఖ తమ్మట మురజ
ఢక్కా హుడుక్కాది నానావిధవాద్యధ్వానంబులు లోకాలోకపర్వతంబునఁ
బ్రతిశబ్దంబు నిగిడింప నైరావతారూఢుండైన దేవతా సార్వభౌముచందంబునఁ
బ్రవేశంబుచేసె నంతకమున్న యాయితంబులయిన హర్మ్యప్రాసాదంబుల బలభద్ర
పుండరీకాక్షులు నానాదేశాగత రాజన్యులను భీష్మాదులను విడియ నియమించి
యక్రూరు మందిరంబున ననుజసమేతుండైన యజాతశత్రునుంచి యఖిలబలంబులకు
సకలపదార్థంబు లొసంగుచుఁ గతిపయదినంబులునిల్చి యొక్కనాఁడు కృష్ణుం
డుగ్రసేన శూరసేన వసుదేవపురస్సరంబుగా భీష్మ ద్రోణాది మాన్యులకును
యుధిష్ఠిరాది పాండవేయులకును సుయోధనాది గాంధారేయులకును రాధేయాది
మహాయోధవీరులకును ద్రుపద విరాటాది నానాదేశాధీశ్వరులకును ఘటోత్కచా
లంబస హలాయుధాది రక్షోనాయకులకును జీని చీనాంబరానర్ఘ్య రత్నాభరణ
తురంగ చతుర్దంతదంతావళాది నానావస్తువ్రాతంబులను వలయువారలకు దోర
హత్తుగా నొసంగి యందఱ ననిచి యందు నయ్యుధిష్ఠిరున కెఱిఁగించి యర్జునుం
దనయొద్దనే యునుచుకొని సుఖంబుండెనంత. ౧౩౩.

సీ. అయ్యుధిష్ఠిరుఁడు భీష్మాది కౌరవ వృద్ధులును ధార్తరాష్ట్రులు జనపతులును
దనతోడ నేతేర ననుపమ సంతోషభరితుఁడై ఖాండవప్రస్థమునఁ బ్ర
వేశంబుచేసె భూమీశులనందఱుఁ దమనాళ్ల నిలిపి సోదరులుఁ దాను
నిత్యసంతుష్టులై నిరతంబు బ్రాహ్మణపూజసేయుచు మహా భూరిమహిమఁ
గీర్తిసౌహార్దములు గడుపూర్తిఁజెంది । యెపుడుఁ దనయందె నిలువంగ విపులశౌర్య
వీర్యధైర్యజవములతో విభవమొసఁగఁ । జిరతరశ్రీల రాజ్యంబు సేయుచుండె.

క. అని శుకయోగీంద్రుం డా యనిమిషరాట్పుత్రునకు దయాపరుఁడై చె
ప్పిన వృత్తాంతము సంతస । మున సూతుఁడు శౌనకాదిమునులకుఁ జెప్పెన్.

శా. శ్రీమత్కాశ్యపగోత్రదుగ్ధ జలధి శ్రీకామినీసోదరా
హేమాద్రి(?)ధర ధీర బుద్ధి జితభోగీంద్రామరాచార్య సం
గ్రామోపార్జిత భూరి భూవరసమగ్ర ప్రాభవా పన్నగ
స్వామి క్ష్మాధరకూర్మభూమిభరవాస్తవ్య స్వబాహార్గళా. ౧౩౬

క. కృష్ణాంబికా కుమారక । కృష్ణాంఘ్రి సరోజయుగళకీర్తన సేవా
నిష్ణాత నిఖిలభువనచ । రిష్ణు సముజ్జ్వల యశః పరిష్కృతమూర్తీ. ౧౩౭

శ్రీవృత్తము. శ్రీరమణీవార సరసీరుహమదభ్రమర శిష్టజనరక్షణమహీమం
దార జలజాతనయనాహృదయ కైరవ సుధాకర నదీవరగభీరా
వైరి వసుధారమణవారణసమూహ మృగవల్లభ నిలింపపతిభోగా
నీరజభవప్రణయినీకరలసత్కమల నిశ్రుతమరందనిభవాక్యా. ౧౩౮.

గద్య. ఇది శ్రీమత్కౌండిన్యగోత్రపవిత్ర చరికొండ తిమ్మనామాత్యపుత్ర సకల విద్యా
పారీణ శతఘంటసురత్రాణ సుకవిజనవిధేయ ధర్మన నామధేయ ప్రణీతంబైన
చిత్రభారతంబను పురాణకథయందు సర్వంబును సప్తమాశ్వాసము.

దండింపఁజాలియు నేరము నోర్చుట క్షమ, అదిలేనిదొర యన్నిసుగుణము లున్నఁ బ్రకాశింపఁడు. అతివాదములు సహించి, యాత్మ దుర్గుణత్యాగి, సర్వకాలముల దానమానాదరముల స్వజనానందనుఁడు, జితేంద్రియుఁడు, వీరుఁడు, కైదువుల నేరుపరి, వైరిసంహారి; శాస్త్రవిద్విధేయుఁడు, జ్ఞప్తిమంతుఁడు, శిల్ప తర్క వ్యాకరణ, వేదాంతవేదియునై, పలువల చెలిమి వదలి, దూరదృష్టిం బెద్దలఁగొలుచుచు, సత్ప్రవర్తనము గలిగి, గుణవంతులు సేవించు రాజు దేవాంశభవుఁడు; ఏతద్విరుద్ధగుణుఁడు రాక్షసాంశజాతుఁడు నరకపాత్రుఁడె. ఎపుడును నృపాంశసమానమె తత్పరిజనము నగును; వారు చేసినదియె, సరియని, దొర, పురాకృతవశమునఁ దలంచి యొప్పికొనును. వారి నడతలచే సదా సంతసించును. మనుజులు ప్రతిక్రియ చేయనియెడఁ దాముచేసిన క్రియకు ఫలమనుభవింపక తీఱనిదియె. ప్రతిక్రియ చేసినచో మందు త్రావినవారికిఁ దెవులువలె ననుభవమునకు వచ్చును. కీడుకతముఁ దెలిపిన, నాపనిఁజేయ నెవఁడు సమకట్టును? మనసు లగ్గువలచును, ఎవనిమదియు నెగ్గొల్లదు. మంచిచెడ్డలు దెలుపు శాస్త్రము లెఱింగియె ప్రవర్తింపవలెను. శాస్త్రజ్ఞానమువలన నింద్రియజయము, దానిచే వినయము, దానివలన నయమును గలుగును. కువలయపతి దొలుతఁ దనకు వినయమలవరించికొని, పిదపఁ గొడుకుల, ననంతరము మంత్రుల, నపుల సేవకుల, నాపిమ్మట జనులను వినయవంతుల నొనరించునది. నరపతి యితరుల కుపదేశింప నేరుపరియె కారాదు. మహీకాంతుఁడు గుణవంతుఁడైనను జనులకు లోఁబడఁదగదు. ఇంద్రభార్య యెన్నఁడును విధవకానియట్లు, ప్రజ యెట్టిదైన నృపతిరహిత కాఁజనదు. రాజె స్వతంత్రుఁడై మంత్రులమాట పాటింపకున్న, రాజ్యము శోభింపదు. దాను వినయవంతుఁడై, ... ను లడఁకువతోఁ దన్నుఁగొలువ, నెల్లప్పుడు జనులు కూర్మిఁ జెందఁ, బ్రజారక్షణపరాయణుండగు విభుండు కడు నెగడు సిరి యనుభవించును, సార్వత్రికవేద్యవిపినమున నూడనిం బాడుచుఁ గీడొనరించు నింద్రియగజము నెఱుకసిల్లుచూపి వశపఱచికొనఁజనును. మానసధీవరుఁ డింద్రియమీనమును విషయపలలమున, నాసగొలిపి నడుపును. ఆమదిని పూనికచే నాఁగవలయును. దానిఁ గెలిచిన నింద్రియజేతయే. ఒకమనసునె చక్కఁగ నడుపఁజాలనివాఁ డెట్లు సముద్రపర్యంతయవు నేల నేలఁగలఁడు. ఆకర్షణశీలములు క్రియాంత సంతోషరహితములు నవు భోగములచే మది చెదరు నరవరుఁడు మదసింధురమువలెఁ బట్టువడును. సద్దు, తాఁకు, రూపు, చవి, గంధము, అను నీ యైదింటిలో నొక్కొక్కటియె వినాశమొందింపఁజాలును. ముఱికిలేనిదియై, దర్భల మొలకలు మేసి, గడుదవ్వుదిరుగఁ జాలిన లేడి చెంచు నీలంబేరాసచేఁ జావు నెమకికొనుచున్నది. కొండకొమ్మునంత యొడలుగలిగి, యాటగఁ జెట్టులం

వెల్లగించిన కరి కరిణిఁ దాఁకవలచి బోనునం బడును. మిడుత, నిగనిగని దీవియ
వెలుఁగు చూపు చూడుక్కులఁ దమిగొలుప, నేమో భ్రాంతిపడి, వడిదానంబడి మిత్తి
పాలగును. కడులోఁతు నీట మునిఁగియుండియుఁ జేఁప యెరతోడి గాలముమ్రింగును.
నతికి తెక్కులబలిమి నెగిరిపోఁజాలియుఁ దుమ్మెద తావిందగు లగ్గలమై తమ్మిం గట్టు
వడుచున్నది. ఇట్లు విషతుల్యములగు విషయము లొక్కొక్కటియె చంపుచుండ
నైదును గలిసిన వాకొననేల; యెట్లు గెడపకుండును. యుక్తిలేమిని ద్యూత కాంతా
మద్యములు మూడె పలుకీడులు మూఁడఁజేయును; యుక్తియుక్తములైనఁ ధనమును
దనూజుని దెలివినిచ్చును. నలయుధిష్ఠిరాదు లకపటముగఁ జూదమాడి యోర్వఁబడిరి.
శకున్యాదులకువలె నందు జదురుగలవారికి మాయజూదము ధనమీయఁజాలును.
నారులపేరు నలరించి మానసమున మానక వికారము నెలకొలుపును. ఒయారముగఁ
గనుబొమ లెగయించువారి సాక్షాత్కారమో, వాచాదూరమె. ఏకాంతసంచార
చతురమై, సన్నని ప్రన్ననిపలుకులు, నెత్తని కనుగోనలును, గలిగిన చాన మానవునేనిఁ
దన దాసీనిఁ జేయదు? ఒప్పులాఁడి తప్పక విరాగుఁడవు యోగి మానసమును స్వాధీన
పఱచికొనును. కాముకుల లెక్కయేల, ప్రసిద్ధులు సాము లిన్ద్రకౌశిక నహుష రావ
ణాదులు నేఘమూఁదాల్చుచును జామలచేఁ జెడిరి. అదియె ప్రధానము కాని నరున కె
మగువ యెపుడును సుముసఁగును. దాని వినా వేరొకతె, యింటిపనిం దోడ్పడునది
లేదు. మద్యము, తప్పఁద్రావినవానికి బుద్ధితప్పునఁట. కొంచెము ద్రావిన మదిఁదేర్చు;
జఠపుడుపు, సందియముడిందఁజేయు. కవనపుఁ దెలివి విరివిగావించు. మితిమీఱిన
దోరించును. కోరిక కినుకలుకల్లుతోతలు, వానిఁ దగినచోట నియమి[illegible]ది. గెలుపును
గోరు రాజు ప్రజలప్రోపునఁ గోర్కియు, మార్తురఁ బరిమార్చుట[illegible]ము, మొనల
గడనం బేరాసయుఁ గూర్చునది. పెలచేడెలకూడికంగోరిక, యొరుల రొక్కములం
బేరాస, తన జనుల నిగ్రహమున నాగ్రహమును రాజు లెన్నఁడును బడయరాదు.
పరనితంబినీసంగంబునం గుటుంబి, స్వజనమారణంబున శూరుఁడు, పరధనాపహరణ
మున భాగ్యవంతుఁడు ననఁబడునా? రక్షణములేని మహీభుజుని, నియమములేని
ద్విజుని, చాగములేని ధనికుని వేలుపులాయువుమాయించి నరకమునఁ గూలఁద్రోయు
దురు. ఏలుబడి, చాగము, కలిమియు నోముపంట. కొలువు, అడిగికొనుట, లేమి
పాపముపంట, ఒడయఁడు శాస్త్రములుచూచి తగునట్లు మనము నియమించి యిహపర
సుఖకరముగఁ దన వ్యాపారముఁ జేయనగు. అది, దుష్టశిక్షణము, శిష్టరక్షణము,
దానము, రాజసూయము మొదలవు జన్నములొనరించుట, న్యాయమున విడిముడిఁ
గూర్చుట, దొరలవలన యరిగొనుట, పగతుర నుక్కడంచుట, కడునధికముగఁ బుడమి

గడించుటయునని యెనిమిదివిధములుగలది. మొనఁ బెంచి, మన్నుకోఁడులచేఁ బన్ను గొనుచుఁ బ్రజలఁ జక్కఁగఁ బాలింపనివారు గొడ్డుమువ్వులసాటి, ప్రజయొకనికిఁ గడు జడియునో; ఎవనిపని నిందించునో; ఏవని ధనవంతులు గుణవంతులును విడుతురో; ఆఱేఁడధముఁడు. ఆటపాటలవాండ్రు, వెలయాండ్రు, జెట్టులు, కొజ్జాలు మొదలగు నలంతి జాతుల నతిప్రీతిగల నరపతి దూఱఁదగువాఁడు మూర్ఖుర నోటనుండినవాడే. తెలివిగలవాఁ డొక్కఁడేనున్న, నెపుడును వాని సేవగించుచు, మోసగాండ్రతో నుల్లాసము నొంది, తన దుర్గుణము నెఱుంగని భూవరుఁడు దనచావు దెచ్చికొనును. ధారుణీపతి నేరము నోరువక, దండుగఁగొనుచుఁ గఠినముగ దండించి, తనదోసము వినిపించు జనుల నలంచుచున్నపుడు, జనులు కలంగి వేఱుపడుదురు. జనపతి తనపని నెవరు భూషించెదరో; ఎవరు దూషించెదరో; అదియెఱింగి మంత్రులు మొదలగువా, రేతలంపుతో నున్నారో; నాగోనములచే నెవరి కెట్టిప్రియము; నాదోసములచే నెవరి కెట్టియప్రియము; అని, మాఱువేసములచే నెఱుంగరాని వేగులవాండ్రచే వినిచి వారివలన నదియంతయుఁ దా నేకాంతమున విని యసమోసఁగింప నెపుడును దన దుర్గుణము విడువనె వలయును గాని జనుల నవమానింపఁజనదు. రాజా? జనులు నిన్ను నిందించుచున్నారని చారులు వలికిన విని తన లోపములఁ బాపనలుగు నరపతి దుర్మతి. శ్రీరామభూపాలుఁడు జనాపవాదమున సీతం బతివ్రతనైన నుజ్జగించుటఁ దక్కఁ, జాలియుండియు బ్రముక్కఁడి చాకిం గొంచెమైన దండించెనే, ఎఱుక, విన్నాణమును గలిగిన, రాజభయమిచ్చినను, రాజునెదుటఁ బిఱికితనమునఁ, గడిందిదోసమునైన నెవఁడును వాక్రువ్వఁడు. వెన్నుఁడు మొదలగు వేలుపులును స్తుతిప్రియులెయని, తొల్లిచదువులు చాటుచున్నవి. మనుజులమాట చెప్పనేల. ఎపుడును దూషణమువలన రోషముపుట్టునుగదా. రాజు తగునంతకోపము నోరుపును గలిగి యెల్లకాలము జనుల నలరించునది. పరువము, మనువు, డెందము, అందము, సిరి, దొరతనము, అను నీయాఱు నస్థిరములని యెఱింగి సత్కార్యమున సాదరుండు గావలయు. ఈయమి, గారవింపమిఁ, గపటమునఁ, బలుకుఁ బ్రల్లదమునఁ, గఠినదండమున జనులు నృపతి నుజ్జనసేయుదురు. మిక్కిలి పందబుద్ధిగలిగి, యప్పకిపని యాఱు నెలలకుఁ జేయుచుఁ, బరాకుహెచ్చ, వ్యసనాసక్తుఁడు భోగపరుఁడునైన దొరను బ్రజలు గొలువరు. వీఁకి విపరీతగుణములచే సాభిజనులు జనులువలతురు. ఒక్కదోసము చెడునసము నెరవును. అవి గుంపులకొలఁదినైన, ననవలెనె త్రాగుడు, జూదము, వేఁటయును నేలఱేఁడులకుఁ గూడవు; వానివలన యదునలపాండులకుఁ జెడుగులు గనఁబడినవి. కామ క్రోధ లోభ మోహ మద మానములను లోపలి పగతురవిడిచిన రాజు సుఖపడును. కామమున

రావణుఁడు, క్రోధమునఁ గల్మాషపాదుఁడు, లోభమున ముంజుఁడు, మోహమున వాతాపి, మదమున యయాతి మానమున సుయోధనుఁడును జెడిరిగదా. ఇవి లేమి రామమాంధాతృ ప్రముఖులు చిరకాలము నేల యేలిరి. ఇందు సాధులాదరించు ధర్మార్థములఁ బెరుచుచు నింద్రియములనడంచి గురువులఁ గొలుచునది. గురుసేవచే శాస్త్రజ్ఞానము, దానిచే వినయాతిశయము, నద్దానిచే సజ్జనసమ్మతియుఁ గల యతఁడు దుశ్చరిత్రులు ప్రేరించిన నకార్యములం జేయఁడు, వేదముల, ధర్మశాస్త్రముల, లోకజ్ఞానమున, మనమునఁ, జక్కఁగ నిర్ణయింపఁబడినపని, ధర్మము. ప్రతిదినముఁ జక్కఁగ నెల్లవిద్దెల సేకరించుచున్న తెలివిగల మన్నెఱేఁడు, దానింబూనును. జితేంద్రియుఁడు నీతిశాస్త్రానుసారిహృదయుఁడునగు రాజు సిరులు నసములును బెఱిఁగి యాకసమంటును. ఆన్వీక్షికి త్రయి, వార్త, దండనీతియను నిత్యములైన యీనాలుగువిద్దెలనె రాజు సర్వదా నేర్చుకొనవలయును. ఆన్వీక్షికియనఁ దర్కవేదాంతాదులు, ఈవిద్య, దేహమునకు వేఱగు నాత్మను దెలుపుటచే సుబ్బుసమ్మలికమును దొలఁగించును. ఋగ్యజుస్సామాథర్వణ సంజ్ఞములు వేదములు నాలుగు, శిక్షా, కల్ప, ఛందో, నిరుక్త, జ్యోతిష, వ్యాకరణములు తదంగములాఱు, కర్మబ్రహ్మ మీమాంసలు, న్యాయము, ధర్మశాస్త్రము, పురాణము, ఇవియన్నియుఁ ద్రయినాఁబడు. ఈవిద్య ధర్మాధర్మములెఱింగించి యిష్టానిష్టము లొందించును. ఇందు నిషిద్ధములవిడిచి విహితముల నొనరించువాఁడు రెండులోకముల సుఖపడును. వడ్డి బ్రతుకు, కరిసనము, బేరము, కీలారితనమును వార్తయను పేరొందును. ఈ విద్దియవలన లాభనష్టములు వచ్చును. వార్తావృత్తిగల సాధువు జీవికవలని భయము నొందఁడు. దణ్డదమపదములు సమానార్థకములు. కావున దుష్టనిగ్రాహకుఁడగు రాజుదండుఁడు, ఆతని నీతి, ప్రజలనడుపుట దండనీతి. ఈవిద్దెచే న్యాయాన్యాయములెఱింగి న్యాయముననె యేలిన రాజు సుఖసమృద్ధుఁడగును. బ్రాహ్మణాదివర్ణములు, బ్రహ్మచర్యాద్యాశ్రమములు నన్నియు నీవిద్దెల నిలిచినవి. అహింస ప్రాణులందఱకుఁ బరమధర్మము. కావున భూవరుఁడు పిసునుల జనులఁ బీడింపక యేలవలెను. తనసుకమునె కోరుచు లోభుల బాధింపఁజనదు. అలజడిపడుచున్న పిసినిగొట్టులు దాము చావవెఱచి రాజుం గెడపుదురు. పున్నెమునకు సుగమునకును మంచివారితో మైత్రిచేయవలయు. సుజనులు గొలువ ఘనుఁడై కడు విరాజిల్లును. చలివెలుఁగు కలువకొలఁకు నలరించు విధమున, సుజనపరివృతుఁడు మదిమోదమొదవించును, వేసఁగిపొద్దు వెలుఁగుల వేఁగి నీడపట్టుల లేమినొంచుచు వెఱపించు చోటి నేలనువలెఁ గూళలకూడిక వీడునది. బుస్సను నిట్టూర్పుల వెడలు నగ్గిం బొగచూరుమొగముల త్రాఁచులతోఁగూడికయె యుంచుక యుంచునుగాని పలువలతోఁ

గూటమి యనయము ననిష్టము. పూజ్యుఁడని తలంపఁబడు సుజనుని కెట్లు దోసిలి మొగ్గఁబడునో, యంతకంటెఁ గడు నొవ్వుగ దుర్జనునికిఁ గేల్మోడ్పునది. ఎపుడు నెడఁదనాకర్షించు పలుకున జగము నానందము నొందించునది. ధనమిచ్చుచున్నఁ బలుకుఁ బ్రల్లదమునఁ బ్రాణులు నొత్తురు. తెలివి కాఁడు; నుగిలియు నెద ములికి నాటినట్లు నరు నుడికించు పరుసపునుడి నుడువరాదు. మిత్రులతోడ నైన నమిత్రులతోడనైన నిత్యము ప్రియమె యాడఁజను. నెమలి కేకవేసినట్టు తీయనిమాటాడు నతఁడు జనప్రియుఁడగు ఆముకొన్న యంచకోయిల నెమిళ్ల పలుకులును బ్రాజ్ఞుల మంచిమాటల యంత మనోహరములు కావు ప్రియములు వక్కాణించుచు నాదరమున మేలుగోరుచున్న మెచ్చు నడతగల సిరిమంతులు నరశరీరధారులైన జేజేలు, ప్రాణులపైఁ, గనికరము, చెలిమి, యీవి, తియ్యపలుకు నిట్టి వశీకరణములు ముల్లోకములను లేవు. వేదము ప్రమాణమని నమ్మికఁ దేఁటు మదితో నిత్యము దేవతలను, దేవతలవలె గురువులను, దనుబలెఁ జెలులను బూజించునది. ధర్మకార్యములచే వేలుపులను, నమస్కారముల గురువులను, సదాచారముల సాధువులను, మంచితనమునఁ జెలులఁ జుట్టాలను, నెమ్మిని గొమ్మను, గారవమున సేవకుని, ఛందానువర్తనమున నితరజనులను, నభిముఖులఁ జేసికొనఁజను. దండు, తెలివి, హెచ్చరిక, తగు బీరమునుగలిగి నిండురొక్కముతోడి పుడమి యనుభవించినసామియె సామి. ఈ నాలుగు మేలిగుణములులేక, యితరగుణములు చెందిన భూకాంతుఁడు ధనవంతుఁడైన నల్పదేశము నే ననుభవింపఁడు. త్వరగ స్వరాజ్యచ్యుతుఁడగు. ఈగుణములచేతనె యప్రతిహతాజ్ఞయుఁ దేజునుగల రాజల్పుఁడైన, మహాధనుఁడైన రాజుకంటెను మెఱయును. తక్కిన సామాన్యగుణములు రాజునకు భూమి సాధింపఁజాలవు. సర్వధనఖని, దేవదానవమర్దినియునపు నీయవనికై భూరమణులు శరీరమునైనఁ గోలుపోదురు. సుఖపడ నర్థప్రాణములు నిలిపికొని క్షితిని రక్షింపనివానికి ధనజీవనములేల. కూడఁబెట్టఁబడిన విడిముడి వచ్చుబడిలేనిచో నెవనికిని నిజముగఁ గుబేరునికైన విచ్చలవిడి వెచ్చపెట్టఁజాలదు. ఏకిమేఁడీ బలాదులచే బలెరాచకొలమునఁ బుట్టువుచేఁ బూజ్యుఁడు కాఁడు. జనుల నలగింపక యేఁటేఁటఁ దప్పక లక్ష మొదలు మూఁడు, పది, ఇరువది, ఏఁబదిలక్షలు, కోటి, పదికోట్లు, ఏఁబదికోట్లు భాగము వచ్చు నృపుఁడు వరుసగ సామంతుఁడు మాండలికుఁడు, రాజు, మహారాజు, స్వరాటు, సమ్రాటు, విరాటు, అనఁబడుదురు. ఏఁడు దీవులతో నేల యెల్లకాలము నేలు రాజు సార్వభౌముఁడు. ఇతఁడు తనపాలి పేరిజీతమున ధాతచే నెపుడును నృపరూపమునఁ గావ నిర్మింపఁబడిన ప్రజలదాసుఁడె. సామంతాదులభాగముతో సరిమైన జీతముకలిగి రాజభాగము గొనువారు నాసంజ్ఞలె చెందుదురు. సామంతాది

పదము దొలంగి, మహారాజాదులచేఁ దగుజీతమునఁ బోషింపఁబడినవారు హీన సామంతులు. నూఱుయాళ్లకు నతఁడును సామంతుఁడె. శతగ్రామముల నియుక్తుఁడు నృసామంతుఁడు పదియూళ్లమీఁద నుండయనిచే నియమితుఁడు నాయకుఁడు. పదివేల యూళ్ల యధికారి యాశాపాలుఁడు, స్వరాటు నను పేళ్లొందును, వేయిరూపాయలు వచ్చు క్రోసు పదరముగలది గ్రామము, అందు సగము, పల్లి, దానియర, కుంభము, భూమి స్వామ్యము పోవునట్లుం గులము నీయరాదు. మెప్పించినవానికి యావజ్జీవము ననుభవమున కేర్పఱుపవచ్చును. గుణియగు నృపశిరోమణి దేవభోగములకుఁ బూర్ణము శాశ్వతమునుగ నియ్యనేవలయును. కుటుంబముకొలంది విమర్శించి యిండ్లకుఁ దోఁటలకు నేనొసఁగనై తగు వివిధపాదపలతావ్యాప్తము పశుపక్షి గణభరితమునై తఱుగని మంచినీరు, ధాన్యము, కట్టెలు, గడ్డియు నెల్లకాలము సులభమగుచోట, సముద్రము దనుక నోడలునడుచు నేటియొడ్డునఁ, గొండ లతిదూరము గానియెడ, మిక్కిలి చక్కనిదియై మిట్టపల్లులు లేనితావున, నరచంద్రవంక, గుండ్రము, నలుపలు కలుగానేని రాజధాని గట్టునది. తద్దమేలగు నా నగరికిఁజుట్టుగోడ, కందకము, నడుమనొలగము, నూళ్ల మొదలగునవియు, నెండలందును నీరుతగ్గని నూతులు బావులు చెఱువులును, నలుదెసల నాలుగుద్వారములు మంచిత్రోవలు తోఁటలు వీథులును, గట్టిదేవళములు మఠములు సత్త్రువులు నొప్పనేర్పఱిచి క్షితిపతి సురక్షితుఁడై ప్రజలతో నందు నివసింపఁదగు, రాజగృహము, నడుమ నాస్థానమున, గోగజాశ్వశాలలఁ, బ్రశస్తవాపీకూపాదుల, జలయంత్రముల నతిరమణీయము, నిల్లుగానిచోట నలుతట్లు సరిచేతులుగలది, పెక్కు బేసిచేతులదియేని, వలకడనెత్తు, డాకడఁ బల్లునై, తఱచుగ నిల్లుబవంతి గాక పలుచేతులది, యుప్పరిగ లట్టడులు నానావిధ గృహములును వెలయునది, శస్త్రాస్త్రధారులు మెలఁగు కోటబురుజులు, మేలియంత్రములఁ జెలఁగునది, మూడేసి తొట్టికట్ల నలుదువారములనతిశుభము, రేయుంబగలు నొఱవెఱికిన కత్తులు దాల్చి యొక్కొక జామునకు మాఱు నారెకు లన్నిదెసలఁ గావ నెల్లపుడు సుఖకరము నగునట్లు గట్టునది. వస్త్రాదులు శుద్ధములు చేయుటకు, స్నానమునకు, దేవతార్చనమునకు, వంటకు, భోజనమునకుఁ దూర్పున; నిద్దురకు, నాటకుఁ, ద్రావం, గన్నీరు విడువ, ధాన్యముకై, దిరుగలి మొదలగువానికిఁ, బరిచారికలకు బానిసీలకు మలవిసర్జనమునకు వరుసగ వలకడఁ; బసులు, మెకము, లొంటె, లేనుఁగులు మొదలగు వానికిఁ బడమర; నరదములకు, నశ్వముల కాయుధములకు సాముకై సంచారమునకు వలువలకు రొక్కమునకుఁ జదువులు నేర్పుటకు న్యాయనిర్ణయమునకు శిల్పములకు డాకడను; గృహములు నిర్మించునది.

దౌల—పిల్లలులేనివారిబ్రతుకు వ్యర్థముగదా! మాయన్నకు బిడ్డలులేకపోవుట చేత నేనే కర్మచేయవలసివచ్చినది. నాకును బిల్లలులేరు. ఈ పల్కూరువంశ మింతటిలో నాశనమే కాఁబోలును.

దుర్గ—(ఈమాటలువిని సిగ్గునఁదలవంచుకొని) "మీరెవరినైనఁబెంచుకొనుఁడ"ని ప్రత్యుత్తరమిచ్చెను.

దౌల— పెంచుకొనినవారికి ముప్పుగడచుట యరుదు. అంతకన్నఁ దగించి మతియొకదానినిఁ బెండ్లియాడుట యుత్తమము. నీకిష్టమైనచో నట్లు చేసెద.

దుర్గ— నాకిష్టమైనదికాని మీకీవయసునఁ బిల్లనిచ్చువారెవరు?

దౌల— ఒకరిచ్చెడువారెవరు? పిల్లసిద్ధముగనెయున్నది. నీదయయుండిననది—

ఈమాట యతనినోటినుండిరాఁగానే దుర్గ వెలవెలబోయిఁ జూడసాగి "ఎవరు పిల్లయెవరు?" అని యడిగెను. అప్పుడు దౌలతరావు లేచి భార్యచేతులు రెండును బట్టుకొని "నేనొకమాట చెప్పెదను కోపపడక వినుము. కమలను నాకిచ్చి వివాహముఁ జేయుము." అని యింక నేమో చెప్పఁబోవుచుండ దెబ్బఁదిన్నపామువలె బుస్సునలేచి దుర్గ కోపావేశముచేఁ బెదవులు తడఁబడ నిట్లనెను. "ఛీఛీ. నీవంటి కఠినచిత్తునిఁ బాపకర్ముని నేనెందుంగనలేదు. అన్నగారికష్టము తిన్నగఁ జల్లారనైన లేదు. అప్పుడే పుట్టెడుదుఃఖములోనున్న యాయనభార్య నోదార్చుటకు మారామెను బెండ్లియాడెదనని చెప్పుటకు నోరెట్లువచ్చెను. విధవయని సందేహములేదు. అన్నపెండ్లాము తల్లివంటిదిగదా యని గౌరవములేదు. నీముఖముఁ జూచినవారికి పంచమహాపాతకములుఁ జుట్టుకొనును." అని యామెను నిందసేయుచుండ దౌలతరావు మెల్లగ నామెతో "ఆమె నిజముగ విధవయైనచో నాదే తప్పు మాయన్న యామెను బెండ్లియాడలేదఁట." అనెను.

దుర్గ — ఈమాయమాట లెవరు నీతోఁ జెప్పినారు? దుండిరావా యేమి? వానియమ్మకడుపుమాడ వానికి మరణమురాదు. ఆ కాళికాదేవికి వానిమీఁదదయ. ఆదిక్కుమాలినవాఁడే నాకొంపఁదీయుచున్నది. ఊరిలో సాటివారు విన్న నేమందురు? ఆమెకుఁ బెండ్లిగాకున్న వైధవ్య మనుభవించుట యామెకు ముచ్చటా?"

అని పలుక దౌలతురావు భార్యను కోపింపవలదని బ్రతిమలాడి "నీకు సవతి వచ్చునను రోషముచే నిట్లనుచున్నావు. కోపపడక నా ముద్దుఁ జెల్లించు" మని వేడెను. దుర్గ యప్పలుకుల కలుక రెట్టింప "నాతో మీరు మాటలాడవద్దు. నాపనిమీఁద నేను బోయెదను." అని చేయివదిలించుకొని లోనికిం బోయెను. తనకు సవతివచ్చునను నీర్ష్యచేతను, విధవను వరించుటచేఁగలుగు నప్రతిష్ఠను భరింపలేకనో,

దుర్గ మిగుల కోపమును విచారమునొంది తనభర్తకుం దనకు జరిగిన ప్రసంగమంతయుం బూసగ్రుచ్చినట్లు కమలకుం దెలిపి జాగ్రతగ నుండుమని చెప్పి యామెకు నేసహాయము గావలసినం దానుచేసెదనని వాగ్దానముం జేసి యంతతోం దృప్తిగలుగమిం దనయింటి పొరుగుననున్న రాధాకాంతరావు భార్యయగు రోహిణీభాయియొద్దకుం బోయి యీవార్త యామెకుం జెప్పి, రాధాకాంతునితోం జెప్పి సాయముం జేయుమని కట్టుదిట్టముం జేసివచ్చెను. దుర్గభాయి దౌలతురావుయొక్క దురుద్దేశముల నెఱింగించినవెనుకం గమల మిగుల భయపడుచుం దోడేలునోటినుండి విడిపింపంబడి పులినోటంబడితినిగదా యని దుఃఖింప నారంభించెను. మరునాఁడు రాధాకాంతరాయులు భార్యచే విని దీనురాలగు స్త్రీకి, మానహాని రాకుండం గాపాడవలెనని నిశ్చయించి “కమలతో మాటలాడి రమ్మ”ని రోహిణి నంపెను. రోహిణియు దుర్గయు నెన్నివిధములనో తరచితరచి యామె వివాహమునుగూర్చియు స్థితినిం గూర్చియుం దెలియంగోరి యనేకప్రశ్నల నడిగిరిగాని యామె తిన్నఁగాం బ్రత్యుత్తరమీయక “నాకర్మము. నేననుభవింపక తప్పదు. జలమరణమొ, యగ్నిమరణమొ నా మొగమున వ్రాసియున్నది. నాకు మానహాని గలుగకుండ మీరుమాత్రము చూచుచుండుఁడు.” అని యుత్తరముచెప్పెను. ఆమాటలంబట్టి యామెకు మృతుఁడైన భర్తపై గాఢానురాగము గలదనియు నందుచే నామె ప్రాణత్యాగముం జేసికొనుననియు నిశ్చయించి రోహిణి మిగుల జాగరూకతగ నుండుమని దుర్గకు బోధచేసి మానహాని సంభవించునెడలం దనయింటి కామె నంపుమని నొక్కి పలుమారు చెప్పి యింటికరిగెను. ఆపేఁట మధ్యాహ్నము రాధాకాంతరావు దౌలతరావునకు నట్టి దుష్కార్యముం జేయవలదని హితోపదేశముచేసెను. ఆ హితమతనికి విషప్రయోగమగుటచే దౌలతరావు మండిపడి వృద్ధుఁడగు రాధాకాంతుని ననరానిమాటలనెను. రాధాకాంతుఁడు వానిమాటలకుం దలపంకించి యీవిషయమున నెంతపనినైనం జేయ నిశ్చయించెను. దౌలతరావామెనుదప్పక వివాహమాడుటకు నిశ్చయించెను. కమల మానహాని సంభవించునని మృతినొంద నిశ్చయించుకొనెను.

ఆఱవ ప్రకరణము.

మహారాష్ట్ర ప్రభువులలో హొల్కారుకుటుంబము మిగుల గౌరవమునకుం బాత్రమైనది. ఈ హొల్కారువంశమును స్థాపనముంజేసిన శూరుఁడు మలహారురావు హొల్కారు. ఈతఁడు క్రీస్తుశకము ౧౬౯౩ వ సంవత్సరమున జనియించి, మొదట పీష్వాలయొద్ద సిపాయిగ బాహుబలాతిశయముచే నొక వాసికెక్కిన

యోధవరుఁడై తన ప్రభువులకు ననుగ్రహపాత్రుఁడయ్యెను. అందుచే పీష్వాయగు బాలాజీరావితనికి, మాళవదేశమున జాగీరులిచ్చి తనకు లోఁబడియుండున ట్లొక చిన్నరాజుగ నొనర్చెను. తరువాత మలహారురావు మఱికొంత రాజ్యము సంపాదించి మాళవదేశముననున్న యిందూరునగరమును రాజధానిగఁ జేసికొని పేరునకు మాత్రము పీష్వాకు లోబడినట్లుండి మాటలచేతను, నప్పుడప్పుడంపు స్వల్పబహుమానములచేతను దమ లొంగుబాటును దెలియఁజేయుచు, నిజముగ సర్వతంత్ర స్వతంత్రుఁడై యథేచ్ఛగ రాజ్యముఁ జేయుచుండెను. కులమున నీచుఁడగు గొల్లవాఁడయ్యు బాహుబుద్ధిబలముల గొప్పవాఁడై మలహారురావు కొలదికాలమున నొక సామంత రాజగుటయే గాక యెల్లవిధముల నైశ్వర్యశాలియయ్యెను. కాని యాతని యుత్సాహ వృక్షమునకు మూలము వదిలించినట్లు భగవంతుఁ డాయన కుమారరత్నమగు ఖండేరావును స్వర్గలోకమున కెత్తుకొనిపోయెను. ఖండేరావు మృతినొందునప్పటికి, శతవృద్ధుఁడై కాటికిఁ గాళ్లుజాపుకొనియున్న తండ్రియు, మాలిరావను నొక మగ శిశువును, గుణవతియు, విద్యావతియునగు నహల్యాభాయి యను భార్యయు గుణ ముక్తాభరణయగు ముక్తాభాయి యను కూతురునుండిరి. మలహారురావు మనుమని మనుమరాలినిఁ జూచుకొని పుత్రుమరచి నిండుజవ్వనమున భర్తృహీనయయ్యుఁ బాతివ్రత్యమె ప్రధానముచేసికొని యొంటిపూట భుజించుచు, నేలఁ బండుకొనుచుఁ బుణ్యకార్యములఁ జేయుటచేఁ గాలముఁ బుచ్చుచు వివేకురాలగు కోడలింజూచుకొని దుఃఖము దిగమ్రింగి యెట్టెటో రాజ్యభారముఁ గొంతకాలము మోసెను. తదనంతరమునఁ గొన్నిదినములకు మలహారురావు కాలధర్మమునొంద మనుమఁడగు మాలిరావునకు మంత్రులందఱుఁ బట్టముఁగట్టిరి. కాని యచిరకాలంబుననె వానికిఁ గాలమాసన్నమగుటచే నతఁడును దండ్రి తాతల దర్శింపఁబోయి హోల్కారువంశము నంతటితో నస్తమించునట్లు మగపురుషు లేకుండఁజేసెను. భర్తయు, మామయుఁ, గుమారుఁడు నించుమించుగ నొకమారు కాలధర్మమునొందుటయు, హోల్కారువంశము నశించుటయు నిందూరు రాజ్యలక్ష్మి తనవలె ననాథయగుటయు, జనులు రాజహీనులై యుంటయుఁ జూచి యహల్య యబలయయ్యు దుఃఖసముద్రమున మునిఁగియు విధిలేక ప్రజారక్షణార్థమై రాజ్యముఁ బూనెను. ఇది యామె మంత్రులలో ననేకుల కిష్టము లేదు. ఇష్టము లేకున్నను, దేశ మరాజకమై పరరాజులపాలగుట కన్నులారఁ జూడలేక యహల్యాభాయి యంతటి సాహసముఁ బూనవలసివచ్చెను.

రాణోజీ పల్కారు మృతినొందిన నాల్గవనాడు మహాపురమునుండి శ్యామసుందరదత్తు రాధాకాంతుగారిగృహమునకువచ్చి, ఋషికిం దనకుజరిగిన ముచ్చటలను

రాణోజీ మరణవిధమును దన సహాయమును దెల్పెను. శ్యామసుందరదత్తుయొక్క తండ్రియగు పరమేశ్వరదత్తు రాధాకాంతరాయునకుఁ బ్రాణమిత్రుఁడైనందునఁ దన మిత్రుని కుమారుని బాగుచేయవలెనని రాధాకాంతుఁడు శ్యామసుందరునకు నప్పటికి స్వల్పకాలముక్రిందట నెలకు ముప్పదిరూకల జీతముగల యుద్యోగమును జెప్పించి యతనికి నెవ్వరు బంధువు లచ్చటలేమి, తనయింటనె భోజనమిడుచు వాని నభివృద్ధికిఁ దెచ్చుచుండెను. రాధాకాంతరావు, చనిపోయిన మలహారురావునకు గుండెకాయయు, బహిఃప్రాణమనియును బ్రజలు చెప్పుకొనుటయేగాక వారతనియం దమితగౌరవముంచి యతని యాజ్ఞానువర్తులై యుండిరి. రాధాకాంతుఁడు డెబ్బదిసంవత్సరములకన్న నెక్కువవయసుకలవాఁడు. అయినను దేహపటుత్వము చెడక బహు దార్ఢ్యముగనుండెను. జీవించియున్నపుడు మలహారురావునకును, నతఁడును మాలిరావును మృతినొందినవెనుక నహల్యాభాయికిని, రాధాకాంతుఁడు తన ప్రాణములు గూడ ధారపోయునంతటి భక్తిగలిగి నిష్కపటియై వర్తించెను. శ్యామసుందరదత్తు రాధాకాంతునియెడలను నంత కృతజ్ఞతఁ జూపుచు రాణీయందు నట్టిభావముంచి పనిఁజేయసాగెను.

వచ్చిననాటిరాత్రి రాధాకాంతరావు శ్యామసుందరుని వెంటఁబెట్టుకొని శ్రీ యహల్యాభాయి రాణీగారిని దర్శించుటకుఁబోయి వాకిటనిల్చి తమవార్త నెఱుంగఁ జేయుమని లోనికిఁ బ్రతీహారినంపెను. లోపలికిరమ్మని రాణీగారి సెలవైనదని సేవకుఁడు వచ్చి తెలిపి యంతఃపురమున నొకగదిలోనికి వారిం గొనిపోయెను. ఆ గదిలో ముత్యాలజాలరువలె నడుమ వేయఁబడిన తెల్లతెరచాటున నల్లని యొక్క బక్కపలచని యంగనయు నామెకుఁ గొంత వెనుకగఁ బదునాఱు వత్సరముల యీడుగల జవ్వని యొక్కతెయుఁ గుర్చీలపైఁ గూర్చుండిరి. రాధాకాంతరావును శ్యామసుందరుఁడును తెరసమీపమునకుఁ జని యానల్లనిస్త్రీకి నమస్కారము గావించి తమకై వేయఁబడిన పీఠములపై సుఖోపవిష్టులైరి. దత్తదివఱ కెన్నఁడు నహల్యాభాయిని జూచియెఱుఁగఁడు కాఁబట్టి, సౌందర్యవతిగాక నల్లని శరీరకాంతిగలిగి సామాన్యస్త్రీవలె సాధారణ వస్త్రములు గట్టుకొని యాభరణములనైనఁ దాల్పక కృశించియున్న యీ యంగనను దన యేలికయగు రాణిగఁ గొంతసేపటివఱకుఁ దలంపక రాణీ యెంతో వైభవముతో నుండుననియు నిఁకముందు వచ్చుననియు నెదురుచూడసాగెను. ఇట్లు వీరిరువురు లోనికరిగి, కూర్చుండినవెనుకఁ గ్రొత్తవాఁడగు దత్తునిఁజూచి పడుచుకన్నెయగు ముక్తాభాయిదగ్గఱనున్న చిన్న గదిలోనికిఁ జనెను. అప్పుడహల్యాభాయి తెరఁదీయించి, దత్తును రాధాకాంతును చేరిపారఁ

జూచి “నీవు మాతో మాటలాడినది బాలునివిషయమేనా” యని యడిగెను.

రాధా — చిత్తము. ఈ కుఱ్ఱవాఁడే. ఏలినవారు నాయందెట్టిభావము నుంచినారో, యీ బాలునియందుఁగూడ నట్టిభావ ముంచఁదగును.

అని రాధాకాంతరాయలు మెల్లఁగ నుడువుచుండ రాణికనుల కొలుకులనుండి వేడికన్నీళ్లబిందువులు జార నారంభించెను. అంత యీయాకస్మికదుఃఖమునకుఁ గారణ మేమని విచారించుచుఁ గొంతసేపటికి గద్గదస్వరముతో రాధాకాంతరాయిట్లనియె. “అమ్మా యేమిది. ఇట్లు మీరుండుటకుఁ గారణమున్నను ధైర్యమూనక విధిలేదు.”

అహల్యాభాయిగారు నామాటలువిని యూరటములేక “యీబాలుని ముఖ మచ్చముగ నాతనివలెనున్నది. హా! మాలిరావూ! నాయనా! నీమరణముచేతనే గదా నేనీ విశ్వాసహీనులగు మంత్రిపశువుల నాశ్రయించుట? హా! తండ్రీ నన్నేకాకిని జేసిపోతివా?” యని యామె విచారించుచుండ లోపల గదిలోనుండి ముక్తసరములవలె బాష్పములు చెక్కులమీఁదినుండి జార ముక్తాభాయి జేలయై రోదనముఁ జేయసాగెను. రాధాకాంతుఁడు వారి విలాపముచే హృదయము గరుగ గవంతవంతఁ దానుగూడ నొంది యనుచితమగు నాకార్యము మానుట పురుషలక్షణ మని కన్నీరుఁ దుడుచుకొని “అమ్మా యేలినవారు విలపింప ధైర్యముఁ జెప్పువారెవరు? మాలిరావు మీగర్భమునఁ జిచ్చువెట్టిపోయెను. ఇది యాజన్మాంతమును బోవునదియు మరపువచ్చునదియుఁగాదు. ధైర్యము దెచ్చికొన్నను మీరే. దుఃఖించినను మీరే. ప్రజలు మీబిడ్డలు. ఆ కుమారుఁడు పోయిన మేమున్నవారము.” అని యూరార్ప రాణి కొంత నేదదేరెను. తరువాత వారిట్లుమాటాడిరి.

అహల్య — నేను నీవు చెప్పినట్లు ప్రజలనె బిడ్డలుగ నమ్మికొంటినిగాని వారు నాయందు విశ్వాసములేక రాజ్యమునకు శత్రువులుగాఁ గొందఱున్నారు.

రాధా — అమ్మా అంతటి పాపకర్ములు, నదృష్టహీనులెవ్వరు?

అహ — నేను నీయందును గంగాధర జస్వంతరావునందును నాయాశలన్నియు నిల్పియుంటినిగాని నాయాస —

రాధా — (తొందరతో) అమ్మా నావిషయమై తమకు సందేహమేల? ఇదిగో మీపాదములుసాక్షి. నేను నాప్రాణమునకైనను లెక్కసేయను. నావిశ్వాసము తమకు విశదము.

అహ — నేను నీవిషయము చెప్పలేదు. గంగాధర జస్వంతరావునుగూర్చి. నిన్న నతఁడు నాదగ్గఱకువచ్చి కుమారునిఁ బెంచుకొమ్మని నాకనేకవిధముల నుపదేశ మొనర్చి నేను రాజ్యము పరిపాలించుట ప్రజలకిష్టము లేదని కఠినముగాఁ బలికెను.

పురోహితుఁడును మంత్రియుఁగదా. నాకుపకారము సేయునని దలఁచితినిగాని యిట్లగునని యెన్నఁ డెంచలేదు. ఈమాటలు చెవిఁబడ ముక్తాభాయికి మనస్సు మనస్సులో లేక "జస్వంతరావునకును మా యమ్మగారికిని వివాదము లేకయుండ వలెనని నాకోరిక. దైవమా! నీవు వీరికి సఖ్యముఁ గలుగఁజేయుము." అని తన మనస్సునఁ బ్రార్థనచేసెను. రాధా:కాంతరావు గంగాధరుని విషయమై మొదటి నుండియు సందేహము నొందుచుండుటచే నతని యనుమానము రాణి దెలిపిన సంగతులచే ధృవపఱచఁబడెను. దత్తు రాణిమాటలకు నర్థము స్పష్టముగా నెఱుఁగక, సత్ప్రవర్తనకు నిధివలెఁ గనఁబడుచుండు జస్వంతరావు దుర్మార్గమునకు నొడఁబడునాయని వితర్కింపసాగెను. తరువాత నీ క్రింది సంభాషణ జరిగెను.

అహల్య— ఇంకను విశేషము లేమి? రాణోజీ, పాపము పోయినాఁడేఁట. దౌలతరావునకుఁ జాలకష్టము సంభవించినది.

రాధా—అతనికేగాదు. చచ్చెడివాఁడు చచ్చుచు నతఁడొక పిల్లగొంతుకఁ గోసినాఁడు. వివాహమాడి యిప్పటికి నెలకాలేదు. పాపమాభార్యగూడ నిక్కడికి వచ్చినది. ఆమె యతి సౌందర్యవంతురాలు.

దత్తు—అతి దుర్మార్గుఁడగు దౌలతురావు పాప మామెనుబాధించుచున్నాఁడట!

అహ — ఏమి! నా పాలనారంభమందుఁ బతివ్రతలకు బాధకలుగునా? అట్లయిన నామీఁద నతని కాగ్రహమువచ్చినను వచ్చుఁగాక. దౌలతరావును నేను మందలించి యామెకష్టమును మాన్పెదను. ఆకష్టమెట్టిదో నాకుఁ దెలియఁజేయుఁడు.

రాధా— వదినగారిని తాను పెండ్లియాడునఁట. ఇది మంచిది కాదని మావంటివారు తెలుప నామెకు వివాహము కాలేదని చెప్పెను. ఆమె వివాహమైనదని వైధవ్య మనుభవింప సిద్ధముగనున్నది. అయిన దమ రిందు జోక్యముఁ గలుగఁ జేసికొనవద్దు. అతఁడు బలియుఁడు. అతఁడు శత్రుగణములోఁ జేరిన మనకు నష్టము కలదు.

అహ— అతఁడు శత్రుపక్షమునఁ జేరననుసరే. నారాజ్యముపోయిననుసరే. ఇంత పాపకర్ముని చర్య నేను జూచుచు సైరింపఁజాలను. సాధుబాధ నివారింపకున్న నా రాజ్యమెందుకు?

దత్తు — (తనలో) ఆహాహా యేమి యీయామె ధర్మగుణము! ధర్మదేవత యీయామెగా నవతరించియుండును. దేవుఁ డీమెను రక్షించుఁగాక.

రాధా —. అమ్మా! అట్లయిన జస్వంతరావు మొదలగువారిలో నెవ్వరు చేరినారు? ఏమి ప్రతిక్రియ మనము చేయవలయును?

అహ— జస్వంతరావులో దౌలతరావు చేరును. ఇంక నెవరు చేరుదురో తెలియదు. మీరు నాయందు గాఢానురాగులగుదురేని నేను గెలువగలను. నేను శౌర్యము ప్రధానముగఁ గల మహారాష్ట్రస్త్రీనని నమ్ముము.

రాధా— అమ్మా! మీపదములు సాక్షులుగా శ్రీవిశ్వేశ్వరుఁడు సాక్షిగ, నేను నా జన్మాంతము దాక మీయెడ విశ్వాసముగలిగి యుండెద. అబ్బాయీ! దత్తా నీవుఁగూడఁ బ్రతిజ్ఞఁ జేయుము.

దత్తు— అఖిలదేవతలు సాక్షులుగ నేను మీయాజ్ఞ నెరవేర్తునని, అట్లు ప్రమాణము చేయుచున్నాను.

ఇట్లు వారుపలుక నహల్య సంతోషించి వారి నారాత్రికి వీడ్కొల్పినదయ్యెను.

ఏడవ ప్రకరణము.

గంగాధర జస్వంతరావు నలువదియేండ్లలోపు వయస్సుగలవాఁడు. బుద్ధిబలముచేతను, బాహుబలముచేతను, నతఁడు తలంచిన కార్యములెల్ల నిర్వహింపఁగల సమర్థుఁడు. మలహారురావుహోల్కారు కాలమునుండియు నతఁడు పురోహితుఁడును మంత్రియునై వైదిక లౌకిక కార్యముల నమోఘముగ నిర్వర్తించుచు రాజ్యమందిరమునకు మూలస్తంభమైయుండి, యాతఁడు మృతినొందినతరువాత నధికారమునంతయు దనచేత నుంచుకొనవలెనని దురాశ జనియించినందున రాజ్యము నహల్యాభాయి వహించినఁదనయాటలు సాగవని యామెను కుమారస్వీకారము చేసికొమ్మని బలవంతపెట్టసాగెను. కుమారుని పెంచుకొన్నయెడల నతఁడు యుక్తవయస్కుఁడగువఱకు రాజ్యము మంత్రులచేతులలో నుండుననియు, నందుచే దురాశాపీడితులగు వారిమూలమున దేశమునకుఁ గీడు రాగలదనియు, విశేషించి తనకు ముద్దులు మూటగట్టు కొమార్తెయుండఁగా నామెకు రాజ్యమొసగక పరుని నెవనినో తెచ్చి వానికీ రాజ్యమును గట్టఁబెట్టుట యనుచితమనియు నెంచి యామె పెంచుకొనదయ్యెను. అందుచే గంగాధరుఁ డాగ్రహించి తనతో నింక కొందఱిని జేర్చుకొని రాణిపైఁ గక్షవహించెను.

వెనుకటి ప్రకరణమునఁ జెప్పఁబడిన సంగతులు జరిగిన మఱునాఁడు రాత్రి గంగాధర జస్వంతరావు భోజనముచేసి తన మిత్రులనిమిత్త మెదురుచూచుచుండెను. అంతలో హరిహరపాండ్యాజీ యను బ్రాహ్మణుఁడు తన యొడ్డని స్థూలదేహము దీపపు వెలుతురులో పెద్దనీడను వ్యాపింపఁజేయవచ్చి “అయ్యా! గోమాజీరావు, దవులతరావు మొదలగువారు సిద్ధముగనున్నారు. వారి నిక్కడికిరమ్మని నేను చెప్పినాఁడను.

వారు త్వరతో రాఁగలరు. తమభోజనమైనదా?'' అని యడిగెను. ‘‘ఆహా నేను సిద్ధముగనుంటిని. కాని రఘునాథరావేమన్నాఁడు? నేను చెప్పుమనినట్లు నీవు చెప్పినావా?' అని పాండ్యాజీతోఁ బ్రత్యుత్తరమిచ్చి కొన్ని ప్రశ్నలు వేసెను.

హరి— ఈకార్యము రఘునాథరావున కిష్టమే. నీవెప్పుడు రమ్మనిన నపుడే బండెత్తివచ్చి యహల్యాభాయిని సింహాసనమునుండి లాగును.

జస్వం— నిజముగా నాతఁ డట్లు వాగ్దానము చేసినాఁడా?

హరి— అతనికి నేను గుండెకాయను. నాతో నిజము పలుకును గాని యబద్ధము పలుకఁడు. నీవు కొంతరాజ్యము నాతనికిచ్చుటకు సమ్మతింతువేని నిన్నే హొల్కారుగఁ జేయునట్లుగూడ నేను చక్కఁ జేసినాను.

జస్వం— ఆహాహా! నాకు నీకంటెఁ బరమమిత్రుఁడు లేఁడు. నన్ను హొల్కారుగఁ జేసినపక్షమున నేనతనికి సగమురాజ్యము నిచ్చుట కాశ్చర్యమా కష్టమా? కాని నేను హొల్కారును గావలెనని పట్టింపులేదు. ఈయాఁడుదానిపాలనలో నుండక పోయినఁజాలును. అహల్యనుజూడ నాయొడలు మండును గాని ముక్తాభాయిని గనుగొన్న నా హృదయము జాలినొందును.

అని జస్వంతరావును హరిహరపాండ్యాజీయును ముచ్చటించుసమయమున సేవకసమేతుఁడై గోమాజీరావు గుమ్మము దాటివచ్చెను. అంతట జస్వంతరావు మాటలాడవలదని సగమవైదికుఁడగు హరిహరునకుఁ గన్నుసన్నఁ జేసి ముందుగా ‘‘ఓహో! కొత్వాలుగారు కాబోలును. మమ్ముఁ జెఱసాలలో నుంచుటకువచ్చినారా యేమి? ఆయన యెవ్వరు?'' అని పరిహాసముగఁ బలికెను. గోమాజీరావు నవ్వుచు ‘‘మీరు రాణిపైఁ గుట్రలు గావించుచుండ వారిసొమ్ము దినువారము మేమూరకుందుమా. అయితే దవులతురావు రాలేదా? ఈతఁడు నాస్నేహితుఁడు. ఈతని కాపురము వాసియా గ్రామము. మనకార్యమున కనుకూలుఁడు. ఇతనిపేరు సకారాం'' అని చెప్పునంతలో ద్వాపరసమేతుఁడగు కలివలె దౌలతరావు దుండిరావుతోఁగూడ గృహము నలంకరించెను. జస్వంతరావు వారినిఁగూడ సన్మానించి యందఱ మేడమీఁదికిఁ గొనిపోయెను. అందఱు నొకరినొకరెఱిఁగినవారే గాని సకారాము నెవ్వరు నెఱుంగరు. అతఁడువచ్చి గోమాజీకిఁ గుడిప్రక్కను గూర్చుండెను. అతనియెదుట తమ రహస్యములను మాటలాడుకొన నందఱు సందేహించిరి గాని గోమాజీరాయని ప్రోత్సాహముచే నివారితసంశయులై మూటగట్టుకొనివచ్చిన రహస్యములను విప్పిరి. అప్పుడు వారందఱు నీక్రిందివిధమున మాటాడిరి.

కృష్ణ— క్షమించు ఆజంతువు నెంచక విధిలేకున్నది. దాని అశనఘాతిత్వము నేమని చెప్పుదును! కసాయివానిని కాళ్లు చేతులు జాగ్రత్తయని హెచ్చరిక చేయవలసి వచ్చుచున్నది దినమునకు మణుగుమాంసము వేసినను చప్పరించి, యింకను గాండ్రించుచుండును.

విజయ— సరే! చాలును. నాతోఁ జెప్పవలసినదంతా చెప్పినావుగదా!

కృష్ణ—ఇంకా లేదు గుట్టపుసాలలో పెట్టెయొకటున్నది. అందేమున్నదని యడిగితిని. సర్పరత్నము లున్నవని చెప్పిరి. సర్పములపయినుండే రతనాలు శ్రేష్ఠమయినవని వాడుకగదా! మన అమ్మాయి కిచ్చుకొను కీముసలాతఁడు మన్యపుసర్పములనుండి యీరత్నాలఁ దెచ్చినాఁడని సంతోషించి మూఁత పయికెత్తిచూతునుగదా! తెగబారెడేసిపొడుగున రెండు క్రూరసర్పము లా పెట్టెయందున్నవి.

విమల— కృష్ణతాతా! తినుటకు వానికేమైన వేయించు. వానివిషయమయి యిఁక మా అన్నయ్యతోఁ జెప్పి అతని నాయాసపెట్టకు.

కృష్ణ— అమ్మాయీ! నాకంఠములో జీవముండఁగా అతనిని నే నాయాసపెట్టఁ దలఁపను. ఒక్కమాటమాత్రము చెప్పఁగోరినాను. ఆజంతువు లిక్కడనె యుండవలసినయెడల, మీఅన్నయ్య త్వరలో చెఱసాలయందుండవలసినదే! ఏమా! ఆ పాడుపాములు కోళ్లనుగాని మఱి వేనిని దినవు. అబ్బాయీ! ఈ లెక్కపత్రముచూడు. ఒక్కొక్కపా మెన్నేసికోళ్లను మ్రింగినదో!

విజ— (అనంగీకారముగా) నేఁ జూడను.

కృష్ణ— నీవు చూడనియెడల నే నాశ్చర్యపడను. పోనీ! కుబేరసేనునికిఁ జూపింతునా?

విజ— వల్లకాదు.

కృష్ణ— (ప్రక్కకు మోముత్రిప్పి) ఎట్లయిన నతనికిఁ జూపి తీరుదును.

విజ— ఒక్కమాటే చెప్పుచున్నాను. విను. మా చిననాయనకుఁగాని అతని పరివారమునకుఁగాని ఏమేమి కావలయునో వాని నన్నిటిని నీవు జాగ్రత్తచేయవలసినది తట్టుబడినిగుఱించిన ప్రస్తావమేమియు అతనియొద్దఁ జెప్పక యూరకుండవలసినది.

కృష్ణ— మంచిదిబాబూ!

విజ— అతని సేవకులతోనయినఁ జెప్పఁగూడదు. జ్ఞాపకముంచుకో!

కుడివయిపునఁ గుబేరసేనుని గదినుండి— ఓరీ! ఎవఁడురా, అక్కడ?

ఇద్దఱు సేవకులు— (తెరవెనుకనుండి వచ్చుచున్నారు.)

కృష్ణ— అతని సేవకులయొద్ద నేమన్నను ఉపద్రవము లేదు. ఏమా? వారితో నేనెపుడు

మాటాడినను ఓత్రముతో నేదో గొణఁగుదురు. నామాట తమకుఁ దెలియలేదని యర్థమయియుండును.

కుబేరసేనునిగదినుండి— ఎవఁడురా! గాడిదలార!

సేవకులు— (రంగస్థలమం దాక పడకకుర్చీయుంచి గదిలోకి వెళ్లుచున్నారు.)

విమల— ఊరకుండుఁడు. చిననాయన వచ్చుచున్నాఁడు. కృష్ణతాతా! ఆయనకు నీవల్ల నేమయినఁ గావలెనేమో! వెళ్లక కొంతసేపిక్కడనుండు.

కుబేర—(ఇద్దఱు సేవకులవయి నానివచ్చి పడకకుర్చీమీఁదఁ గూర్చున్నాఁడు)

సేవకులు— (ఒకఁడు పొడుముకాయయు, ఒకఁడు చేరుమాలును చేతఁబట్టుకొని కుర్చీవెనుక నిలుచున్నారు.)

విజయ— చిననాయనా! చాలప్రొద్దెక్కినది.

కుబేర— ఏమీ ప్రొద్దెక్కలేదు.

విమల— అవును! ఏమీ ప్రొద్దెక్కలేదు.

కుబే— పిల్లా! అల్లాగనకు. మీ అన్నయ్యకు కోపము రాఁగలదు. చాల ప్రొద్దెక్కినది.

విజయ— ఏమండీ! పదిగంటలు దాఁటినదే!

కుబే— దాఁటితేమాత్రమేమి? ఇంకా, తొమ్మిదిగంటలకుగాని సూర్యాస్తమయము గాదు. నేనెవ్వరితోఁ జెప్పినా ఉదయమువనే లేచినానందును.

విజయ— చిననాయనా! నిన్ను నొప్పింపవలెనని నా తాత్పర్యము గాదు.

గుబేర — కాకపోవచ్చును. నన్ను నొప్పింపవలెనని యెవ్వనికిని తాత్పర్యము లేదుగాని ప్రతివాఁడును నన్నే నొప్పించుచున్నాఁడు. వాయుదేవునకు నామీఁద నేమియు అసూయ లేదుకాని, తాను వీచుటమాని, ఉక్కపెట్టి నా దరికి రాక నాకు శత్రువయినాఁడు.

విజయ — గాలిని నేను శాసింపలేను. నాయింట నేదైన సదుపాయలోపముండి దానిని తీర్చుటకు సాధ్యమయ్యెనా, మిక్కిలి యుత్సాహముతో సవరింతును.

కృష్ణ—(ప్రక్కమొగముగా)అక్కఱలేదబ్బాయి ఈయన కీతట్టు గాలి యీవలేకలదు.

కుబేర— నీవు మంచివాఁడవే! అయితే, నా సుఖముకొసమని చెప్పి ప్రజలు తమ కిబ్బంది కలిగించుకొనుటకు నే నెంతమాత్రము నంగీకరింపను. అయినప్పటికీ నీవు కోరుచున్నావుగనుకఁ జెప్పుచున్నాను విను. నా పడకగది సౌఖ్యకరముగాలేదు. అది యేటివార నున్నది.

కృష్ణ— (ప్రక్కమొగముగా) అవును. నట్టేట నుండవలసినది.

విమల—చిననాయనా! అది మార్చుట సుకరమే! వెనుకగదిలో నీవు పరుండవచ్చును.

కుబే— వెనుకగదులంటే నాకసహ్యము. వానిలో మనుష్యసంచారమే కనఁబడదు.

విజ— ఈ యుత్తరపుదిశ నొకటున్నది. దానిలో నిద్రింపవచ్చును.

కుబే— ఏమీ! నాకొంప తీయఁదలఁచుకొన్నావే! దాని కిటికీ కొండగాలి కెదురు గాదటోయి! ఎంతభక్తి! నా శరీరము పాషాణమనుకొన్నావాయేమి?

కృష్ణ— (ప్రక్క-మొగముగా) ఈ మహానుభావుఁడు వెన్నెలకు వడదాఁకే యేడు మల్లెపూవులయెత్తువాఁడండీ! చిన్ననాఁడు త్రాగ్లుతవ్వినశక్తి అంతా పోయినది.

విజ— (చెల్లెలితో ప్రక్క-మొగముగా) నా ఓర్పుంతయు నశించుచున్నది.

విమ— (అన్నతో ఆరీతినే) కొంచెమోపికపెట్టు. ఇతఁ డిక్కడ నిఁక చాలదినములుండఁడు.

విజయ— (చెల్లెలితో ఆరీతినే) ఉండెనా, యేదో పెద్ద కలహము సంప్రాప్తించును.

కుబే— ముట్టుదానికివేసినట్లు నా వసారాలోకి పథ్యము పంపుచున్నారు. నాకోసము మీ రిబ్బందిపడుట నా కెంతమాత్రమును సమ్మతముగాదు. అయినా, నాతో సహపంక్తిచేయుటకు మీకిష్టము లేదుగద!

విమల—(అన్నతో, ప్రక్క-మొగముగా) నన్నుత్తరమియ్యనీ! (పయికి) ముఖ్యముగా— నాకు పరమసంతోషము! అన్నయ్యనుమాత్రమ క్షమించు. అతఁడు కొట్టునొద్దకు త్వరగా వెళ్లవలసివచ్చుచుండును.

కుబే— సాయంకాలమయినను నా సహపంక్తికి రాఁగలిగెనా బాగుండును. దీపాలు పెట్టినతరువాత భోజనమంటే నాకసహ్యము.

విజ— సరే! ఇంతటినుండి రాత్రిభోజనము సూర్యాస్తమయకాలమందే చేయుదము.

కుబే— నానిమిత్తముమాత్రము మీరిబ్బందిపడవద్దు.

కృష్ణ— (ప్రక్క-మొగముగా) ఏమిసరసుఁడండీ!

విజ— ఇఁక నీనిమిత్తము నేఁ జెయ్యవలసిన మార్పు లేమయిన నున్నవా?

కుబే — ఏమీ? నామనస్సును కలఁతపెట్టుటకే ప్రయత్నపూర్వకముగా ఆమాట అనుచున్నావు. నా నిమిత్తమయి యేమీ అక్కఱలేదని యీవఱకే నేను స్పష్టముగాఁ జెప్పియుంటిని. అయినప్పటికి, చెప్పుమన్నావుగనుక విను. నే నెప్పుడును, మేడపయినిఁ గాపురముండేవాఁడను. నిజము చెప్పనా? మేడలేనిచోటఁ గాపురము నాకు సరిపడదు.

విజ— అయ్యో! నాకు మేడయిల్లులేదే!

కుబే— లేకపోయెనా కట్టవోయి! అబ్బాయి! కట్టు! ఒకమేడకట్టు! కాని నాకై మిత్తమయి మాత్రము కష్టపడకు.

విమల—చిననాయనా! నీ సుఖముకొఱకు ఏమిగావలసినను, అన్నయ్యయయినను సరే, నేనయినను సరే, శక్తివంచనలేకుండా, చేసి నీ యస్వస్థత మాన్పుటకు—

కుబే—(మాటనడ్డగించి) నాకస్వస్థముగానున్నదని నీకెవరు చెప్పినారు. నాకాలాగులేదు.

కృష్ణ— (ప్రక్కమొగముగా) మదిఖివలన మదికిమాత్రమే స్వస్థత తప్పినది.

విమ— అదిగాదు. పూర్వమున్నంత దృఢశక్తిలేదనే యభిప్రాయముతోఁ జెప్పినాను.

కుబే— పూర్వము నాకెట్టి దృఢశక్తియుండెనో తెలియుటకు నీకెట్లు సాధ్యము! నేనీదేశము విడిచి యేఁబదిసంవత్సరములయినది.

విజ— చెల్లెలి యభిప్రాయ మేమనఁగా— ఏఁబదిసంవత్సరములకు పూర్వము నీవు, ఇప్పటికంటె చిన్నవాఁడవని—

కుబే— (కోపముతో) కాను!

విజ—పోనీ! ఆలాగే కానీ! నీమాట కడ్డము చెప్పను. (ప్రక్కమొగముగా, చెల్లెలితో) మన మిక్కడినుండి లేచి వెళ్లదము. ఇఁక నాకు ఒళ్లు తెలియదు.

విమ— చిననాయనా! కొంచెము సేవ మేమావలనుందుమా?

కుబే— తప్పకుండా!

విజయ- విమల— (వెళ్లుచున్నారు.)

కుబే—(కుర్చీమీఁదనుండి ప్రక్కకు తిరుగకయే తొందరగాను, బిగ్గరగాను) పాడుము కాయ! పాడుము కాయ!

ఒకసేవకుఁడు— (అందిచ్చును)

కుబే— (వెనుకటివలెనే) చేరుమాలు. చేరుమాలు.

రెండవసేవకుఁడు— (అందిచ్చును)

కృష్ణశర్మ— (ప్రక్కమొగముగా) ఇంతశాంతచిత్తుఁడయిన యీ యజమానునితో ఈ సేవకు లెంతసౌఖ్యపడుచున్నారు.

కుబే—(గట్టిగా పాడుముపీల్చుట నభినయించి తనలో) నామాట కడ్డము చెప్పఁడఁట! నిశ్చయమే! ఎందుచేత? నేను భాగ్యవంతుఁడనని తానెఱుఁగును. ముసలివాఁడనని యెఱుఁగును. అందుచేత నేను త్వరగా చావవలసినదని వానికోరిక! నే నిల్లు వాకిళ్లు విడిచిపెట్టి యేఁబదియేండ్లు దేశాలవెంబడిని తిరిగివచ్చిన దిందుకొఱకే! ఇందుకొఱకే! ఇపుడు నాచేతిలో భాగ్యముండుఁగాక! నేఁ బోఁగొట్టుకొన్న సుఖము తిరిగి రానేరదుగదా! మన్యపుగొడ్డు పడ్డప్పుడు శవకళేబరమును పొడిచి తినుటకు గెద్దలు రామబందులువలె, ఈ దురాశపాతకులయిన బంధువులుమాత్రము చుట్టుకొని యున్నారు.

కృష్ణ— తమకు నావల్లఁ గావలసిన దేమైన నున్నదా?

కుబే— నాకు ఎవరివల్లఁ గావలసినదీ, యేమీలేదు. అలాగే నన్నుఁగూడా ఎవరును ఏమీ కోరరని నాకోరిక!

కృష్ణ— తమవల్ల నేమియు నాజన్మముతో అక్కఱలేదు. తక్కినవారిమాటయు ఇట్టిదే!

కుబే— నీవు మోటదున్నపోతులాగున్నావు. పో! నీపని చూచుకో! ఇఁక నాకన్నుల కగపడకు.

కృష్ణ—(ప్రక్కమోముతో) ఇఁక తనకన్నుల కగపడవద్దట! ఏమి యుత్తముఁడండీ! (కుడివైపునుండి వెళ్ళుచున్నాఁడు)

తెరయావలినుండి చండసేన— నేను రావచ్చునా?

కుబే— చండసేనవలె నున్నది. త్వరగా, త్వరగా! (సేవకులతో) పొండి, దూరముగాఁ బొండి.

చండసేన (ప్రవేశించుచున్నది)— ఏమి అల్లుఁడుగారు!

కుబేర— ఓహో హో! చండమ్మత్తగారా? నమస్కారము! నీవు ఖులాసాగా నున్నావుగద!

చండ—ఆ! ముసలిదానను. నామాటకేమి? మీదేహములో నెట్లున్నది? ముఖ్యముగాఁ గావలసినవిషయమిది!

కుబే—(ప్రక్కమోముతో) ఎంతదయగలయిల్లాలు! (పయికి) వందనములు! నిన్నటికంటె చాల ఖులాసాగా నున్నట్లే తోఁచుచున్నది.

చండ— నామనసిపుడు కుదుటఁబడ్డది. నీకు జబ్బుచేసినట్లు పాడుకలవచ్చి యేమీ తోఁచినదిగాదు.

కుబే— కలా? నిజముగా? నన్ను కలగన్నావా?

చండ— ఏమొట్టుపెట్టితే ఆమొట్టు! ఆ దుస్స్వప్నముచేత రాత్రి తెల్లవాఱుదాఁక మరి నిద్రపట్టినదిగాదు. మంచముమీఁదనుండి లేవఁగానే యిక్కడికిఁ బరుగెత్తి వచ్చితిని. ఉదయాన చలిగాలి వీచెను. అందువల్ల నీవులేచినదాఁకా మనస్సు చాలావేదనపడ్డది.

కుబే— నీకు కలలో నేనెట్లు కనఁబడ్డాను.

[చం]డ — (ప్రక్కమోముతో) మనకు మంచిదారి చూపినాఁడు. (పయికి) నేను [చె]ప్పితినా నీవు నమ్మవు.

[న]మ్మకేమి?

చండ — పరిహాసమనుకోకు! నీవివాహామంట! మంగళస్నానమునకు వేణ్ణీళ్ళకు బదులుగా, నీళ్లబ్రాహ్మణుఁడు, ఇవతుమంటి చన్నీళ్ళబిందె తీసికొనివచ్చి ఆబిందెడు నీళ్ళు కపాలున నీమీఁద క్రుమ్మరించినాఁడఁట! రాత్రియాఁదరగాలికనుక చలియెత్తి నీకు దవడలు దగ్గఱఁబడి మాటలేకపోయినదఁట! నేనే అపుడు శరీరమంతా కాఁచేసరికి మెలమెల్లగా మాటాడినావఁట!

కుబే— ఇది పరిహాసము.

చండ— కాదు నిజము. నేఁ జచ్చినట్లే! నేనుబూ—

కుబే— (మాటకు అడ్డమువచ్చి) వద్దు. వద్దు. నమ్ముచున్నాను.

చండ— కలలో పెండ్లికూఁతురుకూడ కనఁబడ్డది.

కుబే— (సంతోషముతో) ఆ పెండ్లికూఁతురెవరెవరు?

చండ— నేనిపుడు లక్షవరాలిచ్చినా చెప్పను.

కుబే— అత్తా! నిజముగా నావిషయమయి అభిమానించుకొని వేదనపడేవారు ఈ భూమియందొకరైన నున్నారని నాకీవఱకును కలలోనయినా తోఁచలేదు.

చండ— మాయలు, మర్మాలు, ఎఱుఁగని ఆఁడువాండ్రకు యోగ్యులయిన తమ బంధువులమీఁద స్వభావసిద్ధముగానుండు ప్రేమ యెట్టిదో నీవెఱుఁగవు.

కుబే— ఒక్కపీట తెచ్చివేసెదను. కూర్చుండు.

చండ— వద్దు! వద్దు. (తానే పీట తెచ్చివేసికొని యెడమప్రక్కను గూర్చున్నది.)

కుబే— అత్తా! ఆఁడంగుల ప్రేమ యెట్టిదో ఆసంగతి కొంత యెఱుఁగుదునని వెనుక తలఁచుకొనేవాఁడను. ఇంతేకాక, స్త్రీజనానురాగము నాపైని కలిగినదనియే యొకప్పుడు భావించితిని. కాని, నేను మోసపోయితిని. అత్తా! (తొందరగా లేచి బల్లగ్రుద్దుచు) నిజముగా నేను మోసపోయితిని. (తిరిగి నెమ్మదిపడి కూర్చుండి) క్షమించు. నిష్కారణముగా తొందరపడితిని.

చండ— అన్నా! అల్లుఁడా! నిశ్చయముగా నిన్ను నేరపెట్టను. నీవంటి యుత్తముని మోసపెట్టుట కాయాఁడుదానికేమి పిశాచ మావేశించినది చెపుమా!

కుబే— అత్తా! నా అప్పటిదినములలోకూడాను.

చండ — నీ యిప్పటి రూపరేఖావిలాసములు నేనెఱుఁగుదునుగదా! ఇందువల్లు, అప్పు డేలాగుననుండేవాఁడవో గ్రహింపఁగలను.

కుబే — (ప్రక్కమోముగా) నేనీప్రాంతమునకు తిరిగివచ్చినతరువాతఁ జూచి స్త్రీజాతిలో ఉచితానుచితములెఱిఁగినది యీ బిడయొక్కతెయె!. (కుర్చిదగ్గ దీసి, పయికి) తనకు సగముకాలమయినపిమ్మట, తనముప్పు వెళ్లఁబుచ

రెవ్వరులేకుండ తనకు తానొక్కఁడే యగుట చాల దుఃఖకరముగదా!

చండ— ఆమాట నిజమే! కాని కుబేరసేనుఁడుగారికిమాత్ర మట్టివిచారము పనిలేదు.

కుబే— నామాట సత్యము. అట్టి దుఃఖము ముఖ్యముగా నాకే కలిగియున్నది.

చండ— ఈవిషయములోమాత్రము నీతో నే నేకీభవింపను. నిశ్చయముగా నీమాట తప్పు అనుచున్నాను.

కుబే— (ఆశతో) నీకుఁ దెలిసినసంగతుల మీఁదనే యయియుండునా?

చండ— (పరిహాసముతో) నేను ప్రత్యక్షముగాను స్పష్టముగాను ఎఱిఁగినసంగతుల మీఁదనే.

కుబే— (ప్రక్కమొగముగా) ఆహాహా! (పయికి) నాముప్పు గడపఁగలిగినవారెవరో చెప్పు. నావేడుక పట్టఁజాలకున్నాను.

చండ— (ప్రక్కమొగముగా) ఇప్పుడప్పుడే నా యభిప్రాయము చెప్పితినా రసభంగ మగును. (పయికి) ఎవరనఁగా,—

కుబే— అవును. ఎవరో చెప్పు.

చండ— నీ అన్నకొడుకును, కూఁతురును.

కుబే— ఇంతేనా! నాముప్పుగడుపువారు వీండ్రా? అవును. తమకడుపు నించుకొనుటకుఁగాను ఎలుకల ముప్పుగడపే పిల్లులవంటివారు.

చండ— అయ్యయ్యో! వాండ్ర నాలాగు తలఁపకు. మన్యప్రాంతములలో జమీన్దారులయొద్ద పెద్దపెద్ద యుద్యోగాలుచేసి భాగ్యము సంపాదించి తెచ్చినారుగదా! ఆభాగ్యమయినా వందలు, వేలు, కాదు. లక్షలాదిధనముగదా!

కుబే— అవును. నీతోఁ జెప్పుచున్నాను.

చండ— (ప్రక్కమొగముగా) నాకోరికకూడా, మొట్టమొదట నీసంగతి నిశ్చయముగాఁ దెలిసికోవలెననియే! (పయికి) ఇట్టి లక్షాధికారి, వంచకులయిన యితరులవల్ల మోసపడకుండ తప్పించుకొనుట శక్యముకాదు.

కుబే— శక్యముకాదనియే నేనును భయపడుచున్నాను.

చండ— అయినా, ఆ భయ మక్కఱలేదు. నీభాగ్యవిషయములో నాకేమైన నపేక్షయుండునా? అట్లే నాకంటె ఎక్కువ యపేక్ష నీ యన్నకొడుకునకును, కూఁతునకును లేదు.

కుబే— ఆహాహా! అత్తా! నీవు కాపట్యములేనిదానవుగనుక ప్రతివారిని నీవలెనే యెంచుకొందువు.

చండ— నేనంతయెక్కువదానను గాను. వారియెడల నీకుఁ గనఁబడ్డదోషమేమి?

కుబే — వాండ్రతివినయముఁ జూపుచున్నారు. నేనడుగుటయే తరువాయి!

చండ— అది న్యాయమేకదా!

కుబే— కాదు. అన్యాయము వారికాప్రేమ హృదయపూర్వకమయినది కాఁజాలదు. ఏమా? నేను కొన్నివేళల మండిపడుచుందును. కొన్నివేళలందు చంచలచిత్తముతో నుందును. ఏమన్నను సరే! నాకు మాఱుమాటాడరు. ఏమికోరినను సరే, తెచ్చి యిత్తురు.

చండ—ఇంత వినయము అనుమానాస్పదముగానే యున్నది. వాండ్రింత పన్నాగము పన్నినారని నేనీవఱకు తలఁపలేదు.

కుబే— సందేహమేమి? నిశ్చయముగా అనుమానాస్పదము. (పొడుము పీల్చుట నభినయించును.) ఒకవేళ అట్లుగాకపోవచ్చును. నిష్కారణముగా వాండ్రపట్ల ననుమానపడుట యెందుకు?

చండ— (ప్రక్కమొగముగా) ఓహో! మాఱుధోరణిలోఁ బడ్డాఁడేమి చెపుమా?

కుబే — నామాట కెదురాడుటకు నేనొప్పనని వాండ్రెఱుఁగుదురు. అందుచేత, నామాటచొప్పుననే నడచినయెడల నేచిక్కులేదని వాండ్రు తలఁచియుందురు. ఇఁక వ్యయము మాటకా? మా విజయసేనునివంటి స్థితిమంతున కది యొకలక్ష్యము గాదు.

చండ— (ప్రక్కమొగముగా) నాకిపుడు త్రోవదొరికినది. (పయికి) అనఁగా, పూరఁ మట్టిదే! స్థితిచెడకముందు——

కుబే— స్థితిచెడుటయేమి?

చండ— అతని యాస్తియంతయు పోయి ఋణగ్రస్తమయినమాట నీవును వినియుందువు.

కుబే— ఒక్కమాటయినను వినలేదే! (పొడుముపీల్చుట నభినయించును)

చండ— ఆలాగయినయెడల ముందుగాఁ జెప్పుట నాకెందుకు! •

కుబే— ఎంత చక్కని మర్యాదగల యిల్లాలవమ్మా! కానీ! మావానిస్థితి చెడ్డదా?

చండ— సంపూర్తిగా——

కుబే — (పొడుముపీల్చుట నభినయించి) ఈసంగతి తెలిసినందుకు నాకు చాల సంతోషమయినది. ఏమా? (లేచుచున్నాఁడు) వీని నక్కవినయమునకు హేతు విపుడు తెలిసినది. వానివద్ద నేననుకొన్నదానికంటె ఎక్కువమోసమున్నది. ఈ దుర్మార్గము——అనగా, తనయింట నాకు బసయిచ్చుటయు, నాకు సర్వసౌఖ్యములు గలుగునట్లు జాగ్రత్తచేయుటయు, దీనికర్థమేమి? నాకు సకలపదార్థములను దెచ్చి యిచ్చుచు, నామొగముఁజూచుటకు వానికెంతసాహసము చెల్లినది!

నందలి సంసారసౌఖ్యముల విడఁనాడి సమీపమందలి యొక మఠమునందు నివసించుచు, మధ్యమధ్యను హిందూదేశమందలి పుణ్యక్షేత్రములకుఁ బోయి, హిమవత్పర్వతము మొదలగు నిర్జనప్రదేశముల విహరింపుచు, వారి శిష్యులలో ననేకులు సన్యాసాశ్రమమును చైకొనియున్నారు. వారి శిష్యులలోఁ గొందరు గృహస్థాశ్రమమునందే యుండి పరమహంసగారి మతబోధానుసారముగాఁ బ్రవర్తించుచున్నారు. కేశవచంద్రసేనుగారి యవసానకాలములో పరమహంసగారి యుపదేశములయందు వారికి దృఢమైన నమ్మకము కలిగినది. కేశవచంద్రసేనుగారి మతాభిప్రాయములలో నిట్టిమార్పు కలిగినందుకు వారి స్నేహితులనేకులు మిక్కిలి యాశ్చర్యపడిరి. మత సంస్కరణుఁడని పేరువడసిన కేశవచంద్రసేనుగారు వారి యంత్యావస్థయందు మతవిషయములందు భిన్నాభిప్రాయులై తమ స్నేహితుల కందఱకు నత్యాశ్చర్యము వొడమునట్లు నూతన మతావలంబకు లగుటకు ముఖ్యకారణ మీ పరమహంసగారి మతబోధయేయని వేఱుగఁ జెప్పఁ నక్కఱలేదు. కేశవచంద్రసేనుగారి నూతన మతాభిప్రాయములలో ముఖ్యముగా భగవంతుని మాతృభావమునుగూర్చి వారు బోధించుచువచ్చిన మతసిద్ధాంతములఁ బట్టి వారి యాంగ్లేయ స్నేహితు లనేకులు వారిని వదలివేసిరి గాని హిందువులకుమాత్రము వారియందు మిక్కిలి యనురాగము కలిగినదనుట కెంతమాత్రమును సంశయము లేదు. అదెట్లున్నను, బ్రహ్మసమాజస్థాపకులగు కేశవచంద్రసేనుగారి యభిప్రాయభేదములకు ముఖ్యమైన కారణ మిప్పుడు వెల్లడియైనది. కేశవచంద్రుగారికి మన స్థైర్యము చెడిన హేతువుచే నిట్టి యభిప్రాయభేదము కలిగియుండునని కొందరిదివరలో జేసిన యూహ సరిమైనది కాదనికూడ స్పష్టమైనది" అని మాక్సుమూలరుగారు వ్రాసియున్నారు. మన దత్తుగారికిఁ జిన్నవయసునందే శ్రీ పరమహంసగారి యుపదేశములయందు విశేషముగా నమ్మకము కలిగినదనుట కెంతమాత్రమును సందేహము లేదు. ఆ కాలమునందు వంగదేశములో సాధారణముగా వ్యాపించియున్న, భజనకూటము లన్నిటికి నరేంద్రుగారు తప్పక పోవుచుండిరి. దత్తుగారికి గానమందు మిక్కిలి యభిలాషకలదు. గానవిద్యయందును, సంగీతశాస్త్రమునందును వారికి విశేషమైన ప్రజ్ఞకలదు. ౧౮౮౪ వ సంవత్సరమునందు దత్తుగారు పట్టపరీక్షలో కృతార్థులగుటకు బూర్వము వారికిసంసారసౌఖ్యముల విడిచిపెట్టవలెనను యభిప్రాయ మంతగా నున్నట్లు కానుపింపదు. ఆసంవత్సరానంతరమునుండి వ్యవహారములు మారినవి. దత్తుగారు న్యాయవాదివని నేర్చుకొను కాలములోగూడ తరుచు పరమహంసగారియొద్దకుఁ బోవుచుండిరి. సహాయ రసవాద పరీక్షకులుగానుండి, రసవాదశాస్త్రవిషయసంఘ సామాజికులగు దత్తుగారి జ్ఞాతియైన రామచంద్రదత్తు బి. ఏ. గారివలన నీయనకు ప్రథమములో శ్రీ పరమహంసగారితోఁ

బరిచయము కలిగెను. తరువాత సంవత్సరమునకు లోపలనే మన దత్తుగారు సన్న్యాసాశ్రమమునఁ బ్రవేశించిరి. పరమహంసగారి శిష్యులలో వీరు ముఖ్యులు. స్వామిగారి యందు పరమహంసగారికి విశేషమైన యనురాగము కలదు. కేశవునికొక శక్తియే కలదు కాని నరేంద్రునికి పదునెనిమిది శక్తులుగలవని పరమహంసగారొకప్పుడు చెప్పిరట నరేంద్రునికి బ్రహ్మజ్ఞానమును భగవద్భక్తియుగూడ విశేషముగా నున్నవని పరమహంస గారు మరియొకప్పుడు చెప్పినట్లు తెలియవచ్చుచున్నది. తన బుద్ధిబలముచేతను, ఆధ్యాత్మికశక్తిచేతను నరేంద్రుడు ప్రపంచమంతయు గంపింపజేయగలడని పరమహంస గారు వాక్రుచ్చిరి. ౧౮౮౬ వ సంవత్సరము ఆగష్టునెలలో శ్రీ పరమహంసగారు లోకాంతరగతులైరి.

శ్రీ పరమహంసగారి మరణానంతరము వారి శిష్యులందరును చెదిరిపోయి కొంత కాలమువరకు దేశాటనము సలుపుచుండిరి. వివేకానందులవారు హిమవత్పర్వతములకుఁ బోయిరి. కొందరు టిబెటుదేశమునకును కొందరు కాశ్మీరదేశమునకును, మరికొంద రితరస్థలములకును బోయిరి శిష్యులందరీప్రకారము దేశాటనము సలుపుచు గొంత కాలము గడపిరి. తరువాత కొంతకాలమునకు వివేకానందులవారు వంగదేశమునకు వచ్చి, శ్రీ పరమహంసగారి శిష్యులనందఱి నొకచోటకుఁ జేరిరి. మఠము నొకదాని నేర్పఱచుకొని, శ్రీ పరమహంసగారి శిష్యులందరు దానిలో నివసించుచుండిరి.

వివేకానందులవారును వారి యనుచరులును సాధారణముగా మనము చూచు చుండిన సన్న్యాసులవంటివారు కారు. మఠములలో నివసించి కొంతకాలమునకు సమస్త విధములను చెడిపోయిన సన్న్యాసుల నెందరినో మన మెఱిఁగియున్నాము. వీర లట్టి వారలు కారు. స్వదేశస్థులయొక్కయు, మానవజాతియొక్కయు క్షేమలాభములకై శ్రమపడుటయే శ్రీ స్వామివారి ముఖ్యోద్దేశ్యమైయున్నది. వారి యుద్దేశములు నెరవేర్చుకొనుటకై శ్రీ వివేకానందులవారు కలకత్తానగరమును వదలి దేశాటనమునకుఁ బయలువెడలిరి. చీనా, జపానుదేశములందును, టిబెటు, కాశ్మీరము మొదలగు దేశములందును, హిందూదేశమందలి యన్నిభాగములయందును సంచరించిరి. దేశాటనము సలుపుటలో శ్రీస్వామివారు చేసిన పనులనుగూర్చి చిత్రకథలనేకములుగలవు. శ్రీస్వామివారు ద్రవ్యము నపేక్షింపరు. ఆహారము గోరరు. అట్టి స్థితిలో శ్రీస్వామివారు ఆసియా ఖండమునందంతట నెట్లు ప్రయాణముచేసిరో, ఎట్టికష్టములకులోనై, శ్రమలనోర్చిరో మన మూహింపఁజాలకున్నాము. ౧౮౯౨ వ సంవత్సరము ఆగష్టునెలలో శ్రీస్వాముల, వారు తిరువనంతపురంబునకు విచ్చేసిరి. ఆకాలమునందు చెన్నపట్టణమునందు సహాయ లేఖకోద్యోగియులగు (Assistant Accountant General) యమ్-భట్టాచార్య

యమ్. ఏ. గారు పరీక్షనిమిత్తము తిరువనంతపురమునకుఁబోయి వివేకానందులవారి దర్శనముచేసి వారిని చెన్నపురమునకుఁ దోడుకొనివచ్చిరి. శ్రీ స్వాములవారంతకు బూర్వ మెన్నఁడును తమ యభిప్రాయములనుగూర్చి వెల్లడిచేయలేదు. ఈయనకు గల సహజ వాగ్ధోరణాశక్తియు, పెక్కుభాషలయందలి పరిశ్రమయు, ప్రజలకు వెల్లడికాలేదు. ఈయన శరీరసౌందర్యము మిగుల శ్లాఘనీయము. ఈయన మైలాపురియందు భట్టాచార్యులవారిగృహమునందు నివసించుకాలమునందు వీరికిని మదరాసునందు ప్రాముఖ్యత వహించియున్న కొందరికిని పరిచయము కలిగినది. ౧౮౯౨వ సంవత్సరాంతమునం దీప్రకారము శ్రీస్వాములవారిసంగతి మదరాసులో గొందరికి దెలియవచ్చినది. అది మొదలు శ్రీస్వాములవారనిగూర్చి విచిత్రమైనకథలు పట్టణమునందంతట వ్యాపించినవి. ప్రాగ్పశ్చిమదేశ వేదాంతశాస్త్ర ప్రవీణులును, మృదుమధుర వాగ్ధోరణీ నైపుణులును, ఆంగ్లేయభాషా విశారదులునునగు స్వాములవారొకరు పట్టణమునకు విచ్చేసిరని జనప్రతీతి పలుచోట్ల వినవచ్చెను, నిరీశ్వరవాదులను, నిరర్థకవిషయ ప్రాసంగికులును, మొదలగు మహానుభావులు శ్రీ స్వాములవారి దర్శనమాత్రముననే నిశ్చేష్టితులై మారు మాటాడనేరక శ్రీ స్వాములవారి యసమాన ప్రజ్ఞాపాండిత్యములకును, నిరుపమాన రూపలావణ్యాది యంగసౌష్టవమునకును, మిక్కిలి యాశ్చర్యపడసాగిరి. సంఘసంస్కరణులమని పేరుపెట్టుకొని హిందూమతోద్ధరణమునకై పాటుపడువారిని వెక్కిరించుచు పట్టణమునందంతటను సంచరించు దేశాభిమానులుకూడ శ్రీస్వాములవారి సముఖమున నోరెత్తనేరక వారి యభిప్రాయానుసారముగనే ప్రవర్తించుచువచ్చిరి.

(సశేషము)

అంతఃపురోపన్యాసము.

ఏమినాథా! నేటి సాయంకాలము మీముఖము వికసించియున్నదే! నిన్నటిరాత్రివలె చిన్నవోయి యుండలేదు. అదేమిటి? ఈల వేయుచున్నారే? పండుకొనుటకు గదిలోనికి వచ్చినప్పుడా ఈలవేయుట? ఈప్రపంచములో మీవంటి యోగ్యులు లేరని నేనొకప్పు డనుకొంటిని. ఇప్పుడన్ననో, మీరు పెనుభూతమువలె నున్నారే?

నిద్రించెదమనుచున్నారా?

లేదు. నేను మిమ్మున నిద్రపోనియ్యను. మీతో మాటలాడుటకు నాకిప్పుడే మంచి సమయము నేను చెప్పఁబోవునది మీరు వినకతీరదు. దినమంతయు దయ్యము వలె పనిఁజేసి రాత్రి యొక్కమాటైనను మీతో ముచ్చటించఁగూడదు కాబోలు?

నేను తఱుచుగా మాటలాడుదానను కానని మీరెఱింగియేయున్నారు. నిశీథసమయమందైన నొక్కసారి మాటలాడకూడదా? ఆహా! ఏమిదింత!

మీ చొక్కాయి కొక బొత్తము పోయినప్పుడు పెంకులెగిరిపోవునట్లు మీరు కేకలు వేయవచ్చు కాబోలు?

మీరు కేకలువేసి యిల్లుపెట్టుకొనలేదనుచున్నారా?

అవును. మీకు కోపమువచ్చినప్పుడు మీకీప్రపంచజ్ఞానమే యుండదు.

మీకెప్పుడు కోపమురాలేదనుచున్నారా? నిజముచెప్పండి. రాలేదా? నేనెప్పు డాగ్రహమన్ననేమో యెరిగియుండకపోయినను ఇప్పుడైనను తెలిసికొనెదను. నేనిన్ని దినములనుండి మీతోఁ గాపురముచేయుచు నింతమాత్రమైన దెలిసికొనకపోవలెనా?

కోటుబొత్తము పోయినంతమాత్రమున నట్లు మీరు గింజుకొనవలెనా? మీ యదృష్టవశమున నావంటి భార్య దొరికినది కాని పూజారి వెంకమ్మవంటిది సంప్రాప్తమైనయెడల మీపాట్లు కనఁబడును. నాచేతులో నొకప్పుడును మంచి సూదికాని దారముకాని లేదుకదా? మీతోను, మీపిల్లలతోను నేనెంత శ్రమపడుచున్నానో దేవుని కెరుక? నేనెంత శ్రమపడినను మెప్పులేదుకదా? కర్మముచాలక వెధవబొత్తము పోయినందు కింత యల్లరి పెట్టెదరా? బాజారునకుఁబోయి బొత్తము తిరిగి కుట్టించుకొనరాదా? కుట్లుకుట్టడమునకు నేను జంగముదానను కాను. ఇంటిలో నొక గుండుసూదినైన నోచుకొననప్పుడు కుట్టుకుట్టుటెక్కడ? ఈప్రపంచములో నావలె భర్తయొక్క బొత్తములు జాగ్రతపెట్టునది మరియొకతె లేదు. నేను ముఖ్యముగా మూఁడుసారులు చెప్పుచున్నాను. మీరు వినినను వినకపోయినను సరే. నేను కాపురమునకురాక పూర్వము మీరు తొడుగుకొను చొక్కాయి లిప్పుడున్నపక్షమునకు—

నేనాసంగతి చెప్పకూడదా? నేను చెప్పక మానను. "పుట్టినబుద్ధి పుడకలతోఁ బోవలె" నని నట్లు మీకుపుట్టినగుణమెట్లుమానును? నేను నోరెత్తినపుడెల్ల మీరు మండిపడి నన్ను మాటలాడనివ్వరు నేను చెప్పఁబోవునది మీరు వినరు. ఇది మగవాండ్రకుఁ బుట్టిన పాడుబుద్ధి. వారెన్నిదినములైనను "వడవడ" వాగవచ్చునట. ఆడవాండ్రు నోటికి మూతవైచికొనవలెనట! ఆహా! ఏమి యీనీతులు.

అహర్నిశము భార్య తన బొత్తములసంగతియే చూచుచుండవలెనట? ఏమి యభిప్రాయములు! రేయింబవళ్లు బొత్తముల ప్రశంసయే చేయవలసిన యవస్థ సంప్రాప్తమైనయెడల నేయాడదియు వివాహమాడదు. నామాట నిశ్చయము. లేనియెడల వారేమిచేయగలరు?

భార్య లెప్పుడును భర్తలవస్త్రములు, పాదరక్షలే కుట్టవలసివచ్చినపక్షమున,

వారికి భర్తలులేకుండుటయేట్లు?

నాకెందుకీసంత? కానున్నది కాకమానదు. మీబొత్త మూడిపోలేదని నేను నిశ్చయముగా చెప్పగలను నాకు పని కల్పించుటకు మీరాబొత్తము నూడలాగినారు. లేనియెడల బొత్తము పోవుటకు వీలులేదు. మగని చొక్కాయిలకు బొత్తములు కుట్టవలసిన దురవస్థ నాకొక్కదానికి తప్ప మరెవ్వరికినిలేదు. నిశ్చయము.

కానివ్వండి. ఈవ్యవహారము చిరకాలము జరుగునదికాదు. మీరు పెట్టు కోతలకు నే నిదివరకే సగమైనాను. మీకష్టములు త్వరలోనే గట్టెక్కగలవు. హా! మీరు నవ్వవచ్చును! మీరు సంతోషించెదరు. అందుకేమియు సందేహములేదు. ఆహా! ఏమి మీ ప్రేమాతిశయము? మీగుండియకన్న నల్లరాయి మైనను కొంచెము మెత్తగా నుండును. నాకు దినములు సమీపించినవి. నేను వెళ్లిపోవుట నిశ్చయము. నేను పోయినవెనుక మీబొత్తములు మీ ద్వితీయభార్య యెట్లు జాగ్రతపెట్టునో చూదము. మీకప్పుడుకాని బుద్ధిరాదు. అపును. మీకప్పుడు నాసంగతి జ్ఞప్తికివచ్చును. సందియము లేదు. ఎందుచేతనో నేను వేఱుగ చెప్పనక్కరలేదు. మీచొక్కాయి కప్పుడొక్క బొత్తమయిన నుండదు.

నేను రాకాసినికాను. మీరుతప్ప నన్నెవ్వరీప్రకార మనలేదు. ఏమను చున్నారు? నాసంగతి మీకుతప్ప మరెవ్వరికిని తెలియదనుచున్నారా?

దానితో నేమియుసంబంధములేదు? హా! మీరు నాకు మేరుపర్వతము నిచ్చినను నేను మీతో కాపురము చేయలేను. నేనుకూడ మీవంటి కోపధారిని కావలసినది. ఈకొంపపాట్లప్పుడు తెలుసును. మీగుణమునకు దగినభార్య యుండవలసినది. నాకును దానికిని గలతారతమ్య మప్పుడు వెల్లడియగును. నేను ముద్దులాగున మాటలాడను గనుక మీరు నామీద సవారిచేయుచున్నారు. ఇకముందు నేనుకూడ జాగ్రతపడవలసినదే. మిమ్మునజూచి పిల్లలుకూడ చెడిపోవుదురని నేను భయపడుచున్నాను. తెల్లవారినదిమొదలు పదిగంటలవరకు బొత్తములసోదియేకదా! నేడు కార్తీక సోమవారము! గోదావరిస్నానములేదు. గుడిలోనికిబోవుటలేదు! సంధ్యావందన మదివరకే సన్నగించినది. పిల్లవాండ్రు మిమ్మునగూర్చి యేమనుకొనెదరో! ఈయల్ల రంతయు వెధవబొత్తమునుగురించియేకదా? పెద్దమనుష్యు లెవ్వరు నిట్టి నీచవిషయములనుగూర్చి ప్రశంసింపరు.

నన్ను నోరుమూసికొనమనుచున్నారా? నేను మూసికొనను. ఎందుచేతనా? అందుచేతనే! చిల్లిగవ్వమైనను విలువలేని వెధవబొత్తముకొరకు మీరు నన్ను పలు బాధల బెట్టుచున్నప్పుడు నేను నోరెత్తకూడదా? అయ్యో! ఏమి నా ప్రారబ్ధము!

మీరు మగవారుగనుక నా, నాకీపాట్లు? హా! దైవమా! ఇప్పుడు నాకొక యుపాయముం తోచుచున్నది. మీబొత్తములన్నియు నూడిపోవును. నేను వానికొక దారమైనను గ్రుచ్చను. బొత్తములన్నియుఁ బోయిన వెనుక మీరేమిచేయుదురో చూచెదను.

బొత్తములు కుట్టుటకు మరియొకరు వచ్చెదరా? ఆహా! ఏమి యీబెదరింపులు! పరమశాంతస్వభావురాలైన నావంటిభార్య నిట్లు బెదరింపవచ్చునా? మరియొకరు వచ్చెదరా? నాకంఠములో ప్రాణమున్నంతవరకు నంతపని జరుగదు. నేను చనిపోయిన వెనుక. నాకెప్పుడీశ్రమ నివారణ కాగలదో తెలియకున్నది — నేను గతించిన తరువాత— ఏమి ఆ గుఱ్ఱు! పందివలె మూలుగుచున్నారే?

మీరు మూలుగుచుండుటలేదా?

అవును! మీరాప్రకారము చెప్పుట సహజమే! అయితే నాకేమి! మీ బొత్తములు కుట్టుటకు మరియొకరిని తెచ్చుకొనవచ్చును. హా! మీ రట్టిపనిజేసినను నేనాశ్చర్యపడను. మీరిప్పుడేమిచేసిననుసరే? మీవ్యవహార మిట్టిదశకు వచ్చునని జనులందరిదివరకే యనుకొనుచున్నారు? ఈ బొత్తముల వ్యవహారముతో నేనుకూడ కండ్లుతెఱచితిని! మీక్రౌర్యమంతయు ప్రపంచమునకు వెల్లడికాగలదు. నావంటి యోగ్యురాలి కెన్నిపాట్లు వచ్చినవి! దానికడుపుకాల, అదెక్కడ సంప్రాప్తమైనది? బొత్తములుకుట్టుట కది సిద్ధముగును కాబోలు! నాథా! ఇది మీకు న్యాయముకాదు. నన్నీప్రకారము వంచింపజూచుట మీకు తగునా? మీరెన్నిలోపములఁ జేసినను నేను నూరుమూసికొని సగము చచ్చినదానివలె సంచరించుచున్నాను. నాయింటికి నాకు స్వతంత్రములేదా? అయ్యో! నేనెంత మందభాగ్యురాలను! నేను మీవలె కఠినహృదయురాలనుగాను. పనికిమాలిన బొత్తమునకై మీరు నన్నిట్లు వేధించుచున్నారు. తెడ్లవంటి కఱ్ఱలతో మీరు ప్రతిదినము తోలుబంతు లెగరవేయుటెందుకు? క్రిందను మీదను పడి కాళ్ల విరుగగొట్టుకొనుటెందుకు? పరుగెత్తునప్పుడు కోట్లబొత్తములు పారవైచుకొనుటెందుకు? బొత్తములూడిపోయినందుకు నాపై దండెత్తుటెందుకు? అయ్యో? నా కిట్టి దురవస్థ సంప్రాప్తమగునని కలలోనైన నెరుగను! పైపెచ్చు రంకుముండలనిండ్లకు తీసుకొనివచ్చుటకూడ తటస్థించును కాబోలు. మీపిల్లలను మీబొత్తమును మీరు జాగ్రతచేసికొనవచ్చును. నేనిక మీతో కాపురముచేయలేను. నేను పోయినవెనుక మీరు స్వేచ్ఛగా తిరుగవచ్చును. శీఘ్రకాలములోనే మీకోరిక లీడేరగలవు.

హా! దైవమా! నన్నీపాడుజన్మమెందు కెత్తించితివి. ఈ- బొ- త్త—

ఈప్రకార ముపన్యసించుచు భార్య నిద్రపోయి తన మగని కయిదువందల రూప్యముల జీతముగల యుద్యోగమైనట్టు కలగనెనట. ఆహా! ఏమి దైవమాయ!

విజ— నేను చాల వ్యాకులపడుచున్నాను. వెదకితే ఆతనియొద్ద మంచిగుణము లేశము గనఁబడకున్నది.

కుబే— లేదత్తా! మంచిగుణము లేశమునులేదు. అంతా కృత్రిమమే! తానేగడుసు వాఁడ ననుకొన్నాఁడు. నాకీమాత్రమును తెలియదనుకొన్నాఁడు. అసలు నేను దేశాలన్ని జయించినవాఁడను. నాకు సర్వోపచారములు చేయనియెడల నావల్ల తనకేమీ దక్కదనుకొని యింతపని చేసినాఁడు. కనుక, ఇపుడు వానికేమీ దక్కనియ్యను.

చండ— (ప్రక్కమొగముగా) ఎట్లయినను వానినోట మన్నుపడ్డట్లే! (పయికి) శాంతించు! అల్లుఁడా! శాంతించు. ఈలాగు తొందరపడితివా నీకు దేహములో జబ్బుచేయఁగలదు. నాకు నీకోసము బెంగగానున్నది.

కుబే— అత్తా! నీకు నామీఁద పరమవాత్సల్యముగదా! (కూరుచున్నాఁడు.)

- (ఎడమవైపునఁ గూరుచున్నది.)

చండ— అత్తా! దైవసాక్షిగాఁ జెప్పుచున్నాను. నీకు నాపట్లఁగల నిర్హేతుక జాయ

కుబే— కటాక్షముచూచి నాహృదయము కఱఁగిపోవుచున్నది. ఈవఱకు నాతోఁ
మాన బంధువులందఱు 'నీయింటికి చు కేమిచ్చెదవు.' మాయింటికి వచ్చి
జేరిన నాకేమితెచ్చెదవు. అనేదుర్మార్గులె? (పా. - పీల్చుట నభినయించును.)
తివా

చండ— నాభాగ్యమును, అలాగటిదే. నాకు కడుపునఁబుట్టిన పిల్ల యొక్కర్తున్నది. ఇఁక కొడుకులులేరు. కొమ్మలులేరుగదా! నాజీవము 'హరీ' అన్నతరువాత నాయాస్తి అంతా తమకే వచ్చునుగదా! అయినప్పటికీ, ఆపిల్ల దాని నెవరి చేతిలోఁ బెట్టుదామనిచూచినా నాసర్వస్వమూ ఇప్పుడే వ్రాసియిమ్మని కోరే చండాలులే! ప్రపంచమంతు అందఱు తమ కాయుష్యము తమ కారోగ్యము కోరువారే! మోసకృత్యములేనివాఁడొక్కఁడయినా కనుపడఁడోయి నాయన!

కుబే— నిజముగా! మీపిల్లదానికేవయినా సంబంధా లీవఱకు వచ్చినవా?

చండ— కావలసినన్ని—

కుబే— అయితే పిల్ల యింతకాలము పెండ్లిచేయకూరకున్నావేమి?

చండ— నిజముచెప్పుదును. వింటివా?

కుబే— వినవలెననియే అడుగుచున్నాను.

చండ— నా పెద్దకూఁతును రెండవకూతును కూకటులు గోలిచి చిన్నపిల్లలకు, ప్రథమవరులకు కాళ్లుగడిగి కన్యాధారపోసి పెండ్లిచేసినాను. ఆబిడ్డలిద్దఱును భంగపెట్టినారు. (పైఁట కొంగుతో కన్నులు తుడుచుకొనుచున్నది.)

కుబే— ఊఁజడిల్లు. అత్తా! ఊఁజడిల్లు. నీమనస్సు వెన్నకంటెను మృదువయినదిగాఁ దోఁచుచున్నది.

చండ— ఇఁక చెదిరి బ్రతికిన యీపిల్లయొక్క తెయున్నది. దానిని నీవు చూచి నావుగదా! అది జమీదారులయింటఁ బుట్టవలసినపిల్ల. దీనిని పడుచువానికిని ప్రథమవరునికిని పెండ్లిచెయ్యనని శపథము చేసినాను. ఆనుమాయము తప్పించి యే రెండవపెండ్లివానికయినా యిచ్చితినా దానికడుపున నాలుగుకాయలుకాచి ముందరకు వంతుకు రాఁగలదన్న నమ్మకముతో ఇంతవఱకు ఎవ్వరికి మాట యియ్యలేదు.

కుబే— ఈవఱకడిగినవారిలో భాగ్యవంతు లెవరైన నున్నారా?

చండ— అందఱు లక్షాధికారులే!

కుబే—(ప్రక్కమొగముగా)అయినయెడల, యీబిడ సౌమ్ముకోసమపేక్షపడునది గాదు. (పయికి) ఎంత నిక్కపటురాలవమ్మా? ద్వితీయవరుఁడే కావలెనా? ఈవఱకు ఎక్కువవివాహములాడినవాఁడు పనికివచ్చునా?

చండ— ప్రథమవరుఁడు కాకపోతేసరి. అతని కిటుక్రిత మెన్ని పెండ్లిండ్లయినా నాకు విచారములేదు.

కుబే— (ప్రక్కమొగముగా) మన [illegible] ఇదుగురను పెండ్లాడినను గురును గతించి ముప్పళ్ల కెవ్వతెయు లేకుండ [illegible] అయిదు [illegible] మొకూఁతురు మనకు దొరికెనా, పిల్లమాఁట యటుండఁగా, తల్లివల్లనే మనకు సకలోపచారములు జరిగి ముప్పగడచును. (పయికి) నీఅల్లునకు వయస్సెంతయుండవలెను.

చండ—పడుచువాఁడు గాకపోతేసరి! ఎంతవయస్సయితేనేమి? మాఅప్పకూఁతురు అఱువదియేండ్లవానికి పెండ్లిచేసినారు. ఇప్పటికి ముప్పదిసంవత్సరములయినది. దోసతోటలాగున అది కిడిపెడు బిడ్డలఁగన్నది. వయస్సెంతయితేనేమినాయనా? నీకంటె ముసలివాఁడు గాకుంటేచాలును.

కుబే— (ప్రక్కమొగముగా) మనకీసంబంధము సిద్ధించునట్లేయున్నది. (పయికి) మీపిల్లదాని కలంకారము లేమికావలెను.

చండ— (ప్రక్కమొగముగా) త్రోవలోఁబడుచున్నాఁడు. (పయికి) వారియిష్టమే కాని నాకేయలంకారములమీఁదను కోరికలేదు.

కుబే— (ప్రక్కమొగముగా) ఇంత తెలివితేటలుగలది స్త్రీజాతిలోలేదు. మఱి నీకోరికేమి?

చండ— నాకోరిక, నాఅల్లుఁడు, కూఁతురు సర్వదా నన్ను గనిపెట్టుకొని యుండ

వలసినదితప్ప ఇంకేమియు లేదు. నాకేమి కావలెను.

కుబే— అట్టియల్లుఁడు దొరికెనా నీపిల్లనిచ్చుటకు సిద్ధముగా నున్నావా?

చండ—(ప్రక్కమొగముగా) మనయుక్తి యుపయోగింపవలసిన సమయము వచ్చినది. (పయికి) అయితే, యొకమాట! వెనుకటి యల్లుండ్రిద్దఱు నాయింట నుండు ముందుమని చెప్పి మళ్లి మొగమయినా చూపరైరి. పోనీ! వాండ్రంతట వాండ్రు సుఖపడుదురని నమ్మితిని. కాని వంచకులయిన బంధువులవల్ల ఆస్తి కోల్పోయి దరిద్రులయినారు. అందుచేతనే నాక శపథము చేసినాను. ఎవరయితే యీపిల్లను పెండ్లాడఁగోరుదురో వారిసొమ్మంతా ముందుగా నా యధీనము చేసికోకుండా పిల్లదాని నియ్యఁగూడదని— ఆపద్ధతికి లోఁబడే పెండ్లికొడుకు దొరికినయెడల, ఇప్పుడు ఈక్షణమందు సంబంధ నిశ్చయము చేసికొనవచ్చును.

కుబే — (ప్రక్కమొగముగా) ఇంత దొడ్డయిల్లాలిచేతికి మన యాస్తి యిచ్చిన మాత్రమేమిభయము? ఈమోసగాండ్రకు స్వాధీనపడకుండా మఱింతజాగ్రత్తగా నుండును. కాని, తీరా, పెండ్లాడితిమా, వెనుకటిభార్యలవలెనే, నీదగ్గఱ 'పోడుము వాసన' యని యెన్నఁడును ప్రక్కకు రాదేమో? అయినా ముందుకూడఁ జూతము. (పయికి) అత్తా! నీ సర్వమయిన కోరికలు నాచేతఁ దీరఁగలవు. నీకు సరిపడ్డవాఁడను నేనే! నాకు చక్కని దారి చూపినావు. నాయిష్టార్థము లన్నియు, ఈదేరునట్లు కనఁబడు—

చండ—(మాటకడ్డము వచ్చి) కుబేరసేనా! నీమాటలు వినఁగా నాకు పరమాశ్చర్యము కలిగినది. నేను నిన్నుద్దేశింపలే—

కుబే— (మాటకడ్డము వచ్చి) నన్నుద్దేశింపని మాట నిజ—

చండ — పిల్లదాని నెవరికిఁ బెండ్లిచేయఁదలఁచినావని నీవడుగఁబట్టి నాయభిప్రాయము చెప్పినాను గాని నీవు పెండ్లాడవలసినదని నాకోరిక గా—

కుబే— (మాటకడ్డువచ్చి) నీకోరిక గానిమాట సత్యమే! (ఊరకున్నాఁడు).

చండ — (ప్రక్కమొగముగా) 'అది నీకోరిక గాదుగాని నాకోరిక' అని చెప్పక మొద్దులాగున మాటాడకూరకున్నాఁడేమి! అయ్యో వీనినాలుక పడిపోను!

కుబే— (ప్రక్కమొగముగా) ఈవిడ లజ్జావతియు, వినయవతియు, అయిన యుత్తమ కులాంగన గనుక సిగ్గుపడ్డది. నాయభిప్రాయము వెంటనే ప్రత్యక్షముగా చెప్పివేయుట నాదే తెలివితక్కువ. కానీ! ఇఁక భావగర్భముగా మాటాడి యీమె నొడఁబఱిచెదను. (పయికి) అత్తా! నేఁ జెప్పఁబోవుమాటలు విని నాకుత్తరమిమ్ము. స్త్రీజాతిలో నీవంటి వివేకశాలినిని నేనెవతుకుఁ జూడలేను. ఇట్లు దేవుని యెదుట

ప్రమాణముచేసి చెప్పఁగలను. కాఁబట్టి నీవు ప్రత్యుత్తరమియ్యకపోతివా నాపట్ల నీకు దయ తక్కువనియే యెంచుకొందును గాని, ఆలోచన తక్కువని యెంచను. తరువాత నీయిష్టము.

చండ— (ప్రక్కమొగముగా) తిరిగి మనవలలోఁ బడఁబోవుచున్నాఁడు. (పయికి) నాయనా! నీవింత నిర్బంధించుచున్నావుగనుక ప్రత్యుత్తరమిచ్చుచున్నాను. ఆఁడుదాననుగదా? తెలివితక్కువ లేమయిన నాడితినా మన్నించు.

కుబే— (ప్రక్కమొగముగా) మన యుక్తి, చమత్కారములన్నియు ఉపయోగించుటకు సమయమిది! (పయికి). ఒక సాంప్రదాయసిద్ధుఁడయిన వరుఁడు, విదేశములలో పనిచేసి, విస్తారద్రవ్య మార్జించుకొని వచ్చినాఁడు. అతనికి నీబిడ్డ నిచ్చుట కాక్షేపమేమైన నున్నదా?

చండ — అతఁడు ముందుగా జరుపవలసిన విధులను నేఁ బయిని వివరించియే యున్నాను. వానికి లోఁబడి, నాపిల్లను జేసికొనుట కంగీకరించి ఆ విధులను ముందుగా జరిపినయెడల విశేషోత్సాహముతో నాబిడ్డ నతనిచేతిలోఁబెట్టి దేవతలు మెచ్చునట్లుగా వివాహముచేసి నా యావజ్జీవము దాసినయి సర్వోపచారములు చేయుదును.

కుబే— (ప్రక్కమొగముగా) ఇఁక మనము స్వర్గము చూఱగొన్నట్లే. (పయికి) ఆవరుఁడు నల్లమందువాఁడయినయెడల నీకేమయిన నాక్షేపమున్నదా?)

చండ— నామట్టుకు నేనే నల్లమందులేకుండ బ్రతుకలేను.

కుబే— ఎంత యదృష్టము! దానికేమిగాని, ఆవరుఁడు తర్చు పొడుముపీల్చకుండా నిలువలేఁడు! ఎందుచేతనయితేనేమి, పొడుము నసహ్యించుకొనే పిల్ల నిఁక పెండ్లాడనని యతఁ డొట్టుపెట్టుకొన్నాఁడు. పొడుముపీల్చే మగనినిజూచెనా నీపిల్ల కిష్టమేనా! (పొడుముపీల్చుట నభినయించును.)

చండ— (ప్రక్కమొగముగా) ఆవరుఁడు తప్పు పొడుముపీల్చకుండా నిలువలేఁడు! నేను పొడుమువాసన తగిలితే బ్రతుకలేను. కాని, పొడుము పనికిరాదనిచెప్పి చేతికి దొరికిన భాగ్యమంతా పోగొట్టుకొనుటకంటె తెలివితక్కువలేదు. కాఁబట్టి ఇట్లనియెదను. (పయికి) పొడుమనఁగా రాజపూజితమయినవస్తువు. పండితులందఱకు కావలసినవస్తువు. నీవు దేహసంబంధుఁడవుగనుకను నేను కాలము చెల్లినదానను గనుకను సిగ్గువిడిచి నీతో చెప్పుచున్నాను. నామట్టుకు నేను పొడుములేకుండా బ్రతుకలేను. నాకు మాపిల్లదియే పొడుము చేసియిచ్చును. పొడుముపీల్చేతల్లి యిష్టమయినప్పుడు పొడుముపీల్చే మగడిష్టము కాఁడటోయి?

కుబే— ఎంత సంతోషకరమయిన మాట చెప్పినావు. ఈమాటతో నాశరీరమంతా ఉబ్బిపోవుచున్నది! నీకు పొడుమభ్యాసమన్నమాట యీవఱకును నాకుఁ దెలియకుండ కప్పిపుచ్చితివి! నామట్టుకు నేను, బ్రహ్మదేవుఁడు ఎదుటనున్నను సరే! గడియకు అర్ధము నాలుగుమార్లయిన పొడుముపీల్చకుండా నిలువలేను. ఎంత మర్యాదగల యుత్తమురాలవు! ఈసంగతిని నాయంతట నేను కనిపెట్టలేనందుకు నేనెంత బుద్ధిహీనుఁడను! నాయందలి గౌరవముచేత నీవెంత యిబ్బంది పడి నాయెదుట పొడుము వేయుట మానుకొన్నావో? నేను వరుఁడననుకొన్నావా? పీలుచు, పీలుచు, మానితివా నాతోడే సరి. (అని కాయ చేతికందిచ్చుచున్నాఁడు)

చండ— (ప్రక్కమొగముగా) ఓహో! కంఠముమీదికి తెచ్చుకొన్నానుగదా! అక్కఱలేదంటినా యితఁడు విడువఁడు. అభ్యాసము లేదంటినా యీవఱకన్న మాట యబద్ధమయి పన్నిన యెత్తంతా చెడును. (కాయనుండి పొడుము రాల్చుచున్నది.)

కుబే— బాగా వేసికో! బాగా! బాగా! చాలసేపటినుండి యిబ్బందిపడుచున్నావు.

చండ— (పొడుముపట్టుపట్టి ముక్కు దగ్గఱఁ బెట్టుకొనుచున్నది.)

కుబే— సిగ్గువిడిచిపెట్టు. బా · పీల్చకుంటివా కాసియొట్టుపెట్టెదను.

చండ— (పీల్చుట నభినయించుచున్నది. ఆక్ష్. ఆక్ష్. ఆక్ష్. ఆక్ష్. ఆక్ష్. ఆక్ష్. ఆక్ష్. ఆక్ష్ అని విరామములేకుండ తుమ్ముచున్నది.

సేవకుఁడు— (తెర జిమ్ముకొని పరుగెత్తుకొని కుబేరసేనుఁడున్న తావునకు వచ్చుచున్నాఁడు.)

విజ- విమ- సుమంత్రుఁడు— ప్రక్కగుమ్మముకడకు వచ్చుచున్నారు.

చండ— (మఱియు తుమ్ముచున్నది.)

కుబే— (సేవకునితో) ఓరి గాడిదకొడుకా! పొడుములో సున్నమెక్కువ యెందుకు వేసినావురా? ఆయిల్లాలు నావలెనే తనకును పొడు మభ్యాసమని చెప్పినది. సున్నమెక్కువ కాకుంటే యిన్ని తుమ్ములురావు. మంచిపొడుము తీసికొనిరా! (అని కాయచేతికిచ్చుచున్నాఁడు.)

సేవ— (తీసికొనివెళ్లుచుండఁగా)

సుమం— (విమలావిజయసేనులతో) ఈ ముసలివానిని లోఁబఱుచుకొనుటకయి తనకు పొడుముకూడ నభ్యాసమని చెప్పినది! ఎంతకయినా తగినదండీ! ఈ పొడుము మనమును చూతము. సైగచేఁ—

విజ— (సేవకుని బిలిచి, పొడుము కొంచెము చేతిలో వేసికొని యాఘ్రాణించుటను

నటించి, తమ్మఁబోయి ముక్కు గట్టిగాఁ బట్టుకొని సుమంత్రుని బిల్చుమని సైగఁ జేయుచున్నాఁడు.)

సుమం— (విజయసేనునివలెనే నటించి యెడమచేత ముక్కుఁ బట్టుకొనుచున్నాఁడు.) స్త్రీజాతికి చండసేన దారిచూపినది. (అని పాదము పట్టి విమల ముక్కునొద్దఁ బెట్టుచున్నాఁడు.)

విమల— (తమ్మఁబోయి చేత ముక్కు బిగించుకొనుచున్నది.)

చండ— (మరల తుమ్ముచున్నది. లేచుచున్నది.)

కుబేర— నేనెంత దుర్మార్గము చేసినాను. ఓర్చుకో! అత్తా! ఓర్చుకో!

చండ— ఇదియేమి నాతల తిరుగుచున్నది. నేను పడిపోవునట్లున్నాను.

కుబేర— ఓహో! ముసలివాఁడను. ఈమెను పడకుండఁ బట్టుకొనలేనుగదా! (అని పదము పట్టుకొనుచున్నాఁడు.)

చండ— నాతలతిరుగుచున్నది. క్రిందఁ బడఁద్రోయునట్లున్నది.

కుబేర— పడకు! పడకు! నీతో నేనుకూడ పడుదును.

విజయ— (తొందరతో ప్రవేశించి) భయములేదు భయములేదు.

కుబే— ఈలాగురా! నాకు శక్యముగాకున్నది ఈమె పడకుండ సహాయము చేయుము.

చండ— (తెప్పిటిల్లి) నేను కొంచెమావలకు వెళ్లుదును. నాకితనిసహాయ మక్కఱలేదు. నాకుఁ గావలసినది నీసహాయమే!

విజ— నా తాత్పర్యమును అదే! (నవ్వుచున్నాఁడు.)

విమ- సుమం— (దగ్గఱకు వెళ్లి నవ్వుచున్నారు.)

చండ— విజయసేనా! నీవు మోటుమొద్దువు. సుమంత్రుఁడా! ఎంతసరసుఁడవు నీవు! విమలా! నీప్రవర్తనముచూడఁగా నాకు సిగ్గగుచున్నది. (కుబేరసేనుఁడు పట్టుకొనియుండఁగా గుమ్మమునొద్దకు వెళ్ళి) అల్లుడా! మన మనుకొన్నమాటలన్ని నీయాంతర్యమునందే యుంచుము. (వెళ్లుచున్నది.)

విజ- విమ- సుమం— (మరల నవ్వుచున్నారు.)

కుబే— విజయసేనుఁడా! చాల సంతోషించినాను. విమలా! నీవు చాల చక్కని పిల్లవని యిపుడు తెలిసినది. నాకిష్టురాలయిన యిల్లాలికి మీరు గనుపఱిచే భక్తి ప్రపత్తు లిట్టివేగదా!

విమ— చిననాయనా! క్షమించు. క్షమించు! నవ్వినందుకు కోపింపకు. ఆమె పాదము పీల్చుట నీకిష్టమని నాకుఁ దెలిసినదిగాదు. (తుమ్ముచున్నది.)

కుబే— తెలియకపోవచ్చును. అందుచేతనే కాఁబోలు నీవుగూడ తుమ్మి వెక్కిరించు చున్నావు.

సుమం— ఆమె తుమ్ముటకు హేతువదిగా— (తాను తుమ్ముచున్నాఁడు.)

కుబే— నీతో నాకు చిరకాలపరిచయము లేదు. ఇఁకనక్క అనులేను. అయక్క అవిమలకే!

విజ— చిననాయనా! నిన్ను నవ్వించుటకు స్వప్నమందయినా మేము తలఁపలేదు. చండసేననుజూచి నవ్వినమాట నిజము.

కుబే— మీరామెనుజూచి నవ్వితిరా నన్నుఁజూచి నవ్వినట్లే!

విజ— అయితే మేమామెనుజూచి యిఁక నవ్వము. సర్వథా నీ యిష్టానుసారము నడతుము.

కుబే— ఇఁకకి తెలిసినది. తిరిగి దైన్యవృత్తికిఁ బాలుపడ్డావు.

విజ— ఏమీ? దైన్యవృత్తియా?

కుబే— అవును. దైన్యవృత్తి. నాపట్ల నీయతివినయమునకు హేతువేమో నేనెఱుఁగ ననుకొన్నావు! నాసొమ్ముపై నాశయే!

విజ— నాకు నీసొమ్ము గావలెనా? అది నాకు గడ్డిపరకవంటిది.

విమ— అన్నయ్యా! తొందరపడకు.

కుబే— (విమలతో) అవును. అది సత్యము. నీఅన్నను నెమ్మదిపఱచి ధనవంతుఁడయిన మీ చిననాయనను అలక్ష్యము చేయవలదని చెప్పు— కాని, అందువల్ల కార్యము లేదు. మీ మాయోపాయములన్నియు నాకుఁ దెలిసినవి.

విజ— మాయోపాయములనఁగా నీ యభిప్రాయమేమి? ఇట్లనుటకీ సాహసమెవనికి—

కుబే— (మాటకడ్డువచ్చి) నీకు కోరికయయ్యెనా, నీయిష్టమువచ్చినంత కోపము దెచ్చుకోవచ్చును. కాని, సంగతియంతా నాకుఁ దెలిసినది. నీవు దూరదృష్టి దూరశ్రవణములులేక చేసిన యీసాహసవ్యాపారములో నీసొమ్మంతా గంగ పాలయినదిగదా!

విజ— అయితే నీకేమి?

కుబే— నాకేమియులేను. కాని, అంతయు నానెత్తినే పడియుండును. నీఋణము లన్నియు నేను తీర్పవలసినదనియేకదా నీకోరిక!

విజ— అది ఘోరమయిన అబద్ధము. నీకెవరీయభిప్రాయము పుట్టించిరో కాని నేను నిన్ను యాచించనలేను. అట్లు నాకోరికయును గాను.

కుబే— అను! అను! నీవేమన్నను నేనాడిపట్టినాను. ఋదియేకదా!

పెట్టితిమా పెండ్లి, కట్టుకుంటిమా శ్రాద్ధము

విజ— నీవు మిక్కిలి దుర్మార్గుఁడవు. నన్ను నిష్కారణముగా నొప్పించుచున్నావు.

కుబే— నీ యిష్టానుసారము దూషింపు. నీకేమియు నపాయములేదు — నేను ముసలివాఁడను.

విమల— చినవాయనా! ఈప్రపంచమంతా యిచ్చినను, అన్నయ్య నిన్ను దూషింపఁడు. నీవే మొదట మిగుల తొందరపడినావు.

కుబే— ఓ బుద్ధిమంతురాలా! నీయన్నగారి మోటుతనముతో నీవును సర్వధా, ఏకీభవింపుము.

సుమం— ఈ చెడుగున కంతకు కారకురాలా దుర్మార్గపు ముసలిముండ. ఇందుకు నాది ఘంటెము—

కుబే— నీవు నీతిమాలినపడుచువాఁడవు. నాపట్ల మీ దుస్తంత్రములన్నిటిని గనిపెట్టి నాకు దారిచూపి నన్ను జాగ్రత్తకుఁ దెచ్చినది నిశ్చయముగా నా యుత్తమాంగనయే! ఈ మహోపకారమునకుఁ బ్రత్యుపకార మామెకు నేనెట్లు చేయఁగలనో నాకుఁ దెలియకున్నది.

విజ— కాని, ఆమెకుఁ దెలియును.

కుబే— సరే! నేనీదినము నాగదినుండి యీవలికిరాను. రేపు నీయింటనుండను. (గదవైపునకు వెళ్లుచున్నాఁడు.)

కృష్ణశర్మ—(అతనికెదురుగావచ్చి) కాని, తమ పెద్దపులిని, ఆకాలసర్పములనుగూడ తమతో వెంటఁబట్టుకొని వెళ్లుటకు నాప్రార్థనము.

కుబే— (అతని పయిని బెత్తము జళిపించుచు) ఛీ! అయోగ్యుఁడా!

కృష్ణ— అట్లు సెలవియ్యకండి! ఇక్కడ తమ యధికారము సాగదు.

కుబే— దారిలోనుండి లే!

కృష్ణ— అందుకు నాకభ్యంతరము లేదు.

కుబే— ఛీ! ఈసెల్లపుట్టు! (వెళ్లుచున్నాఁడు.)

విజ— కృష్ణశర్మా! నేను మా చినవాయనయు, ఏమనుకొన్ననుసరేకాని, నీవుమాత్రము ఆయనపట్ల గౌరవముతప్పినడుచుట నామతముగాదు.

కృష్ణ—నాకుఁ జెప్పకోయి నాయన! నేను నిన్ను ముద్దాడి చేతనెత్తుకొని పెంచినాను. ఇంతకాలముచెల్లిన నాకు నీవిపుడు నీతు లుపదేశింప నక్కఱలేదు. చమత్కారముగా మా— — —? అది, యీకాలములో నాకంటె తక్కువవాండ్రే నేర్తురు! ని— — — నేను మంచిచెడ్డలు తెలియనివాఁడనుగాను.. నీమేలు కోఱకే — — — మనసులోనున్నదంతయు చెప్పక దాఁచలేను.

జస్వం— స్నేహితులారా, మనమిచ్చటఁజేరిన దెందునిమిత్తమో మీరెఱుఁగుదురు. మన స్వామియైన మలహారురావుగారు చనిపోవుటయు వానికి కుమారులును మనుమలును లేకపోవుటయు మన కింతటివిచారమును శ్రమయు గలిగించినవి. అదియటుండ, వంశనాశనమయ్యెనని విచారముగలిగి మన రాణిగారికిఁ బుత్రస్వీకారము జేయవలెనని నేను బ్రయత్నముచేయుచుండ మన రాణి — రాణియనుటకు నోరాడ లేదు—యహల్యాభాయి మనపైనధికారము జేయవలెనని పెంచుకొనననని, స్పష్టముగ జెప్పినది. అదిగాక సన్నద్ధమైనమాటలాడినది.

గోమే— ఆహాహా! యెంత దుష్కార్యము, ఆఁడుది రాజ్యము జేయుటగూడ వచ్చినది.

దౌల— ఆమెకు మామగారిచావు, కుఱ్ఱగుంటచావు సంతసకరమైనది. యెంత కఠినురాలుగాకున్న యెడ కుమారుఁడు కడతేఱి మూఁడుమాసములుకాలేదు, యింతలోనె రాజ్యమేలఁదలంచునా?

జస్వం— కొడుకుచచ్చెనని విచారముగాని, ప్రజలు తన్నేమందురో యను లజ్జగాని యామెను బాధించుటలేదు. రాజ్యకాంక్ష దుఃఖమును, లజ్జనుగూడ మరపించునుగదా?

దుండి— కర్తవ్యాంశమును వేగమె వితర్కించుట మంచిది.

జస్వం— ఇపుడు నేఁ జెప్పఁదలఁచిన దేమన్న మనమందఱము పరువుగల మహారాష్ట్రులము శివాజీకాలమునుండియు మనవారు ప్రాణములకంటె మానము హెచ్చుగ నెంచినమాట నేను వర్ణింపనక్కఱలేదు. ఇంతంత బలవంతులమై యింతంత బుద్ధిమంతులమై కటకటా! తుదకు పనికిమాలిన యాఁడుదానిచేతఁ బరిపాలింపఁబడవలసినంతటి దురదృష్టవంతులమైతిమి. ఈయాఁడుదాని ప్రభుత్వమున మనమున్న గౌరవము నిలచునా! మీరీమెచే నేలఁబడుట కిచ్ఛగలవారా! మీకు మీసములేదా? శూరులు కారా? మహారాష్ట్రులకు బుట్టలేదా? మీరు మహారాష్ట్రులగుదురేని యామెను రాజ్యవిహీనురాలుగఁ జేసి ప్రతివిషయమున నామె యత్నమునకు విఘ్నముగావింపుడు. ఇది మీకు సమ్మతమేనా?

దౌల— సమ్మతమాయని యడుగుచున్నావా? ఆఁడుదాని పాలనలోన రెండు మూఁడు నెలలున్నందుకే సిగ్గుపడి తల పొట్టలోఁ బెట్టుకొనుచున్నాను నీవెట్లు చెప్పిన నట్లు చేసెదను. ఈమె ప్రయత్నము భంగముఁజేయుటకు దేశముననున్న భిల్లులను సహాయముజేసికొని మనము దేశముఁ గొల్లకొందము. అప్పు డామె లొంగును.

జస్వం— ఆమెమీఁదఁ గోపముచే నిష్కారణముగ నిరపరాధులగు ప్రజలను

క్షోభ పెట్టుట మంచిది గాదు. మన మెంతకష్టపడియున్నను, దేశమునకు కళంకము రాఁగూడదు. ప్రజలసుఖము చెడరాదు.

గోమా—నే నిదివఱకే దీనినిఁగూర్చి కొంచెమాలోచించినాను. ఉదయపుర మహారాణావారికి వర్తమానమంపి మనదేశముపై దండెత్తుమని ప్రోత్సాహపెట్టి యుత్తనికిఁ దగు సహాయము జేయుట యుక్తము. ఫతేశాళసింగుతో నేనిదివఱకే మాటఁ దలపెట్టినాను.

జస్వం— రాజపుత్రు లసాధ్యులు. తీసుకొనివచ్చుటయే గాని మరల వదల్చుకొనుట మన తరముగాదు. అందుచే వారిని బిలువవలదు. ఒకరిని బిలుచుటయే యుక్తమైన శ్రీ రఘునాధరావును రప్పింతము.

దౌల—కొంచెమది బాగున్నది. (అని దుండిరావు చెవిలో) ఈ జస్వంతరావు మెల్లగా రఘునాధరావును రప్పించి తన మనోరథసిద్ధికైఁ బ్రయత్నించుచున్నాఁడు. మనము భిల్లుల వదలగూడదు.

దుండి— అయ్యా, యింకొకసంగతి. మన రహస్యముల నెఱుఁగుటకు రాధాకాంతుఁడును, వానితోనున్న శ్యామసుందరదత్తును, దమ తపస్సు ధారవోయుచున్నారఁట. వారు మనలను బట్టుకొందురఁట జాగ్రత.

దౌల— చెప్పుట మేలాయెను. అకట్టువాఁడు శ్యామసుందరుఁడు తెగనీలుగుచున్నవాఁడఁట. ఓయమ్మా, గోపాజీ, యేదోయొక పెట్టి వానిని గడతేర్చెడు నుపాయము జూడుము. నీవు కొత్త్వాలువుగదా నీవు చేయఁగలవు.

గోమా—వాఁడెక్కడెక్కడ నన్నుఁగూర్చి ప్రేలుచున్నాడఁట. వానివిషయమై యేపనిచేయుమన్నను చేయుదును. ఇంక మన మరుగుదము లెండు.

జస్వం— మీరు నాపలుకుల కియ్యకొనిరిగనుక నేనామెతో ప్రత్యక్షకక్ష వహించెద. ఆమెదగ్గఱ నాయుద్యోగము వద్దనియు, గొడుకును బెంచుకొనక యున్నామెకు మాకు సంబంధము లేదనియు, నామెకు నేనుత్తరము వ్రాసెద.

గోమా—నామాట నీవందు వ్రాయకుము, నేనికొత్త్వాలుపనిలో నుండియే నీకు సమస్తసహాయములు చేసెదను. ముందుగా నుద్యోగము మానుటెందుకు?

జస్వం— ఇంతటి ధైర్యమే నాసిది? ఓయీ దౌలతరావూ, నీవు మీయన్న భార్యను వివాహమాడెదవని విన్నాను. ఆపనిమాత్రము వద్దు. అట్లయిన మనపైఁ బ్రజలకు నమ్మకముండదు.

దౌల— దాని కేమిలే యెట్లో సాగించవచ్చును. అప్పుడే యైనదా, మన మందఱమిప్పుడు బోదము రండు. అని యందఱును లేచి యుచితప్రకారమున సెలవుఁ

గైకొనిపోయిరి. సఖారాము దేవళములో విగ్రహమువలెఁ గూర్చుండెనేకాని యొక మాటయు మాట్లాడ లేదని జస్వంతరావు సందియమందెనుకొని కారణ మడుగఁ డయ్యెను. అందఱును గృహము వెడలిరి. గోమాజీరావు సఖారామును వెంటబెట్టుకొని కొంత దవ్వరిగి యచ్చట నతని చెవిలో మెల్లగా "ఓయీ స్వలాభపరాయణులును, దురాత్ములునగు వీరిని నమ్ముకొని నా యుద్యోగము మానుకొందునా? యెటువచ్చి యెటు వచ్చునో; దౌలతరావు జస్వంతరావులు తమతమ మనోరథముల నెరవేర్పఁ దలఁచి యీ యెత్తు లెత్తిరి. అవి నే నెఱుఁగనా? ఏమైనను రాణావారిని వచ్చి సంబపురమును గైకొమ్మని చెప్పుము. ఇంక నీవరుగుము" అని నొక్కి పలికి వానినంపి తాను స్వగృహమున కరిగెను.

ఎనిమిదవ ప్రకరణము.

"నేను మీ ముఖ్యమంత్రులలో నివాఁడనని మీ రెంచుకొనుట లేదు. అట్లు మీ రెంచుకొనిన పక్షమున నా యాలోచనమునకు మీరు చెవియొగ్గియుందురు. పుత్రస్వీకారము సేకొని నిర్మూలమైన హోల్కారువంశమును నిలుపుమని హితోపదేశము నొనర్చితిని కాని నే నెగ్గు చేయలేదు. అయినను నా మాటలు విషభోజనమువలె మీకు రుచింపవయ్యె. మతిలేని వృద్ధజంబుకము యొక్క మాటలను, చిఱుతలవంటివలె వేగిరపాటుగల పడుచువాని కారుకూతలను, నమ్ముకొని వారు మిమ్ము దరింపఁగలరని చిరకాలమునుండి రాజ్యమునకు మీకు నమితోపకార మొనర్చిన మావంటివారిని నిరాకరించితిరి; వారు మిమ్ము ద్రోహము చేసినపుడే మీరు పశ్చాత్తాపమునొంది మరల మమ్మాదరింపగలరు. ఇంక నేను మీ వాఁడనని నాయందాశ యుంచుకొనవద్దు. నేను మీకును మీ రాష్ట్రమునకు నిష్టుఁడనని మీ రెంచినారుగనుక నేనట్లె యుందును. కుమారుని పెంచుకొనరేని మీయొద్ద నేనుద్యోగము చేయను. ఇవి త్రికరణశుద్ధిగ నేను వ్రాసిన మాటలు. ఇందుకు తిరుగులేదు." అని యున్న యుత్తరమును జదువుకొనుచు మహారాణి యహల్యాభాయి తన గదిలో నొక పీఠముపైఁ గూర్చుండి నడుమనడుమ ముక్తాభాయి యుత్తరమునుగూర్చి తన్నడుగు ప్రశ్నలకుఁ బరాకుగఁ బ్రత్యుత్తరమిచ్చుచు గర్తవ్యము నూహించుచు రాధాకాంతుని నిమిత్త మెదురుచూచుచుండెను. అంతటిలో రాధాకాంతు డరుదెంచి యథోచితముగఁ దనరాణికి నమస్కరించి యుచితాసనమున గూర్చుండెను. ముక్తాభాయి చిన్నతనమునుండి రాధాకాంతునియందుఁ బితృభావముంచి గారవించుటచే నతని యొద్ద భాషాపద్ధతి యక్కఱలేక యథేచ్ఛముగ మాటలాడును. మహారాణి యంత రాధాకాంతుని మొగమువైపు చూచి "యీ చమత్కారమును నీవెఱుఁగవు కాఁబోలును,

ఈయుత్తరమును చదువుకొమ్మ" అని ఆయుత్తరము నతనిపై వైచెను. అతఁ
డాయుత్తరమును నామూలాగ్రముగ చదువుకొని విస్మయముతో నాకమాఱు గుండె
కొట్టుకొని "అమ్మా జస్వంతరా వెంతవాఁడయ్యెను. ఇంతవాఁడగునని నే నెన్నఁడు
నెఱుఁగను. అమ్మా వ్యవహారము శ్రుతిమించి రాగమున బడినది. మనము జాగ్రతగ
నుండవలె" నని చెప్పెను. అనవుడు నాదేవి "ఇటువంటి తుచ్ఛులు వేయి పన్నుగడలు
పన్నినను నేను బెదరను. వారికి వినాశకాల మాసన్నమగుటచే నిట్టిబుద్ధులుపుట్టినవి.
వారు నాకు లోబడకున్నను వారిప్రాణములు నాఖడ్గమునకు లోబడకమానవు.
కాని మనకు నెవ్వరు కృతజ్ఞులుగ నుండిరో వారినందఱఁ జేర్కొనుము" అని
ప్రత్యుత్తరమిచ్చెను. రాధాకాంతరావా పలుకుల నాలకించి రాణి మనోధైర్యమున
కుబ్బి "శివనానా మనకు నాప్తుఁడు- అతని నింబపురమందుంచుటలో మీరు మంచిపని
చేసినారు. గోమాజీరావు కొత్త్వాలుకూడ మంచివాఁడనియె తోచుచున్నది. తుకాజీ
హొళాల్కరు కుక్కవంటి విశ్వాసముగలవాఁడు. కాని నీచుడగుటచే నతనికి సర్వా
హైన యుద్యోగ మీయదగదు." అని యుగ్గడించుచుండ నతనిమాట కడ్డమువచ్చి రాణి
"వంశముచేత నీచుఁడైన గుణములచేతను రాజభక్తిచేతను మన తుకాజీయుత్తముఁడు
అందుచే నతనికి సైన్యాధిపత్య మొసఁగెదను. గోమాజీరావుసంగతి నిశ్చయ
జెప్పజాలను నీవాతనినిగూర్చి వాకబుచేయుచుండుము. కాని వీనికంటె నాకు
యొక్కువవిచారము పట్టినది. ముక్తాభాయి నలతగనున్నది. ఆమె కాశీరావునిమిత్త
బెంగపెట్టుకొనినది. మనోవ్యాధికి మందులేదుగద! దీనికేమియుపాయము చేయ
వలెనో యెఱుఁగను." అని పలికెను. అప్పలుకులు విని రాధాకాంతరావు, రాణితో
నిట్లనియెను. "ఆమె నిజముగ బెంగపెట్టుకొన్నది. మనసు తమ్మునిమీద కరుగకుండ
నిరంతరము నామె కుత్సాహజనకములగు పలుకులు చెప్పువా రుండవలయు. అట్లు
చేయుటకు తమకు తీరికలేదు. నాదగ్గఱ నొకదాసియున్నది. ఆమె బహు చమత్కార
కథల జెప్పును. ఏడ్చువారికైన నామెమొగము జూడ సకలదుఃఖములుపోవును. ఆమెను
నేనిక్కడికంపెదను. ముక్తాభాయి నామెకు జతచేయుడు. అంతట నామెదేహమున
గల రుగ్మత నశించును. ఇంక నేసెలవు గైకొని పోయివచ్చెదను. కాని యడుగ
మఱచినాడ. దౌలతరావు విషయమై యేమిచేసినారు స్త్రీరాజ్యమేలుచుండ స్త్రీకి
మానగౌరవము దక్కకున్నచో నింక జెప్పనదియేమి? అన్నియు ముగిసినవేనుక మీరు
కనుగొన్న నేమిలాభము? ఆమె ప్రాణత్యాగము చేసికొనకమునుపే యామె పాతి
వ్రత్యము చెడకమునుపే, మీరు సాయము చేయవలెను" అను రాధాకాంతుని కఠినో
క్తులు రాణికి రోసమును జాలియు గల్గించినందున నామె "ఓయీ నేను జీవించియుండగ

ఎనిమిదవ ప్రకరణము.

కమలాభాయికి మాంగల్యభంగమగునా! దౌలతరావును బిలుపించి యిప్పుడే మందలించెద ఇదివఱకే రమ్మని వానికి వర్తమానము పంపితిని. నీకష్టమునకై నొచ్చి యామెను రక్షింతు నీవింక బొమ్ము దౌలతరావు వచ్చువేళయైనది" అని పలికెను. రాధాకాంతు డందులకు సంతసించి సెలవు గైకొని స్వగృహమున కరిగి కమలాభాయి స్థితి గనుగొనమనియు, నామెతో గొన్ని రహస్యములు జెప్పమనియు, తనభార్యనంపి యామె విషయమై జాగ్రతగనుండెను. రాధాకాంతు డరిగిన యొక గడియలోపున దౌలతరావు తన యేలిక దర్శనమునకువచ్చి గుమ్మమునందుండి తనరాక దెలియబనిచెను. లోపలికి రమ్మని సెలవయినతోడనే మొగమున లేని గాంభీర్యమును దెచ్చిపెట్టుకొని మొలలో నొకవేళ నపాయ మేదయిన జరుగునేమోనని ప్రాణసంరక్షణార్థమై తెచ్చిపెట్టుకొన్న కయిజారు గనబడకుండఁజేసి లోనికరిగి రాణిదర్శనము జేసి సాష్టాంగ నమస్కారమొనర్చి నిలువఁబడెను. రాణి నాలుగు నిముషములు వానివంక జూచి కూర్చుండుమనెను. తరువాత వారి యుభయులకు నీక్రిందిసంభాషణ జరిగెను.

అహ— పాపము మీ యన్నగారు పోయినందుకు మాకు చాలా విచారముగ నున్నది. ఈవేళకు నాలునెలకటి కాదా? నీకు పెద్దకష్టమువచ్చినది.

దౌల— (తలవంచి) ఏమిచేయగలము. కాలవశము వచ్చినది.

అహ— ఆతనిభార్య యెక్కడనున్నది. క్రొత్తగా పెండ్లియైనదట కాదా?

దౌల— ఇక్కడనే యున్నది. పెండ్లికాలేదని చెప్పుచున్నారు.

అహ— ఛీ. ఏమిమాటలు. నాదగ్గఱకూడ నబద్ధ మాడనేల? నీవామెను బలవంతముగ వివాహమాడ యత్నించుచున్నావట. నారాజ్యములో నీవు దుర్మార్గము చేయకుము. ఇటువంటివానిని క్షమియింపను. అన్నభార్యను పెండ్లియాడుటకు నీకు సిగ్గులేదా?

దౌల— అమ్మా నేనామెవిషయమై యట్టి దుష్కార్యము దలపెట్టలేదు. కిట్టనివారు చెప్పినయబద్ధముల నమ్మి మీరు నన్ను శిక్షింపఁదలంచుచున్నారు. నేనట్టిపని చేయుదునా? అన్నభార్య తల్లి కాదా? పెండ్లికాలేదని నేను స్వీకరింప దలచితిని. పెండ్లియైనమాట నిజమే. నాకామెవద్దు.

అహ— సరే జస్వంతరావు మాపై నలుకవహించినాడట. నీవును నందు జేరినవాఁడవే నా? ఇంక నీవంటి నిర్భాగ్యులెందఱు—

దౌల— రామరామ. నేనేపాపమెఱుఁగను. మీపాదములతోడు. శ్రీవిశ్వేశ్వర స్వామివారితోడు సెలవైన జస్వంతరావును పట్టియిచ్చెదను.

అహ— తన ప్రాణముల కాశపడవద్దని జస్వంతరావుతో చెప్పుము మీరందఱు

వచ్చినట్లు భావించుకొనుఁడు. ఇఁక నీవుపో.

అని యహల్యాబాయి దౌలతరావు నంపెను. దౌలతరావు నోటికి వచ్చిన న్నియసత్యములాడి రాణి యాగ్రహమునకు పాత్రుడు కాకుండ పులినోటబడి తప్పించుకొనిన మేకవలె సంతసించుచుపోయెను. అట్లు దౌలతరావింటికి వచ్చునప్పటికి భార్య దుర్గాబాయి గృహమునందు లేనందున నిదె సమయమని కామబాధావివశుఁడై కమలాబాయియొక్క కమలములవంటి పాదములపైఁబడి తన్ను వివాహము చేసుకొమ్మని యామెను బహువిధముల బ్రార్థించెను. కమల భయసంభ్రమములతో వడఁకుచు నాతని దన పాదములతోఁ దన్ని యాడరానిమాటలాడి యనేకవిధముల నిందించి రోదనము చేసెను. మన్మథబాణపాతముచే దేహము ఒళ్లి పడుటచే ములుకులవంటి యామె పలుకులంత పనిచేయదయ్యెను. సిగ్గతని నీవలెనే విడుచుటచే నిగ్రహానికి గుపడదయ్యెను. అందుచే నాతఁడు వడఁకుచున్న యావన్నెలాడిని గట్టిగ బట్టుకొని సందిటఁజేర్చి యాలింగనసౌఖ్యము గొనఁగ యత్నించుచుండ యామె చెదరిన మార్జాలమువలె యొడలెల్ల రక్కి యతువసాగెను. ఆమె బరుకులు వాని సానియంగములనుండి రక్తము స్రవింపఁజేసి కుంకుమ మనలందుకొన్న పెండ్లికుమారుని విలాసము నతనికొసఁగెను. ఇంతలో దుర్గవచ్చి తలుపు కొట్టినందున కమల యామెకు తలుపుతీసెను. దౌలతరావు చేసిన చర్యలను దుర్గ కమలాముఖమున విని యుట్టి మగనికి దాను భార్యగానుండుటకు సిగ్గుపడి కమలనూరార్చి మగనిని శూలములవంటి మాటలతో నొప్పించెను. కాని నల్లతాయివలె నతఁడు నిరుత్తరుఁడై కమలను వశము చేసుకొను నుపాయమును వెదకుచుండెను. ఇట్లతఁ డాలోచనలు సలుపుచుండఁగనే సూర్యుఁ డపరశైలశిఖరము నలంకరించెను. రాత్రి యందఱు భోజనములుచేసి పండుకొన్న తరువాత నిద్రాసక్తులైరి. రెండుజాముల రాత్రియైన తరువాత దౌలతరావు తాను నిద్రించుచున్న గదివిడిచి తళతళ మెరయుచున్న ఖడ్గమును కేలఁబూని కమల శయనించు గది ప్రవేశించి "దురాత్మురాలా, కమలా నీవు నాకు వశ్యురాలవు కాని దానవు. నీవుండిననేమి చచ్చిననేమి దీని నిప్పుడు చంపివేయుదును." అని ఖడ్గమామె మెడమీదనుంచి యొకయేటున వేయఁ గత్తినెత్తెను. అంతలో నామె ముఖవికాసచంద్రికలు కోపావేశాంధకారమును బాపినందున "ఈమె నిప్పుడు చంపను. ముందుముందీమె తప్పక నావశము గాఁగలదు. కాకపోయినచో నప్పుడే తుదముట్టించెద" నని తన దుష్ప్రయత్నము మాని మరల లోనికిం జని నిద్రించెను. నాలుగుగడియల రాత్రి యుండఁగ కమల మొగమున మేలిముసుఁగు దిగజారవేసుకొని యెవరితోడను జెప్పక గృహమునుండి వెడలిపోయెను. యెక్కడికరిగినదో యెవ్వరు నెఱుఁగరు. ఉదయమున దుర్గయు దౌలతరావును కమలం గానక కలవరపడి దుండిరాజును లక్ష్మణుని వెదకుమని

సంపిరి. అందు దుండిరావెచ్చుటవో గంజాయి త్రాగి మత్తిడిసంతుకొని సాయంకాలమునవచ్చి కమల కనబడ లేదని చెప్పెను. దీపములు పెట్టినతరువాత లక్ష్మణుడు వగర్చుకొనుచువచ్చి దౌలతరావుతో రహస్యముగ "అయ్యా నల్లమంచుచెట్లతోటలోనున్న నూతిలో బడి కమలచచ్చినది. శవ మొకగడియక్రిందట తేలినది" అని భయపడుచుఁ జెప్ప దౌలతరావు తలయూచి "సరే భయమేమి నేను చేయవలసినపని తానే చేసుకొనినది. కాని యెవరికి తెలియకుండ దహనముచేయుడు" అని పలికి నాలుగురూపాయలిచ్చి వానిని దండిరావునంపెను. వీరిరువురు తోటలోనికి జనునప్పటికి నూతియొద్దను నొక వృద్ధుడును నొక పడుచువాడును నపుడే తేలిన శవమునుజూచి విలపించుచుండిరి. అందు వృద్ధుడు "అమ్మా నిన్నీబలవంతపు మరణము పాలుజేయుటకే వానికిచ్చి పెండ్లిచేసితిని. కాకున్నచో నీకిట్టి కింత చేటుకాలము రాదు." అని విలపింప నందు పడుచువాఁడు వాని నూరార్చి "ఇది యేడువఁదగిన సమయముగాదు. ఎవ్వరో వచ్చుచున్నారు. పదపద యని వానిని వెంటుకొనిపోయెను. తరువాత దుండిరావును లక్ష్మణుడును మెల్లగా శవమును బయటికితీసి మోచికొనిపోయి దహనము చేసిరి.

తొమ్మిదవ ప్రకరణము-

ధరణీ రమణికిఁ గాలపురుషుండు పట్టిన ధవళచ్ఛత్రమువలె చంద్రుఁడు గగనభాగము నలంకరించి చెట్లకుఁ బర్వతములకు సమస్తపదార్థములకు సఫేదపూతబూసిన తెరగునఁ దన వెన్నెల వ్యాపింపఁజేసి వాని కపూర్వధావళ్యము నొసంగెను. ఆ వెన్నెలలోఁ దన యజమానుని యాజ్ఞ శిరసావహించి దుండిరావు మహాబాపుర సమీపమునసున్న గూడెముఁజేరి యందున్న ఋషి కుటీరము బ్రవేశించెను. ఋషి వానినిఁ జూచి యాలింగనముఁజేసికొని "నాయనా! దుండీ నీవు వచ్చితివా? మన రాణోజీ మృతినొందినాఁడుగదా, దౌలతరావు చేయునదియేమి"యని యడుగుటయు దుండిరావు వానికి నుత్తరము చెప్పుటకు యత్నించుచుండ నింతలో దీర్ఘకాయుఁడును మహాసత్వుఁడునగు నొక నల్లని మనుష్యుఁడు కుటీరముఁజొచ్చి వారిసంభాషణకాటంకము గావించెను. ఆ పురుషుని గడ్డము కాయముకంటె కొంచెము నల్లనై జుట్టువలె నతిదీర్ఘమైయుండెను. అతని శిరమున నల్లుకొన్న జడలును, జడలనడుమ నతఁడు చూడామణిగ నుంచుకొన్న నెమలి పింఛములును, మెడను ధరించిన పులిగోరులుగల పూసలును, గండ్రగొడ్డలితోనున్న కుడిచేయియు నతఁడు పర్వతప్రాంతముల వసించు నాటవికుఁడని తెలియఁజేయును. చింతనిప్పులవలెనుండు వాని కన్నుగవనుండి వెడలు దృష్టి రాలగుండెగల దుండిరావునకుఁగూడ భయంకరమై యుండెనని నింక చెప్పనది

మేమి? అతఁడు లోపలఁ బ్రవేశించి తన మోటుమహారాష్ట్రపుమాటలతో నిట్లనియెను. "శాంతియా రాలేదా? ఈ దుండిరావువచ్చి మీతో నేమిచెప్పినాఁడు? మనమితఁడు చెప్పినట్లు చేయవచ్చునా?" అన, ఋషి "ఓయీ గండా వచ్చి కూర్చుండుము." అని "నిర్మలముగ విచారింపవలసిన యంశములు యీ దుండిరావు చెప్పినమాటలువిను." అని తన సందేశ మెఱిగింపుమని దుండిరావును హెచ్చరించెను. అనంతరము దుండిరావు మెల్ల మెల్లగా నిట్లుపలికెను. "ఓయీ గండాభిల్లుడా! మన పుణ్యము పుచ్చినది. జస్వాంతరావు, దౌలతరావు, గోమాజీరావు మొదలగు ప్రబలులు రాణితోఁ బగ సాధించి కత్తిఁగట్టినారు. అందుచే నీవును నీ భిల్లుసైన్యము వారికి సహాయముగవచ్చి రాణి నెదిర్చితివేని యుభయులకును లాభముండును. నీవు దోచుకొన్నసొమ్ము నీవే తీసికొమ్ము. అదిగాక మలహారురావు హోల్కారు మరణము నొందునపుడు తన మనుమఁడు చచ్చునేని కోడలు మరల నొకని దత్తముఁజేసికొనవలయునని మరణశాసనమును వ్రాసినాఁడు. వారి బంధుగులకుఱ్ఱవాఁడె యున్నాఁడు. మనవా రాబాలుని హోల్కారుగఁజేసి కొద్దిదినములలోఁ బట్టాభిషేకముఁజేతురు. క్రొత్త హోల్కారునకు మీరు సహాయము చేయుఁడు.

ఋషి — ఆ హోల్కారును నేనెఱుఁగుదును. ఆహాహా! మిక్కిలి బాగున్నది. గండా, నీకు సందేహమెందుకు? అహల్యాభాయి సింహాసనముమీఁదనుండదు. రాధాకాంతరావుతోఁ జెప్పినాను. శ్యామసుందరదత్తు నాతో మాటలాడినప్పుడు నేను వారిపక్షము పల్కితినిగాని నేను వారి సంహారముచూచువాఁడను. మలహారురావు నా కపకారముఁజేసినాఁడు. ఆ కసి నేనిప్పుడు తీర్చుకొందును. దేశమును మంగలములోఁ బెట్టి వేఁచివేయవలెను. నీ రెండువేలభిల్లు సైన్యముతోఁ ద్రోప్రడు వెంటనే యారంభింపుము. నీకు నాదీవన నిచ్చెదను. ప్రజలకు నావయస్సునుబట్టి నాపై మిగుల భక్తిగలదు. వారు నా మాయాసముద్రమునఁబడి మునిఁగినవారలు. నీవు జంకకు.

గండభిల్లీ పలుకుల నాలకించి యడవిజంతువువలె ఖణిల్లని యొకవింత కేకవేసి "యిదిసరి. యిదిసరి. నాతమాషచూడుము. ఈపని నెరవేరునేని నూరు దున్నపోతులను శ్రీ కాళికి బలియిచ్చెదను. దొరికినయెడల మనుష్యుని బలియిచ్చెదను. దుండీ నేనిందులకు సమ్మతించితినని మీ దౌలతరావుతోఁ జెప్పుము.

దుండి — మలహారురావు మనయీ, ఋషికి నపకారముఁజేసెను. అహల్య కమలాభాయిని వివాహమాడవద్దని దౌలతరావును నిందించి యనరానిమాటలనని పరిభవించినది. అదిగాక కమల నూతిలోఁబడి మృతినొందినది. కాఁబట్టి దౌలతరావు